సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 244

సోమవారం 25-11-2024



'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'



విదేశీ 'స్టాక్స్' షాపింగ్ చేద్దామా!

- 13లో



అమెరికా వ్యవసాయ మంత్రిగా బ్రూక్ రోలిన్స్

- 6లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సంపదలు సత్కార్యాలకు ద్వారాలు

మంచిమాట

అమృత బిందువులు

- మూలం మట్టే ఆయినా మొలకెత్తడం ప్రధానం. మనం ఎలా పుట్టినా మంచిగా బ్రతకడమే ముఖ్యం. బురదలో పుట్టిన తామర అందంగా బయటకు వస్తుంది. అలాగే పుట్టుక సాధారణమే అయినా లక్ష్యం ఉన్నతం కావాలి.'
- కోపం హద్దులు దాటుతున్నప్పుడు మాటలతో సమాధానాన్ని ఎప్పుడూ చెప్పకండి. మీ మౌనానికి మించిన సమాధానం మరొకటి లేదు.'
- జీవితంలో కొన్ని సార్లు విరిగిన రెక్కలతో కూడా ఎగరవలసి వస్తుంది. అలా ఎగిరి నిలబడిన వాడే తనను నమ్ముకున్న వారిని నిలబెట్టగలడు...!!
- 'తెలివికి నిదర్శనం తప్పులు వెదకడం కాదు.. పరిష్కారాలు చూపించడం'...!!
- కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు, ఆనందం, ఆవేదన కూడా అంతే..!
- జీవితం, కష్టం శాశ్వతం కాదు.. సంతోషము శాశ్వతమూ కాదు...!!
- జీవితమనేది ఓ అవకాశం అయితే దాన్ని వదులుకోండి
- బాధ్యత అయితే నెరవేర్చండి
ఒక ఆశయం అయితే సాధించండి
ఒక శోకం అయితే తట్టుకోండి
ఒక పోరాటం అయితే జయించండి,
ఒక పయనం అయితే సాగిపోండి...!!

– స్వామి వివేకానంద

సాధారణంగా సంపద అంటే డబ్బులు అనుకుంటారు. కాని, సనాతన ధర్మం ఎప్పుడు కాగితం ముక్కల్ని కాని, లోహపు బిళ్ళలని కాని ధనంగా పరిగణించినట్టు కనపడదు. అష్టలక్ష్ములు అని చెప్పే సంపదలు ఏవైతే ఉన్నాయో వాటిని మాత్రమే ధనంగా చెప్పటం జరిగింది. సత్కార్యాలు చేయటానికి చేతి నిండుగా డబ్బు లేదే అని బాధ పడ నవసరం లేదు. మనకి ఎన్నో రకాలైన సంపదలు ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేయవచ్చు.



సంపదలు ఉంటే ఎన్నో సత్కార్యాలు చేయవచ్చు అంటే ఆశ్చర్యం అనిపిస్తుంది. సంపదలు అనుభవించటానికి మాత్రమే అని లోకంలో ఉన్న అభిప్రాయం. కానీ, అవి ఎన్ని పనులు చేయటానికో సాధనాలు. దురదష్టవంతులు, దుర్మార్గులు అయినవారికి పతనానికి హేతువులుఅవుతాయి. సంపద అంటే ఇతరులకి ఎంత ఇచ్చినా తరగనంత ఉన్నది. తాను అనుభవించటానికి లేదే అని కొద్దిగా కూడా బాధ పడవలసిన అవసరం లేనంత ఉండటం. ఎవరికైనా ఇవ్వాలంటే ముందు తన దగ్గర ఉండాలి కదా! ఇవ్వాలని ఉద్దేశం ఉంది కాని, తన దగ్గర తగినంత లేక పోతే ఏమి చేయగలరు ఎవరైనా? అందువల్ల ఎవరికైనా సహాయం చేయాలంటే తగినంత సమకూర్చుకోవలసి ఉంటుంది.

అన్నిటిని మించి ఆరోగ్యవంతమైన శరీరం ఉంది. దానితో శారీరకంగా బలహీనంగా ఉన్న వారికి సహాయం చేయ వచ్చు. బలహీనుడు మరొకరికి చేయూత నివ్వలేడు కదా! కనీసం ఈ సంపదని పెంపొందించు కోవచ్చు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవటం కోసమైనా ఆరోగ్యంగా, బలంగా ఉండాలి. అదీ కాక పోయినా, తాను ఇతరుల పైన ఆధార పడి ఉండకుండా ఉంటే అదే పెద్ద సహాయం.

మరొక ప్రధాన మైన సంపద జ్ఞానసంపద. ఇతరులకి జ్ఞానాన్ని పంచాలి అంటే తన దగ్గర ఉండాలి. ఎంత చదువుకుంటే ఏం లాభం? అంటూ ఉంటారు చాలా మంది. నిజమే! దానిని ఎవరికి పంచక, తన జీవితంలో ఉపయోగపరచక పోతే వ్యర్థమే. సార్థకం చేసుకోవాలంటే తన కున్న జ్ఞానాన్ని వీలైనంత మందికి పంచుతూ పోవాలి.

ఈ మాట అనగానే నాకు పెద్ద పెద్ద డిగ్రీలు లేవు నేనేం చేయ గలను? అంటారు. జ్ఞానం అంటే కళాశాలలలోనో, విశ్వవిద్యాలయాలలోనో చదివితే వచ్చేది కాదు. ఆ చదువు సహజంగా ఉన్న దానికి సహకరించ వచ్చు. అనుభవంతో, లోకాన్ని పరిశీలించటంతో వచ్చేది ఎక్కువ. ఆ జ్ఞానాన్ని తన వద్దనే ఉంచుకోకుండా పదిమందికి పంచితే నశించకుండా తరువాతి తరాలకి అందుతుంది. అందుకే ధర్మశాస్త్రాలు కూడా ఏదైనా విషయంలో కలిగిన సందేహానికి పరిష్కారం గ్రంథాలలో లభించక పోతే ఆ కుటుంబంలో వృద్ధురాలైన మహిళని అడగమని చెప్పాయి. అనుభవ జ్ఞానం అంత గొప్పది.

అన్నిటినీ మించినది ప్రేమ. దీనితోఎన్నిటినో సాధించవచ్చు. ఈ సంపద పంచిన కొద్దీ పెరుగుతూ ఉంటుంది. మనం ఇచ్చినదే మన సంపద. దాచుకున్నది ఏమవుతుందో తెలియదు. మనం అన్ని విధాలా సంపన్నులం అయే మార్గం తెలిసింది కదా!

– డా. ఎన్. అనంతలక్ష్మి

శారీరకంగా ఏమీ చేయలేనప్పుడు ఏ మాత్రం కష్టపడకుండా చేయగలిగిన సహాయం కూడా ఉంది. అది మాట సాయం. ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఏం చేయాలో తెలియని స్థితిలో ఉన్న వారికి మాట సహాయం చేయవచ్చు. తాను చేయ లేక పోయినా, చేసే వారిని చూపించ వచ్చు. అది కూడా తనకి అందుబాటులో లేక పోతే కష్టంలో ఉన్నప్పుడు ఓదార్పుగా ఒక్క మాట చెపితే ఎంతో ధైర్యం కలుగుతుంది. మాట్లాడితే నోటి ముత్యాలు రాలిపోవుగా! ఇదీ చేయటం రాక పోతే ఊరకున్నంత ఉత్తమం లేదు. పిచ్చి మాటలు మాట్లాడి చెడగొట్టకుండా ఉండటం కూడా గొప్ప సహాయమే అంటారు తెలిసిన పెద్దలు. నేర్పుగా మాట్లాడిన ఒక్క మాటతో సమస్యల పరిష్కారం, బాధల నుండి ఓదార్పు దొరకటం చూస్తూనే ఉంటాం.

ఆత్మీయం — ఆర్ద్ర హృదయం



ఎవరైనా తప్పు చేసినప్పుడు లేదా ఆకస్మికంగా తప్పుదారిలో నడిచినప్పుడు వారిని తిరస్కార భావంతో చూసి ఎగతాళి చేసే వారే కానీ చెడుదారిన వెళ్లేవారి తప్పును సున్నితంగా ఎత్తి చూపించి, ప్రేమతో దిద్ది, ఆ వ్యక్తి ఆత్మవిశ్వాసానికీ, ఆత్మాభిమానానికీ దెబ్బ తగలకుండా అతడిని చక్కదిద్దే నేర్పరితనం మనలో ఎంతమందిలో ఉంటుంది?


తప్పు చేసినప్పుడు సహనం కోల్పోయి తీవ్రంగా దండించి 'అలా చేయకూడదు, ఇలా చేయకూడదు..' అంటూ చెప్పినంత మాత్రాన పెద్దల కర్తవ్యం ముగిసిందా? ఒకడు కాలుజారి కిందపడుతున్నప్పుడు వాడిని లేవదీయకుండా వ్యంగ్యంగా విమర్శిస్తూ 'అయ్యో పాపం!' అని జాలి ప్రదర్శించే మాటలు కురిపించే వారే చాలామంది! అటువంటి వారిపై దోషారోపణ చేసినంత మాత్రాన మనకొచ్చే ఫలితం ఏమీ ఉండదు. తాము విద్యార్థులుగా ఉన్నప్పుడు తమ ఉపాధ్యాయులు తమకు విధించిన శిక్షలు (కొట్టడం వంటివి) తమకు నచ్చకపోయినా, తాము ఉపాధ్యాయులు అయిన తర్వాత ఆ పద్ధతినే అనుసరిస్తూ వస్తారు. సహనం, ప్రేమ ఆచరణ యోగ్యం కావనీ, ఉపన్యాసాలకూ, రాతలకూ మాత్రమే పనికి వస్తాయనీ భావిస్తారు. బానిసత్వంలో పెరిగిన వర్గాల ప్రజల్లో కనిపించే ఒక అలవాటు ఇది. తమకంటే పై మెట్టులో ఉన్న వారి ఎదుట దైన్యంగా ఉండటం, తమకంటే కిందిస్థాయిలో ఉన్న వారి పట్ల దర్పం చూపడం గమనిస్తూనే ఉన్నాం.

సామాజిక విప్లవం, కుల నిర్మూలన వంటి విషయాలను గురించి భావోద్వేగంతో ప్రసంగించే ఒక కార్యాలయాధికారిని 'మీరెప్పుడైనా మీ విభాగంలోని సిబ్బందినంతా సమీకరించి దానిలో అందరూ పాల్గొనేటటువంటి ఒక ఒక సభను నిర్వహించారా?' అని అడిగితే, 'లేదు' అన్నాడా అధికారి. ఒకే ప్రభుత్వ శాఖలో, ఒకే కార్యాలయంలో కొన్ని ఏళ్ల పాటు కొద్ది వేతన వ్యత్యాసాలతో పనిచేసే వారిలో అధికారికీ, ఉద్యోగులకూ సామరస్యం లేదని తెలిసింది. కేవలం యాంత్రికంగా వారి ఉద్యోగం నిర్వహిస్తూ వచ్చారు. అంతేకాని, పరస్పర ప్రేమ, విశ్వాసం, సహకార భావం వంటివి వారిలో మచ్చుకైనా కనిపించలేదు.

బుద్ధిమంతులు, సంస్కారవంతులూ అయినవారంతా అణగదొక్కబడిన వారిపట్ల ప్రేమ, ఆదరాభిమానాలు చూపాలి. అంతేకాని, క్షణికమైన ఉద్రేకంతో నేను పరోపకారిని అని ప్రకటించుకుని ప్రయోజనం లేదు. నిష్కల్మషమైన ప్రేమ ఒక్కటే ప్రగతిశీలమైన రాచబాట అనే వాస్తవాన్ని మరువకూడదు. పైస్థాయిలో ఉన్న వారు ఈ విషయాన్ని గ్రహించి, కింది వారిపట్ల శ్రద్ధాసక్తులు చూపాలి. అప్పుడే సమన్యాయం సాధ్యం అవుతుంది.

– స్వామి జగదాత్మానంద

తాత్వికథ — కనీస సంస్కారం



ప్రముఖ రచయిత బెర్నార్డ్ షా ఓరోజు పాత పుస్తకాల దుకాణానికి వెళ్ళారు. అక్కడున్న పుస్తకాలను తరచి చూస్తున్నారు. అలా చూస్తున్నప్పుడు ఆయనకు తాను రాసిన ఓ పుస్తకం కంట పడింది. అది తీసి మొదటి పేజీ చూశారు. అది చూసి ఖంగుతిన్నారు. ఆయన తనకెంతో ఇష్టమైన మిత్రుడికి సంతకం చేసి ఇచ్చిన పుస్తకమది.

వెంటనే బెర్నార్డ్ షా ఆ పుస్తకాన్ని ఏ మాత్రం బేరం చేయకుండా కొనుగోలు చేశారు. ఇంటికి వెళ్ళి వెళ్ళడంతోనే ఆ పుస్తకాన్ని తన మిత్రుడికే సంతకం చేసి మళ్ళీ నీకు నా కానుకగా ఇస్తున్నాను అనే మాటలు రాసి పంపారు.

ఆ పుస్తకాన్ని అందుకున్న మిత్రుడు ఎలా ఫీలయ్యాడో మనం ఊహించి ఉండొచ్చు. దాన్ని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. బెర్నార్డ్ షా తిరిగి ఆ పుస్తకాన్ని ఆ మిత్రుడికే పంపడంలో ఓ ఉద్దేశం లేకపోలేదు.

తాను రాసిన పుస్తకంలోని విషయ ప్రాధాన్యాన్ని మిత్రుడికి తెలియజెప్పడం బెర్నార్డ్ షా ఉద్దేశం కావచ్చు. కానీ అంతకన్నా మరో ముఖ్యవిషయం కూడా అందులో దాగి ఉంది. అదేంటో తెలుసా .. ఎవరైనా సరే తమ ప్రేమకు అభిమానానికి గుర్తుగా దేన్నయినా కానుకగా ఇస్తున్నప్పుడు దానిని స్వీకరించి మూలనపడేయడం కాదు. దానిని ప్రాణప్రదంగా చూసుకోవడం ప్రధానం. అలా చేయడం వల్ల ఒకరు తనకు ప్రేమతో ఇచ్చిన దానికి తగిన గౌరవం ఇచ్చినట్లవుతుంది. మనల్ని గౌరవించిన వారిని ఆదరించిన వారిని ప్రేమించిన వారిని అంతే అభిమానంతో చూడడం అనేది సంస్కారమనిపించు కుంటుంది.

– యామిజాల జగదీశ్

సినిమా

మాజీ ప్రేయసితో పాట



● వెంకటేశ్

హ్యాపీగా ప్రేయసితో వెంకటేశ్ డెహ్రాడూన్‌లో పాట పాడుకుంటున్నారు. వెంకటేశ్, మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 14న విడుదల కానుంది. ఈ చిత్రంలో వెంకటేశ్ భార్యగా ఐశ్వర్య, ఆయన మాజీ ప్రేయసిగా మీనాక్షీ చౌదరి నటిస్తున్నారు. ప్రస్తుతం డెహ్రాడూన్, ముస్సోరీ, రిషికేశ్‌లోని లొకేషన్లలో వెంకటేశ్, మీనాక్షీ చౌదరి పాల్గొనగా ఓ పాట షూట్ చేస్తున్నారు. ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, భాను మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

అస్సలు తగ్గేదే లే – అల్లు అర్జున్



● దేవిశ్రీ ప్రసాద్, వై. రవిశంకర్, చెర్రీ, నవీన్ ఎర్నేని, రష్మికా మందన్నా, అల్లు అర్జున్, శ్రీలీల

''నా ఫ్యాన్స్‌ని ప్రేమగా ఆర్మీ అని పిలుచుకుంటాను. వాళ్లు నాపై ప్రేమ చూపిస్తున్నారు... నా కోసం పోరాడుతున్నారు. డిసెంబరు 5న మీ గుండెల్లో వైల్డ్‌ఫైర్. అస్సలు తగ్గేదేలే'' అని అల్లు అర్జున్ అన్నారు. అల్లు అర్జున్ హీరోగా, రష్మికా మందన్నా హీరోయిన్‌గా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'పుష్ప: ది రూల్'. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 5న విడుదల కానుంది. ఈ చిత్రంలోని 'కిస్సిక్...' అనే స్పెషల్ సాంగ్‌లో అల్లు అర్జున్‌తో కలిసి స్టెప్పులు వేశారు హీరోయిన్ శ్రీలీల. ఆదివారం చెన్నైలో నిర్వహించిన 'పుష్ప: ది రూల్ వైల్డ్‌ఫైర్' ఈవెంట్‌లో 'కిస్సిక్' సాంగ్ లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా **అల్లు అర్జున్ మాట్లాడుతూ** – ''చెన్నైతో నాకు మంచి ఎమోషనల్ బాండింగ్ ఉంది. జీవితంలో మన తొలి ఇరవయ్యేళ్లు ఎలా ఉంటే మన జీవితం అంతా అలానే ఉంటుందని అంటుంటారు. అలా నేనీ రోజు ఈ స్థాయిలో ఉండటానికి కారణం నా చెన్నై రూట్స్. నిర్మాతలు నవీన్, రవి, చెర్రీగార్లు లేకపోతే 'పుష్ప' ఈ స్థాయిలో ఉండేది కాదు. నా సినిమా అంటే కాస్త ప్రేమతో దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ ఇస్తారు. నా లైఫ్‌లో ముఖ్యమైన వ్యక్తి సుకుమార్ సార్. ఆయన నాతో 'ఆర్య' తీయకపోతే నేనీ స్థాయిలో ఉండేవాణ్ణి కాదు'' అన్నారు.

మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ– ''పుష్ప' నాకు చాలా స్పెషల్. మనకి ఏం కావాలో మనం అడిగి తీసుకోవాలి. అడగకపోతే ఎవరూ ఇవ్వరు. కరెక్టే కదా బన్నీ. అది ప్రొడ్యూసర్స్ దగ్గర పేమెంట్ అయినా... స్క్రీన్‌పై వచ్చే క్రెడిట్ అయినా. రవి (నిర్మాత రవిశంకర్‌ని ఉద్దేశించి) సార్... నేను స్టేజ్ ఎక్కి ఎక్కువ సేపు మాట్లాడానని అనొద్దు. మీరేమో టైమ్‌కు పాట ఇవ్వలేదు. టైమ్‌కి బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇవ్వలేదు. టైమ్‌కు ప్రోగ్రామ్‌కు రాలేదని నన్ను అంటుంటారు. నా మీద మీకు ప్రేమ ఉంది. ప్రేమ ఉన్నచోట కంప్లైంట్స్ కూడా ఉంటాయి. కానీ ప్రేమ కంటే నాపై కంప్లైంట్సే ఎక్కువ ఉంటాయి ఎందుకో అర్థం కాదు. ఇవన్నీ సెపరేట్‌గా అడిగితే పెద్ద కిక్ ఉండదు. ఇలా అడిగేసేయడమే.. నేను చాలా ఓపెన్. 'పుష్ప 2'కి పాటలు ఇవ్వడం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇవ్వడాన్ని బాగా ఎంజాయ్ చేశాను'' అంటూ కాస్తంత వ్యంగ్యంగా మాట్లాడారు.

''పుష్ప 2' తమిళంలోనూ బ్లాక్ బస్టర్ అవుతుందని నమ్ముతున్నాం'' అన్నారు **నవీన్ ఎర్నేని, రవిశంకర్.**

''600 లొకేషన్స్‌లో 800 స్క్రీన్స్‌లో సినిమా రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నాం'' అని 'పుష్ప 2'ని తమిళంలో రిలీజ్ చేస్తున్న ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ ప్రతినిధి, నిర్మాత **అర్చనా కల్పాతి** అన్నారు. తమిళ దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్‌తో పాటు పలువురు ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

లవ్ మెలోడీతో...



● రామ్‌చరణ్, కియారా అద్వానీ

రామ్‌చరణ్ హీరోగా రూపొందిన చిత్రం 'గేమ్ చేంజర్'. కియారా అద్వానీ హీరోయిన్‌గా నటించారు. శంకర్ దర్శకత్వంలో అనిత సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, 'దిల్' రాజు ప్రొడక్షన్స్ పతాకాలపై 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 10న విడుదల కానుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి 'జరగండి...జరగండి...', 'రా మచ్చా...' పాటల లిరికల్ వీడియోలను విడుదల చేశారు. తాజాగా రామ్‌చరణ్, కియారా కాంబినేషన్‌లో రూపొందిన ఓ మెలోడీ సాంగ్‌ను ఈ నెల 28న రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సినిమాకి తమన్ స్వరకర్త.

చలో మైసూర్: రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా తాజా షెడ్యూల్ మైసూర్‌లో ఆరంభమైంది. ఈ షూట్‌లో పాల్గొనేందుకు ఆదివారం రామ్‌చరణ్ మైసూర్ వెళ్లారు.

కిల్లర్ యాక్షన్



● పూర్వాజ్

'శుక్ర, మాటరాని మౌనమిది, ఏ మాస్టర్ పీస్' వంటి చిత్రాలతో ఆకట్టుకున్న డైరెక్టర్ పూర్వాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'కిల్లర్: పార్ట్ 1 డ్రీమ్ గర్ల్'. ఈ చిత్రంలో ఆయన కీలక పాత్రలో నటించారు. పూర్వాజ్, ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభ రెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో జ్యోతి పూర్వజ్ ఓ లీడ్ రోల్ చేశారు. ఈ చిత్రం నుంచి పూర్వాజ్ క్యారెక్టర్ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'కిల్లర్'. ఈ మూవీ నుంచి విడుదలైన ప్రతి పోస్టర్ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది'' అని పేర్కొన్నారు మేకర్స్.

మానవతా విలువలతో...

సముద్ర ఖని, అనన్య జంటగా నటించిన చిత్రం 'మిస్టర్ మాణిక్యం'. నంద పెరియసామి దర్శకత్వంలో జీపీ రేఖా రవికుమార్, చింతా గోపాలకృష్ణా రెడ్డి, రాజా సెంథిల్ నిర్మించిన ఈ సినిమా డిసెంబరు 28న విడుదల కానుంది. నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ఏషియన్ సునీల్ నారంగ్ ఈ సినిమా ఫస్ట్ లుక్, రిలీజ్ డేట్ పోస్టర్‌ను రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''ఈ సినిమా నిర్మాతల్లో ఒకరైన రవి నాకు మంచి ఫ్రెండ్. అతను నిర్మించిన 'మిస్టర్ మాణిక్యం' ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నా'' అన్నారు.



● సముద్ర ఖని, సునీల్ నారంగ్

''విమానం' సినిమా నటుడిగా నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. 'మిస్టర్ మాణిక్యం' అంతకు మించిన పేరు తెస్తుందనే నమ్మకం ఉంది. మానవతా విలువలు ప్రధానాంశంగా రూపొందిన చిత్రం ఇది'' అని తెలిపారు సముద్ర ఖని. ''ఈ సినిమాలో నటించిన సముద్ర ఖని, నాజర్, భారతీరాజా గార్లు ఓ మంచి సినిమా చేశామన్న సంతృప్తిని వ్యక్తం చేశారు. మేం ఇష్టపడి నిర్మించిన సినిమా ఇది'' అన్నారు నిర్మాత రవి. ''వాస్తవ ఘటనలకు అద్దం పడుతూ మానవతా విలువలతో కూడిన మంచి చిత్రం ఇది'' అని తెలిపారు నంద పెరియసామి. ఈ కార్యక్రమంలో నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఇఫీలో హను-మాన్ భాగం కావడం ఆనందం – తేజ సజ్జా



● 'ఇఫీ'లో తేజ సజ్జా

''కథా కథనాల పట్ల ప్రేక్షకులకు ఉన్న అభిరుచి మన సినిమా అభివృద్ధికి దోహదపడుతుంది'' అన్నారు హీరో తేజ సజ్జా. ''హను–మాన్' కేవలం సినిమా కాదు.. మన సాంస్కృతిక మూలాలు, సంప్రదాయాలకు కట్టిన పట్టం'' అని కూడా అన్నారు. గోవాలో జరుగుతున్న 55వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ)లో ఇండియన్ పనోరమా విభాగంలో 'హను–మాన్'ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా తేజ సజ్జా మాట్లాడుతూ... ''కల్పిత గ్రామమైన అంజనాద్రి నేపథ్యంలో దైవిక శక్తులను పొందిన ఓ చిన్న దొంగ... మహా శక్తిమంతుడైన హనుమంతుని దాకా సాగించే ప్రయాణాన్ని ఈ చిత్రం చూపించిందని, భారతీయ పురాణాల విశిష్టతను ముందుకు తీసుకెళ్లే బాధ్యతను ఈ చిత్రం ద్వారా నిర్వర్తించామనీ అన్నారు. ఈ చిత్రం మన పౌరాణిక మూలాలను చాటి చెబుతూ భారతీయ సినిమాను ప్రపంచ వేదికపై నిలిపిందన్నారు. 'హను–మాన్' సీక్వెల్ రూపకల్పన కోసం పని చేస్తున్నట్టు ధృవీకరించారు. తెలుగు పరిశ్రమ వినూత్న కథనాలతో అంతర్జాతీయంగా గొప్ప గుర్తింపు సాధిస్తోందన్నారు. 'హను–మాన్' సాంస్కృతిక వారసత్వం, ఆధునిక కథల శక్తిమంతమైన సమ్మేళనమని, భారతీయ పనోరమాలో భాగం కావడం ఈ చిత్ర కళాత్మక సాంస్కృతిక విశిష్టతకు నిదర్శనం'' అంటూ తన ఆనంద వ్యక్తం చేశారు తేజ సజ్జా.

– గోవా నుంచి సాక్షి ప్రతినిధి

ప్రపంచంలోనే ఏఆర్ అత్యుత్తమ వ్యక్తి – సైరా భాను



ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, ఆయన భార్య సైరా భాను విడాకుల వ్యవహారంపై రకరకాల ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. 29 ఏళ్ల అన్యోన్యంగా సంసార జీవితాన్ని సాగించిన ఈ జంట విడిపోవాలనుకోవడానికి గల కారణాలను నెటిజన్లు పెద్ద ఎత్తున వెతుకుతున్నారు. ఏఆర్ రెహమాన్ వద్ద చాలా కాలంగా పని చేస్తున్న గిటారిస్ట్ మోనికా దేను కూడా ఈ వివాదంలోకి లాగుతున్నారు. దీంతో తన గురించి అసత్య ప్రచారాన్ని చేస్తున్న సామాజిక మాధ్యమాలకు రెహమాన్ తన న్యాయవాది ద్వారా నోటీసులు జారీ చేశారు. ఆదివారం సైరా భాను 'నేను సైరా రెహమాన్ మాట్లాడుతున్నా' అంటూ ఓ వీడియో వాయిస్‌ను విడుదల చేశారు. అందులో ''ఏఆర్ గురించి దయచేసి అసత్య ప్రచారం చేయకండి. ఈ ప్రపంచంలోనే అత్యుత్తమ వ్యక్తి ఆయన. అలాంటి అద్భుతమైన మనిషిని చూడలేం. నా శారీరక అనారోగ్యం కారణంగా కొన్ని నెలలుగా ముంబైలో ఉంటూ, చికిత్స పొందుతున్నాను. అందువల్లే ఏఆర్ నుంచి కొంతకాలం బ్రేక్ తీసుకోవాలనుకున్నా. విడిపోవాలనుకోవడానికి కారణం నా అనారోగ్యమే. ఏఆర్ రెహమాన్ ఎంతో బిజీగా ఉన్న పరిస్థితుల్లో ఆయన్ని ఇబ్బంది పెట్టడం ఇష్టం లేదు. నా పిల్లలనూ ఇబ్బంది పెట్టాలనుకోవడం లేదు. ఏఆర్‌పై నాకున్న నమ్మకం నా జీవితానికంటే పెద్దది. నేను ఆయన్ని ఎంతగా ప్రేమించానో చెప్పడానికి ఇదే నిదర్శనం. నన్ను కూడా ఆయన అంతే ప్రేమించారు. ఇంకా ఏదీ అధికారికంగా ప్రకటించలేదు కాబట్టి ఈ పరిస్థితుల్లో మా స్వేచ్ఛను గౌరవించండి. చికిత్స పూర్తయ్యాక త్వరలోనే చెన్నైకి తిరిగి వస్తాను. ఏఆర్ రెహమాన్ పేరుకు దయచేసి కళంకం ఆపాదించకండి'' అని సైరా భాను కోరారు.


– సాక్షి, చెన్నై, తమిళ సినిమా

విలేజ్‌లో వశిష్ఠ



● సుమన్ తేజ్

సుమన్ తేజ్, అనుశ్రీ జంటగా నటిస్తున్న 'వశిష్ఠ' చిత్రం ఆదివారం ప్రారంభమైంది. హరీశ్ చావా దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నోరి నాగప్రసాద్ నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి నటుడు గగన్ విహారి కెమెరా స్విచ్చాన్ చేయగా, తెలుగు టెలివిజన్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ నాగబాల సురేష్ కుమార్ క్లాప్ ఇచ్చారు. యాడ్ ఫిల్మ్ మేకర్ యమున కిశోర్ గౌరవ దర్శకత్వం వహించారు. సుమన్ తేజ మాట్లాడుతూ– ''వశిష్ఠ' కథ వినగానే నేను ఎప్పట్నుంచో కోరుకుంటున్న కథ ఇదే అనే ఫీలింగ్ కలిగింది'' అన్నారు. ''విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే సోషల్ డ్రామా ఇది'' అని తెలిపారు హరీశ్ చావా. ''పక్కా స్క్రిప్ట్ వర్క్‌తో ఈ చిత్రం తీస్తున్నాం'' అన్నారు నోరి నాగ ప్రసాద్.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 244

సోమవారం 25-11-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



విజయం వాకిట్లో..

ఆస్ట్రేలియాతో పెర్త్‌లో జరుగుతున్న తొలి టెస్టులో భారత జట్టు భారీ విజయం దిశగా సాగుతోంది. భారత్ నిర్దేశించిన 534 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఆస్ట్రేలియా మూడో రోజు ఆట ముగిసే సమయానికి 12 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అంతకుముందు భారత జట్టు రెండో ఇన్నింగ్స్‌ను 6 వికెట్లకు 487 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. యశస్వి జైస్వాల్ (161), విరాట్ కోహ్లి (100 నాటౌట్) సెంచరీలు చేశారు.


12లో



నేనూ ఎన్‌సీసీ సభ్యుడినే

విద్యార్థులు ఎన్‌సీసీలో చేరాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. తాను కూడా చిన్నప్పుడు ఎన్‌సీసీలో చేరానని చెప్పారు.


- వివరాలు 6లో▶



నేటి నుంచే పార్లమెంట్ సమరం

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. 16 బిల్లులను ప్రవేశపెట్టాలని కేంద్రం భావిస్తోంది.

- వివరాలు 6లో▶



చిచ్చురేపిన మసీదు సర్వే

యూపీలో మసీదు సర్వే వ్యవహారం హింసకు దారితీసింది. ఆదివారం పోలీసులతో జరిగిన ఘర్షణలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.

- వివరాలు 6లో▶



ఆదిలోనే అలర్ట్ అవ్వండి

పిల్లల్లో గుండెజబ్బుల ముప్పు పెరుగుతోంది. అప్పటివరకు ఆడుతూ సందడి చేసిన చిన్నారులు హఠాత్తుగా కుప్ప కూలిపోతున్నారు.

- వివరాలు 2లో▶

న్యూస్‌రీల్

న్యాయవ్యవస్థకు ఏఐ ఊతం



ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న కృత్రిమ మేధ (ఏఐ) న్యాయవ్యవస్థకు ఊతంగా నిలుస్తోందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ అభిప్రాయపడ్డారు. ఏఐ టూల్స్ శ్రుతి, సారాంశ్, పాణిని లను న్యాయవ్యవస్థ కుటుంబ సభ్యులుగా ఆయన అభివర్ణించారు.

- వివరాలు 14లో▶

బిల్లులు చెల్లించామనడం అవాస్తవం



గ్రామ పంచాయతీలకు రూ.750 కోట్ల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం చెల్లించిందనడం అవాస్తవమని తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. పెండింగ్‌లో ఉన్న బిల్లుల్లో ఒక్క రూపాయిని కూడా విడుదల చేయలేదని జేఏసీ తెలిపింది.

- వివరాలు 3లో▶

డీప్ ఫేక్.. అంతా ఫేక్



మీరు చెప్పనిది చెప్పినట్టుగా.. అనని మాటలు అన్నట్టుగా.. చెయ్యని పనులు చేసినట్టుగా.. ఒక్క మాటలో చెప్పాలంటే మిమ్మల్ని మీరు నమ్మలేనంతగా మాయ చేసి ఏమార్చే డీప్ ఫేక్ కాలం నడుస్తోంది. సైబర్ నేరగాళ్లు దీన్ని అస్త్రంగా మార్చుకుంటున్నారు.

- వివరాలు 3లో▶

ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా డిసెంబర్ 1 నుంచి 9 వరకు నిర్వహించతలపెట్టిన ప్రజాపాలన విజయోత్సవాలకు అన్ని శాఖలు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమాల షెడ్యూల్‌ను సిద్ధం చేశాయి.

- వివరాలు 3లో▶





రాష్ట్రంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే తగిన ఫలితం ఇస్తుందా? దాని ఆధారంగా సర్కారు ముందుకు వెళుతుందా? ఆ వివరాలతో సంక్షేమ పథకాల అమలు కుదురుతుందా? అసలు ప్రభుత్వ ఉద్దేశం నెరవేరుతుందా?.. ఇలా ఎన్నో సందేహాలు ముసురుకుంటున్నాయి. సర్వేలో చాలా ప్రశ్నలకు అరకొర సమాచారమే వస్తుండటం.. ముఖ్యమైన ప్రశ్నలకు ప్రజలు ఎదురుప్రశ్నలు వేయడం.. పైగా ఆగ్రహం వ్యక్తం చేస్తుండటం.. ఎన్యుమరేటర్లు చేసేదేమీ లేక ఆ వివరాల కాలమ్‌లను ఖాళీగా వదిలేస్తుండటంతో సర్వేకు 'సమగ్రత' చేకూరడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాల సేకరణే ప్రధానంగా చేపట్టిన ఈ సర్వేపై 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. ఎన్యుమరేటర్లతో కలిసి వెళ్లి... సర్వేలో ప్రజల స్పందన ఎలా ఉందన్నది స్వయంగా పరిశీలించింది.

సర్వే 'సమగ్ర'మేనా?

రాష్ట్రంలో 90 శాతానికి పైగా పూర్తయిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే

సర్వే ప్రశ్నావళిలో కుటుంబ సభ్యులు, కులం వంటి సాధారణ సమాచారమే ఇస్తున్న ప్రజలు

ఆధార్, ఆస్తులు, అప్పుల వివరాలు వెల్లడించని తీరు.. ఉద్యోగం, ఆదాయం, సంక్షేమ పథకాల లబ్ధిపైనా గోప్యతే!

ఈ అరకొర వివరాలతో సర్కారు ఎలా ముందుకు వెళ్తుందనే సందేహం

ఎన్యుమరేటర్లతో కలిసి వెళ్లి ప్రజల స్పందనపై 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలన



కేసముద్రంలో వివరాలు సేకరిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే సిబ్బంది

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం గ్రామంలోని ఏడవ వార్డులో ఎన్యుమరేటర్ శనివారం సర్వే నిర్వహించాడు. భద్రయ్య కుటుంబాన్ని సర్వే చేస్తుండగా.. బ్యాంకు ఖాతా, టీవీ, కూలర్ ఉన్నాయా అన్న ప్రశ్నలకు అతడు తడబడ్డాడు. జీరో బిల్లుకు ఏమైనా సమస్య వస్తుందా అనే సందేహంతో తడబడినట్లు తెలిపారు. అతనికి కొడుకు, కోడలు, మనుమరాళ్లు ఉండగా వారి వివరాలను తెలపడానికీ ససేమిరా అన్నాడు. తమ ఇల్లు ఇరుకుగా ఉందని, కొడుకుకు రేషన్ కార్డు ఉన్నందున సర్వేను వేరుగా రాస్తే వారికి ప్రభుత్వం నుంచి ఇల్లు, ఇతర పథకాలు వస్తాయని చెప్పుకొచ్చాడు. ఇదే క్రమంలో ఓ వృద్ధురాలిని వివరాలు అడుగుతూ ఇల్లు ఉందా అని ప్రశ్నించగా, తనకు రేకుల ఇల్లు ఉందని మీరు రాసుకున్నంత మాత్రాన తనకు ఇల్లు వస్తదన్న నమ్మకం లేదని.. ఇంతకుముందు కూడా ఇలాగే రాసుకొని వెళ్లారంటూ ఆవేదన వ్యక్తం చేసింది.

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వేలో మెజారిటీ ప్రశ్నలకు ప్రజల నుంచి స్పందన రావడం లేదు. 75 ప్రశ్నలతో సర్వే ఫారాన్ని తయారు చేస్తే.. అందులో 40 వరకు ప్రశ్నలకు ప్రజల నుంచి వివరాలు అందడం లేదు. సాధారణంగా ఏదైనా సర్వే నిర్వహించేటపుడు వీలైనన్ని ఎక్కువ ప్రశ్నలకు జవాబులు రాబట్టాలి. అప్పుడే ఆ సర్వే లక్ష్యం నెరవేరుతుంది. కానీ ప్రభుత్వం తలపెట్టిన సమగ్ర ఇంటింటి సర్వేలో మెజారిటీ ప్రశ్నలకు, అందులోనూ కీలకమైన వాటికి ప్రజల నుంచి స్పందన లేకపోవడం అధికార యంత్రాంగాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం సమగ్ర సర్వే 90 శాతానికిపైగా మిగతా 2వ పేజీలో ▶



లక్నో 'నవాబ్' పంత్

రూ. 27 కోట్లకు తీసుకున్న సూపర్ జెయింట్స్

ఐపీఎల్-2025 కోసం ఆదివారం జరిగిన వేలంలో భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్‌ను లక్నో సూపర్ జెయింట్స్ జట్టు ఏకంగా రూ. 27 కోట్ల మొత్తానికి సొంతం చేసుకుంది. ఐపీఎల్ చరిత్రలో ఒక ఆటగాడికి దక్కిన అత్యధిక మొత్తం ఇదే కావడం విశేషం. శ్రేయస్ అయ్యర్‌ను పంజాబ్ కింగ్స్ రూ. 26.75 కోట్లకు తీసుకోగా.. వెంకటేశ్ అయ్యర్‌ను రూ. 23.75 కోట్లకు కోల్‌కతా నైట్‌రైడర్స్ ఎంచుకుంది. తొలి రోజు మొత్తం 72 మందిని పది ఫ్రాంచైజీలు వేలంలో సొంతం చేసుకున్నాయి.

12లో



శ్రేయస్ - రూ.26.75 కోట్లు (పంజాబ్ కింగ్స్)



వెంకటేశ్ - రూ.23.75 కోట్లు (కోల్‌కతా నైట్‌రైడర్స్)

'మహా' సీఎంపై పీఠముడి!

రేసులో ఫడ్నవీస్‌తో పాటు షిండే, అజిత్

నేడు మహాయుతి ఎమ్మెల్యేల భేటీ

సీఎంపై నిర్ణయం, రేపు ప్రమాణం!



ఎన్నికల ధ్రువీకరణ పత్రంతో ఫడ్నవీస్

28న హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం

ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించిన జార్ఖండ్ గవర్నర్

నాలుగోసారి సీఎం కాబోతున్న జేఎంఎం నేత




గవర్నర్ సంతోష్‌కుమార్ గంగ్వార్‌కు లేఖను అందజేస్తున్న జేఎంఎం నేత హేమంత్ సోరెన్. చిత్రంలో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి తదితరులు

వివరాలు 6లో▶

ధర్మం పేరిట అధర్మాచరణ

అసలైన ధర్మానికి అర్థం మార్చేస్తున్నాం

- సనాతన ధర్మాన్ని నేటి సమాజానికి అందించాలి
- లోక్‌మంథన్ ముగింపు కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్
- దిగ్విజయంగా ముగిసిన ఉత్సవాలు



మాట్లాడుతున్న మోహన్ భాగవత్

సాక్షి, హైదరాబాద్/మాదాపూర్: నేటి సమాజంలో ధర్మం పేరిట అధర్మాన్ని అనుసరిస్తున్నామని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్‌భాగవత్ అన్నారు. మనిషిలో స్వార్థం పెరిగి.. ధర్మానికి, అధర్మానికి అర్థంలో మార్పులు చేసుకుంటూ అనుసరించే ప్రయత్నం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం శిల్పకళావేదికలో జరిగిన లోక్ మంథన్ ముగింపు వేడుకల్లో ఆయన ప్రసంగించారు. 'మానవుడు సంతోషం కోసం అన్వేషిస్తున్నాడు. మన పూర్వీకులు సంతోషం గురించి ఎంతో చక్కగా వివరించారు. ఇది ఎక్కడో దొరికే వస్తువు కాదు. సంతోషం అనేది మనలోనే దొరుకుతుంది. దాన్ని వదిలేసి వస్తు మిగతా 5వ పేజీలో ▶

వాస్తవాలు దాచి.. అడ్డగోలు రాతలా?



రైతుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ నిరాటంకంగా ఉచిత విద్యుత్‌కు గత సర్కారు చారిత్రక ఒప్పందం

సౌర విద్యుత్ అత్యంత చౌకగా సరఫరా చేస్తామని కేంద్ర సంస్థ 'సెకీ' నాడు స్వయంగా లేఖ రాసింది

- పైగా ప్రత్యేకంగా పరిగణిస్తూ అంతర్రాష్ట్ర ప్రసార చార్జీల నుంచి మినహాయింపు కూడా కల్పించింది
- ఉచిత విద్యుత్‌పై గత సర్కారు దూరదృష్టిని ప్రశంసిస్తూ ఇతోధికంగా సాయం అందించేందుకు కేంద్రం సంసిద్ధత
- ఏటా రూ.3,750 కోట్లు.. 25 ఏళ్లలో రూ.లక్ష కోట్ల విద్యుత్తు భారాన్ని తగ్గించే చారిత్రక ఒప్పందం.. అది ఓ రాష్ట్ర సర్కార్-కేంద్రం మధ్య జరిగిన ఒప్పందం
- ఇంత తక్కువ ధరకు గతంలో ఏనాడూ, ఏ సీఎం హయాంలోనూ, డిస్కంలు కుదుర్చుకోలేదు.. అలాంటి చారిత్రక ఘట్టాన్ని ప్రశంసించాల్సింది పోయి నిందలా?

5లో

ఉద్యమ స్ఫూర్తిని మళ్లీ రగిలిస్తం

29న రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ దీక్షా దివస్

అదేరోజు నిమ్స్‌లో అన్నదానం.. డిసెంబర్ 9న మేడ్చల్‌లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

ఏర్పాట్లపై ఈ నెల 26న సన్నాహక సమావేశం

కాంగ్రెస్ నుంచి తెలంగాణను కాపాడుతాం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సమాజాన్ని ఏకం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ స్ఫూర్తితో మరో మారు ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తెలిపారు. కాంగ్రెస్ కబంధ హస్తాల నుంచి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను కాపాడేందుకు మరోసారి సంకల్ప దీక్ష చేపట్టాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. తెలంగాణ భవన్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, పలువురు మాజీ మంత్రులతో కలిసి కేటీఆర్ ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. '2009 నవంబర్ 29న నిరాహార దీక్ష ప్రారంభించి తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని కేసీఆర్ మలుపు తిప్పారు. తెలంగాణపై కేసీఆర్ వేసిన ముద్రను గుర్తు మిగతా 2వ పేజీలో ▶

నేడు మహబూబాబాద్‌లో మహాధర్నా

2లో

ఇదండీ జోక్!



ఇప్పుడే వద్దు సార్! ఎప్పుడూ ఒకచోట గెలిస్తే మరోచోట ఓడిపోతున్నాం! రెండుచోట్లా గెలిచినప్పుడు చూద్దాం!

విరుగుడు లేని విషం!

'పారాక్వాట్' గడ్డి మందుతో గాల్లో కలుస్తున్న ప్రాణాలు

క్షణికావేశంలో ఈ మందు తాగుతున్న రైతులు

ఏ చికిత్సకూ లొంగని 'విషం'తో దక్కని ప్రాణాలు

రాష్ట్రంలో ఇటీవల పెరిగిన 'పారాక్వాట్' మరణాలు

పొలాల్లో పిచికారీ సమయంలోనూ ఆరోగ్య సమస్యలు

పర్యావరణానికి, జీవ జాతులకూ ప్రమాదకరం

నిషేధించాలంటున్న వైద్య నిపుణులు

- కాగజ్‌నగర్‌కు చెందిన యువకుడు (35) కుటుంబ గొడవలతో గడ్డి మందు తాగాడు. చికిత్స కోసం మంచిర్యాలకు తీసుకెళ్లారు. అప్పటికే కిడ్నీలు దెబ్బతినడంతో ప్రత్యేక డయాలసిస్ చేశారు. అయినా పరిస్థితి విషమించి నాలుగు రోజుల్లోనే మృత్యువాత పడ్డాడు.
- కరీంనగర్ జిల్లా వీణవంక మండలం కనపర్తికి చెందిన యువకుడు (21) స్నేహితుల మధ్య విభేదాలతో గడ్డి మందు తాగాడు. వెంటనే ఆస్పత్రికి తరలించినా.. పరిస్థితి చేయి దాటి పోయింది. చికిత్స ప్రారంభించిన వైద్యులు ఆ యువకుడు బతకడం కష్టమని తేల్చి చెప్పారు. రెండు రోజులకే అతడి ప్రాణాలు పోయాయి.



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పంట చేన్లలో కలుపు నివారణకు వాడే గడ్డి మందు మనుషుల ప్రాణాలు తీస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా నెలకు రెండు, మూడు చోట్ల 'పారాక్వాట్' గడ్డి మందు తాగి మరణిస్తున్న ఘటనలు జరుగుతున్నాయి. క్షణికావేశంలో ఈ మందును తాగిన వారిని కాపాడుకునేందుకు విరుగుడు కూడా లేక నిండు ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. అత్యంత విషపూరితమైన ఈ మందును పొలాల్లో పిచికారీ చేసే సమయంలోనే తీవ్ర ఆరోగ్య సమస్యలు మిగతా 5వ పేజీలో ▶

పీజీ చేసినా పెరటి మొక్క పేరు తెలియని విద్యార్థులు

శాస్త్రీయ నామాలకే నేటి తరం పరిమితం..

ఫార్మా పరిశ్రమలకు తగ్గుతున్న పరిశోధనలు

బొటానికల్ ఇండియా సర్వేలో తేలిన వాస్తవాలు



మొక్కా.. మొక్కా.. నీ పేరేంటి..

సాక్షి, హైదరాబాద్: పెరట్లో మొక్కలు.. వాటి పేర్లు, ఉపయోగాల గురించి చిన్నప్పుడు నాయనమ్మో.. అమ్మమ్మో చెబితే నేర్చుకునేవాళ్లు. బడికి వెళ్లాక టీచర్ మొక్కల శాస్త్రీయ నామాలు చెబుతుంటే.. 'ఓ అదా.. మా పెరట్లోని జిల్లేడు చెట్టు.. పొలం మధ్యలో వావిలాల చెట్టు' అని తేలికగా గుర్తుపట్టేవాళ్లు. ఇప్పుడు కాలం మారింది. వృక్ష శాస్త్రంలో పీజీ చేసిన విద్యార్థికి కూడా ఇంట్లోని మందార చెట్టు పేరు తెలియడం లేదు. బొటానికల్ ఇండియా ఇటీవల చేసిన సర్వేలో అనేక ఆశ్చర్యకరమైన విషయాలు బయటపడ్డాయి. విద్యార్థుల వైఖరి ఇలాగే కొనసాగితే వారిలో శాస్త్రీయ కోణమే లోపిస్తుందని బొటానికల్ ఇండియా శాస్త్రవేత్తలు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. పాఠశాల స్థాయి నుంచే మొక్కలపై అవగాహన పెంచాలని సూచించారు.

సర్వేలోని కీలక విషయాలు

- సర్వేలో భాగంగా పీజీ పూర్తిచేసిన 867 మందిని పెరటి మొక్కలపై ప్రశ్నలు అడిగితే.. సొంత ఊరిలో కనిపించే ఔషధ మొక్కల గురించి కూడా కనీస సమాచారం ఇవ్వలేకపోయారు. జిల్లేడు, తిప్పతీగ, బంతి మొక్కలను చూపిస్తే వంద మిగతా 3వ పేజీలో ▶



- గుండె జబ్బుల నుంచి చిన్నారుల ప్రాణాలు కాపాడుకోవాలి
- తల్లిదండ్రులకు వైద్య నిపుణుల సూచన
- ఇటీవలి కాలంలో పిల్లల్లో పెరుగుతున్న గుండె జబ్బుల ముప్పు
- హఠాత్తుగా కుప్పకూలి చనిపోతున్న వైనం
- పుట్టినప్పటి నుంచే గుండెజబ్బుకు సంబంధించిన లక్షణాలు ఉంటాయి: వైద్యులు
- సమస్యను ముందే గుర్తించి జాగ్రత్త పడాలని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: చిన్నపిల్లల్లో గుండెజబ్బుల ముప్పు పెరుగుతోంది. ఇటీవలి కాలంలో చిన్నపిల్లలతో పాటు యుక్త వయసు వారు కూడా హఠాత్ గుండెపోటుతో మరణిస్తున్నారు. ముఖ్యంగా అప్పటివరకు ఆడుకుంటూ సందడి చేసిన ఐదు, పదేళ్ల లోపు పిల్లలు హఠాత్తుగా కుప్ప కూలిపోతున్నారు. క్షణాల్లోనే మృత్యువాత పడుతున్నారు. గుండెపోటు వల్ల తమ బిడ్డలు మరణించారని తెలుసుకుంటున్న తల్లిదండ్రులు, బంధువులు విస్తుపోతున్నారు. తమకెందుకీ శాపం అంటూ కన్నీరుమున్నీరవుతున్నారు. రాష్ట్రంలో సైతం ఇటీవలి కాలంలో పెరుగుతున్న ఈ తరహా మరణాలపై ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే అకస్మాత్తుగా వచ్చిన గుండెపోటు కారణంగానే వారు మరణించినప్పటికీ, పుట్టినప్పటి నుంచే..జన్యుపరమైన కారణాలు, ఇతరత్రా కారణాలతో గుండె జబ్బులకు సంబంధించిన లక్షణాలు వారిలో ఉంటాయని, వాటిని గుర్తించడం ద్వారా, గుర్తించిన తర్వాత నిర్లక్ష్యం చేయకుండా ఉండటం ద్వారా ఈ ప్రాణాంతక ముప్పును తప్పించవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముందుగానే ఆయా జబ్బులతో ముడిపడిన చిన్న చిన్న లక్షణాలను గుర్తించి సరైన వైద్యం చేయిస్తే ప్రమాదం ఉండదని చెబుతున్నారు. కార్పొరేట్ ఆసుపత్రులలోనే పరీక్షలు, వైద్యం చేయించాల్సిన పనిలేదని, పేద కుటుంబాల వారు నిమ్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలో 'పీడియాట్రిక్ ఐసీయూ', ఇతర రూపాల్లో ఉత్తమ సేవలు పొందవచ్చునని వివరిస్తున్నారు. ఇటీవలే బ్రిటన్‌కు చెందిన నిపుణులైన వైద్యుల బృందం పేద పిల్లలకు ఆపరేషన్లు చేయడంతో పాటు ఇతర రూపాల్లో వైద్య సేవలు అందించిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్న ఈ అంశంపై, హృద్రోగ సంబంధిత సమస్యలపై.. నిమ్స్ కార్డియో థొరాసిక్ సర్జరీ హెడ్ డాక్టర్ అమరేష్ రావు మాలెంపాటి, ఉస్మానియా మెడికల్ కాలేజీ కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హరీష్‌లు తమ అభిప్రాయాలు, సూచనలను **'సాక్షి'**తో పంచుకున్నారు.

ఇటీవల ఖమ్మం జిల్లాలో అప్పటివరకు తల్లిదండ్రులతో కలిసి ఆట పాటలతో సందడి చేసిన ప్రహర్షిక అనే నాలుగేళ్ల చిన్నారి గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలి చనిపోయింది.

మంచిర్యాల జిల్లా చెన్నూరులో ఏడో తరగతి చదువుతున్న నివృతి హఠాత్తుగా గుండెపోటుకు గురై మరణించింది.

జగిత్యాల జిల్లాలో సంజీవ్ అనే యువకుడు పెళ్లి బారాత్‌లో నృత్యం చేస్తూ గుండెపోటుతో కుప్పకూలాడు.

గమనించడం ముఖ్యం



గుండె జబ్బుకు సంబంధించి లక్షణాలను ముందే గమనించవచ్చు. వారి శరీరరంగు ముఖ్యంగా పెదవులు, చేతులు నీలం రంగులోకి మారుతుంటే జాగ్రత్తపడాలి. ఏడుస్తూ మారాం చేస్తున్నపుడు ఏదైనా మార్పు కనిపించినా, కొంచెం సేపే ఆటలు ఆడినా ఎక్కువగా ఆయాసపడుతున్నా, పాలు తాగుతున్న సమయంలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నా, చెమటలు పడుతున్నా, పాలు వదిలేయడం వంటివి చేస్తున్నా తేలిగ్గా తీసుకోకూడదు. సాధారణంగా పసిపిల్లలుగా ఉన్నపుడే 3,4 పర్యాయాలు శ్వాస సంబంధిత ఇన్ఫెక్షన్లు సోకుతాయి. అంతకు మించిన సంఖ్యలో అంటే నెలనెలకు ఇన్ఫెక్షన్లు వస్తున్నాయంటే తల్లిదండ్రులు అలర్ట్ కావాలి. వయసుకు తగ్గట్టుగా బరువు పెరగకపోవడం, ఏడాది వయసు పూర్తయ్యేలోగా తొలి అడుగు వేయకపోవడం లాంటివి బాగా ఆలస్యమైతే ఏదైనా సమస్య ఉండొచ్చునని భావించాలి. ఇలాంటి లక్షణాలు కన్పిస్తే వారికి కచ్చితంగా గుండెజబ్బు ఉందని కానీ వస్తుందని కానీ చెప్పలేం. వీటిని కేవలం కొన్ని సూచికలుగానే పరిగణనలోకి తీసుకుని జాగ్రత్తపడాలి. తగిన పరీక్షలు, వైద్యం చేయించాలి. పిల్లల్లో చిన్నప్పుడే గుండెలో చిన్న రంధ్రం బయటపడినా, వారు పెద్దయ్యేటప్పటికి అది పూడుకుపోతుందని కొందరు తల్లిదండ్రులు భావిస్తుంటారు. అయితే దీనికి సంబంధించిన లక్షణాలు క్రమంగా తగ్గొచ్చుకానీ సమస్య అలాగే ఉండే అవకాశాలున్నాయి. అందువల్ల వైద్యులను సంప్రదించాలి. మొన్నీమధ్యే ఏడేళ్ల పిల్లవాడికి నిమ్స్‌లో కాంప్లికేటెడ్ 'రాస్ ప్రొసీజర్'తో విజయవంతంగా సర్జరీ చేశాం.

– డాక్టర్ అమరేష్ రావు మామెంపాటి, కార్డియో థొరాసిక్ సర్జరీ హెడ్, నిమ్స్, హైదరాబాద్

గర్భస్థ శిశువులో సమస్యను కూడా గుర్తించవచ్చు



హఠాత్ గుండెపోటును చాలా మటుకు నివారించే అవకాశాలున్నాయి. గుండెకు చిల్లులున్నా గుండెపోటుకు గురికాకుండా జాగ్రత్త పడవచ్చు. శస్త్రచికిత్సలతో వాటిని ఆపొచ్చు. చిన్నపిల్లల్లో రక్తనాళాలు ఉండాల్సిన స్థితిలో సవ్యంగా లేకుండా తేడాగా ఉంటే గుండెపోటు వచ్చే అవకాశాలుంటాయి. ఏదైనా అంశంపై వారు భావోద్వేగానికి గురైనా, ఎగ్జైట్‌మెంట్ పెరిగినా వారి గుండె కదలికల్లో మార్పులు సంభవిస్తాయి. ఎక్కువగా ఆయాసపడుతున్నా, తరచుగా మూర్ఛ (ఫిట్స్) పోవడం జరుగుతున్నా గుండె సమస్య ఉన్నట్టుగా అనుమానించాలి. మైటోకాండ్రియా సెల్స్‌లో పొటాషియం, కాల్షియం, సోడియం సమతూకం దెబ్బతింటే రిథమ్ డిస్టర్బెన్స్ వచ్చి కుప్పకూలే అవకాశాలుంటాయి. పుట్టినప్పటి నుంచే గుండె పనితీరుకు సంబంధించి ఏవైనా లోపాలుంటే ప్రాథమికంగా ఈసీజీ, 2 డీ ఎకో పరీక్షల ద్వారా కనిపెట్టవచ్చు. ప్రస్తుతం వైద్య చికిత్సలో అధునాతన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చినందున గుండె సమస్యలున్న చిన్నారులకు తగిన చికిత్స అందించేందుకు అవకాశం ఉంది. గర్భస్థ శిశువుగా ఉన్నపుడు కూడా గుండె సంబంధిత సమస్యలను గుర్తించి సరిచేయవచ్చు. బిడ్డ పుట్టాక ఫాలో అప్ చేయడం ద్వారా కూడా అకస్మాత్తుగా గుండెపోటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.

– డాక్టర్ హరీష్ తంగెళ్లపల్లి, డీఎం కార్డియాలజీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉస్మానియా జనరల్ హాస్పిటల్, హైదరాబాద్

సర్వే 'సమగ్ర'మేనా?

▶ మొదటి పేజీ తరువాయి


పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు. సర్వే ఫారాల కంప్యూటరీకరణ కూడా సాగుతోంది.

40 ప్రశ్నలకు అరకొర జవాబులు..


సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రశ్నావళిలో 75 ప్రశ్నలు ఉన్నాయి. అందులో 56 ప్రధాన ప్రశ్నలు, 19 ఉప ప్రశ్నలు. మొత్తం ప్రశ్నావళి రెండు భాగాలుగా ఉంది. మొదటి విభాగం (పార్ట్–1)లో కుటుంబ యజమాని, కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలకు సంబంధించిన ప్రశ్నలు ఉన్నాయి. సాధారణ వివరాలు, విద్య, ఉద్యోగ, ఉపాధి, భూమి, రిజర్వేషన్లు, రాజకీయాలు, వలసలకు సంబంధించిన అంశాలపై ప్రశ్నలు ఉన్నాయి. రెండో విభాగం (పార్ట్–2)లో కుటుంబ ఆర్థిక స్థితిగతుల అంశాలు ఉన్నాయి. రుణాలు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలు, పశు సంపద, స్థిరాస్తి, రేషన్ కార్డు, నివాస గృహానికి సంబంధించిన ప్రశ్నలు ఉన్నాయి. ఇందులో చాలా ప్రశ్నలకు ప్రజలు సమాచారం ఇవ్వడం లేదని ఎన్యుమరేటర్లు చెప్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కాస్త మెరుగ్గా ఉన్నా.. పట్టణ ప్రాంతాల్లో స్పందన అంతంతగానే ఉందంటున్నారు. 56 ప్రధాన ప్రశ్నల్లో సుమారు 40 ప్రశ్నలకు సరైన విధంగా జవాబులు రావడం లేదని పేర్కొంటున్నారు.

- సర్వే ఫారం మొదటి విభాగంలో 1 నుంచి 10వ ప్రశ్నలకు సమాధానాలు చెప్పేందుకు జనం ఎలాంటి ఇబ్బందిపడటం లేదు. ఇందులో కుటుంబ సభ్యుల పేర్లు, లింగం, మతం, సామాజికవర్గం, కులం, వయసు తదితర ప్రశ్నలున్నాయి. **11, 12వ ప్రశ్నలు ఆధార్, ఫోన్ నంబర్లకు సంబంధించినవి. ఇవి ఐచ్ఛికమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ వివరాలను చెప్పేందుకు గ్రామీణ ప్రాంతాల వారు ముందుకొస్తున్నా.. పట్టణ ప్రాంతాల్లో చెప్పేందుకు ఇష్టపడటం లేదు.**
- ఇక కాలమ్ 13 నుంచి 19 వరకు ప్రశ్నలు వివాహ స్థితి, పాఠశాల, విద్యార్హతలు, మాధ్యమం, డ్రాపౌట్ తదితర వివరాలకు సమాధానాలు వస్తున్నాయి.
- కాలమ్ 20 నుంచి 56 వరకు ఉన్న ప్రశ్నలకు సమాచారం చెప్పడంలో జనం వెనక్కి తగ్గుతున్నారు. అందులో చాలావరకు వ్యక్తిగత వివరాలు ఉన్నాయని.. అవి వెల్లడించలేమని నిర్మొహమాటంగా చెబుతున్నారు.
- 20వ కాలమ్ నుంచి ఉన్న ప్రశ్నల్లో ఎక్కువగా వ్యక్తిగత అంశాలు, ఆస్తులకు సంబంధించిన వివరాలే ఉన్నాయి. వృత్తి, వ్యాపారం, వేతనం, కులవృత్తి, వ్యాధులు, వార్షికాదాయం, పన్ను చెల్లింపులు, బ్యాంకు ఖాతాలు, వ్యవసాయ భూములు, ధరణి పాస్‌బుక్ వివరాలు, భూమి రకం, నీటిపారుదల వనరులు, కౌలు, రిజర్వేషన్ల ద్వారా పొందిన విద్యావకాశాలు, ఉద్యోగ ప్రయోజనాలు, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి, ప్రజా ప్రతినిధిగా పనిచేసిన అనుభవం, నామినేటెడ్ పోస్టులు, వల సలు, అందుకు కారణాలు, బ్యాంకు లేదా ఇతర సంస్థల నుంచి రుణాలు, వాటి చెల్లింపులు, పశుసంపద, స్థిర, చరాస్తి వివరాలు, రేషన్ కార్డు, నివాసగృహం, ఇంటికి సంబంధించిన ప్రశ్నలకు సరిగా సమాధానాలు రావడం లేదని ఎన్యుమరేటర్లు వాపోతున్నారు.

సమగ్ర సర్వేలో గుర్తించిన ఇళ్లు



సర్వే పూర్తయిన ఇళ్లు: 1,05,03,257



రాష్ట్రంలో ఇప్పటివరకు సర్వే పూర్తయిన శాతం

సర్వే విధుల్లో పాల్గొన్న ఎన్యుమరేటర్లు 87,807

గ్రామీణ ప్రాంత ఎన్యుమరేటర్లు 47,561

పట్టణ ప్రాంత ఎన్యుమరేటర్లు 40,246

పర్యవేక్షకులు 8788 (ప్రతి పది మంది ఎన్యుమరేటర్లకు ఒక పర్యవేక్షకుడు)

సమగ్ర సర్వే దాదాపు పూర్తయిన జిల్లాలు: ములుగు, జనగామ, నల్లగొండ, మెదక్, యాదాద్రి భువనగిరి, జగిత్యాల, గద్వాల, కామారెడ్డి, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల

'అసలు' వివరాలే రావట్లే!

సమగ్ర కుటుంబ సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాల సేకరణే కీలకం. కానీ ఉద్యోగం, వృత్తి, ఆర్థిక, రాజకీయ అంశాలకు సంబంధించిన ప్రశ్నలకు జవాబులు ఇవ్వకపోతుండటంతో ఎన్యుమరేటర్లు సైతం చేతులెత్తేస్తున్నారు. వివరాలు చెప్పాలని మళ్లీ మళ్లీ అడిగితే... ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతుండటంతో ఇచ్చిన వివరాలు నమోదు చేసుకుంటూ ఇతర కాలమ్స్‌ను వదిలేస్తున్నారు. కొన్ని చోట్ల గట్టిగా ఎదురు ప్రశ్నిస్తుండటంతో చాలామంది ఎన్యుమరేటర్లు తర్వాత అడగడమే మానేశారు. అయితే నిర్దేశించిన ప్రశ్నల్లో సగానికి పైగా సమాధానాలు రాకపోతే సర్వే లక్ష్యం నెరవేరే అవకాశాలు తక్కువేనని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొన్నిచోట్ల ఎన్యుమరేటర్లు పెన్సిల్‌తో సర్వే ఫారం పూరిస్తున్నారు. తర్వాత వాటిని పెన్నుతో రాస్తామని చెప్తున్నారు. తప్పులు దొర్లకుండా ఈ విధానం అనుసరిస్తున్నట్టు ఎన్యుమరేటర్లు చెప్తున్నా... పెన్నుతో రాసే సమయంలో ఇతర వివరాలు నమోదు చేస్తారేమోనని జనంలో ఆందోళన కనిపిస్తున్న పరిస్థితి.



ఆదాయ వివరాలు ఎందుకు చెప్పాలి..

ఈ ఎన్యుమరేటర్ పేరు రవికుమార్. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేశారు. వెంకటేశ్వరకాలనీ 4బీ రోడ్‌లో నివాసం ఉంటున్న మంద సతీశ్‌రెడ్డి ఇంటికి రాగా.. సర్వేతో తమకు ఎంత మేరకు ప్రయోజనం చేకూరుతుందని.. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా సర్వే చేసింది.. అప్పుడు అన్ని చెప్పాం.. మళ్లీ కొత్తగా చెప్పేది ఏముంటుందని ప్రశ్నించారు. దీంతో ఎన్యుమరేటర్ నచ్చజెప్పి వివరాలను నమోదు చేశారు. కుల వృత్తికి సంబంధించి ప్రశ్న అడగ్గా.. రెడ్డిలకు ఏ కుల వృత్తి ఉంటుందని ఎదురు ప్రశ్నించారు. అలాగే, ఆదాయ వివరాలు ఎందుకు చెప్పాలంటూ ఎదురు ప్రశ్నించారు. తాము అప్పులు చేసి కొన్న ఫ్రిజ్, టీవీ, ఏసీ, వాహనం వంటి వివరాలు అడగడం తగదన్నారు. రుణమాఫీ, రైతుబంధు, రేషన్‌కార్డు, పింఛన్లు ఇవ్వకుండా సర్వే చేయడం అనవసరమని చెప్పారు.

సంక్షేమ పథకాలకు కోత పడుతుందని..

సమగ్ర సర్వేపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయడంలో అధికార యంత్రాంగం సఫలీకృతం కాకపోవడంతోనే... సర్వేలో చాలా ప్రశ్నలకు సమాధానాలు రావడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా ఆర్థికపరమైన అంశాలు, ఆస్తులు, అప్పులకు సంబంధించిన సమాచారాన్ని చాలా మంది వెల్లడించడం లేదు. ఒకవేళ ఆస్తుల లెక్కలు చెబితే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్లో కోత పడుతుందనే ఆందోళన కనిపిస్తోంది. ఈ కారణంగానే ఆధార్ వివరాలను కూడా ఈ కారణంగానే బహిర్గతం చేయడం లేదని అంటున్నారు. వాహనాలు, ఇళ్లు, స్థిర, చరాస్తులకు సంబంధించిన సమాచారాన్ని కూడా ఎక్కువ మంది చెప్పడం లేదు. ప్రధానంగా పింఛన్లు, ఉచిత కరెంటు, రేషన్‌కార్డు, ఉచిత నల్లా కనెక్షన్, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ తదితర పథకాలు ఆగిపోతాయేమోనన్న కారణంతో వాస్తవాలను దాచేస్తున్న పరిస్థితి.

స్టిక్కర్లు వేయని ఇళ్ల మాటేంటి?

పట్టణ ప్రాంతాల్లో చాలా ఇళ్లకు ఇప్పటికీ స్టిక్కర్లు వేయలేదని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, నాలుగైదు అంతస్తుల భవనాల్లోని చాలా ఇళ్లకు స్టిక్కర్లు వేయలేదని అంటున్నారు. పూర్తిస్థాయి సర్వేలో ఇలాంటి ఇళ్లను గుర్తించి, వివరాలు నమోదు చేసే అవకాశం లేకుండా పోయిందన్న ఫిర్యాదులు వస్తున్నాయి. సర్వే సమయంలో అలాంటి ఇళ్లను కూడా గుర్తించాలని అధికారులు సూచిస్తున్నా.. ఎన్యుమరేటర్లు వచ్చే సమయం తెలియక ఇబ్బందిగా మారిందని ప్రజలు పేర్కొంటున్నారు.

జార్ఖండ్‌లో భట్టి బిజీబిజీ

- గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో భేటీ
- ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి కోసం గవర్నర్‌కు విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: జార్ఖండ్ అసెంబ్లీ ఫలితాల నేపథ్యంలో ఏఐసీసీ పరిశీలకుని హోదాలో రాంచీలో మకాం వేసిన తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదివారమంతా బిజీబిజీగా గడిపారు. తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పక్షాన పోటీ చేసి గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో జార్ఖండ్ పీసీసీ కార్యాలయంలో ఆయన భేటీ అయ్యారు. జేపీసీసీ అధ్యక్షుడు కేశవ్ మహతో కమలేశ్‌తో పాటు పార్టీ సీనియర్ నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గెలిచిన ఎమ్మెల్యేలకు అభినందనలు తెలిపిన భట్టి.. కొత్త ప్రభుత్వ ఏర్పాటు క్రమంలో పార్టీ వ్యూహాలను ఎమ్మెల్యేలకు వివరించారు. ఆ తర్వాత ఇండియా కూటమి ఎమ్మెల్యేలతో కలిసి జార్ఖండ్ గవర్నర్ సంతోశ్ గంగ్వార్‌ను కలిశారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌తో పాటు జేఎంఎం, కాంగ్రెస్, ఆర్‌జేడీ, సీపీఐఎంఎల్ పార్టీల ఎమ్మెల్యేలతో కలిసి రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఇండియా కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి కోరారు. కాగా, జార్ఖండ్ ఎన్నికల ప్రక్రియలో కీలకపాత్ర పోషించిన భట్టి ఫలితాల అనంతరం ప్రభుత్వ ఏర్పాటు, మంత్రివర్గ కూర్పు తదితర అంశాల్లో కాంగ్రెస్ పక్షాన కీలకంగా వ్యవహరిస్తుండటం గమనార్హం.

ఎన్నుకున్న ప్రజల కోసం కష్టపడి పనిచేయండి

దేశాన్ని ఓ వికృత పార్టీ పాలిస్తోందని, ఆ పార్టీని కాదని ప్రజలు మిమ్మల్ని ఎన్నుకున్నందున వారి కోసం కష్టపడి పనిచేయాలని జార్ఖండ్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు భట్టి దిశానిర్దేశం చేశారు. రాంచీలోని హోటల్ చాణక్యలో జరిగిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల భేటీలో ఆయన మాట్లాడారు. 'ఇక్కడ కూర్చున్న వాళ్లు అదృష్టవంతులు. ఎంతోమంది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా పోటీ చేయాలనుకున్నారు. కానీ అందరికీ టికెట్లు దక్కలేదు. కాంగ్రెస్ పార్టీలో పనిచేయడం అదృష్టం' అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వంతో పాటు రాష్ట్ర పార్టీ పక్షాన కొత్త ఎమ్మెల్యేలను అభినందించిన భట్టి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పక్షాన రాష్ట్రానికి రావాలని కోరుతూ జార్ఖండ్ ఎమ్మెల్యేలకు సాదర ఆహ్వానం పలికారు. ఈ సమావేశంలో జార్ఖండ్ పార్టీ ఇన్‌చార్జి సిరివెళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పొరపాట్లకు తావివ్వకండి

సర్వేలో డేటా ఎంట్రీ చాలా కీలకం
రాంచీ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో భట్టి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న భట్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ఈ దశలో డేటా ఎంట్రీ చాలా ముఖ్యమైనదని, ఈ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని సంబంధిత అధికారులను ఆదేశించారు. జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో ఉన్న ఆయన అక్కడి నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సర్వే స్థితిగతులను అడిగి తెలుసుకోవడంతో పాటు మిగిలిన ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. సర్వే జరిగిన క్రమంలో పట్టణ ప్రాంతాల్లో కొన్ని చోట్ల డోర్‌లాక్ ఉండటం, ఇంటివద్ద అందుబాటులో లేకపోవడం లాంటి సమస్యలు వచ్చాయని, వారి వివరాలను ఫోన్ ద్వారా.. లేదంటే నేరుగా కలిసి సేకరించాలని కోరారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు వెళ్లిన వారి వివరాలను కూడా జాగ్రత్తగా క్రమబద్ధీకరించాలని సూచించారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నేడు (సోమవారం) ఢిల్లీ వెళ్లనున్నారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా కుమార్తె వివాహానికి ఆయన హాజరవుతారు. రాత్రికే సీఎం మళ్లీ హైదరాబాద్ వస్తారని సీఎంవో వర్గాలు వెల్లడించాయి.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటుదాం: కవిత



సాక్షి, హైదరాబాద్: అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పదవులకు రాజీనామా చేయకుండా పార్టీ మారిన నేతలను ప్రజలు క్షమించరని కవిత పేర్కొన్నారు. ఆదివారం తన నివాసంలో ఆమె జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు, బీసీ సంఘాల నేతలతో వేర్వేరుగా భేటీ అయ్యారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ బీఆర్‌ఎస్ కార్యకర్తల రెక్కల కష్టం మీద గెలిచి పార్టీ మారడంపై కవిత తీవ్ర విమర్శలు చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత తదితరులు పాల్గొన్నారు.

బీసీ నాయకులతో సమావేశం: యునైటెడ్ పూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి, బీసీ కుల సంఘాల ప్రతినిధులతో కవిత సమావేశమయ్యారు. సోమవారం ఉదయం 11 గంటలకు డెడికేటెడ్ కమిషన్ చైర్మన్‌కు ఆమె రిజర్వేషన్లపై వినతిపత్రం అందజేస్తారు.

నేడు మహబూబాబాద్‌లో బీఆర్‌ఎస్ మహా ధర్నా

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాక

మహబూబాబాద్: లగచర్ల బాధితులకు అండగా సోమవారం మహబూబాబాద్‌లో బీఆర్‌ఎస్ పార్టీ దళిత, గిరిజన రైతులతో కలసి మహా ధర్నా నిర్వహించనుంది. మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం జరగనుంది. ఈ నేపథ్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ తదితరులు మీడియాతో మాట్లాడారు. ప్రజలను ఇబ్బంది పెడుతున్న సీఎం రేవంత్‌రెడ్డిలో మార్పు రావాలని, ఆయనలో మార్పు వచ్చేవరకూ వదిలి పెట్టమని ఎర్రబెల్లి అన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వందకుపైగా సీట్లతో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమన్నారు. లగచర్ల రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేసి, వారిని విడుదల చేయాలని, ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. సీఎం సొంత గ్రామంలో ఆయన కుటుంబ సభ్యుల కారణంగా మాజీ సర్పంచ్ సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ తలపెట్టిన మహాధర్నాకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ పోలీసులు సంఘవిద్రోహ శక్తులను ముందే అరెస్ట్ చేసి ధర్నాకు ఆటంకం కలగకుండా చూడాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ ధర్నాకు అనుమతి విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్‌కు చెంప పెట్టులాంటిదన్నారు. అనంతరం ధర్నా జరిగే ప్రాంతాన్ని నాయకులు పరిశీలించారు.

ఉద్యమ స్ఫూర్తిని మళ్లీ రగిలిస్తం

▶ మొదటి పేజీ తరువాయి

చేసుకుంటూ 33 జిల్లాల్లోని బీఆర్‌ఎస్ కార్యాలయాల్లో ఈ నెల 29న దీక్షా దివస్ నిర్వహిస్తాం. దీక్షా దివస్ నిర్వహణకు ఈ నెల 26న అన్ని జిల్లాల్లో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేస్తాం. సీనియర్ నాయకులకు జిల్లాల వారీగా దీక్షా దివస్ ఇన్‌చార్జీలుగా బాధ్యతలు అప్పగించాం' అని కేటీఆర్ వెల్లడించారు.

డిసెంబర్ 9న మేడ్చల్‌లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

కేసీఆర్ నిరాహార దీక్ష ముగించిన రోజును గుర్తు చేస్తూ డిసెంబర్ 9న మేడ్చల్‌లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేస్తామని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ నిరాహార దీక్ష చేసిన నిమ్స్ ఆసుపత్రిలో అన్నదానం, రోగులకు పండ్లు పంపిణీ చేస్తామని చెప్పారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పాలనా కాలంలో తెలంగాణలోని ప్రతీ వర్గం, ప్రతీ మనిషి బతుకు చితికిపోయిందని, ఇప్పుడు తిరిగి అవే పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. నిర్బంధాలు, అణచివేతలు, దుర్భర పరిస్థితులు దర్శనమిస్తున్నాయని..కాంగ్రెస్‌కు అధికారమిస్తే తెలంగాణలో మళ్లీ అదే అంధకారం నెలకొని అట్టడుగు వర్గాలతో సహా అందరూ బాధపడుతున్నారని ధ్వజమెత్తారు.

జాతీయ పార్టీలకు బుద్ధి చెప్పేలా..

'స్వరాష్ట్ర కలను నిజం చేసేందుకు 'కేసీఆర్ సచ్చుడో... తెలంగాణ వచ్చుడో'అని తెగువ చూపిన నాయకుడికి మూడు కోట్ల మంది ప్రజలు ముక్త కంఠంతో అండగా నిలబడ్డారు. ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ రాష్ట్రం సాధించిన కేసీఆర్ స్ఫూర్తితో ప్రస్తుతం మళ్లీ రెండు జాతీయ పార్టీల మెడలు వంచాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉంది. దుర్మార్గ కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలనే సంకల్పంతో బీఆర్‌ఎస్ చేపడుతున్న కార్యక్రమాల్లో కార్యకర్తలు కలసి కట్టుగా పనిచేయాలి'అని కేటీఆర్ పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, మహమూద్ అలీ, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, కేపీ వివేకానంద్, ముఠా గోపాల్ పాల్గొన్నారు.

పురుగుల అన్నం.. కుళ్లిన కూరలు

- గిర్మాపూర్ గురుకుల పాఠశాలలో నాసిరకం ఆహారం
- ఆందోళనకు దిగిన తల్లిదండ్రులు

కొండాపూర్ (సంగారెడ్డి): గురుకులాలు, ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని పాలకులు ఎంత మొత్తుకుంటున్నా క్షేత్రస్థాయి పరిస్థితుల్లో ఏమార్పూ ఉండటం లేదు. విద్యార్థులకు పురుగుల అన్నం, కుళ్లిన కూరలే గతి అవుతున్నాయి. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల పరిధిలోని గిర్మాపూర్ గురుకుల పాఠశాలలో ఆదివారం పాఠశాల సిబ్బంది దారుణమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించారు. పురుగులు పట్టిన అన్నం.. కుళ్లిపోయిన కూరగాయలతో వండిన కూరలు వడ్డించారు. ఆహారం దుర్వాసన రావటంతో విద్యార్థులు తినకుండా పారబోశారు. ఆదివారం సెలవురోజు కావడంతో తమ పిల్లల్ని చూసేందుకు వచ్చిన తల్లిదండ్రులు.. ఆ ఆహారాన్ని పరిశీలించగా అన్నంలో పురుగులు కనిపించాయి. కూరలు దుర్వాసన వచ్చాయి. విద్యార్థులు ఉంటున్న వసతి గృహం కూడా చెత్తా చెదారంతో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పిల్లలు తమ తల్లిదండ్రులతో వాపోయారు. ఆ పరిస్థితులను చూసి ఆగ్రహించిన తల్లిదండ్రులు గురుకుల పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. పురుగుల అన్నం వడ్డించటంపై ప్రిన్సిపాల్ సుదర్శన్‌ను నిలదీశారు. వారం రోజుల్లో అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



సిబ్బందితో విద్యార్థుల తల్లిదండ్రుల వాగ్వాదం

అబద్ధాల్లో రేవంత్‌కు పీహెచ్‌డీ ఇవ్వొచ్చు

ఆరు గ్యారంటీలు అమలు చేసేవరకూ విడిచి పెట్టం: హరీశ్‌రావు



హుజూరాబాద్: అబద్ధాలు ఆడటంలో సీఎం రేవంత్‌రెడ్డికి పీహెచ్‌డీ పట్టా ఇవ్వవచ్చని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను మహారాష్ట్రలోనూ అమలు చేస్తామని చెబితే, అక్కడి ప్రజలు కనిపెట్టి ఓటుతో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పారని అన్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోరు తెరిస్తే అబద్ధాలు తప్ప నిజాలు రావడం లేదని, అధికారంలోకి వచ్చిన వంద రోజులలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి ఇప్పటివరకు ఏ ఒక్కటీ సంపూర్ణంగా పూర్తి చేయలేదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కట్టిన కాళేశ్వరంతో తెలంగాణవ్యాప్తంగా పంట పొలాలు సస్యశ్యామలం అయ్యాయని చెప్పారు. కాళేశ్వరం కూలిపోయిందని నిందవేశారని, ఇప్పుడు ఆ కాళేశ్వరమే కాంగ్రెస్‌కు దీపం అయ్యిందన్నారు. హైదరాబాద్ ప్రజలకు తాగునీటి కోసం కాళేశ్వరం నుంచి టెండర్లు పిలవాలని సీఎం చెప్పడమే దీనికి ఉదాహరణ అని పేర్కొన్నారు. నీళ్ల కోసం కేసీఆర్ అనేక ఆలోచనలు చేసి కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టి లక్షల ఎకరాలకు నీళ్లు అందించారన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు కేవలం 30 లక్షల టన్నుల పంట పండితే.. కేసీఆర్ పాలనలో 1.54 కోట్ల టన్నుల పంట పండిందన్నారు. ముఖ్యమంత్రి ఇలాఖాలోనే ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా రైతులు పోరాడుతున్నారని, ఫార్మాసిటీకి గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన సీఎం, ఇప్పుడు ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏర్పాటు అని ఎలా చెబుతారని ప్రశ్నించారు. దళితబంధు కోసం హుజూరాబాద్‌లో ధర్నాకు దిగిన దళిత కుటుంబాలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని హరీశ్ ఖండించారు. దళితుల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో నిలదీస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

డీప్ ఫేక్.. అంతా ఫేక్..



నకిలీ ఆడియో, వీడియో, ఫొటోలు సృష్టించి సైబర్ నేరగాళ్ల ఆగడాలు

సోషల్ మీడియాలో పెట్టే ఫొటోలే వారికి వనరు

కొన్ని కిటుకులతో డీప్ ఫేక్‌ను గుర్తించవచ్చంటున్న నిపుణులు

మీరు చెప్పనిది చెప్పినట్టుగా..
అనని మాటలు అన్నట్టుగా..
చెయ్యని పనులు చేసినట్టుగా..

ఒక్క మాటలో చెప్పాలంటే మిమ్మల్ని మీరు నమ్మలేనంతగా మాయ చేసి ఏమార్చే డీప్ ఫేక్ కాలం నడుస్తోంది. ఈ టెక్నాలజీని గతంలో సెలబ్రిటీలు, రాజకీయ నాయకులను బద్నాం చేసేందుకే అధికంగా వినియోగించగా.. ఇప్పుడది సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి కూడా వెళ్లింది. మీరు మీ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, 'ఎక్స్' వంటి సోషల్ మీడియా అకౌంట్లలో పంచుకునే ఒకే ఒక్క హై రిజల్యూషన్ ఫొటో ఉంటే చాలు.. సైబర్ నేరగాళ్లు మీకు సంబంధించి ఏ డీప్ ఫేక్‌నైనా సృష్టించగలరని పేర్కొంటున్నారు.

– సాక్షి, హైదరాబాద్

డీప్ ఫేక్‌లో ఏమేం చేయవచ్చు?

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్ వాడి డీప్ ఫేక్ వీడియోలు, ఆడియోలు, ఫొటోలు సృష్టించవచ్చు. సాంకేతికంగా చెప్పాలంటే డీప్ ఫేక్‌లో ఫేస్ స్వాపింగ్, వాయిస్ క్లోనింగ్, లిప్ సింక్రనైజింగ్, ఎమోషనల్ మ్యానుపులేషన్, ఆడియో డీప్ ఫేక్ వంటివి చేయవచ్చు. ఒరిజినల్ వాయిస్‌లోంచి మనకు కావాల్సిన పదాలను ఎంపిక చేసుకుని వాటి నుంచి ఫేక్ కంటెంట్‌ను స్పీచ్ సింథసిస్ చేసే వీలు కూడా ఉందని నిపుణులు చెబుతున్నారు. అమాయకులను మోసగించేందుకు సైబర్ నేరగాళ్లు ఈ డీప్ ఫేక్‌ను అస్త్రంగా మార్చుకుంటున్నారు.

సోషల్ మీడియాలో అతి వద్దు

ఫేస్‌బుక్, 'ఎక్స్', ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికలపై కొందరు అవసరానికి మించి వ్యక్తిగత, ఫొటోలు, వీడియోలను పంచుకుంటారు. ఇలా చేస్తే సైబర్ నేరగాళ్లకు అవకాశం ఇచ్చినట్టేనని నిపుణులు చెబుతున్నారు. ఇలా మనం పెట్టే ఫొటోలు, వీడియోలను వాడుకుని డీప్ ఫేక్ చేసేందుకు అవకాశాలున్నాయని హెచ్చరిస్తున్నారు. సోషల్ మీడియా యాప్‌లు వాడే విష యంలో ప్రైవసీ సెట్టింగ్స్‌ను మరవొద్దని సూచిస్తున్నారు. మనం పెట్టే ఫొటోలు, వీడియోలు మన కాంటాక్ట్ లిస్ట్‌లోనివారే చూసేలా సెట్టింగ్స్ అప్‌డేట్ చేసుకోవడం మంచిదని చెబుతున్నారు.

డీప్ ఫేక్‌ను ఎలా గుర్తించవచ్చు?

డీప్ ఫేక్ వీడియోను గుర్తించేందుకు అందులోని వ్యక్తుల ముఖ కవళికలను నిశితంగా పరిశీలించాలి. అసహజంగా కళ్లు ఆర్పుతున్నట్టుగా ఉన్నా, సహజ పరిస్థితులకు భిన్నంగా ముఖంపై వచ్చే లైటింగ్‌లో తేడాలు ఉన్నా అది డీప్ ఫేక్ అని గుర్తించాలి.

శరీర కదలికల్లో అకస్మాత్తుగా తేడాలు ఉన్నా అనుమానించాలి.

ఆడియోలో పెదాల కదలికలు సరిగానే అనిపిస్తున్నా..కొన్ని పదాలు వెనుక, ముందు అవుతుండడం గమనించవచ్చు.

డీప్ ఫేక్ ఆడియోల్లో నిశితంగా గమనిస్తే.. వాయిస్ మాడ్యులేషన్‌లో తేడాలను, ఆడియో క్వాలిటీలో తేడాలను గుర్తించవచ్చు.

డీప్ ఫేక్ ఇమేజ్‌లలో చివరలు బ్లర్ అయినట్టుగా ఉంటాయి. బ్యాక్‌గ్రౌండ్‌లో తేడాలు, వెలుతురులో తేడాలు ఉంటాయి.

కొండ కింద భక్తులు పార్కింగ్ చేసిన వాహనాలు



కార్తీకం.. గుట్టపై పోటెత్తిన భక్తజనం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం ముగుస్తుండటం, మరోవైపు సెలవు రోజు కావడంతో ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. దీంతో క్యూకాంప్లెక్స్, ప్రసాద విక్రయశాల, ముఖ మండపం, కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి, సత్యనారాయణస్వామి వ్రత మండపం, ఆలయ మాడ వీధులు, మెట్ల దారి భక్తులతో కిక్కిరిసిపోయాయి. 45 వేల మందికిపైగా స్వామి వారిని దర్శించుకున్నారు. ధర్మ దర్శనానికి నాలుగు గంటలకుపైగా, వీఐపీ దర్శనానికి గంటన్నరకుపైగా సమయం పట్టిందని భక్తులు తెలిపారు. కాగా 2,520 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో కొండ దిగువన పార్కింగ్ ప్రాంతాలన్నీ వాహనాలతో నిండిపోయాయి.

క్లుప్తంగా...

రేపు ఓయూలో జాబ్‌మేళా

100 ఫార్మసిస్టు పోస్టుల భర్తీకి సన్నాహాలు

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా వర్సిటీలోని ఎంప్లాయ్‌మెంట్ బ్యూరో, అపోలో ఫార్మసీ సంయుక్తంగా ఈ నెల 26న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నాయి. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న ఎంప్లాయ్‌మెంట్ బ్యూరో కార్యాలయంలో జాబ్‌మేళా జరగనుంది. అపోలో ఫార్మసీల్లోని 100 ఫార్మసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్టు పోస్టులను.. జాబ్‌మేళా లో భర్తీ చేయనున్నారు. డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డిగ్రీ చేసిన 18 నుంచి 35 ఏళ్ల వయసున్న అభ్యర్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు వర్సిటీ ఎంప్లాయ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఒక ప్రకటనలో తెలిపింది. వేతనం రూ.14,800 నుంచి 25 వేల వరకు ఇవ్వనున్నారు. విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్సు ప్రతులతో యూనివర్సిటీ ఎంప్లాయ్‌మెంట్ బ్యూరోకు హాజరుకావాలని సూచించారు.

డిసెంబర్ 14, 15 తేదీల్లో 'అరుణోదయ' మహాసభలు



సాక్షి, హైదరాబాద్/సిరిసిల్ల: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఏర్పాటై 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా డిసెంబర్ 14, 15 తేదీల్లో హైదరాబాద్‌లో మహాసభలు నిర్వహించనున్నట్టు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆహ్వాన సంఘం తెలిపింది. మహాసభలను విజయవంతం చేసేందుకు 200 మందితో ఏర్పాటైన ఆహ్వాన సంఘం ఆదివారం ప్రత్యేకంగా సమావేశమైంది. డిసెంబర్ 14, 15 తేదీల్లో రెండ్రోజుల పాటు జరిగే మహాసభల్లో మొదటి రోజు వీఎస్టీ హాలులో, రెండో రోజు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కార్యక్రమాలుంటాయని వివరించింది. సమావేశంలో విమలక్క తదితరులు పాల్గొన్నారు.

'విత్తన' ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



వి.లచ్చిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: విత్తన ధ్రువీకరణ సంస్థ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి వెల్లడించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంలో ఈ సంస్థ ఉద్యోగుల పాత్ర కీలకమని, ఈ విభాగాన్ని చిన్న సంస్థగా కాకుండా ప్రత్యేక శాఖగా పరిగణించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ విత్తన ధ్రువీకరణ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ, విత్తన ధ్రువీకరణ సంస్థ ఉద్యోగులు జేఏసీలో భాగస్వాములవడం అభినందనీయమన్నారు. సంస్థ ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా జేఏసీ అండగా ఉంటుందని చెప్పారు. అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ తిరుపతి నాయక్, విత్తన ధ్రువీకరణ అధికారుల అసోసి యేషన్ అధ్యక్షుడు టి. జయప్రకాశ్, ప్రధాన కార్యదర్శి పెబ్బేటి మహేశ్, కోశాధికారి వి. పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

అభ్యర్థులకు టీ-సాట్ 'జనరల్ స్టడీస్ ఫర్ ఆల్'

సాక్షి, హైదరాబాద్: 'జనరల్ స్టడీస్ ఫర్ ఆల్' పేరుతో అన్ని పోటీ పరీక్షలకూ ఉపయోగపడే కంటెంట్ సోమవారం (ఈనెల 25) నుంచి ప్రసారం చేయాలని నిర్ణయించినట్లు టీ-సాట్ (తెలంగాణ స్కిల్ అకడమిక్ ట్రెనింగ్) సీఈవో బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోటీ పరీక్షల అవగాహన పాఠ్యాంశాల ప్రసారాల్లో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన 600 ఎపిసోడ్స్.. 10 సబ్జెక్టులకు సంబంధించి 500 రోజుల కంటెంట్ ప్రసారం చేస్తున్నామన్నారు. టీ-సాట్ నిపుణ ఛానల్‌లో మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట, 3 నుంచి 4 గంటల వరకు, విద్య ఛానల్‌లో అదే రోజు రాత్రి 8 నుంచి 10 గంటల వరకు పునః ప్రసారం అవుతాయన్నారు.

21.73 ఎల్‌ఎంటీల ధాన్యం కొనుగోలు

మంత్రి ఉత్తమ్ వెల్లడి

- రైతులకు రూ.2,760.22 కోట్లు చెల్లింపు
- రైతులు తొందరపడి దళారులకు అమ్ముకోవద్దు



ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: గత సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 20.6 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీ) ధాన్యం కొనుగోలు చేయగా, ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి ఇప్పటికే 21.73 ఎల్‌ఎంటీల ధాన్యం కొనుగోలు చేసినట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరుగుతున్నాయని ఇప్పటివరకు రూ.5,040.01 కోట్ల విలువైన వడ్లు కొనుగోలు చేశామని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లు, పౌర సరఫరాల అధికారులతో ఆయన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నుంచి ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు దాదాపు 8 వేల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. గతంలో కంటే 2,447 కేంద్రాలను అధికంగా ప్రారంభించామన్నారు. మొత్తం 16.06 ఎల్‌ఎంటీల దొడ్డు, 5.67 ఎల్‌ఎంటీల సన్నాలు కొనుగోలు చేసినట్లు చెప్పారు. సన్నాలకు సంబంధించి రూ.283.25 కోట్ల బోనస్ ఇవ్వాల్సి ఉండగా.. రూ.8.17 కోట్లు చెల్లించామని తెలిపారు. చెల్లింపుల్లో గత ప్రభుత్వం కంటే ముందంజలో ఉన్నామని మంత్రి చెప్పారు. గత ప్రభుత్వంలో వానాకాలం సీజన్‌లో రూ.2,414.23 కోట్లు చెల్లిస్తే.. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటివరకు తాము రూ.2,760.22 కోట్లు చెల్లించామన్నారు.

రికార్డు స్థాయిలో దిగుబడి

ఉమ్మడి ఏపీలో కూడా రాని దిగుబడి ఈ సారి తెలంగాణలో వచ్చిందని ఉత్తమ్ చెప్పారు. 66.07 లక్షల ఎకరాల్లో 40 లక్షల మంది రైతులు 153 ఎల్‌ఎంటీల ధాన్యాన్ని పండించారని, ఇది భారతదేశంలోనే రికార్డు సృష్టిస్తుందని అన్నారు. కాళేశ్వరం కింద మూడు బరాజ్‌లు పని చేయకున్నా.. రికార్డు స్థాయిలో ఉత్పత్తి రావడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలే కారణమన్నారు. చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, జనవరి 10వ తేదీ వరకు కొనుగోళ్లు సాగుతాయని మంత్రి చెప్పారు. రైతులు తొందరపడి దళారులకు అమ్ముకోవద్దని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి మూడు రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందన్నారు.

ధాన్యం ఎప్పటికప్పుడు తరలించాలి

అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం

హుజూర్‌నగర్ రూరల్: కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని వేపలసింగారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. యంత్రం ద్వారా ధాన్యం తేమను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో జాప్యం జరుగుతోందని, లారీలు సకాలంలో రావడం లేదని రైతులు చెప్పారు. దీంతో మంత్రి వెంటనే అధికారులతో మాట్లాడి రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఫీజు చెల్లించలేక కూలి పనికి..

దాతల సాయానికి చదువుల తల్లి వినతి



మిర్యాలగూడ: ఉన్నత చదువు చదవాలన్నది ఆ గిరిజన బిడ్డ తపన.. కానీ, ఫీజు చెల్లించే ఆర్థిక స్తోమత లేకపోవడంతో కూలి పనులకు వెళ్తూ కష్టపడుతోంది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం వాటర్‌ట్యాంక్ తండాకు నూనావత్ లింగా, శాంతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కూతురు మౌనిక, చిన్న కూతురు కల్యాణి. మౌనిక మూడేళ్ల వయసులో తల్లి మరణించగా.. తండ్రి మరో పెళ్లి చేసుకుని తన దారి తాను చూసుకున్నాడు. అప్పటి నుంచి మౌనిక, కల్యాణిల బాగోగులు అమ్మమ్మ, మామయ్యలు చూసుకుంటున్నారు. చదువు కోసం మౌనికను నల్లగొండ చారుమతి అనాథాశ్రమంలో చేర్పించగా.. ఇంటర్ బైపీసీలో 9.9 గ్రేడ్ మార్కులతో ఉత్తీర్ణురాలైంది. ఈ తరువాత శ్యామల నాగసేనారెడ్డి అనే వ్యక్తి ప్రోత్సాహంతో ఈఏపీ సెట్, నీట్ పరీక్షలు రాసి మంచి ర్యాంకు తెచ్చుకుంది. మహబూబాబాద్ జిల్లా మాల్యాలలోని హార్టీకల్చర్ కళాశాలలో కన్వీనర్ కోటాలో మౌనికకు సీటు వచ్చింది. మౌనిక చదువుకు అమ్మమ్మ బాణావత్ లచ్చి, మేనమామ శ్రీను కొంత సాయం చేస్తున్నప్పటికీ.. పూర్తిస్థాయిలో ఫీజు చెల్లించే స్తోమత వారికి లేదు. తన చదువుకు అవసరమైన ఫీజు చెల్లించేందుకు దాతలు చేయూతనివ్వాలని మౌనిక వేడుకుంటోంది.

బైక్‌పై వెళ్లి.. వైద్య శిబిరం ప్రారంభించి..

అడవిలో ఎస్పీ రోహిత్‌రాజు ప్రయాణం



అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన మనుబోతులగూడెం గ్రామ పంచాయతీ వేములూరులో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి రహదారి సౌకర్యం కూడా సక్రమంగా లేదు. మండల కేంద్రం నుంచి వేములూరు సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అక్కడికి వెళ్లాలంటే వాగులు, వంకలు దాటాల్సిందే. దీంతో ఎస్పీ బి.రోహిత్ రాజు సుమారు ఆరేడు కిలోమీటర్ల మేర దట్టమైన అటవీ ప్రాంతంలో బైక్‌పై ప్రయాణించి.. వేములూరులో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఇతర ప్రాంతాల నుంచి కొత్త వ్యక్తులను గ్రామాలకు రానివ్వొద్దని వారికి సూచించారు. కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు

ప్రజా పాలన విజయోత్సవాలకు వేగంగా ఏర్పాట్లు

శాఖలవారీగా సిద్ధమైన కార్యక్రమాల షెడ్యూల్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా డిసెంబర్ ఒకటో తేదీ నుంచి 9 వరకు నిర్వహించతలపెట్టిన ప్రజాపాలన విజయోత్సవాలకు అన్ని శాఖలు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమాల షెడ్యూల్‌ను సిద్ధం చేశాయి. సంబంధిత శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తోన్న మంత్రుల సారథ్యంలో ఈ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని ఇప్పటికే సీఎం ఆదేశించారు. ఆ మేరకు ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి.

విజయోత్సవాల్లో నిర్వహించే ముఖ్య కార్యక్రమాలు

- ఇప్పటికే ప్రారంభమైన 28 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ భవనాల నిర్మాణాలకు తోడు మరో 26 పాఠశాలలకు ఈ విజయోత్సవాల్లోనే శంకుస్థాపనలు చేయనున్నారు.
- స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రీడా పోటీలు నిర్వహిస్తారు. ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు సీఎం కప్ పేరుతో అన్ని గ్రామాల్లో వివిధ క్రీడా పోటీలు జరుపుతారు.
- కొత్తగా 16 నర్సింగ్, 28 పారామెడికల్ కళాశాలలను ప్రారంభిస్తారు. 213 కొత్త అంబులెన్సులను ప్రజలకు అందుబాటులోకి తెస్తారు.
- ట్రాన్స్‌జెండర్లకు వైద్య సేవలు అందించేందుకు జిల్లాకు ఒక ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌ను ప్రారంభిస్తారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ వలంటీర్లుగా ట్రాన్స్‌జెండర్లను నియమిస్తారు.
- హైదరాబాద్ వేదికగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారు. కొత్త భవనాలకు శంకుస్థాపన చేస్తారు. గోషామహల్‌లో నిర్మించతలపెట్టిన ఉస్మానియా ఆసుపత్రి భవనానికి భూమి పూజ చేస్తారు. ఆరాంఘర్–జూపార్క్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు. నిర్మాణం పూర్తి చేసుకున్న ఆరు మురుగునీటి శుద్ధి ప్లాంట్లు (ఎస్‌టీపీ) ప్రారంభిస్తారు. రూ.826 కోట్లతో కేబీఆర్ పార్క్ సమీపంలో నిర్మించనున్న ఫ్లైఓవర్లు, అండర్ పాస్ పనులకు శ్రీకారం చుడతారు. శిల్పకళా వేదిక సమీపంలో 106 స్టాళ్లతో ఏర్పాటుచేసిన ఇందిరా శక్తి మహిళా బజార్‌ను ప్రారంభిస్తారు.
- తెలంగాణ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అటవీ, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో సఫారీ థీమ్ పార్క్, బొటానికల్ గార్డెన్‌లను ప్రారంభిస్తారు.
- ఘట్‌కేసర్‌లో బాలికల ప్రభుత్వ ఐటీఐ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. మల్లేపల్లి, మేడ్చల్, నల్లగొండ ఏటీసీలను ప్రారంభిస్తారు.
- దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంటులో 800 మెగావాట్ల యూనిట్‌ను జాతికి అంకితం చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 237 కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు శ్రీకారం చుడతారు.
- ఇప్పటికే ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ తరగతులను ప్రారంభిస్తారు. స్పోర్ట్స్ యూనివర్సిటీకి భూమిపూజ చేస్తారు. ఐటీ, పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో ఏఐసిటీ ఏర్పాటుతో పాటు పలు ఒప్పందాలు చేసుకుంటారు.
- రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఏడాది పాలనపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు.

మొక్కా.. మొక్కా.. నీ పేరేంటి..

▶ మొదటి పేజీ తరువాయి

మందిలో 28 మంది మాత్రమే తెలుగు పేర్లు చెప్పారు. మిగతా వాళ్లతా శాస్త్రీయ నామాలే చెప్పారు. కుండీల్లో పెరిగే మొక్కల గురించి ప్రశ్నలేసినప్పుడు వందకు 20% మంది వాటి ఉపయోగాలను వెల్లడించలేకపోయారు.

- నాగజెముడును అనేక ఔషధాల్లో వినియోగిస్తున్నాయి. పల్లె వాకిట్లో తేలికగా దొరికే ఈ మొక్క గురించి వృక్షశాస్త్రంలో డిగ్రీ చేసిన 428 మందిని ప్రశ్నిస్తే, 48% దీని ఆనవాలు తెలియదన్నారు. 26% ఇదో ఔషధ మొక్క.. విదేశాల్లో పండిస్తారని చెప్పా రు. 18% మంది మాత్రమే భారతీయ పల్లె పెరిగే మొక్కగా గుర్తించారు.
- పదేళ్ల క్రితం వరకూ పల్లెల్లో విరివిగా కనిపించిన మంగళగిరి కంచె గురించి 60 శాతం బోటనీ విద్యార్థులకు అవగాహనే లేదు. కార్బన్‌డయాక్సైడ్‌ను నియంత్రించడంలో దీని పాత్ర గురించి అసలే చెప్పలేకపోయారు.
- వైద్య రంగంలో ఉన్నవారికి కూడా ఉమ్మెత్త మొక్క గొప్పతనం తెలియడం లేదు. ఇంటర్లో బైపీసీ చదివిన 250 మందిని ఈ మొక్క గురించి ప్రశ్నిస్తే.. 186 మంది అదేం మొక్క? అని ఎదురు ప్రశ్నించారు. ఫొటో చూశాక శాస్త్రీయ నామం చెప్పగలిగారు.
- బతకమ్మ సందడి వల్ల తెలుగు విద్యార్థులు తంగేడు చెట్టును గుర్తుపడుతున్నారు. నూటికి 80 శాతం మంది ఇది తంగేడు పూల మొక్క అని చూడగానే చెప్పారు.
- రకరకాల షాంపూల గురించి గుక్క తిప్పుకోకుండా చెప్పగలిగే ప్రస్తుత యువతరంలో 78 శాతం మందికి కుంకుడు చెట్టు గురించి ఇసుమంతైనా తెలియటంలేదు. ఈ చెట్టు ఆకులు ఎలా ఉంటాయో సర్వేలో పాల్గొన్న 92 శాతం మందికి తెలియలేదు.

కాల గర్భంలో ఎన్నో మొక్కలు

విరిగిన ఎముకలు కట్టుకోవడానికి వాడే నల్లేరు.. కఫంతో ఊపిరి ఆగిపోయే పరిస్థితి నుంచి కాపాడే కరక్కాయ.. ప్రాణం పోయేలా అనిపించే తలనొప్పిని సైతం తగ్గించే శొంఠి.. కురుపు ఏదైనా ఆకుతోనే నయం చేసే జిల్లేడు.. చర్మ వ్యాధుల పనిపట్టే మారేడు.. సర్వ రోగ నివారిణి తులసి వంటి ఎన్నో అద్భుత ఔషధ మొక్కలు మన పెరటి వైద్యం నుంచి కన్పించకుండా పోతున్నాయి.

ఇలా అయితే కష్టం

మొక్కలు, వాటి ప్రయోజనాలు తెలుసుకునే ఆసక్తి విద్యార్థి దశ నుంచే ఏర్పడాలి. లేకపోతే ఔషధ రంగం ఇతర దేశాల చేతుల్లోకి వెళ్తుంది. ఇప్పటివరకు 3.5 లక్షల మొక్క జాతులను వృక్ష శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇందులో 2.78 లక్షల మొక్కలపై ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు జరిగాయి. వీటిల్లో చాలా వరకు మన పల్లెల్లో ఒకప్పుడు కన్పించినవే.

-నవీన్ చావా (ఫార్మా రంగ నిపుణుడు)

విద్యలో మార్పు తేవాలి

నేడు అందరూ కంప్యూటర్ సైన్స్ వైపు వెళ్తున్నారు. వృక్షశాస్త్ర ప్రాధాన్యత తగ్గుతోంది. మొక్కల ప్రాధాన్యతను భావి తరాలకు చెప్పే బయో డైవర్సిటీ బోర్డులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే ఈ పరిస్థితిలో మార్పు వస్తుంది.

- డాక్టర్ కె. తులసీరావు, డైరెక్టర్, గ్లోబల్ బయోడైవర్సిటీ.



పొలం కాదిది.. కాలువ

పచ్చగా కనిపిస్తున్న ఈ చిత్రం పంటపొలం అనుకుంటే 'కాలువలో కాలేసినట్టే'.. ఇది పంట చేలకు నీరందించే కాలువ. నీరు కూడా కనిపించని స్థాయిలో కాలువ నిండా గుర్రపుడెక్క అల్లుకుపోయింది. కాలువకు సాగునీరు విడుదల చేసినప్పటికీ.. గుర్రపుడెక్కను తొలగించకపోవడంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. గుర్రపుడెక్కను తొలగించాలని యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లి రైతులు కోరుతున్నారు. – భూదాన్‌పోచంపల్లి

ఎన్టీపీసీకి అపెక్స్ ఇండియా అవార్డులు

జ్యోతినగర్ (రామగుండం): రామగుండంలోని ఎన్టీపీసీ ప్రాజెక్టు నాలుగు విభాగాల్లో చూపిన ప్రతిభకు అపెక్స్ ఇండియా–2024 అవార్డులను అందుకుంది. వీటితోపాటు ప్రాజెక్టు సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు.. అపెక్స్ ఇండియా లీడర్ సీఈవో ఆఫ్ ది ఇయర్ అవార్డు– 2024ను అందుకున్నారు. గోవాలో శనివారం రాత్రి జరిగిన అపెక్స్ ఇండియా అవార్డుల ప్రదానోత్సవంలో కేదార్ రంజన్‌తోపాటు ఏజీఎం(హెచ్‌ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్, అధికారులు ఈ అవార్డులు అందుకున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించామనడం అవాస్తవం

- అబద్ధాలు చెప్పడం సీఎం స్థాయికి తగదు
- డిసెంబర్ 1 వరకు బిల్లులు చెల్లించకపోతే ఆందోళనకు దిగుతాం
- తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జేఏసీ

సాక్షి, హైదరాబాద్: గ్రామాల్లో గతంలో సర్పంచ్‌లు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి ఒక్క రూపాయి కూడా విడుదల చేయనప్పటికీ రూ.750 కోట్ల పెండింగ్ బిల్లులను చెల్లించేశామని ప్రభుత్వం పేర్కొనడం అవాస్తవమని తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ఆరోపించింది. పెండింగ్ బిల్లులు చెల్లించామని అబద్ధాలు చెప్పడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్థాయికి తగదని సంఘం నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డిలు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. '2024 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ (ఎస్‌డీఎఫ్) నిధులు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎస్ఎఫ్‌సీ) నిధులు ఇవ్వలేదు. జనరల్ నిధులపైనా ఫ్రీజింగ్ ఇంకా ఎత్తివేయలేదు. ఇప్పటికీ గత సర్పంచుల చెక్కులు ట్రెజరీలోనే ఉన్నాయి' అని వారు పేర్కొన్నారు.

ఆందోళనకు దిగుతాం..

రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం వచ్చి 11 నెలలు గడుస్తున్నా.. సర్పంచ్‌లపై ప్రభుత్వం వివక్ష చూపుతోందని సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ఆరోపించింది. డిసెంబర్ 1వ తేదీ వరకు పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే తెలంగాణ మొత్తం 12,769 సర్పంచ్‌ల కుటుంబ సభ్యులతో పాటు ప్రజలను కూడగట్టుకొని ఆందోళనకు దిగుతామని స్పష్టం చేసింది.

'సైబర్' కేసులో కీలక నిందితుడి అరెస్టు

స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ పేరిట హైదరాబాదీకి టోకరా

సాక్షి, హైదరాబాద్: స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ చేస్తే భారీ లాభాలు వస్తాయని ఆశచూపి హైదరాబాద్ వాసి నుంచి మూడు నెలల్లో రూ.8.14 కోట్లు కొల్లగొట్టిన సైబర్ మోసం కేసులో కీలక నిందితుడిని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. నిందితుడు శర్వణ్‌కుమార్ శర్మను రాజస్థాన్‌లోని చిత్తోర్‌గఢ్‌లో అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించినట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. పట్టుబడిన నిందితుడు తన పేరిట ఉన్న బ్యాంకు ఖాతాను సైబర్ నేరగాళ్లకు కమీషన్ కోసం ఇచ్చినట్టు చెప్పారు. ఈ భారీ మోసం వెనుక ఉన్న అసలు ముఠా కోసం దర్యాప్తు ముమ్మరం చేసినట్టు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆన్‌లైన్ ఆర్థిక మోసాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు సూచించారు. ఏదైనా ఆన్‌లైన్ మోసానికి గురైతే వెంటనే 1930లో సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. నగరంలోని బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తికి మూడు నెలల క్రితం వాట్సాప్‌లో ఒక సందేశం పంపిన సైబర్ నేర ముఠా.. అతడి నుంచి పలు దఫాలుగా రూ.8.14 కోట్లు స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో కాజేసింది. ఆ తర్వాత ఆ ముఠా ముఖం చాటేయటంతో బాధితుడు గత నెల 21న టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో ఫిర్యాదు చేశాడు.



అనుకరణ అనేది ఆత్మహత్య.
– రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి

సోమవారం, 25 నవంబర్ 2024

మీ చేతి ఉన్నివస్త్రం

‘తపాలా బండి గంటల చప్పుడుకు ఏ పడుచు పిల్లయినా నిద్ర లేచినా మళ్లీ అటు తిరిగి పడుకుని తియ్యటి కలలు కంటుంది’ అని ఉంటుంది చెహోవ్ రాసిన ‘ఒక చలి రాత్రి’ కథలో! ఊహించండి. దట్టమైన చలికాలం. రాత్రి మూడు గంటల సమయం. ఏ వెధవ ప్రాణమైనా ముడుక్కుని పడుకుని కాసింత సుఖాన్ని అనుభవించే వేళ. ఒడలు మరిచే వేళ. వెచ్చదనమూ భోగమే అని భావించే వేళ. పొట్టకూటి కోసం, రోజూ చేయాల్సిన పని కోసం తపాలా మూటలను బగ్గీలో వేసుకుని స్టేషనుకు చేర్చక తప్పని మెయిల్‌మేన్ మనసులో ఎలా ఉంటుంది? నిశ్శబ్దాన్ని కప్పుకొని గాఢ సుషుప్తిలో ఉన్న ఊరి వీధుల గుండా అతడొక్కడే చలికి వణుకుతూ, కన్ను పొడుచుకున్నా కానరాని చీకటిలో వెళుతూ ఉంటే అతడి అంతరంగ జగాన ఏముంటుందో ఆ సమయాన ఇళ్లల్లోని గదుల్లో రగ్గుల చాటున శయనిస్తున్న మనుషులకు తెలుస్తుందా?

శ్రీమంతులు కూడా భలే వాళ్లులే! చలి రాత్రుళ్లలో వారికి మజాలు చేయాలనిపిస్తుంది. అతిథులను పిలవాలనిపిస్తుంది. పార్టీలూ గీర్టీలూ. పనివాళ్లను తొందరగా ఇళ్లకు పోండి అంటారా ఏమి? లేటు అవర్సు వరకూ పని చేయాల్సిందే! బయట చలి ఉంటుంది. పాకల్లో పసిపిల్లలు ‘కప్పుకోవడానికి ఇవాళ్టైనా దుప్పటి కొనుక్కుని రా నాన్నా’ అని కోరడం గుర్తుకొస్తూ ఉంటుంది. ఒంటి మీదున్న ఈ కనాకష్టం బట్టలతో ఇంతరాత్రి చలిలో ఇంటికి ఎలా చేరాలనే భీతి ఉంటుంది. వెచ్చటి ద్రవాలు గొంతులో ఒంపుకునే శ్రీమంతులు ‘ఒరే... ఆ రగ్గు పట్టుకుపో’ అంటారా? ‘ఈ పాత స్వెటరు నీ కొడుక్కు తొడుగు’ అని దయతో పారేస్తారా? ఆ సోయి ఉంటే కొందరు ఎప్పటికీ శ్రీమంతులు కాలేరు. పాపం పనివాడు రంగడు పార్టీలో యజమాని ఉండగా ఆ అర్ధరాత్రి రగ్గు దొంగిలిస్తాడు. పేదవాణ్ణి దొంగను చేసింది లోపలి పెద్దమనిషా... బయటి చలా? డి.వెంకట్రామయ్య ‘చలి’ కథ ఇది.

దర్శకుడు బి.నరసింగరావు కథలు కూడా రాశారు. ‘చలి’ అనే కథ. నగరానికి వచ్చిన వెంటనే మొగుడు పారిపోతే ఆ వలస కూలీ చంకన బిడ్డతో వీధుల్లో తిరుగుతూ చలిరాత్రి ఎక్కడ తల దాచుకోవాలా అని అంగలారుస్తుంటుంది. అక్కడ నిలబడితే ఎవరో కసురుతారు. ఇక్కడ నిలబడితే ఎవరో తరుముతారు. నోరూ వాయి లేని చెట్టు ‘పిచ్చిదానా... నిలుచుంటే నిలుచో. నీకేం వెచ్చదనం ఇవ్వలేను’ అని చిన్నబోతూ చూస్తుంది. చెట్టు కింద తల్లీబిడ్డా వణుకుతుంటారు. చలి. చెట్టు కింద తల్లీ బిడ్డా కొంకర్లు పోతూ ఉంటారు. శీతలం. చెట్టు సమీపంలోని చాటు అటుగా వచ్చి ఆగిన కారులోని యువతీ యువకులకు మంచి ఏకాంతం కల్పిస్తుంది. బయట చలి మరి. ఒకే తావు. చెట్టు కింద చావుకు దగ్గరపడుతూ తల్లీబిడ్డ. అదే తావులో ఏమీ పట్టని వెచ్చని సరస సల్లాపం. చలి ఒకటే! బహు అర్థాల మానవులు.

శతకోటి బీదలకు అనంతకోటి ఉపాయాలు. పేదవాడు బతకాలంటే నోరు పెంచాలి. లేదా కండ పెంచాలి. కండ పెంచిన మల్లయ్య రైల్వేస్టేషన్ దగ్గర సగం కట్టి వదిలేసిన ఇంటి వసారాను ఆక్రమించుకుంటాడు. తక్కిన కాలాల్లో దాని వల్ల లాభం లేదు. చలికాలం వస్తే మాత్రం రాత్రిళ్లు తల దాచుకోవడానికి అలగా జనాలు ఆ వసారా దగ్గరికి వస్తారు. తలకు ఒక్కరూపాయి ఇస్తే వెచ్చగా పడుకునేందుకు చోటు. కొందరి దగ్గర ఆ రూపాయి కూడా ఉండదు. దీనులు. పేదవాడు మల్లయ్య దయ తలుస్తాడా? తరిమి కొడతాడు. లేచిన ప్రతి ఆకాశహర్మ్యం నా ప్రమేయం ఏముందని నంగనాచి ముఖం పెట్టొచ్చుగాని అది ఎవడో ఒక పేదవాడిలో మంచిని చంపి రాక్షసత్వం నింపుతుంది. వి. రాజా రామమోహనరావు ‘చలి వ్యాపారం’ కథ ఇది.

చలిరాత్రి ఎప్పటికీ అయిపోదు. అది పేదవాళ్లకు తామెంత నగ్నంగా జీవిస్తున్నారో గుర్తు చేయడానికే వస్తుంది. చలికి వణికే కన్నబిడ్డల్ని చూపి బాధ పెట్టడానికే వస్తుంది. మనందరం మధ్యతరగతి వాళ్లమే. ఇంటి పనిమనిషిని అడుగుదామా ‘అమ్మా... నీ ఇంట ఒక గొంగళన్నా ఉందా... పిల్లలకు ఉన్ని వస్త్రమైనా ఉందా?’.... ‘చలికి వ్యక్తి మృతి’ అని వార్త. మనిషి చలికి ఎందుకు చనిపోతాడు? ప్రభుత్వం అతనికి ఇస్తానన్న ఇల్లు ఇవ్వకపోతే, ఇల్లు ఏర్పాటు చేసుకునేంత ఉపాధి చూపకపోతే, నీ దిక్కులేని బతుకును ఇక్కడ వెళ్లదీయమని వింటర్ షెల్టరైనా చూపకపోతే, తన నిర్లక్ష్యాన్ని తోడు చేసుకుని చలి హత్యలు చేయగలదని గ్రహించకపోతే అప్పుడు ఆ వ్యక్తి ‘చలికి చనిపోయిన వ్యక్తి’గా వార్తలో తేలుతాడు. విలియమ్ సారోయాన్ అనే రచయిత రాస్తాడు– చలి నుంచి కాపాడటానికి కనీసం శవాల మీదున్న వస్త్రాలనైనా తీసివ్వండ్రా అని! అతని కథలో ఒక యువకుడు ఆకలికి తాళలేక ఓవర్‌కోట్ అమ్మి చలితో చచ్చిపోతాడు.

పగిలిన గాజుపెంకుతో కోసినట్టుగా ఉంటుందట చలి. అదంత తీవ్రంగా ఉండేది మనుషుల్లో నిర్దయను పెంచడానికా? కాదు! దయను పదింతలు చేయడానికి! పాతదుప్పట్లో, పిల్లలు వాడక వదిలేసిన స్వెటర్లో, నాలుగు కంబళ్లు కొనేంత డబ్బు లేకపోలేదులే అని కొత్తవి కొనో వాటిని స్కూటర్లో, కారులో పడేసి ఆఫీసు నుంచి వచ్చేప్పుడు ఒక్కరంటే ఒక్కరికి ఇచ్చి వస్తే ఎలా ఉంటుందో ఈ చలికాలంలో చూడొద్దా? ఉబ్బెత్తు బ్రాండెడ్ బొంతలో నిద్రపోయే వేళ మన చేతి ఉన్నివస్త్రంతో ఒక్కరైనా నిద్ర పోతున్నారన్న భావన పొందవద్దా? అదిగో... అర్థమైందిలే... మీరు అందుకేగా లేచారు!

మాటలకు అడ్డు తగలకూడదా?

కామెంట్



కరణ్ థాపర్

ఒక మనిషిని ఇంటర్వ్యూ చేయడానికి రకరకాల కారణాలుండొచ్చు. ఒక విషయం మీద వారి దృక్పథం ఏమిటి, వివరణ ఏమిటి, వారి పాత్ర ఏమిటి... ఇలా ఏదో స్పష్టత కోసమే ఆ సంభాషణ జరుగుతుంది. ఇంటర్వ్యూ చేయడమంటేనే, అతిథి చెప్పేది వినడానికి సిద్ధపడటం! అదే సమయంలో అతిథి తనకిష్టమొచ్చింది మాట్లాడేందుకు ఇంటర్వ్యూ చేయరన్న సంగతినీ గుర్తుంచుకోవాలి. ముఖ్యంగా టీవీ సంభాషణలకైతే ఒక సమయ పరిమితి ఉంటుంది. ఆ సమయంలోనే కావాల్సింది రాబట్టుకోవాలి. అతిథి విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నా, విషయాన్ని సాగదీస్తున్నా వారి మాటలను అడ్డుకోవాల్సి ఉంటుంది. అయితే ఆ అడ్డు తగలడం సరైన సమయంలో జరగాలి. అడ్డుకోవడం అవసరమేనన్న భావన వీక్షకులకూ కల్పించాలి.

ఇంటర్వ్యూలు చేసేటప్పుడు నేను అవతలి వాళ్ల మాటలకు తరచూ అడ్డుపడుతూంటాననీ, ఇది చాలామంది ప్రేక్షకులకు చిరాకు తెప్పిస్తుందనీ చాలామంది నాతో చెబుతుంటారు. నువ్వు తలదూర్చే ముందు నీ అతిథి ఏం చెబుతున్నాడో వినాలని అనుకుంటున్నామన్న వాళ్లూ ఉన్నారు. అయితే ఒక ప్రశ్న. అడ్డుకోవడాన్ని ఎప్పుడు తప్పించవచ్చు? అతిథిని అస్సలు అడ్డుకోరాదా? అతడు మాట్లాడటం ఆపేంతవరకూ ఓపికగా ఎదురు చూడాలా? దీనికి ఎంత సమయం పట్టినా ఫరవాలేదా?

వాస్తవానికి ఇదంతా అవతలి వ్యక్తి నేను అడిగిన ప్రశ్నకు బదులుగా ఏం చెబుతున్నాడన్నదానిపై ఆధారపడి ఉంటుంది. అలాగే... అతిథి తనకిష్టమొచ్చింది చెప్పేందుకు కాదు ఇంటర్వ్యూ అన్న సంగతినీ గుర్తుంచుకోవాలి. ప్రశ్నలు, జవాబుల ఆధారమైన చర్చ ఇంటర్వ్యూ అంటే! అడిగే ప్రశ్నకు తగ్గట్టు సమాధానం ఉండాలి.

కాబట్టి... అడిగిన ప్రశ్నతో సంబంధం లేని సమాధానం వచ్చినప్పుడు అడ్డుకోవడం అన్నది అత్యవసరం. తప్పించలేనిది కూడా! తనేం చెబుతున్నాడో తనకే తెలియని స్థితిలో అతిథి ఉన్నా... లేదా విషయాన్ని పక్కదారి పట్టించేందుకు ఉద్దేశపూర్వకంగానే ఏదో ఒకటి చెబుతున్నా, కాలయాపన చేస్తున్నా అడ్డుకోవాల్సిందే. ఈ ఇంటర్వ్యూలన్నీ నిర్దిష్ట సమయం లోపల జరగాల్సినవి. కాబట్టి వ్యూహాత్మకంగా కాలయాపన చేసేందుకు కొందరు ప్రయత్నిస్తూంటారు. లేదా మరిన్ని ప్రశ్నలను నివారించేందుకూ ప్రశ్నతో సంబంధం లేని సమాధానాలు చెబుతూంటారు.

అలాగే అడ్డుతగలడం అనేది స్పష్టత కోసం గందరగోళాన్ని తొలగించేందుకూ అవసరమే. అంతగా తెలియని సంక్షిప్తనామాలు ఉపయోగిస్తూంటే... మనం అడ్డుకుని వాటి అర్థమేమిటో వివరించాల్సి ఉంటుంది. మరీ ముఖ్యంగా... అతిథి చెప్పాలనుకున్న విషయం మాటల్లో తప్పిపోతే అతడిని మళ్లీ చర్చిస్తున్న అంశానికి తీసుకురావడం కోసం కూడా అడ్డుకోవడం అవసరమవుతుంది.

చెప్పే విషయం ఏమిటన్న దానిపై అతిథికి స్పష్టత ఉండవచ్చు కానీ... వీక్షకులకు స్పష్టత లేదని అనిపిస్తే అడ్డుకుని వివరణ తీసుకోవాల్సిందే. విషయం అర్థమైనప్పుడు వీక్షకులకు ఈ అడ్డుకోవడం అన్నది చికాకుగానే ఉంటుంది కానీ అర్థం కాని వాళ్లు కూడా ఉంటారన్నది మనం గుర్తుంచుకోవాలి. వివరణ తీసుకునేందుకు, స్పష్టత కోసం సమయానుకులంగా అడ్డు తగలాల్సిందే!



అయితే, అతిథి వాస్తవాలకు భిన్నంగా మాట్లాడుతున్నాడు అనుకోండి... అప్పుడు కూడా అడ్డుకోవాల్సిన అవసరముంటుంది. వీక్షకులకు అందే సమాచారం కచ్చితమైనదిగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత ఇంటర్వ్యూ చేసే వ్యక్తిది. లేదంటే, మర్యాదగానైనా లేదా నిశ్చయంతోనైనా అతిథిని అడ్డుకోవాలి. అతిథి దురుసుగా లేదా అభ్యంతరకరంగా మాట్లాడుతున్నా అడ్డుకోవడం అవసరం. ఒక్కోసారి, విచక్షణ మీద ఉద్వేగానిది పైచేయి అయినప్పుడు కూడా ముందు జాగ్రత్తగా అడ్డుకోవాల్సి ఉంటుంది.

చివరగా... వాగ్వాదం జోరుగా సాగుతున్నప్పుడూ అడ్డుకోవడం జరుగుతూంటుంది. వివాదాస్పదమైన, శక్తిమంతమైన వాదన జరుగుతున్నప్పుడు ఒకరిపై ఒకరు కేకలు పెట్టుకోవడం సహజం. ఇది సాధారణంగా జరుగుతూంటుంది. అయితే ఇలాంటి స్థితిలో ఏదో అడ్డుకోవాలి కాబట్టి అడ్డుకోరాదు. ఉద్వేగపూరిత వాతావరణంలోనే చర్చలు జరుగుతాయన్నది తెలిసిందే. ఇలాంటి సందర్భాల్లోనే ఇంటర్వ్యూ చేస్తున్న వ్యక్తిపై అతిథి సవాళ్లు గ్రత్రా విసురుతూంటారు. ఇంటర్వ్యూ చేసే వ్యక్తి నిగ్రహంతో ఉండాల్సింది కూడా ఇక్కడే!

ఇంటర్వ్యూలు చేసే వారికి ప్రధానంగా మూడు హెచ్చరికలు చేయాలి. మొదటిది–అడ్డుకోవడం దూకుడుగా ఉండకూడదు. సంయమనం కోల్పోరాదు. మన్నించమంటూ అడ్డుకోవడం మేలైన పద్ధతి. మన్నించమనడం వేడిని కొంతవరకూ చల్లారుస్తుంది. రెండోది–అడ్డుకోవడం అన్నది విజయవంతంగా పూర్తి చేయాలి. సగం సగం ప్రయత్నాలు చేయరాదు. మరీ తరచుగా అడ్డుకోకపోవడం మంచి పద్ధతి. అడ్డుకోలేకపోతే దానికి సార్థకతే ఉండదు. పదే పదే అడ్డుకుంటూవుంటే, చికాకు కలగడం సహజం.

చివరగా... అతి ముఖ్యమైన అంశం... అడ్డుకోవడం అన్నది సరైన సమయంలో జరగాలి. సమర్థుడైన ప్రెజెంటర్ వీక్షకుల కంటే చాలా ముందుగానే ఎప్పుడు అడ్డుకోవాలో నిర్ణయించుకోగలడు. అయితే అనుకున్న వెంటనే అడ్డుకున్నాడనుకోండి, అది కొంచెం తొందరపాటు అవుతుంది. వీక్షకులు హర్షించరు. చూసేవాళ్లు కూడా అతిథి మాటలింకా కొనసాగితే బాగోదు అనుకునేంత వరకూ వేచి చూసి అప్పుడు అడ్డుకోవాలి.

వాస్తవానికి అడ్డు తగలడానికి ఇదే కీలకం. అడ్డుకోవడం అవసరమైందన్న ఫీలింగ్ వీక్షకులకూ కల్పించాలి. ఎందుకంటే... వాళ్లకు ఇంటర్వ్యూ అనేది ఒక ‘ప్రదర్శన’ లాంటిది. అతిథికీ, ఇంటర్వ్యూ చేసేవాళ్లకూ ఇద్దరికీ వీక్షకుల మెప్పు కావాలి. అదే జరగకపోతే ఇంటర్వ్యూకు అర్థమే లేదు. అది ఇద్దరికీ వర్తిస్తుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

కొండగుర్తు



ఉత్తర భారతదేశంలో నివసించే మలయాళీలందరి తరఫునా, 2024 శీతకాలం ప్రారంభమైందని నేను ప్రకటిస్తున్నాను. కొబ్బరి నూనె గడ్డకట్టింది మరి!

– మనూ జోసెఫ్, రచయిత

అలాగే కొనసాగొచ్చు!



కాంగ్రెస్ నాయకులు కలిసి కూర్చుని మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఓటమికి కారణాలను విశ్లేషించుకుంటారని నేను నిజాయతీగా ఆశిస్తున్నాను. తద్వారా వారు కలిసి మెలసి, ఓటమికి కారణమైన అవే పనులను ఇకముందూ కొనసాగించవచ్చు.

– జాయ్‌దాస్, వ్యంగ్య వ్యాఖ్యాత

అంతా కృత్రిమమే!



భారతీయులు ఎన్ని సింథటిక్ రంగులను వినియోగిస్తున్నారో ఊహించగలరా? టూత్ పేస్టు (అల్యూరా రెడ్), షాంపూ (సన్‌సెట్ ఎల్లో), జామ్ (కార్మోయిసిన్), ప్యాకేజ్డ్ ఆరెంజ్ జ్యూస్ (టార్ట్రజీన్), బ్రౌన్ బ్రెడ్ (కేరమెల్); ఇంకా సబ్బులు, కుకీలు, ఎనర్జీ డ్రింకులు, డార్క్ చాకొలెట్లు... మనకు తెలియకుండానే రోజుకు 7–8 కృత్రిమ రంగుల ఉత్పత్తులను వాడుతున్నాం. వీటిలో చాలావాటిని యూరోపియన్ దేశాలు నిషేధించాయి. ఇవి పిల్లల్లో ఏడీహెచ్‌డీ, న్యూరోటాక్సిసిటీకి కారణమవుతున్నాయి. ఎక్కువ వాడితే పెద్దలకూ హానికరమే!

– రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

విషాదకరం



ఆఫ్రికా దేశాలు తమ జాతీయ గీతాలను యూరోపియన్ భాషల్లో పాడుతుంటాయి. చాలా తీవ్ర బానిసత్వంలో ఉన్న జనాలు వీళ్లు!

– ఓయ్‌కా నువేల్యూ, నైజీరియా రచయిత

రష్యా నుంచేగా!



2023లో భారతదేశం నుండి అమెరికా 100 కేబీడీ పెట్రోలియం ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది; 2024 సంవత్సరంలో ఇప్పటివరకూ దాదాపు 75 కేబీడీలు. ఈ ఉత్పత్తులను తయారు చేయడానికి ఉపయోగించే ముడి చమురు ఎక్కడి నుండి వచ్చిందో ఊహించగలరా? (1 కేబీడీ = రోజుకు వెయ్యి బ్యారెళ్లు)

– అనస్ అల్హజ్జీ, ఎనర్జీ మార్కెట్ నిపుణుడు

అందరికీ అంతేనా?



నేను నా బయోమెట్రిక్ డేటాను అనేక దేశాలు, ప్రభుత్వాలకు లెక్కలేనన్ని సందర్భాలలో ఇచ్చాను. వేలిముద్రలు, డీఎన్ఏ, లెక్కలేనన్ని ఫొటోలు, కంటి స్కాన్‌లు సంవత్సరాలుగా ఇస్తూనేవున్నాను. ఎవరైనా నేరం చేసి, నా డీఎన్‌ఏను నేరస్థలంలో ఉంచుతారేమోనని నా భయం.

– అర్నేసియా బల్యూస్కిక్ కుస్తూరా, పరిశోధకురాలు

ముందే సరిదిద్దితే...



ఒక జపనీస్ సామెత ఏమిటంటే, మీరు తప్పు రైలులో ఎక్కితే, సమీపంలోని స్టేషన్‌లో దిగాలి. ఎంత ఎక్కువసేపు వేచి ఉంటే, తిరుగు ప్రయాణం అంత ఖరీదైనది అవుతుంది. అందుకే జీవితం ప్రారంభంలోనే తప్పులు ఏమైనా ఉంటే సరిదిద్దుకోవాలి.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఆదర్శ కార్మికోద్యమ నేత

విప్లవ కమ్యూనిస్టు, ఆదర్శ కార్మికోద్యమ నేత కామ్రేడ్ ఉప్పులూరి సుబ్బారావు. ఆయన మధ్య తరగతి భూస్వామ్య కుటుంబంలో 1924 నవంబర్ 26న పిఠాపురంలో జన్మించారు. యువకుడుగా ఉన్నప్పుడే నాటి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో చేరారు. ఎన్నికల ద్వారా కాక – మార్క్స్, లెనిన్, మావోల సిద్ధాంతాల బాటలో కార్మికవర్గ నాయకత్వంలో సాగే ప్రజల విప్లవోద్యమం ద్వారా మాత్రమే దేశంలో నిజమైన సమసమాజం ఏర్పడుతుందని ఆయన విశ్వసించారు. ఆ లక్ష్యంతో పని చేస్తూ 1998లో అమరులయ్యారు.

తన రాజకీయ జీవితం తొలిదశలో ఆయన పిఠాపురం ప్రాంతంలో జరిగిన భూస్వామ్య వ్యతిరేక రైతాంగ పోరాటాలలో పాల్గొన్నారు. రహస్య జీవితంలో ఉండి, ప్రాణాలను పణంగా పెట్టి, నాయకత్వ బాధ్యతలను నిర్వర్తించారు. పిఠాపురంలో మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికుల పోరాటాలకు నాయకత్వం అందించారు. 1951లో ఆనాటి తెలంగాణ ప్రజల సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనడానికి పార్టీ ఆదేశాల మేరకు బయలుదేరారు. మార్గమధ్యంలో ఆ పోరాట విరమణ జరిగిన సమాచారం తెలిసి వెనుదిరిగారు. పార్టీ సూచనల మేరకు కొద్ది కాలం రూర్కెలా ఉక్కు ఫ్యాక్టరీలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేశారు. ఆ తర్వాత కమ్యూనిస్టు, కార్మికోద్యమాలకే తన యావజ్జీవితాన్నీ అర్పించారు.



కా॥ ఉప్పులూరి సుబ్బారావు

సీపీఐ, సీపీఎంల మితవాద, వర్గసంకర విధానాలను; వివిధ సీపీఐఎం–ఎల్ గ్రూపుల అతివాద, అవకాశవాద విధానాలను బలంగా వ్యతిరేకించారు. భారత కమ్యూనిస్టు విప్లవోద్యమ నిర్మాతలు దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి వంటివారు రూపొందించిన విప్లవ ప్రజాపంథాను సరైనదిగా గుర్తించి, బలపరచారు. వారు స్థాపించిన యు.సి.సి.ఆర్.ఐ.యం.యల్.తో (1992–1998) సన్నిహిత సంబంధాలను నెరపి, ఆ సంస్థతో ఐక్యత దిశగా కృషి చేశారు. కార్మిక వర్గాన్ని ఒక స్వతంత్ర, విప్లవ రాజకీయ శక్తిగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ఆయన స్వతంత్ర కార్మిక సంఘాల సమాఖ్య–ఎఫ్.ఐ.టి.యు.ను (1983లో) స్థాపించి, అభివృద్ధి చేశారు. దేశంలోని తెలుగు, తమిళం, కన్నడ, మలయాళీ, బెంగాలీ, పంజాబీ వంటి వివిధ భాషాజాతులకు స్వయం నిర్ణయాధికారం ఉండే విధంగా భారత రాజ్యవ్యవస్థను సమూలంగా పునర్నిర్మించుకునే జాతీయ విప్లవోద్యమాలను కూడా కార్మిక వర్గ నాయకత్వంలో కమ్యూనిస్టు విప్లవశక్తులు నిర్మించాలని ఉప్పులూరి సూత్రీకరించారు. అమలాపురం ప్రాంతంలో ప్రయివేటు మోటారు రవాణా కార్మికుల మిలిటెంట్ పోరాటాలకు నాయకత్వం అందించారు. ఆర్టీసీలో ఎస్.ఎం.యు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రశంసనీయమైన నాయకత్వ బాధ్యతలను నిర్వర్తించారు. ‘ఎ.పి.ఎస్. ఆర్టీసీ యునైటెడ్ వర్కర్స్ యూనియన్’ను స్థాపించి, ఉద్యమ నిర్మాణానికి కృషి చేశారు. ఆయన చూపిన బాటలో విప్లవ రాజకీయ చైతన్యంతో, విప్లవ ఉద్యమ నిర్మాణానికి కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి!

– సిహెచ్.ఎస్.ఎన్. మూర్తి, ఎఫ్.ఐ.టి.యు. ప్రధాన కార్యదర్శి । 77300 03545

(నేడు రాజమండ్రిలో కా॥ ఉప్పులూరి సుబ్బారావు శతజయంతి సంవత్సర ముగింపు సభ)

దేశ రాజధాని మార్పు అవసరమేనా?

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరింది. తాజాగా అక్కడ గాలి నాణ్యతా సూచి 500 మార్క్ చేరుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కాలుష్యం తీవ్ర స్థాయికి చేరడంతో ప్రజలు కళ్ల మంటలు, దురద, గొంతు నొప్పితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరాన్ని దట్టమైన పొగ మంచు కమ్మేసింది. ఈ నేపథ్యంలో కాలుష్య మయమైన ఢిల్లీని భారతదేశ రాజధానిగా కొనసాగించడం అవసరమా అని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ లేవనెత్తిన అంశం చర్చకు దారి తీస్తోంది.

మొఘల్ చక్రవర్తుల రాజధానిగా ఒక వెలుగు వెలిగిన ఢిల్లీ... బ్రిటిష్ రాణి పాలనా కాలంలోనూ, స్వాతంత్ర్యం తరువాత కూడా రాజధాని హోదాతోనే ఉంది. పార్లమెంట్, రాష్ట్రపతి భవన్, సుప్రీం కోర్ట్, ప్రధాన మంత్రి కార్యాలయం వంటి అత్యున్నత సంస్థలు ఢిల్లీలో ఉన్నాయి. ఇతర నగరాలతో పోటీ పడుతూ వాణిజ్య కేంద్రంగానూ అభివృద్ధి చెందింది. అంతర్జాతీయ సంబంధాల రీత్యానూ ఢిల్లీ కీలకమైన స్థానం. అయితే తాజా పరిస్థితుల నేపథ్యంలో రాజధాని మార్పు అంశం తెర మీదకు వచ్చింది.



ప్రపంచంలో కొన్ని దేశాలు తమ తమ రాజధానులను అవసరం మేరకు మార్చుకున్న ఉదాహరణలు చాలానే ఉన్నాయి. నైజీరియా పాత రాజధాని లాగోస్ నుంచి 1991లో ‘అబుజా’కు మార్చుకుంది. లాగోస్‌లో అధిక జనసాంద్రత సమస్య, ట్రాఫిక్ సమస్యలు ఉండేవి. అందుకే దేశానికి భౌగోళికంగా మధ్యలో ఉన్న అబుజాను కొత్త రాజధానిగా ఎంచుకున్నారు. ఇక 2006లో యాంగోన్ (రంగూన్) నుంచి నైపిటావ్‌కు మయన్మార్ తన రాజధానిని మార్చుకుంది. భద్రత, పరిపాలన సామర్థ్యం పెంపొందించుకోవడం వంటి కార ణాలు ఇందుకు కారణాలు. 1918లో రష్యా కూడా సెయింట్ పీటర్స్ బర్గ్ నుంచి మాస్కోకు రాజధానిని మార్చింది. వ్యూహాత్మకంగా మాస్కో మరింత ప్రాముఖ్యం ఉన్న ప్రాంతమని రష్యా భావించింది. ఇక పొరుగు దేశం పాకిస్తాన్ 1963లో కరాచీ నుంచి ఇస్లామాబాద్‌కు రాజధానిని మార్చుకుంది. కరాచీ నగరానికి భద్రతా సమస్యలు ఉండటం, అక్కడ అధిక జనాభా ఉండడం వంటి కారణాలతో దేశానికి కేంద్ర స్థానంలో ఉన్న ఇస్లామాబాద్‌కు రాజధానిని తరలించుకున్నారు. బ్రెజిల్, కజకిస్తాన్, టాంజానియా వంటివీ రాజధానులను మార్చుకున్నాయి.

ఇక ప్రస్తుతం మన విషయానికి వస్తే... పుణే, హైదరాబాద్, నాగపూర్ వంటి నగరాలు దేశానికి మధ్యలో ఉండటం వల్ల వీటిలో ఏదో ఒక నగరాన్ని రాజధానిగా ఎంచుకోవాలని కొందరు సూచిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఢిల్లీలో కొన్ని తక్షణ చర్యలు చేపట్టాలి. గ్రీన్ బెల్ట్స్ అభివృద్ధి చేయాలి. పునఃవినియోగ ఇంధన వనరులన వాడకాన్ని అధికం చేయాలి. పరిపాలనా కార్యాలయాలను ఇతర నగరాలకు విస్తరించాలి. ఈ క్రమంలో హైదరాబాద్‌ను రెండో రాజధాని చేసే అంశం మరోసారి తెరపైకి వస్తోంది. ఇక్కడి మౌలిక వసతుల నేపథ్యంలో హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధానిగా చేయాలని రాజ్యాంగ నిర్మాత డా॥ బాబా సాహెబ్ అంబేడ్కర్ అప్పట్లోనే అన్నారని, ఆ అర్హత హైదరాబాద్‌కు ఉందని కొందరు గుర్తు చేస్తున్నారు. హైదరాబాద్‌లో కూడా కాలుష్యం పెరిగే అవకాశం ఉంటుందని, భాగ్యనగరంతో పాటు తెలంగాణలో వివిధ ప్రదేశాల్లో పరిపాలనా కేంద్రాలను నిర్మిస్తే బాగుంటుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.


శశిథరూర్ లేవనెత్తిన అంశంపై మరింత చర్చ జరగాలి. ఢిల్లీ వంటి నగరంలో పెరుగుతున్న కాలుష్యం, జనాభా, మౌలిక సదుపాయాల సమస్యలను పరిగణనలోకి తీసుకుంటూ దేశ భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని సరైన నిర్ణయాలు తీసుకోవాలి. రాజధానిని మార్చడం అనేది తక్షణావసరం కాకపోయినా, భవిష్యత్తులో పరిశీలనార్హమైన అంశం. అదే సమయంలో ఢిల్లీని కాలుష్యం బారి నుంచి రక్షించడం తక్షణ అవసరం.

– ఎక్కులూరి నాగార్జున్ రెడ్డి
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ । 90320 42014

భ్రమ–యథార్థాల వైరుధ్యం

లలితా పరాభట్టారికా అమ్మవారికి ‘నిరాబాధా’ అనే పేరుంది. ‘నిర్వికల్పా, నిరాబాధా, నిర్భేదా, భేదనాశినీ’ అని లలితా సహస్ర నామ స్తోత్రంలో 49వ శ్లోకం. ‘నిర్–ఆబాధా’ అంటే ‘ఆబాధ’ లేనిది. ‘ఆబాధ’ అంటే వైరుధ్యం. పొంతన లేకపోవటం. ఇది వ్యాకరణం లోనూ, వేదాంత శాస్త్రంలోనూ కనిపించే పారిభాషిక పదం. ‘ఆబాధ’ – లేక ‘బాధ’ – అంటే, ఒక విషయం సత్యం అని చెప్పడానికి కలిగే అడ్డంకి, ఇబ్బంది, అభ్యంతరం.

ఉదాహరణకు, ‘న్యాయస్థానం తీర్పు ఇచ్చింది’ అని ఎవరన్నా అంటే, ఆ వాక్యం అర్థం ‘బాధితం’ లేదా ‘అబాధితం’. ఎందుకు? అది నిజం కావటానికి వీలే లేదు. న్యాయ ‘స్థానం’ తీర్పు ఇవ్వదు, ఇవ్వలేదు. ఆ స్థానంలో ఉన్న న్యాయమూర్తి తీర్పు ఇస్తాడు. కాబట్టి ఆ వాక్యంలో న్యాయస్థానం అనే మాటకు, ‘కోర్టు’ అని అర్థం చెప్పుకొంటే ఆ వాక్యం అర్థరహితమౌతుంది. అది పొంతన లేని మాట. కనుక వ్యవహారంలో ఎవరయినా ‘న్యాయస్థానం తీర్పు చెప్పింది’ అంటే, ‘న్యాయమూర్తి తీర్పు చెప్పాడు’ అని అర్థం చెప్పుకొని, అదే స్వీకరిస్తోంది.



అలాగే, చీకటిలో తాడు, పాముగా కనిపిస్తుంది. కానీ ఆ పాము సత్యం కాదు. ‘బాధిత’మైన సత్యం. దీపం వెలుతురులో చూస్తే, పాము అనే రూపం మాయమై, తాడు దాని ‘అబాధిత’మైన యథార్థ రూపంలో కనిపిస్తుంది. తాత్కాలికమైన భ్రమకూ, యథార్థ రూపానికీ మధ్య ఉన్న వైరుధ్యం ‘ఆబాధ’. పాము ‘బాధిత’ సత్యం. తాడు ‘అబాధిత’ సత్యం.

ఈ ప్రపంచంలో సర్వమూ భగవత్ స్వరూపం. భగవంతుడిని, తల్లి రూపంలో భావిస్తే, ‘భగవతీ స్వరూపం’. కానీ ఈ ప్రపంచంలో ఏదీ మనకు దేవి రూపంలో కనిపించదే! ప్రాణిగా, చెట్టుగా, గుట్టగా, పుట్టగా, అనేక రూపాలలో భిన్నభిన్నంగా కనిపిస్తుంది. దీనికి కారణం ప్రాణులకు సహజ లక్షణమైన అవిద్య, అజ్ఞానం. తీవ్ర సాధన ద్వారా జగత్తు యథార్థ తత్వం తెలుసుకొన్న జ్ఞానికి, ఈ దృశ్య ప్రపంచం బాధితమైన సత్యం. జ్ఞాన ప్రకాశం ప్రసరింపజేస్తే, దాని వెనక సర్వవ్యాపిగా ఉన్న భగవతి గోచరిస్తుంది. అది అబాధితమైన సత్యం. కాబట్టి అమ్మవారిని ‘నిరాబాధా’ అన్నారు. ఆమెది ఎటువంటి పొంతన లేని తనానికీ ఆస్కారం లేని నిత్య సత్య స్థితి. ఇన్నిన్ని భిన్న రూపాలలో దృశ్యమౌతున్నా, అన్నిటి వెనకా ఉన్నది ఆమె ఒక్కతే అన్న యథార్థ జ్ఞానం కలిగినవాళ్ళకు దుఃఖమూ, మరణ భయమూ ఉండవు.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.దశమి రా.1.29 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** ఉత్తర రా.2.40 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** ఉ.8.15 నుండి 9.59 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.11 నుండి 12.59 వరకు, తదుపరి ప.2.26 నుండి 3.14 వరకు, **అమృతఘడియలు:** సా.6.44 నుండి 8.12 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.13, **సూర్యాస్తమయం:** 5.20.

లగచర్ల బాధితులను కలిసిన ఎన్‌హెచ్‌ఆర్సీ

సంగారెడ్డి టౌన్/అనంతగిరి: లగచర్ల ఘటనలో అరెస్టయిన 16 మంది బాధిత రైతులను జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) బృందం ఆదివారం కంది సెంట్రల్ జైలులో కలిసింది. ఎన్‌హెచ్‌ఆర్సీ డిప్యూటీ రిజిస్ట్రార్ ముఖేశ్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల బృందం జైలులోని రైతులతో మాట్లాడి.. వివరాలు అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా బృందం సభ్యులు విలేకరులతో మాట్లాడుతూ.. త్వరలోనే కేసుపై పూర్తి స్థాయి విచారణ చేపడతామని వెల్లడించారు.

వికారాబాద్ కలెక్టర్‌తో భేటీ

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల ఘటనపై ఆదివారం ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో సమావేశమైంది. దాదాపు 2 గంటల పాటు కొనసాగిన భేటీలో.. లగచర్ల ఘటనకు కారణాలు, తదనంతర పరిస్థితులపై ఆరా తీసినట్లు సమాచారం.

మా ఇల్లు బఫర్ జోన్‌లో లేదు

- హైడ్రా కమిషనర్ రంగనాథ్



సాక్షి, హైదరాబాద్: తాము నివాసం ఉంటున్న ఇల్లు బఫర్ జోన్‌లో ఉందని సామాజిక మాధ్యమాలు, న్యూస్ పేపర్లలో వచ్చిన వార్తలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరణ ఇచ్చారు. మధురానగర్‌లో తాము ఉంటున్న ఇల్లు నాలుగు దశాబ్దాల క్రితం తమ తండ్రి నిర్మించిందని, కృష్ణకాంత్ పార్కు దిగువన ఉన్న వేల ఇళ్ల తర్వాత తమ ఇల్లు ఉందని స్పష్టం చేశారు. ఒకప్పటి చెరువునే 25 ఏళ్ల కింద కృష్ణకాంత్ పార్కుగా మార్చిన విషయం అందరికీ తెలిసిందేనని చెప్పారు. అయినా చెరువు కట్టకు దిగువన 10 మీటర్లు దాటితే కింద ఉన్న నివాసాలు ఇరిగేషన్ నిబంధనల ప్రకారం బఫర్ జోన్ పరిధిలోకి రావని పేర్కొన్నారు. తమ ఇల్లు కట్ట కింద కిలోమీటరు దూరంలో ఉందని, తప్పుడు సమాచారంతో ప్రజలను కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు.

మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య కన్నుమూత



ఇల్లెందురూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య (72) హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో ఆదివారం కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇల్లెందు మండలం సుదిమళ్ల పంచాయతీ పరిధిలోని హనుమంతులపాడులో మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన అబ్బయ్య, మొదట సింగరేణి కార్మికుడిగా ఉద్యోగం చేశారు. సీపీఐ అనుబంధ ఏఐటీయూసీలో చురుగ్గా పనిచేయడంతో 1981లో సుదిమళ్ల పంచాయతీ సర్పంచ్‌గా సీపీఐ ఆయనను బలపర్చింది. ఆ ఎన్నికల్లో విజయం సాధించిన రెండేళ్లకే ఆయన 1983లో బూర్గంపాడు అసెంబ్లీ స్థానం నుంచి సీపీఐ అభ్యర్థిగా విజయం సాధించారు. 1998లో టీడీపీలో చేరారు. 1999లో టీడీపీ బీ ఫాం ఇచ్చినా.. దానిని హైదరాబాద్‌లోనే మరచిపోయి రావడంతో టీడీపీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. 2009లో తిరిగి టీడీపీ అభ్యర్థిగా ఇల్లెందు నుంచి విజయం సాధించారు. 2014లో టీడీపీ టికెట్ దక్కకపోవడంతో టీఆర్ఎస్ తరఫున, 2019లో ఇండిపెండెంట్‌గా పోటీచేసి ఓటమి పాలయ్యారు. అనంతరం బీజేపీలో చేరి, 2023 ఎన్నికల సమయంలో తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు.

మాజీ ఎమ్మెల్యే రాంచంద్రారెడ్డి కన్నుమూత



కొండపాక (గజ్వేల్): సిద్దిపేట జిల్లా కొండపాక గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే దొమ్మాట రాంచంద్రారెడ్డి హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూశారు. 1985లో టీడీపీ ప్రభుత్వ హయాంలో రాంచంద్రారెడ్డి దొమ్మాట నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఐదేళ్ల పదవీకాలం పూర్తి కాకముందే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్నారు. ఎమ్మెల్యేగా గెలవక ముందు కొంతకాలం సైన్యం, నౌకాదళంలో పనిచేశారు. రాంచంద్రారెడ్డి కొండపాక గ్రామంలోనే పెంకుటింట్లో భార్య, ఇద్దరు కూతుళ్లతో కలిసి నివసించేవారు.

కూతురు పెళ్లికి చేసిన అప్పులు తీర్చలేక..

- దంపతుల ఆత్మహత్య

యాలాల: కుమార్తె పెళ్లికి తీసుకున్న అప్పులు తీర్చలేక దంపతులు మనస్తాపం చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషాద ఘటన వికారాబాద్ జిల్లా యాలాల మండల పరిధిలోని నాగసమందర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శంకర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మాసుల యాదప్ప (42), జ్యోతి (34) దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి లక్ష్మి అలియాస్ శ్రీలత, సందీప్ సంతానం. కాగా రెండేళ్ల క్రితం అప్పులు చేసి లక్ష్మికి వివాహం చేశారు. పెళ్లి ఖర్చులతో పాటు ఇతర ఆర్థిక సమస్యలతో తరచూ భార్యాభర్తలు ఆందోళన చెందేవారు. ఈ క్రమంలో యాదప్ప, జ్యోతి ఆది వారం ఉదయం ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

వాస్తవాలు దాచి.. అడ్డగోలు రాతలా?

- రైతుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ నిరాటంకంగా వ్యవసాయ ఉచిత విద్యుత్తుకు గత సర్కారు చారిత్రక ఒప్పందం.. సౌర విద్యుత్ అత్యంత చౌకగా సరఫరా చేస్తామని కేంద్ర సంస్థ 'సెకీ' నాడు స్వయంగా లేఖ రాసింది
- పైగా ప్రత్యేకంగా పరిగణిస్తూ అంతర్రాష్ట్ర ప్రసార చార్జీల నుంచి మినహాయింపు కూడా కల్పించింది.. అలాంటి చారిత్రక ఘట్టాన్ని ప్రశంసించాల్సింది పోయి నిందలా?
- కేంద్ర సంస్థలు ఎక్కడైనా రాష్ట్రానికి లంచాలిస్తాయా?

సాక్షి, అమరావతి: రైతుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ వ్యవసాయానికి 25 ఏళ్ల పాటు నిరాటంకంగా ఉచిత విద్యుత్తు అందించేందుకు గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా తాపత్రయపడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన గొప్ప ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం సైతం ప్రశంసించింది. అత్యంత చౌకగా సోలార్ విద్యుత్తు అందిస్తామంటూ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెకీ తనంతట తానే ముందుకొచ్చి స్వయంగా రాష్ట్రానికి లేఖ రాసింది. చెప్పాలంటే దేశ చరిత్రలోనే ఇది ఓ చారిత్రక ఒప్పందం. దేశంలో మరే రాష్ట్రానికీ దక్కని అరుదైన అవకాశం. అంతేకాదు.. ఆత్మ నిర్భర్‌లో భాగంగా ప్రత్యేక ప్రోత్సాహంగా అంతర్రాష్ట్ర ప్రసార చార్జీల (ఐఎస్‌టీఎస్) నుంచి మినహాయింపు సైతం సెకీ కల్పించింది. అత్యంత చౌక ధరకు విద్యుత్తు అందించే గొప్ప కార్యక్రమం అది. గతంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ, ఏ ముఖ్యమంత్రికి సాధ్యం కాని విధంగా, డిస్కమ్‌ల చరిత్రలో తొలిసారిగా చౌక ధరకు విద్యుత్తు పొందేలా ఓ రాష్ట్ర ప్రభుత్వం – కేంద్రం మధ్య జరిగిన ఒప్పందం అది. అలాంటి కార్యక్రమాన్ని ప్రశంసించాల్సి పోయి 'ఈనాడు' బురద చల్లేందుకు తెగబడింది. చౌకగా విద్యుత్తు ఇస్తామని సెకీ స్వయంగా లేఖ రాసినప్పుడు గత ప్రభుత్వం స్పందించకుంటే ఇదే ఎల్లో మీడియా నిందించేది కాదా? అయినా ఇది ఓ రాష్ట్ర ప్రభుత్వానికి – కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెకీకి మధ్య జరిగిన ఒప్పందం. మధ్యలో లంచాలెక్కడ? కేంద్ర సంస్థలు ఎక్కడైనా రాష్ట్రానికి లంచాలిస్తాయా? అసలు మూడో వ్యక్తికి తావెక్కడ? ఇందులో అదానీతో ప్రభుత్వానికి ఏం సంబంధం? అమెరికాకు చెందిన సంస్థ అదానీపై ఆరోపణలు చేస్తే వైఎస్ జగన్‌పై విషం చిమ్మడం ఏమిటి? అంతా అసంబద్ధ వాదనలు.. పసలేని ఆరోపణలు!! సెకీతో కుదుర్చుకున్న చారిత్రక ఒప్పందం వల్ల ఏటా రూ.3,750 కోట్ల విద్యుత్తు భారం తగ్గుతుంది. 25 ఏళ్లలో రాష్ట్రంపై రూ.లక్ష కోట్ల మేర భారాన్ని తప్పించే గొప్ప నిర్ణయం అది. రాష్ట్ర విద్యుత్తు రంగ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించే చర్యగా భావించవచ్చు. గుజరాత్‌లో రూ.1.99కే విద్యుత్తు అందించే ఒప్పందం కుదిరిందంటూ ఈనాడు ఓ పసలేని వాదన తెరపైకి తెచ్చింది. సరఫరా చార్జీల కింద వాటిపై మరో రూ.రెండు అదనంగా భారం పడుతుందనే విషయాన్ని దాచిపెట్టింది. మన రాష్ట్రానికి ఆ విద్యుత్తు చేరవేసేందుకు అంతర్రాష్ట్ర ప్రసార చార్జీలతో కలిపితే అది రూ.3.98 నుంచి రూ.4 వరకు అవుతుంది. అంటే ఒక మెగావాట్‌కే నెలకు రూ.4 లక్షలు చొప్పున సరఫరా చార్జీల భారం అదనంగా పడుతుంది. ఈ విషయాన్ని కప్పిపుచ్చుతూ మభ్యపెట్టేందుకు యత్నించడం ఈనాడు మార్కు జర్నలిజానికి నిదర్శనం. ఐఎస్‌టీఎస్ చార్జీల భారం పడుతోందంటూ ఎల్లో మీడియా అసత్య ఆరోపణలు చేసింది. ప్రత్యేక ప్రోత్సాహకంగా దాని నుంచి మినహాయింపు కల్పిస్తున్నట్లు సెకీ తన లేఖలో స్పష్టంగా పేర్కొన్నా ఎల్లో మీడియా వక్రీకరిస్తూ నిలువెల్లా విషం చిమ్ముతోంది. ఇక అత్యధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేసిన చంద్రబాబును వెనకేసుకొస్తూ ఈనాడు ఆదివారం ఓ కట్టుకథ అల్లింది. తక్కువ ధరకు సౌర విద్యుత్‌ను కొనడం తప్పన్నట్లు అడ్డగోలు రాతలు అచ్చేసింది.

ఉత్పత్తి వ్యయం తక్కువ కాబట్టే..

గుజరాత్‌లో నెలకొల్పే ప్లాంట్ల నుంచి మధ్య గుజరాత్ విజ్ కంపెనీ లిమిటెడ్, దక్షిణ గుజరాత్ విజ్ కంపెనీ లిమిటెడ్, ఉత్తర గుజరాత్ విజ్ కంపెనీ లిమిటెడ్, గుజరాత్‌లోని నాలుగు విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు 2020 డిసెంబర్ నుంచి విద్యుత్ సరఫరా చేసేందుకు గుజరాత్ ఊర్జా వికాస్ నిగమ్ లిమిటెడ్ (జీయూవీఎన్ఎల్) 2020 సెప్టెంబర్ 28న ఫేజ్ 11లో 500 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు టెండర్లు జారీ చేసింది. ఈ టెండర్‌లో యూనిట్ రూ.1.99కి ఇచ్చేందుకు గుత్తేదారులు ముందుకు వచ్చారు. విషయం ఏమిటంటే గుజరాత్, రాజస్థాన్‌లోని ప్రదేశాలు ఎడారి భూభాగం కారణంగా అధిక సూర్యరశ్మి తీవ్రత(వికిరణం) ఉన్న ప్రాంతాలు. మన రాష్ట్రంలో పీఎల్ఎఫ్ 17 శాతం నుంచి 18 శాతం ఉంటే అక్కడ 23.5 శాతం ఉంటుంది. అంటే అక్కడ ఒక యూనిట్ ఉత్పత్తికి అయ్యే ఖర్చు మన రాష్ట్రంలో కంటే దాదాపు 60 నుంచి 70 పైసలు తక్కువగా ఉండే అవకాశం ఉంది. ఉత్పత్తి వ్యయం అంత తక్కువగా ఉన్నప్పుడు అక్కడ తక్కువ ధరకు సౌర విద్యుత్ లభించడంలో విశేషమేముంది. అదే విధంగా 1,070 మెగావాట్ల విద్యుత్‌కు సెకీ టెండర్లు పిలవగా టారిఫ్ యూనిట్‌కి రూ.2కి ఒప్పందం కుదిరింది. అయితే ఆ విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటయ్యేది కూడా రాజస్థాన్‌లోనే కాబట్టే ఆ రేటు! 2020లో ఆంధ్రప్రదేశ్‌లో 6,400 మెగావాట్ల పీవీ సోలార్ ప్రాజెక్టుల స్థాపనకు టెండర్ జారీ చేసినప్పుడు యూనిట్ రూ.2.49, రూ.2.58 చొప్పున ఇచ్చేందుకు టెండర్లు దాఖలయ్యాయి. ఈ టెండరింగ్ ప్రక్రియలో ఎన్‌టీపీసీ, టోరెంట్ పవర్, అదానీ రెన్యూవబుల్, హెచ్ఇఎస్ ఇన్‌ఫ్రా, షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ పాల్గొన్నాయి.

ప్రసార చార్జీలు లేనందున తక్కువే కదా..

మరో అంశాన్ని కూడా ఈనాడు ఉద్దేశపూర్వకంగా కప్పిపుచ్చింది. ఒకవేళ యూనిట్ రూ.1.99 లేదా రూ.2.01, రూ.2.36కి ఇస్తామని చెప్పినా ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ (ఐఎస్‌టీఎస్) లేని కారణంగా ఆ ప్రాజెక్ట్‌లకు ఛార్జీల మినహాయింపు వర్తించదు. ఈ విద్యుత్‌ను గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తే అత్యధిక ప్రసార చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ట్రాన్స్‌మిషన్ ఛార్జీలు కూడా కలిపితే ఆ విద్యుత్ ఖరీదు యూనిట్‌కు రూ.3.98 (యూనిట్ రూ.1.99కి కొంటే మరో రూ.1.99) చెల్లించాలి. అదే యూనిట్ రూ.2.01కి కొంటే దానికి ఐఎస్‌టీఎస్ చార్జీ రూ.1.99 కలిపి యూనిట్‌కు మొత్తం రూ.4.00 కట్టాలి. ఇక యూనిట్ రూ.2.36కు తీసుకుంటే దానికి రూ.1.99 జోడిస్తే యూనిట్ ధర రూ.4.35 పడుతుంది. అంటే నెలకు ఒక మెగావాట్‌కు రూ.4 లక్షలు అంతర్ రాష్ట్ర ప్రసార చార్జీలకే చెల్లించాల్సి వస్తుంది. అదే సెకీ నుంచి తీసుకుంటే ఈ ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి కేంద్రం మినహాయింపు ఇస్తుంది. ఈ లెక్కన సెకీ అందిస్తామన్న యూనిట్ ధర రూ.2.49 తక్కువే కదా.

కోవిడ్ తర్వాత పెరిగిన సోలార్ ప్యానల్స్ ధరలు..

జీయూవీఎన్ఎల్ ఫేజ్ 9 టెండర్ గుజరాత్ ప్రభుత్వం చేపట్టే నాటికి కోవిడ్ కారణంగా అంతర్జాతీయంగా సోలార్ ప్యానెళ్ల ధరలు భారీగా పడిపోయాయి. భవిష్యత్తులోనూ ధరలు అదే స్థాయిలో కొనసాగుతాయని ఆ ప్రభుత్వం భావించింది. కానీ కోవిడ్ తరువాత ప్రపంచవ్యాప్తంగా ప్యానెల్ ధరలు పెరిగాయి. దీంతో తర్వాత టెండర్లలో సోలార్ టారిఫ్‌లు ఎక్కువగా ఉన్నాయి. ఉదాహరణకు జీయూవీఎన్ఎల్ 2024 మార్చి 15న గుజరాత్‌లోని ఖవ్డా ప్రాంతంలో అధిక సూర్యరశ్మి తీవ్రత, అధిక పీఎల్ఎఫ్ ఉన్న ప్రాంతాల్లో టెండర్‌ను జారీ చేసింది. ఈ టెండర్‌లో గుజరాత్ ఊర్జా వికాస్ నిగమ్ లిమిటెడ్‌కు వచ్చిన టారిఫ్ వివరాలను ఒకసారి పరిశీలిస్తే...

2024 మార్చి 15న గుజరాత్ ఊర్జా వికాస్ నిగమ్ లిమిటెడ్ జారీ చేసిన టెండర్‌లో టారిఫ్ ధరలు ఇలా ఉన్నాయి

టెండర్ వేసిన సంస్థ పేరు	యూనిట్ ధర(రూ)
ఇంజిన్ ఎనర్జీ	2.62
ఎన్‌హెచ్‌పీసీ	2.66
జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ	2.66
ఎన్‌టీపీసీ రెన్యూవబుల్స్	2.67

2024 జనవరి 29న గుజరాత్ ఊర్జా వికాస్ నిగమ్ లిమిటెడ్ జారీ చేసిన మరొక టెండర్‌లో టారిఫ్ ధరలు ఇలా ఉన్నాయి

టెండర్ వేసిన సంస్థ పేరు	యూనిట్ ధర(రూ)
కేపీఐ గ్రీన్ ఎనర్జీ	2.67
అవాడ ఎనర్జీ	2.68
సోలార్ క్రాఫ్ట్ పవర్ ఇండియా	2.69
హిందూజా రెన్యూవబుల్స్	2.72

మరి ధరలెందుకు తగ్గలేదు..?

ఎల్ఈడీ టీవీ ధర 2016లో రూ.రెండు లక్షలు ఉంటే ఇప్పుడు ఇంకా మెరుగైన సదుపాయాలతో అవే కంపెనీ టీవీలు ఇప్పుడు రూ.55 వేలకే దొరుకుతున్నాయంటూ ఈనాడు తన కథనంలో రాసుకొచ్చింది. అలాంటప్పుడు కరెంట్ ధరలు మాత్రం ఎందుకు తగ్గవనే సందేహం వ్యక్తం చేసింది. టీడీపీ, ఈనాడు చేస్తున్న వాదనే గనుక నిజమైతే 2020లో రూ.1.99గా ఉన్న యూనిట్ విద్యుత్తు ధర 2024 నాటికి రూ.1.50 లేదా అంతకంటే తక్కువకు పడిపోవాలి. కానీ అలా జరగలేదు. రూ.2.70 కంటే ఎక్కువకు పెరిగింది. అయినప్పటికీ గత ప్రభుత్వం యూనిట్ రూ.2.49కే సెకీతో ఒప్పందం కుదుర్చుకుంది. అదీగాక భారత ప్రభుత్వ రంగ సంస్థలతో ఒప్పందం చేసుకుంటే ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి మినహాయింపు ఇస్తామని కేంద్రం ప్రభుత్వం చెప్పడం వల్ల వైఎస్ జగన్ ప్రభుత్వం సెకీతో ఒప్పందం చేసుకుంది.

టీడీపీ హయాంలో అత్యధిక ధరలతో పీపీఏలు..

2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో జరిగిన ఒప్పందాలు గత ప్రభుత్వం చేసుకున్న సెకీ ఒప్పందానికి భిన్నంగా ఉన్నాయి. అధిక ధరలకు సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు టీడీపీ హయాంలో పీపీఏలు కుదుర్చుకున్నారు. 2019–20 నాటి ఏపీఈఆర్‌సీ టారిఫ్ ఆర్డర్ ప్రకారం సౌర విద్యుత్ సగటు ధర రూ.5.90కి పెరిగింది. అంత ఖరీదైన దీర్ఘకాలిక పీపీఏలను డిస్కంలు హడావుడిగా అమలు చేయడానికి చంద్రబాబు నాయుడు ఎందుకు కారణమయ్యారని ఈనాడు పత్రిక ఏనాడైనా ప్రశ్నించిందా? నిజంగా రాష్ట్ర ప్రయోజనాల గురించి ఆందోళన చెంది ఉంటే చంద్రబాబును దీనిపై ఎందుకు నిగ్గదీయలేదు?


'సెకీ' టెండర్‌ను ఆమోదించడానికి పలు కారణాలు..

- సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ) అనేది భారత ప్రభుత్వ నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ కింద పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ.
- యూనిట్ రూ.2.49కే ఇస్తానంటూ తనకు తానుగా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది.
- ఈ ప్రతిపాదనకు ఏపీ అంగీకరించడం వల్ల 25 ఏళ్ల పాటు ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి మినహాయింపు లభిస్తుందని 2021 సెప్టెంబర్ 15న రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో సెకీ స్పష్టం చేసింది.
- మునుపెన్నడూ రాష్ట్ర డిస్కంలు ఇంత తక్కువ ధరకు సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసిన దాఖలాలు లేవు.
- గత ప్రభుత్వం చేసిన ప్రయత్నాల కారణంగా ఈ చారిత్రక ఒప్పందం జరగడం వల్ల రాష్ట్ర ఖజానాకు ఏటా రూ.3,750 కోట్లు చొప్పున 25 ఏళ్ల పాటు దాదాపు రూ.లక్ష కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది.
- టీడీపీ, దాని అనుబంధ మీడియా మూడేళ్లుగా ఈ ప్రాజెక్ట్ గురించి అసత్య ప్రచారాలు చేస్తూనే ఉన్నాయి.
- టీడీపీ కుదుర్చుకున్న అధిక ధరల పీపీఏలతో పోలిస్తే ఇది సగం కంటే తక్కువే.
- సెకీతో చేసుకున్న ఒప్పందం చాలా ప్రాముఖ్యత సంతరించుకుంది. ఎందుకంటే వ్యవసాయానికి పగటిపూట ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయడంతో పాటు రాష్ట్రానికి యూనిట్ రూ.2.49 కే 25 ఏళ్ల ఇంటర్–స్టేట్ ట్రాన్స్‌మిషన్ చార్జీల నుంచి పూర్తి మినహాయింపుతో భారత ప్రభుత్వం అందిస్తుంది.
- ఐఎస్‌టీఎస్ మినహాయింపు అనేది మరే ఇతర ప్రాజెక్ట్‌కి దక్కని చాలా కీలకమైన ప్రయోజనం. ఇతర రాష్ట్రంలో ఉన్న సోలార్ పవర్ ఉత్పాదక కేంద్రం నుంచి విద్యుత్ సరఫరా కోసం మరే ఇతర సంస్థతోనైనా ఇదే విధమైన ఏర్పాటు చేస్తే మన రాష్ట్రం ఐఎస్‌టీఎస్ ఛార్జీలను చెల్లించాల్సి వచ్చేది. అప్పుడు అది చాలా భారంగా మారుతుంది. ప్రతి నెలా మెగావాట్‌కు సుమారు రూ.4 లక్షలు దానికే ఖర్చవుతుంది.
- ఇది కేంద్ర సంస్థ సెకీతో గత ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం. ఇందులో మూడో వ్యక్తి ప్రమేయానికి తావే లేదు. అలాంటప్పుడు ఇక లంచాలకు ఆస్కారం ఏముంటుంది?
- ఖజానాపై విద్యుత్ సబ్సిడీ భారాన్ని గణనీయంగా తగ్గించే విధంగా భారత ప్రభుత్వం స్వయంగా చేసిన ప్రతిపాదనను గత ప్రభుత్వం తిరస్కరించినా, విస్మరించినా ఎల్లో మీడియా కచ్చితంగా తప్పుడు ఉద్దేశాలను ఆపాదించేది. రాష్ట్ర ప్రభుత్వం స్వప్రయోజనాల కోసం రాజీ పడిందంటూ బురద చల్లేది.
- అలాంటి వాటికి ఆస్కారం లేకుండా గత ప్రభుత్వం కేంద్రం చేసిన ప్రతిపాదనను అంగీకరించి సెకీతో ఒప్పందం చేసుకోవడం వల్ల ఏటా రూ.3,750 కోట్లు చొప్పున 25 ఏళ్లలో రూ.లక్ష కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది.

కారు చౌకగా విద్యుత్ ఇస్తాం


- సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) ఆంధ్రప్రదేశ్‌కు లేఖ..
- తనంతకు తానుగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ 2021లో ప్రతిపాదన

సాక్షి, అమరావతి: పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించుకోవడంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అవలంబిస్తున్న వినూత్న విధానాలు, చూపిస్తున్న చొరవకు స్పందిస్తూ పాతికేళ్ల పాటు ఏపీకి చవగ్గా సౌర విద్యుత్ అందిస్తామని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) తనకు తానుగా తొలుత ప్రతిపాదించింది. అందుకు 2021 సెప్టెంబర్ 15న సెకీ రాసిన లేఖే తిరుగులేని ఆధారం. వేరే ప్రయత్నాలు అవసరం లేదని, అతి తక్కువ ధరకు యూనిట్ రూ.2.49కి తామే అందిస్తామంటూ సెకీనే ఆరోజు ఏపీకి లేఖ రాసింది. 25 సంవత్సరాల పాటు ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ (ఐఎస్‌టీఎస్) చార్జీల నుంచి రాష్ట్రానికి మినహాయింపు కూడా ఇస్తామని చెప్పింది. తామిచ్చే టారిఫ్ యూనిట్ రూ.2.49 వల్ల వ్యవసాయ విద్యుత్‌కు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ భారం కూడా తగ్గుతుందని పేర్కొంది. అదే విధంగా 9 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఏపీలో ప్రాజెక్టు నిర్మిస్తే అయ్యే ఖర్చులు, భూమి కూడా మిగులుతాయని, వాటిని రాష్ట్రం ఇతర అభివృద్ధి, ప్రాజెక్టుల అవసరాలకు వినియోగించుకోవచ్చని వివరించింది. డిస్కంలకు కూడా విద్యుత్ కొనుగోలు ఖర్చులు తగ్గుతాయని వెల్లడించింది. తమ ప్రతిపాదనకు అంగీకరించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆత్మ నిర్భర్ భారత్'కు ఏపీ మద్దతు ఇచ్చినట్టవుతుందని కూడా చెప్పింది. వెంటనే సానుకూల నిర్ణయాన్ని తెలపాలని రాష్ట్రాన్ని కోరింది. ఇలా కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీనే స్వయంగా విద్యుత్ ఇస్తామంటూ ముందుకు వచ్చిన ఈ వ్యవహారంలో స్కామ్‌కు ఆస్కారమే ఉండదన్నది స్పష్టం. ఇందులో ముడుపుల అన్న ప్రశ్నే ఉత్పన్నం కాదన్న విషయం ఎవరికైనా ఇట్టే అవగతమవుతుంది. అతి చౌకగా విద్యుత్ అందిస్తామని కేంద్ర ప్రభుత్వమే ఇంత స్పష్టంగా చెప్పాక ఏ రాష్ట్రమైనా ఎందుకు వద్దంటుంది? పైగా, ఈ విద్యుత్ తీసుకొంటే ఆర్థికంగా, ఇతరత్రా పలు ప్రయోజనాలూ ఉన్నాయి. ఇంత మంచి అవకాశాన్ని ఏ రాష్ట్రమూ వదులుకోదు. ఒక వేళ వద్దంటే ప్రతిపక్షాలు ఊరుకుంటాయా? తక్కువకు ఇస్తామని కేంద్రమే ముందుకు వస్తే ఎందుకు తీసుకోవడంలేదని, దాని వెనుక రాష్ట్ర ప్రయోజనాలకంటే వేరే కారణాలున్నాయంటూ గోల పెట్టేవి. ఇదే ఎల్లో మీడియా ప్రభుత్వాన్ని తప్పుబడుతూ కథనాలు రాసేది. అలాంటి అవకాశాన్ని ఇవ్వకుండా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే కేంద్ర ప్రతిపాదనను మంత్రి మండలి సమావేశంలో ప్రవేశపెట్టారు. మంత్రులంతా ఏకగ్రీవంగా సెకీతో ఒప్పందానికి అంగీకారం తెలిపారు. అనంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య 7 వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం కుదిరింది.



- 'పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించుకోవడంలో ఆంధ్రప్రదేశ్ అవలంబిస్తున్న వినూత్న విధానాలు, చూపిస్తున్న చొరవను ప్రశంసిస్తున్నాం.
- చౌక ధరతో రైతులకు విద్యుత్ అందించాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.
- మీ నిర్ణయాలకు మద్దతుగా రాష్ట్రానికి చవగ్గా సౌర విద్యుత్ అందిస్తాం
- అన్ని ఖర్చులతో కలిపి యూనిట్ రూ. 2.49 చొప్పున ఇస్తాం'

అని లేఖలో స్పష్టంగా పేర్కొన్న సెకీ



25 సంవత్సరాల పాటు ఇంటర్ స్టేట్ ట్రాన్స్ మిషన్ సిస్టమ్ (ఐఎస్‌టీఎస్) చార్జీల నుంచి రాష్ట్రానికి మినహాయింపు కూడా ఇస్తామని లేఖలో తెలిపిన కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీ

విరుగుడు లేని విషం!

▶ మొదటి పేజీ తరువాయి

వస్తున్నాయి. అది పర్యావరణానికి, జీవజాతులకూ ప్రమాదకరమని వైద్య నిపుణులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చికిత్సకు లొంగని మందు!

పారాక్వాట్ గడ్డి మందు కేవలం పది మిల్లీలీటర్లు (ఎంఎల్) శరీరంలోకి వెళ్లినా ప్రాణాంతకంగా మారుతుందని వైద్యులు చెప్తున్నారు. అది శ్వాస వ్యవస్థ, కిడ్నీలపై తీవ్రంగా ప్రభావం చూపుతుందని... గుండె, కాలేయం సహా అన్ని అవయవాలను దెబ్బతీస్తుందని అంటున్నారు. గత ఏడాది ఈ గడ్డిమందు తాగిన ఓ యువకుడికి హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో ఊపిరితిత్తుల మార్పిడి చేయాల్సి వచ్చిందని గుర్తు చేస్తున్నారు. చాలా క్రిమిసంహారక మందులకు చికిత్సలు అందుబాటులో ఉన్నాయని.. వాటి తయారీ కంపెనీలే విరుగుడు ఫార్ములా ఇస్తుంటాయని చెబుతున్నారు. కానీ ఈ గడ్డి మందుకు మాత్రం ఇప్పటికీ సరైన విరుగుడు చికిత్స లేక.. ఎన్నో పేద, మధ్య తరగతి జీవితాలు అర్ధంతరంగా ముగుస్తున్నాయని పేర్కొంటున్నారు.



గడ్డి మందు

ఏమిటీ పారాక్వాట్?

పారాక్వాట్ డైక్లోరైడ్‌గా పిలిచే గడ్డిమందు వినియోగం విపరీతంగా పెరిగిపోతోంది. ఇది అత్యంత విషపూరితమైనా.. కూలీల కొరత ఓవైపు, సులువుగా కలుపు నివారణ అవుతుందనే ఉద్దేశంతో మరోవైపు రైతులు ఈ మందును వాడుతున్నారు. కేవలం రూ.200 ఖర్చుతో ఎకరం చేనులో కలుపు నివారణ చేయవచ్చని.. అధిక గాఢత కారణంగా 24 గంటల్లోనే మొక్కలు మాడిపోతాయని అంటున్నారు. పిచికారీ చేసే సమయంలోనూ తలనొప్పి, వికారం, ఒంటిపై దద్దుర్లు వస్తుంటాయని చెబుతున్నారు.

ఆందోళన వ్యక్తం చేస్తున్న వైద్యులు

సరైన చికిత్స లేని ఈ మందు దుష్ప్రభావాలపై వైద్యులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో పరిస్థితిని గమనించిన కొందరు వైద్యులు ప్రభుత్వానికి విన్నవించేందుకు ఓ గ్రూప్‌గా ఏర్పడ్డారు. ఇటీవల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) మంచిర్యాల పరిధిలోని ప్రతినిధులు పారాక్వాట్ తీవ్రతపై వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం ఇచ్చారు కూడా. పలు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పారాక్వాట్ తీవ్రతపై పరిశోధనలు జరిగాయి. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో స్వచ్ఛంద సంస్థలు, ఆత్మహత్య నిరోధక కమిటీలు ఈ మందు విషయంలో అవగాహన కల్పిస్తున్నాయి.

తయారు చేసే దేశంలోనే ఆంక్షలు

పారాక్వాట్‌ను చాలా దేశాలు నిషేధించాయి. ఈ మందు తయారీ కంపెనీ ఉన్న స్విట్జర్లాండ్‌లో, ఉత్పత్తి చేసే చైనాలోనూ ఆంక్షలు ఉన్నాయి. మన దేశంలో ఒడిశాలోని బుర్లా జిల్లాలో రెండేళ్లలో 170 మంది వరకు ఈ గడ్డి మందు తాగి చనిపోవడంతో నిషేధించాలంటూ ఒత్తిళ్లు వచ్చాయి. అక్కడి సర్కారు పారాక్వాట్ గడ్డి మందు అమ్మకాలపై ఆంక్షలు విధించింది. కానీ రాష్ట్రాలకు 60రోజులు మాత్రమే అమ్మకాలను నిలిపేసే అధికారం ఉండటంతో.. శాశ్వతంగా నిషేధించాలంటూ కేంద్ర వ్యవసాయ శాఖకు లేఖ రాసింది. ఈ క్రమంలో కలుపు గడ్డి నివారణ కోసం మరో మందును ప్రత్యామ్నాయంగా చూపాలనే డిమాండ్లు వస్తున్నాయి.

కిడ్నీలపై తీవ్ర ప్రభావం



ఎవరైనా పారాక్వాట్ తాగిన వెంటనే ఆస్పత్రికి వస్తే బతికే చాన్స్ ఉంటుంది. కిడ్నీలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఇందుకు ప్రత్యేక డయాలసిస్ చేస్తాం. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోతే ప్రాణాలు కోల్పోయినట్టే. అందుకే ఈ మందు తీవ్రతను సర్కారుకు తెలియజేయాలని అనుకుంటున్నాం.

– రాకేశ్ చెన్నా, నెఫ్రాలజిస్టు, మంచిర్యాల

నిషేధం విధించాలి



గడ్డిమందుతో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. కొద్దిమోతాదులో శరీరంలోకి వెళ్లినా బతకడం కష్టమవుతోంది. చికిత్సకు కూడా లొంగకుండా ఉన్న ఈ మందును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధం విధించాలి. సమాజ శ్రేయస్సు కోసం కొంతమంది వైద్యులం కలసి ప్రభుత్వానికి నివేదించనున్నాం.

– సతీశ్ నారాయణ చౌదరి, ఎమర్జెన్సీ మెడిసిన్ ప్రాక్టిషనర్, ఖమ్మం

చాలా కేసుల్లో మరణాలే..



పారాక్వాట్‌కు ఇప్పటికీ సరైన చికిత్స లేదు. మా వద్దకు వస్తున్న చాలా కేసుల్లో మరణాలే సంభవిస్తున్నాయి. ఈ మందు రోగి పెదవులు మొదలు శరీరంలో అన్ని అవయవాలను వేగంగా దెబ్బతీస్తుంది. తిరిగి మామూలు స్థితికి తీసుకురావడం చాలా కష్టం.

– అవునూరి పుష్పలత, అసిస్టెంట్ ప్రొఫెసర్, కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కాలేజీ

ధర్మం పేరిట అధర్మాచరణ

▶ మొదటి పేజీ తరువాయి

రూపంలో దొరికే సంతోషానికి సంబరపడిపోతున్నాడు. భారత్ సనాతన దేశం. రుషులు, మునిపుంగవుల ఆలోచనతో ఏర్పడిందే సనాతన ధర్మం. ఎన్నో ప్రాంతాలు పర్యటించి సాధించిన అనుభవాలతో శాస్త్రాలు, ధర్మాలు రాశారు. అలాంటి వాటిని అనుసరించాల్సిన మనం.. కేవలం అనుకూలమైనవాటిని ఆచరిస్తూ అదే ధర్మమార్గం అని భ్రమపడుతున్నాం. ప్రపంచంలోని అన్ని దేశాలు సాధించిన మంచిని మనం నేర్చుకోవాలి. జ్ఞానాన్ని ఆర్జించే ప్రక్రియ ఒక దగ్గర ఆగిపోకూడదు. మనమంతా సంస్కృతి, ధర్మంవైపు అడుగులు వేయాలి. కానీ వికృతి దిశగా వెళ్తూ సృష్టి ధర్మాన్ని విస్మరిస్తున్నాం. విజ్ఞానం ధర్మానికి వ్యతిరేకం కాదు. విజ్ఞానాన్ని ఉపయోగించే తీరులోనే ధర్మం నిలుస్తుంది. సనాతన ధర్మం మూలాల్లోకి వెళ్లి, దానిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది'అని పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. వనవాసి, నగరవాసి, గ్రామవాసి అందరూ భారతీయులేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన ఉత్సవాలు: లోక్‌మంథన్ భాగ్యనగర్–24 ఉత్సవాలు దిగ్విజయంగా ముగిశాయి. నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకొనే ఆవశ్యకతను వక్తలు వివరించారు. వివిధ రంగాలకు చెందిన కళాకారుల ప్రతిభను ప్రతిబింబించేలా 210 ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. శిల్పారామంలో మూడు వేదికల్లో 12 దేశాలకు చెందిన సుమారు వంద మంది ప్రముఖులు ఉపన్యాసాలు, బోధనలు అందించారు. సుమారు 1,500 మంది కళాకారులు వివిధ రకాల కళలను ప్రదర్శించారు. లోక్ మంథన్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్, ఆహార ధాన్యాలు, ఔషధ మొక్కల స్టాల్స్, గిన్నిస్ రికార్డు అందుకున్న భారీ పెన్ను వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముగింపు ఉత్సవాల్లో అభినయ కూచిపూడి కళాక్షేత్రం ఆధ్వర్యంలో మహాన్ భారతోహం పేరుతో నృత్య ప్రదర్శన నిర్వహించారు. నాలుగు రోజుల్లో సుమారు 2.10 లక్షల మందికిపైగా లోక్ మంథన్‌లో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు.

ప్రాంతాలకతీతంగా మహా సునామీ



మహారాష్ట్రలో మహాయుతి హవా ● 6 ప్రాంతాల్లోనూ ఎంవీఏపై ఆధిపత్యం

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి సాధించిన కనీవినీ ఎరగనంతటి ఘనవిజయం రాజకీయ వర్గాలనే ఆశ్చర్యపరుస్తోంది. 288 అసెంబ్లీ స్థానాల్లో ఏకంగా నాలుగింట మూడొంతులకు పై చిలుకు సీట్లను అధికార సంకీర్ణం కైవసం చేసుకోగా విపక్ష మహా వికాస్ గఘాడీ (ఎంవీఏ) కేవలం 49 సీట్లకు పరిమితం కావడం తెలిసిందే. బీజేపీ ఏకంగా 132 స్థానాలు గెలుచుకోగా కాంగ్రెస్ కేవలం 16 స్థానాలకు పరిమితమైంది. ఇవి రాష్ట్ర చరిత్రలోనే బీజేపీకి అత్యధిక, కాంగ్రెస్‌కు స్థానాలు కావడం విశేషం! మహారాష్ట్రలోని ఆరు ప్రాంతాలకు గాను అన్నిచోట్లా మహాయుతి జైత్రయాత్ర అప్రతిహతంగా సాగడమే ఈ అఖండ విజయానికి కారణమైంది.

పశ్చిమ మహారాష్ట్ర

షుగర్ బెల్ట్‌గా పిలిచే ఈ ప్రాంతం నిజానికి ఎంవీఏకు కంచుకోట వంటిది. ఇక్కడ కూడా ఈసారి విపక్ష కూటమికి దారుణ ఫలితాలే ఎదురయ్యాయి. 70 స్థానాలకు గాను మహాయుతి ఏకంగా 53 చోట్ల విజయనాదం చేస్తే ఎంవీఏ కేవలం డజను సీట్లకు పరిమితమైంది. మరీ ముఖ్యంగా 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ 12 సీట్లు నెగ్గిన కాంగ్రెస్ ఈసారి కేవలం 2 స్థానాలతో సరిపెట్టుకుంది. ఈ ప్రాంతం నుంచి బరిలో దిగిన పృథ్వీరాజ్ చవాన్, బాలాసాహెబ్ థోరట్ వంటి కాకలు తీరిన కాంగ్రెస్ నేతలు కూడా ఓటమి చవిచూశారు. శివసేన (యూబీటీ)కీ రెండే సీట్లు దక్కాయి. వాటితో పోలిస్తే ఎంవీఏలోని మూడో పక్షమైన శరద్ పవార్ ఎన్సీపీ మెరుగైన ప్రదర్శన చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ నెగ్గిన 10 స్థానాల్లో ఏకంగా 8 పశ్చిమ మహారాష్ట్రలోనే కావడం విశేషం. ఈ ప్రాంత పరిధిలోని కొల్హాపూర్ జిల్లాలోనైతే మహాయుతి ఏకంగా 10కి 10 స్థానాలు కైవసం చేసుకుంది.

విదర్భ

లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడి 10 స్థానాల్లో 7 ఎంవీఏ పరమయ్యాయి. ఇప్పుడు మహాయుతి 62 అసెంబ్లీ సీట్లకు గాను ఏకంగా 49 స్థానాలను నెగ్గింది. వీటిలో ఒక్క బీజేపీ వాటాయే 39 కావడం విశేషం! కాంగ్రెస్ ఇక్కడ కేవలం 8 స్థానాలు గెలవగలిగింది. ఇక్కడి సాకోలీ స్థానం నుంచి పీసీసీ చీఫ్ నానా పటోలే కూడా కేవలం 208 ఓట్ల మెజారిటీతో అతి కష్టమ్మీద గట్టెక్కారు!

మరాఠ్వాడా

ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడి ఏడు స్థానాల్లో ఏకంగా 6 ఎంవీఏ ఖాతాలోకి వెళ్లాయి. ఆర్నెల్లకే పరిస్థితి పూర్తిగా తిరగబడింది. ఇక్కడి 46 అసెంబ్లీ సీట్లలో ఏకంగా 41 చోట్ల మహాయుతి జెండా ఎగిరింది. ఎంవీఏ కేవలం 5 సీట్లకు పరిమితమైంది. బీజేపీ 20 చోట్ల పోటీ చేస్తే ఏకంగా 19 స్థానాలు గెలుచుకుంది. శివసేన (షిండే) 16 స్థానాల్లో 13, ఎన్సీపీ (అజిత్) 9 సీట్లకు ఏకంగా 8 నెగ్గాయి. మరాఠా రిజర్వేషన్ల అంశానికి విరుగుడుగా ఓబీసీలను మహాయుతి పక్షాలు విజయవంతం సంఘటితం చేయగలిగాయి. ఈ సోషల్ ఇంజనీరింగే ఈ ప్రాంతంలో అధికార కూటమి విజయానికి ప్రధాన కారణంగా నిలిచింది. అయితే ఇక్కడి నాందేడ్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ నెగ్గడం ఎంవీఏ కూటమికి కాస్తలో కాస్త ఊరటనిచ్చింది.

కొంకణ్

ఈ ప్రాంతాన్ని మహాయుతి దాదాపుగా క్లీన్‌స్వీప్ చేసేయడం విశేషం. 39 అసెంబ్లీ సీట్లకు గాను ఏకంగా 35 స్థానాలు అధికార కూటమి ఖాతాలో పడ్డాయి. ఇక్కడ కాస్తో కూస్తో పట్టున్న శివసేన (యూబీటీ) ఒక్కటంటే ఒక్క స్థానమే గెలవగలిగింది. ఆరెస్సెస్ దన్నుతో పాటు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు కొంకణ్‌పై ఉన్న పట్టు ఈ ఫలితాలకు ప్రధాన కారణంగా నిలిచింది.

ఉత్తర మహారాష్ట్ర

మహాయుతి దాదాపుగా క్లీన్‌స్వీప్ చేసిన మూడు ప్రాంతాల్లో ఇదొకటి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడి 7 స్థానాల్లో ఆరు ఎంవీఏ ఖాతాలో పడ్డాయి. ఈసారి మాత్రం 35 అసెంబ్లీ స్థానాల్లో మహాయుతి ఏకంగా 33 చోట్ల గెలిచింది. ఎంవీఏ కూటమి ఇక్కడ కేవలం ఒక్క స్థానానికి పరిమితమైంది.

ముంబై

ఎంవీఏ కాస్త మెరుగైన ప్రదర్శన చేసిన ఏకైక ప్రాంతం. రాజధాని నగరంతో పాటు శివారు ప్రాంతాలతో కలిపి 36 సీట్లుంటే విపక్ష కూటమి 14 సీట్లు దక్కించుకుంది. వాటిలో 10 స్థానాలు ఉద్ధవ్ శివసేనకే దక్కగా మూడుచోట్ల కాంగ్రెస్ నెగ్గింది. శరద్ పవార్ పార్టీకి ఒక్క సీటూ రాలేదు. మహాయుతి 22 చోట్ల గెలిచింది. వాటిలో 15 బీజేపీకే దక్కడం విశేషం.

ప్రాంతం	అసెంబ్లీ స్థానాలు	మహాయుతి	ఎంవీఏ
ముంబై	36	22	14
మరాఠ్వాడా	46	41	5
కొంకణ్	39	35	4
విదర్భ	62	49	13
పశ్చిమ మహారాష్ట్ర	70	53	12
ఉత్తర మహారాష్ట్ర	35	33	1
మొత్తం	288	233	49

(ఇతరులకు 6 స్థానాలు)

సోదిలో లేని చిన్న పార్టీలు

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి కీలక పాత్ర పోషిస్తాయని అంతా భావించిన చిన్న పార్టీలు సోదిలో కూడా లేకుండా పోవడం విశేషం. రాజ్ ఠాక్రే మహారాష్ట్ర నవ నిర్మాణ సేన (ఎంఎన్ఎస్), అంబేడ్కర్ మనవడు ప్రకాశ్ అంబేడ్కర్ సారథ్యంలోని వంచిత్ బహుజన్ అఘాడీ (వీబీఏ) వంటివి కూడా ప్రభావం చూపలేకపోయాయి. 125 చోట్ల పోటీ చేసిన ఎంఎన్ఎస్, 200 స్థానాల్లో బరిలో దిగిన వీబీఏ కనీసం ఖాతా కూడా తెరవలేదు! అత్యధికంగా 237 చోట్ల పోటీ చేసిన బీఎస్పీ కూడా ఒక్కచోటా గెలవలేదు. 28 చోట్ల పోటీ చేసిన ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరాం)దీ అదే పరిస్థితి. రైతుల్లో బాగా ఆదరణ ఉన్న స్వాభిమాని పక్ష, ప్రహార్ జనశక్తి వంటివి కూడా సున్నా చుట్టాయి. సమాజ్‌వాదీ, జన్ సురాజ్య శక్తి పార్టీలు కాస్త మెరుగ్గా రెండేసి స్థానాలు నెగ్గాయి. సీపీఎం, మజ్లిస్‌తో పాటు రాష్ట్రీయ యువ స్వాభిమాన్ పార్టీ, రాష్ట్రీయ సమాజ్ పక్ష్, పిజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ, రాజర్షి సాహూ వికాస్ అఘాడీ ఒక్కో స్థానంతో సరిపెట్టుకున్నాయి. ఈసారి మహారాష్ట్రలో ఏకంగా 158 పార్టీలు ఎన్నికల బరిలో దిగడం విశేషం.

ముఖాముఖిల్లో షిండే, అజిత్ పార్టీల హవా

● 36 చోట్ల ఉద్ధవ్ సేనపై షిండే సేన గెలుపు
● 29 చోట్ల శరద్ పార్టీపై నెగ్గిన అజిత్ ఎన్సీపీ

శివసేన, ఎన్సీపీ వర్గ పోరులో సీఎం ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ వర్గాలు స్పష్టంగా పై చేయి సాధించాయి. ఉద్ధవ్ ఠాక్రే శివసేన (యూబీటీ), షిండే శివసేన 50 అసెంబ్లీ స్థానాల్లో ముఖాముఖి తలపడ్డాయి. వాటిలో 36 చోట్ల షిండే సేన నెగ్గింది. 14 చోట్ల మాత్రం ఉద్ధవ్ సేన గెలిచింది. ఆ పార్టీ మొత్తం 95 చోట్ల బరిలో దిగినా కేవలం 20 సీట్లే గెలుచుకుంది. షిండే సేన 81 చోట్ల పోటీ చేయగా 57 స్థానాలు కైవసం చేసుకుంది. 2022లో షిండే మెజారిటీ ఎమ్మెల్యేలతో కలిసి శివసేనను చీల్చడం, బీజేపీతో కలిసి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం తెలిసిందే. ఇక రెండు ఎన్సీపీలు 35 చోట్ల ముఖాముఖి తలపడ్డాయి. అజిత్ ఎన్సీపీ 29 స్థానాల్లో శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీని ఓడించింది. ఆరుచోట్ల మాత్రం ఆ పార్టీ చేతిలో ఓటమి చవిచూసింది. అజిత్ పార్టీ మొత్తం 59 చోట్ల పోటీ చేయగా ఏకంగా 41 స్థానాలు గెలుచుకుంది. శరద్ పార్టీ మాత్రం ఏకంగా 86 చోట్ల పోటీ చేస్తే కేవలం పదింట మాత్రమే నెగ్గింది. శరద్ పవార్ స్థాపించిన ఎన్సీపీని గతేడాది అజిత్ చీల్చి బీజేపీ–షిండే సేన సంకీర్ణ ప్రభుత్వంలో చేరారు. రెండు వర్గాల్లో అసలైన పార్టీలు ఎవరివంటూ నాటినుంచీ సాగుతున్న చర్చకు ఈ ఫలితాలతో తెర పడింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

'మహా' సీఎంపై పీటముడి!

● రేసులో ఫడ్నవీస్‌తో పాటు షిండే, అజిత్
● నేడు మహాయుతి ఎమ్మెల్యేల భేటీ
● సీఎంపై నిర్ణయం, రేపు ప్రమాణం!



ముంబై: మహారాష్ట్ర నూతన ముఖ్యమంత్రి ఎవరన్నదానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మహాయుతి కూటమిలోని మూడు పార్టీల నేతలూ ఇందుకోసం పోటీ పడుతున్నట్టు సమాచారం. ప్రస్తుత సీఎం, శివసేన (షిండే) అధినేత ఏక్‌నాథ్ షిండే మరోసారి అవకాశం ఆశిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ కూడా తం ఆ పోస్టుపై కన్నేసినట్టు చెబుతున్నారు. బీజేపీ మాత్రం ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పార్టీ ముఖ్య నేత దేవేంద్ర ఫడ్నవీస్ పేరును ఇప్పటికే ఖరారు చేసినట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం జరగనున్న మహాయుతి ఎమ్మెల్యేల భేటీపైనే అందరి కళ్లూ నిలిచాయి. ఈ భేటీలోనే కొత్త సీఎంను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. ప్రస్తుత శాసనసభ గడువు మంగళవారంతో తీరనుంది. కనుక ఆలోపు కొత్త సర్కారు కొలువుదీరడం తప్పనిసరి. ఈ నేపథ్యంలో కొత్త సీఎం ప్రమాణస్వీకారం మంగళవారం ముంబైలోని వాంఖెడే స్టేడియంలో జరిగే అవకాశముంది. మూడు పార్టీల అగ్రనేతలు ఆదివారం తమ ఎమ్మెల్యేలతో చర్చల్లో మునిగితేలారు. ఎన్సీపీ శాసనసభాపక్ష నాయకుడిగా అజిత్‌ను ఆ పార్టీ నూతన ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. నూతన సీఎంను మహాయుతి నేతలతో కలిసి తమ పార్లమెంటరీ బోర్డు నిర్ణయిస్తుందని మహారాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ బావంకులే చెప్పారు. బ్రాహ్మణ సామాజికవర్గానికి ఫడ్నవీస్‌కు కుల సమీకరణాలు ప్రతికూలంగా మారే పరిస్థితి కనిపిస్తోంది. మహారాష్ట్రలో మరాఠా సామాజిక వర్గానిదే అన్నింటా పైచేయి. ఇప్పటిదాకా సీఎంగా చేసిన వారిలో ఏకంగా 13 మంది ఆ సామాజికవర్గానికి చెందినవారే. ఈసారి కూడా తమ సామాజిక వర్గానికే సీఎం పీఠం దక్కాలని వారు ఆశిస్తున్నారు. ఫడ్నవీస్‌ను మరోసారి సీఎం చేయాలన్న ఆలోచనను చాలామంది వ్యతిరేకిస్తున్నారు. మరాఠా వ్యతిరేకిగా ఆయనకున్న ఇమేజీని గుర్తు చేస్తున్నారు. మహారాష్ట్ర జనాభాలో మరాఠాలు 30 శాతం కాగా బ్రాహ్మణులు 10 శాతమున్నారు. మనోహర్ జోషీ తర్వాత మహారాష్ట్ర సీఎంగా చేసిన రెండో బ్రాహ్మణ నేతగా ఫడ్నవీస్ నిలిచారు.

28న హేమంత్ ప్రమాణం

● ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించిన జార్ఖండ్ గవర్నర్
● నాలుగో సారి జార్ఖండ్ సీఎం కాబోతున్న హేమంత్



గవర్నర్‌కు లేఖ అందజేస్తున్న సోరెన్

రాంచీ: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) నేత హేమంత్ సోరెన్ ఆదివారం రాష్ట్ర గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్‌ను కలిశారు. నూతన ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని గవర్నర్ దృష్టికి తీసుకొచ్చారు. తనకు మద్దతు ప్రకటిస్తూ మెజార్టీ ఎమ్మెల్యేలు ఇచ్చిన లేఖను గవర్నర్‌కు అందజేశారు. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు హేమంత్ సోరెన్‌ను గవర్నర్ ఆహ్వానించారు. అంతకుముందు ముఖ్యమంత్రి పదవికి హేమంత్ రాజీనామా చేశారు. జేఎంఎం నేతృత్వంలోని 'ఇండియా' కూటమి పార్టీల ఎమ్మెల్యేలు హేమంత్ నివాసంలో సమావేశమయ్యారు. ఆయనను తమ నాయకుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హేమంత్ సోరెన్ ఈ నెల 28వ తేదీన జార్ఖండ్ 14వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అప్పటి దాకా ఆయన ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని అధికార వర్గాలు తెలిపాయి. హేమంత్ నాలుగోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయబోతుండడం విశేషం. జార్ఖండ్ శాసనసభ ఎన్నికల్లో 81 స్థానాలకు గాను ఇండియా కూటమి 56 స్థానాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఇందులో సోరెన్ పార్టీ 34 సీట్లు సాధించింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కేవలం 24 సీట్లకే పరిమితమైంది. హేమంత్ సోరెన్ తొలిసారిగా 2013లో 38 ఏళ్ల వయసులో జార్ఖండ్ ముఖ్యమంత్రి అయ్యారు. జార్ఖండ్‌లో అత్యంత పిన్నవయస్కుడైన సీఎంగా రికార్డు సృష్టించారు.

అమెరికా వ్యవసాయ మంత్రిగా బ్రూక్ రోలిన్స్



వాషింగ్టన్: చిరకాల మిత్రురాలు బ్రూక్ రోలిన్స్‌ను వ్యవసాయ మంత్రిగా డోనాల్డ్ ట్రంప్ నామినేట్ చేశారు. రిపబ్లికన్ల థింక్ టాంక్ అమెరికా ఫస్ట్‌పాలసీ ఇనిస్టిట్యూట్ అధిపతిగా ఉన్న బ్రూక్ నియామకంతో కేబినెట్ జాబితా దాదాపు పూర్తయ్యింది. దేశానికి నిజమైన వెన్నెముక అయిన అమెరికా రైతులను రక్షించేందుకు బ్రూక్ నాయకత్వం వహిస్తారని ఆయన తెలిపారు. అమెరికా ఫస్ట్ అధ్యక్షురాలిగా ఉన్న బ్రూక్స్ ట్రంప్ మిత్రురాలు. ట్రంప్ తొలి పర్యాయంలో వైట్‌హౌస్ సహాయకురాలిగా పని చేశారు. ఆఫీస్ ఆఫ్ అమెరికన్ ఇన్నోవేషన్ డైరెక్టర్‌గా, డొమెస్టిక్ పాలసీ కౌన్సిల్ తాత్కాలిక డైరెక్టర్‌గా పనిచేశారు. వ్యవసాయ అనుబంధ కుటుంబం నుంచి వచ్చిన రోలిన్స్.. దేశవ్యాప్త వ్యవసాయ క్లబ్ అయిన 4హెచ్‌తో పాటు ఫ్యూచర్ ఫార్మర్స్ ఆఫ్ అమెరికాతోనూ మంచి సంబంధాలను కలిగి ఉన్నారు. టెక్సాస్ ఏ అండ్ ఎం యూనివర్సిటీ నుంచి అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ డిగ్రీ అందుకున్న ఆమె తరువాత న్యాయవాదిగానూ పని చేశారు. అమెరికా, కెనడా, మెక్సికో దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాన్ని పునఃసమీక్షించడంలోనూ కీలక పాత్ర పోషించనున్నారు. రోలిన్స్ ఎంపికతో ట్రంప్ కేబినెట్ జాబితా ఎంపిక దాదాపు పూర్తయ్యింది. ప్రతి అభ్యర్థిని సెనేట్ ధ్రువీకరించాల్సి ఉంటుంది. 15 మంది సలహాదారుల బృందం అమెరికన్ ప్రభుత్వంలో ఒక బ్యూరోక్రటిక్ విభాగానికి నాయకత్వం వహిస్తుంది.



ట్రంప్ టీమ్‌లోకి మరో భారతీయుడు

ట్రంప్ అధికార బృందంలో మరో భారతీయుడు చేశారు. కోల్‌కతాలో పుట్టిన జై భట్టాచార్యను అమెరికా హెల్త్ ఏజెన్సీ డైరెక్టర్‌గా ట్రంప్ ఎంపిక చేశారు. స్టాన్‌ఫర్డ్‌లో చదివిన భట్టాచార్య వైద్యుడు, ఆర్థికవేత్త. ఎన్ఐహెచ్‌ను మార్చే ఆలోచనలను కాబోయే ఆరోగ్య మంత్రి రాబర్ట్ ఎఫ్ కెనెడీ జూనియర్‌తో ఆయన ఇటీవల పంచుకున్నారు. అనంతరం ఆయనను ట్రంప్ తన టీమ్‌లోకి ఎంపిక చేశారు.

నేనూ ఎన్‌సీసీ సభ్యుడినే

● విద్యార్థులు అందులో చేరాలి
● మన్ కీ బాత్‌లో మోదీ



న్యూఢిల్లీ: విద్యార్థులు నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్‌సీసీ)లో చేరాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. తాను కూడా చిన్నప్పుడు ఎన్‌సీసీలో చేరానని చెప్పారు. ''ఎన్‌సీసీ పేరు వినగానే నా స్కూలు, కాలేజీ రోజులు గుర్తుకొస్తాయి. ఎన్‌సీసీ నుంచి చాలా విలువైన అనుభవం పొందా. ఈ మాట పూర్తి ఆత్మవిశ్వాసంతో చెప్పగలను. యువతలో ఎన్‌సీసీ క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవా స్ఫూర్తిని నింపుతుంది. భారత యువ శక్తిలోని దయాగుణం, శక్తి సామర్థ్యాలు వృద్ధులకు తోడ్పడుతుండడం ప్రశంసనీయం. లఖ్‌నవూలో ఓ యువకుడు వృద్ధులకు సేవలందిస్తున్నాడు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించేందుకు సాయపడుతున్నాడు. అహ్మదాబాద్‌లో మరో యువకుడు సైబర్ మోసాలు, డిజిటల్ అరెస్టులపై పెద్దవారికి అవగాహన కల్పిస్తున్నాడు. యువ మిత్రులు సేవా తత్పరత చూస్తే చాలా ఆనందంగా ఉంది'' అన్నారు. ఆదివారం 116వ 'మన్ కీ బాత్'లో మోదీ దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. విదేశాల్లో మన భారతీయులు ఎన్నో విజయాలు సాధిస్తూ అంతర్జాతీయంగా తమదైన ముద్ర వేస్తున్నారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. ''ఇటీవలే గయానాలో పర్యటించా. అక్కడకి 180 ఏళ్ల క్రితం ఎంతోమంది భారతీయులు కూలి పనుల కోసం వెళ్లారు. ఇప్పుడు భారత సంతతి వ్యక్తులే ఆ దేశానికి నాయకత్వం వహిస్తున్నారు. అన్ని రంగాల్లోనూ కీలక స్థానాల్లో ఉన్నారు. గయానా అధ్యక్షుడు ఇర్ఫాన్ అలీవి భారత మూలాలే. వాటిపట్ల ఆయన గర్వపడతారు. శతాబ్దాల క్రితం విదేశాల్లో స్థిరపడిన భారతీయుల మూలాల పరిశోధనకు 'ఓరల్ హిస్టరీ ప్రాజెక్టు' ప్రారంభించాం. దేశవ్యాప్తంగా ప్రతి గ్రామ చరిత్రనూ రికార్డు చేయాలన్న ఆలోచన కూడా ఉంది'' అని వివరించారు.

జనవరిలో యువ నేతల భేటీ

వచ్చే ఏడాది జనవరి 12న స్వామి వివేకానంద 162 జయంతిని చాలా ప్రత్యేకంగా నిర్వహించబోతున్నాం. ఢిల్లీలోని భారత్ మండపంలో రెండు రోజులు యువతను భాగస్వాములను చేస్తూ 'మహా కుంభ్' నిర్వహిస్తాం. దీనికి 'వికసిత్ భారత్ యువ నేతల సమావేశం' అని నామకరణం చేశాం. జనవరి 11, 12 తేదీల్లో కార్యక్రమం జరుగుతుంది. రాజకీయ నేపథ్యం లేకున్నా యువత రాజకీయాల్లోకి వచ్చేలా స్ఫూర్తినివ్వడమే దీని ఉద్దేశం. దేశవ్యాప్తంగా కోట్లాదిగా యువత ఇందులో పాల్గొంటారు మారుమూల గ్రామాల నుంచి రెండు వేల మంది యువతీ యువకులను ప్రత్యేకంగా ఎంపిక చేశాం. కనీసం లక్ష మంది యువతను రాజకీయాలతో అనుసంధానించడానికి చర్యలు తీసుకుంటాం. దేశ విదేశాల నుంచి నిపుణులు హాజరవుతారు. నేనూ సాధ్యమైనంత ఎక్కువ సమయం గడుపుతా. యువత విభిన్న ఆలోచనలను పంచుకోవచ్చు. వాటి అమలుకు బ్లూప్రింట్ రూపొందిస్తాం'' అని మోదీ చెప్పారు.

ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా భీకర దాడి

250 రాకెట్లు ప్రయోగించిన మిలిటెంట్లు

బీరూట్: లెబనాన్‌కు చెందిన హెజ్‌బొల్లా మిలిటెంట్లు మరోసారి భీకర దాడులకు దిగారు. ఆదివారం ఇజ్రాయెల్ భూభాగంపై 250 రాకెట్లు, ఇతర డ్రోన్లు ప్రయోగించారు. గత కొన్ని రోజులుగా ఇజ్రాయెల్ సైన్యం లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలపై విరుచుకుపడుతుండడంతో ప్రతీకార చర్యగా మిలిటెంట్లు రాకెట్లతో దాడి దిగారు. ఈ దాడుల్లో కనీసం ఏడుగురు ఇజ్రాయెల్ పౌరులు గాయపడ్డారు. మరోవైపు ఇజ్రాయెల్ సైన్యం లెబనాన్ ఆర్మీ సెంటర్‌పై దాడికి పాల్పడింది. నైరుతి కోస్తా తీర రహదారిపై టైర్, నఖౌరా మధ్య ఈ దాడి జరిగినట్లు లెబనాన్ సైన్యం వెల్లడించింది. ఇజ్రాయెల్ దాడిలో ఒక సైనికుడు మృతిచెందాడని, 18 మంది గాయపడ్డారని తెలియజేసింది.

ఉప ఎన్నికల్లో పోటీ చేయను: మాయా



లక్నో: నకిలీ ఓటింగ్‌ను నిరోధించేందుకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకునేవరకు ఉప ఎన్నికల్లో బీఎస్పీ పోటీ చేయదని ఆ పార్టీ అధినేత్రి మాయావతి ప్రకటించారు. ఉత్తరప్రదేశ్ తాజా ఉప ఎన్నికల్లో ఓటింగ్ లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. వాటిలో బీఎస్పీ మొత్తం 9 స్థానాల్లో పోటీ చేసినా ఒక్కటి కూడా గెలవలేకపోయింది. ''బ్యాలెట్ పత్రాలతో పోలింగ్ జరిగే రోజుల్లో నకిలీ ఓట్లు వేసేవారని ప్రజల్లో అభిప్రాయముండేది. ఈవీఎంలు వచ్చాక కూడా ఇలాంటి పద్ధతులే జరుగుతున్నాయి. ఇది ప్రజాస్వామ్యానికి చేటు. ఉప ఎన్నికల సమయంలో మరింతగా అక్రమాలకు పాల్పడుతున్నారు'' అని మాయా అన్నారు.

లడ్కీ బహన్, మత విభజనే కారణం

మహాయుతి విజయంపై శరద్‌పవార్



కరాడ్: లడ్కీ బహిన్ పథకం, మతపరమైన విభజనే అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి విజయానికి దోహదపడ్డాయని ఎన్‌సీపీ (ఎస్పీ)అధినేత శరద్‌పవార్ అభిప్రాయపడ్డారు. లడ్కీ బహెన్ పథకం వల్ల మహిళలు పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారని, మతపరమైన విభజన కలిసొచ్చిందని చెప్పారు. క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పుకోవడంపై పార్టీ సహచరులతో కలిసి నిర్ణయం తీసుకుంటానన్నారు. ఓటమికి గల కారణాలను అధ్యయనం చేసి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈవీఎంలపై అనుమానాలు తలెత్తుతున్నాయన్న అంశంపై అధికారిక సమాచారం ఉంటేనే మాట్లాడతానన్నారు. ఎంవీఏ కూటమి ఎంతో కష్టపడ్డా ప్రజలు ఆశించిన ఫలితాలు రాలేదని పవార్ అన్నారు. మనవడు యుగేంద్ర పవార్‌ను బారామతిలో అజిత్ పవార్‌పై బరిలోకి దింపడం తప్పు నిర్ణయం కాదని, ఎన్నికలన్నప్పుడు పోటీ తప్పదని చెప్పారు. అజిత్ పవార్, యుగేంద్ర పవార్లను పోల్చలేమని, ఈ విషయం తనకూ తెలుసని స్పష్టం చేశారు. యుగేంద్ర పవార్‌పై అజిత్ పవార్ లక్ష ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

నేటి నుంచే పార్లమెంట్ సమరం

● డిసెంబర్ 20వ తేదీ వరకు శీతాకాల సమావేశాలు
● మొత్తం 16 బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం
● పార్లమెంట్ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లు
● జమిలీ ఎన్నికల బిల్లు వాయిదా



మీడియాతో మాట్లాడుతున్న రిజిజు

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 20వ తేదీ వరకు జరిగే ఈ సమావేశాల్లో 16 బిల్లులను ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో అత్యంత ముఖ్యమైన వక్ఫ్ సవరణ బిల్లును జాబితాలో చేర్చారు. జమిలీ ఎన్నికలకు సంబంధించిన బిల్లును మాత్రం పక్కనపెట్టారు. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరుగనున్న శీతాకాల సమావేశాలకు అధికార, ప్రతిపక్షాలు అస్త్రశస్త్రాలతో సిద్ధమయ్యాయి. ఈసారి సమావేశాలు వాడీవేడీగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే పార్లమెంట్‌లో సమావేశాల్లో ముందుగా ఇటీవల మరణించిన ఎంపీలకు సంతాపం తెలియజేశారు. తర్వాత కార్యకలాపాలు మొదలవుతాయి. వక్ఫ్ సవరణ బిల్లుపై జగదాంబికా పాల్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) తన నివేదికను ఈవారం సమావేశాల చివరి రోజున పార్లమెంట్‌కు సమర్పించాల్సి ఉంది. దానిని పార్లమెంట్ పరిగణనలోకి తీసుకుని ఆమోదించే అవకాశాలున్నాయి.

26న పాత పార్లమెంట్ భవనంలో ప్రత్యేక కార్యక్రమం

భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 26న పార్లమెంట్ ఉభయ సభలు కొనసాగవు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాత పార్లమెంట్ భవనం సంవిధాన్ సదన్‌లోని చారిత్రక సెంట్రల్ హాల్‌లో ఉభయ సభల ఎంపీలతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తదితరులు హాజరవుతారు. ఈ సందర్భంగా స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తోపాటు సంస్కృతం, మైథిలీ బాషలతో కూడిన భారత రాజ్యాంగ ప్రతులను విడుదల చేస్తారు.

'అదానీ, మణిపూర్'పై చర్చించాలి

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఆదివారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జేపీ నడ్డాతోపాటు 30 పార్టీల నేతలు పాల్గొన్నారు. అదానీపై గ్రూప్‌పై ఆరోపణలు, మణిపూర్ సంక్షోభం, వాయుకాలుష్యం, రైలు ప్రమాదాలపై విస్తృతంగా చర్చించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. భేటీ అనంతరం రిజిజు మీడియాతో మాట్లాడారు. అన్ని అంశాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఉభయ సభలు సజావుగా సాగేందుకు విపక్షాలన్నీ సహకరించాలని కోరారు.

చిచ్చురేపిన మసీదు సర్వే



ఘటనా స్థలిలో మోహరించిన పోలీసులు

సంభాల్(యూపీ): మొఘల్ రాజుల కాలంలో నిర్మించిన మసీదు సర్వే వ్యవహారం హింసాకాండకు దారితీసింది. పోలీసులతో జరిగిన ఘర్షణలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ పట్టణంలో ఆదివారం ఈ సంఘటన జరిగింది. సంభాల్‌లో ప్రాచీన షాహీ జామా మసీదు ఉంది. ఇక్కడ నిత్యం ప్రార్థనలు జరుగుతుంటాయి. అయితే, ఈ మసీదు నిర్మించిన స్థలంలోనే హరిహర మందిరం ఉండేదని పేర్కొంటూ స్థానిక కోర్టులో కొందరు పిటిషన్ దాఖలు చేశారు. మందిరం ఆనవాళ్లు గుర్తించడానికి సర్వే చేయాలని కోరారు. దీంతో సర్వే ప్రారంభించాలని అధికారులను ఆదేశిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. గత మంగళవారం ప్రభుత్వ అధికారులు మసీదు ప్రాంగణంలో సర్వే ప్రారంభించారు. అధికారులను అడ్డుకొనేందుకు ఓ వర్గం ప్రజలు ప్రయత్నిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆదివారం మధ్యాహ్నం పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. ఓ వర్గానికి చెందిన వందలాది మంది జనం మసీదు వద్ద గుమికూడారు. పోలీసులపై తిరగబడ్డారు. రాళ్లు రువ్వారు. పోలీసుల వాహనాలకు నిప్పుపెట్టేందుకు ప్రయత్నించారు. ఆందోళనకారులను నిలువరించడానికి పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఘర్షణ కొనసాగుతుండగానే గుర్తు తెలియని వ్యక్తులు తుపాకీతో కాల్పులు జరిపారని, ఈ కాల్పుల్లో నయీమ్, బిలాల్, నౌమాన్ మరణించారని మొరాదాబాద్ డివిజనల్ కమిషనర్ వెల్లడించారు. ఈ హింసాకాండ బీజేపీ ప్రభుత్వ కుట్రేనని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు.

ఎంవీఏ ఓ రాక్షస కూటమి: కంగన



న్యూఢిల్లీ/సిమ్లా/ముంబై: మహిళలను గౌరవించకపోవడం వల్లే మహారాష్ట్రలో ఎంవీఏ కూటమి ఓడిపోయిందని బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ అన్నారు. ఆమె ఆదివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఎంవీఏను రాక్షస కూటమిగా అభివర్ణించారు. మహిళలను గౌరవించే వారు దేవతలుగా, గౌరవించనివాళ్లు రాక్షసులుగా మిగిలిపోతారన్నారు. 2020లో అవిభాజ్య శివసేన నేతృత్వంలోని ఎంవీఏ సర్కారు ముంబైలోని కంగనా బంగ్లాను కూల్చేయడం తెలిసిందే. అప్పట్లో తనను అసభ్య పదజాలంతో దూషించారని ఆమె ఆరోపించారు. ''దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకునే వారికి మహారాష్ట్ర ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పారు. అభివృద్ధికి, సుస్థిర ప్రభుత్వానికి ఓటేశారు'' అన్నారు.

సాక్షి హైదరాబాద్

సోమవారం ౹ 25 ౹ నవంబర్ ౹ 2024



శిశువు కిడ్నాప్ కథ సుఖాంతం

నిలోఫర్ ఆస్పత్రిలో కిడ్నాప్‌నకు గురైన శిశువు ఆచూకీ లభించింది. శిశువును అపహరించి ఏపీలోని అనంతపురం జిల్లాకు తరలిస్తున్న నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. - 8లో



నట్టింటి నుంచి.. నెట్టింటికి..

పెళ్లి సందడి నట్టింట్లో నుంచి నెట్టింట్లోకి చేరింది. పెళ్లి చూపులు, ఎంగేజ్‌మెంట్, ప్రీ వెడ్డింగ్ మొదలు, పెళ్లి అనంతరం తతంగాలన్నీ సోషల్ వేదికగా షేర్ చేసుకుంటున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 29.0/17.0

నగరంలో సోమవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్ఠంగా 29, కనిష్ఠంగా 17 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

చలితో గజ గజ



నగర శివారులో కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఇలా..

ప్రాంతం	డిగ్రీలు
పటాన్‌చెరు	12.4
రాజేంద్రనగర్	14.0
హకీంపేట	15.2
హయత్‌నగర్	15.6
దుండిగల్	16.0

సాక్షి, సిటీబ్యూరో: చలి గజగజ వణికిస్తోంది. తెల్లవారు జామున పొగ మంచు కమ్మేస్తోంది. పగటి గరిష్ఠ ఉష్ణోగ్రత కూడా తగ్గుముఖం పట్టి 29 డిగ్రీలకు చేరింది. రాత్రి పూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత పడిపోతున్నాయి. ఆదివారం రాత్రి చలి తీవ్రత పెరిగింది. నగరం మొత్తం మీద సగటున కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15.7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. శివార్లలో మాత్రం అత్యల్పంగా సగటున 12.4 డిగ్రీల సెల్సియస్ రికార్డు అయింది. గత వారం రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

ఇంటింటి సర్వే 75.30 శాతం

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల గణన సర్వే వేగంగా కొనసాగుతోంది. గ్రేటర్ హైదరాబాద్‌లో 75.30 శాతం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పూర్తయిందని జీహెచ్‌ఎంసీ అధికారులు వెల్లడించారు. ఎన్యుమరేటర్లు ఇంటింటి సర్వేను జాగ్రత్తగా నిర్వహించి, తప్పుల్లేకుండా కోడింగ్ నమోదు చేస్తున్నారని వివరించారు. గ్రేటర్‌లో ఇప్పటివరకు 18,26,564 కుటుంబాల్లో సర్వే పూర్తయిందని వెల్లడించారు. మిగిలిన గృహాల సర్వేను నిర్దేశించిన సమయానికి పూర్తి చేయడానికి అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. సర్వే పూర్తయిన ప్రాంతాల్లో పూర్ పర్ఫార్మెన్స్ ఉన్న బ్లాకులను గుర్తించి, ఆ బ్లాకుల్లో ఉన్న వారిని సర్వే కోసం కేటాయించాలని, ఈ మేరకు డిప్యూటీ కమిషనర్ చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు.

ఘనంగా 'ఇరిసెట్' వార్షికోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: ఇండియన్ రైల్వేస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజినీరింగ్, టెలీ కమ్యూనికేషన్స్ (ఇరిసెట్) 67వ వార్షికోత్సవం ఆదివారం తార్నాకలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైల్వేబోర్డు అదనపు సభ్యుడు (సిగ్నలింగ్) విజయలక్ష్మి కౌశిక్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సురక్షితంగా రైళ్లను నడిపేందుకు అవసరమైన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి, శిక్షణలో ఇరిసెట్ గొప్ప సంస్థగా సేవలు అందజేస్తోందన్నారు. రైల్వేబోర్డు మరో అదనపు సభ్యుడు సమీర్ దీక్షిత్ మాట్లాడుతూ.. దేశ అవసరాలకు తగినవిధంగా వినూత్నమైన సాంకేతిక వ్యవస్థలను ఇరిసెట్ అందజేస్తోందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ.. సిగ్నలింగ్ అండ్ టెలీ కమ్యూనికేషన్స్ రంగంలో బహుళ ప్రాధాన్యం కలిగిన నిపుణులను అందజేసి ఇరిసెట్ కీలకమైన పాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో ఇరిసెట్ డైరెక్టర్ జనరల్ శరత్ కుమార్ శ్రీవాస్తవ, వివిధ విభాగాల రైల్వే అధికారులు, ఉద్యోగులు, సాంకేతిక నిపుణులు, ట్రైనీ ఉద్యోగులు పాల్గొన్నారు.







శునకంతో మహేశ్ భగవత్

పెట్.. పర్‌ఫెక్ట్

నగరంలోని నార్సింగి వేదికగా ఓం కన్వెన్షన్‌లో ఆదివారం నిర్వహించిన 'పెడిగ్రీ ప్రో హైకాన్–24' షో ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో 500కు పైగా శునకాలు, 100కు పైగా పిల్లులు అలరించాయి. సుమారు 5 వేల మంది పెట్ లవర్స్ పాల్గొన్నారు. – వివరాలు సిటీప్లస్‌లో

చౌకగా.. చక్కగా..

జన్‌పోషణ్ కేంద్రాలుగా మరో 30 రేషన్ షాపులు



సికింద్రాబాద్ పరిధిలో జన్ పోషణ్ కేంద్రం

- ఇప్పటికే 15 ఈ తరహా దుకాణాలు
- నిత్యావసర సరుకులు సహా చిరు ధాన్యాలు, పప్పులు లభ్యం
- గ్రేటర్ నగరంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మరో 30 ప్రభుత్వ చౌక ధరల దుకాణాలు త్వరలో జన్ పోషణ్ (ప్రజా పోషక) కేంద్రాలుగా మారనున్నాయి. ఇప్పటికే ప్రయోగాత్మకంగా 15 రేషన్ షాపుల్లో ఇవి కొనసాగుతుండగా.. మరికొన్ని కేంద్రాలను ప్రారంభించేందుకు పౌరసరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా మరిన్ని ఉత్పత్తులను ప్రజలకు చేరవేసేందుకు చర్యలు చేపట్టిన విషయం విదితమే. పైలట్ ప్రాజెక్టులో భాగంగా మూడు నెలల క్రితం తొలి విడతలో ప్రారంభించిన కేంద్రాలకు మంచి స్పందన లభిస్తుండటంతో తాజాగా మరో 30 జన్ పోషణ్ కేంద్రాలకు అనుమతించింది. ఎంపిక చేసిన రేషన్ షాపుల డీలర్లకు మూడు రోజులపాటు సరుకుల విక్రయాలు, నిల్వల తీరుపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ కేంద్రాల్లో తృణ ధాన్యాలు, పప్పులు, పాల ఉత్పత్తులు, రోజువారీ నిత్యావసర సరుకులు సహా వివిధ ఉత్పత్తులను విక్రయిస్తారు. దశల వారీగా రేషన్ షాప్‌లను పూర్తిగా ఆధునికీకరించి నిత్యావసర సరుకులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

తక్కువ ధరల్లోనే..

జన్ పోషణ్ కేంద్రాల్లో నాణ్యమైన సరుకులు తక్కువ ధరకు అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. బహిరంగ మార్కెట్లో లభించే ధర కంటే తక్కువ ధరకు నాణ్యత కలిగిన నిత్యావసర సరుకులు విక్రయించనున్నారు. ప్రజా పంపిణీ పథకం కింద పంపిణీ చేస్తున్న పీడీఎస్ బియ్యం, సబ్సిడీ, గోధుమలు, కిరోసిన్, చక్కెర తదితర వంటివి మినహాయించి, కంది పప్పు, శనగ, పెసర పప్పు, కొర్రలు, సజ్జలు తదితర పోషకాహార సరుకులను విక్రయించే విధంగా ఏర్పాటు చేశారు. సబ్బులు, అగ్గిపెట్టెలు, పప్పులు, పాలు, నూనెలు, ఉప్పు, బెల్లం, ఉల్లిగడ్డలు వంటివి కూడా విక్రయించేందుకు డీలర్లకు వెసులుబాటు కల్పించారు.

డీలర్లకు ఆర్థిక చేయూత..

రేషన్ డీలర్ల ఆదాయాన్ని పెంచేందుకు జన్ పోషణ్ కేంద్రాలు ఎంతో ఉపయోగపడనున్నాయి. ఒకవైపు ప్రజలకు పోషక పదార్థాలు అందించడంతోపాటు డీలర్లకు ఆర్థిక చేయూత అందించేందుకు కేంద్రాలు కలిసి వచ్చే విధంగా కేంద్రం చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. వాస్తవంగా ప్రభుత్వ చౌకధరల దుకాణాలు కేవలం పీడీఎస్ బియ్యంతో పాటు సబ్సిడీ సరుకుల పంపిణీకే పరిమితమయ్యాయి. ప్రతి నెలా మొదటి వారం తర్వాత పది రోజులు మాత్రమే నిర్ణీత సమయంలోనే రేషన్ దుకాణాలు పని చేస్తుంటాయి. మిగిలిన రోజుల్లో సరుకుల పంపిణీ గడువు ముగియడంతో దుకాణాలను మూసివేయడం షరామామూలైంది. దీంతో రేషన్ డీలర్లకు సబ్సిడీ సరుకుల పంపిణీపై వస్తున్న కమీషన్లు కనీసం మడిగ కిరాయికి సైతం సరిపోని పరిస్థితి నెలకొంది. దీంతో దుకాణాల నిర్వహణ కష్టంగా తయారైందని రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

6.36 లక్షల కుటుంబాలు

హైదరాబాద్ పౌర సరఫరాల విభాగం పరిధిలో సుమారు 653 రేషన్ షాపులున్నాయి. వీటి పరిధిలో 6.23 లక్షల కుటుంబాలకు ఆహార భద్రత కార్డులున్నాయి. ఇందులో దాదాపు 23.61 లక్షల సభ్యులు ఉన్నారు. ప్రతి నెలా 80 నుంచి 90 శాతం వరకు లబ్ధి కుటుంబాలు సబ్సిడీ సరుకులు డ్రా చేస్తుంటాయి. రేషన్ షాపులు జన్‌పోషణ్ కేంద్రాలుగా మారుతుండటంతో ఇతర నిత్యావసర సరుకులు కూడా కొనుగోలు చేస్తుండటంతో మరింత కలిసి వస్తోంది. దీంతో పౌరసరఫరాల శాఖ మరిన్ని రేషన్‌షాపులను జన్‌పోషణ్ కేంద్రాలుగా మార్చే పనిలో ఉన్నట్లు కనిపిస్తోంది.

సెల్లార్ తవ్వుతుండగా కూలిన అపార్ట్‌మెంట్ ప్రహరీ

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి భరత్‌పురి కాలనీ సెవెన్‌హిల్స్ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్ పక్కన ఆదివారం ఉదయం సెల్లార్ తవ్వుతుండగా ప్రహరీ కూలిపోయిన ఘటన స్థానికులను భయాందోళనకు గురిచేసింది. త్రుటిలో పెను ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. అపార్ట్‌మెంట్ పక్కనే సెల్లార్ కోసం తవ్వుతున్నారని మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందించినా పట్టించుకోలేదని వారు ఆరోపించారు. మున్సిపల్ అనుమతి లేకుండానే సెల్లార్‌లు జరుగుతున్నా అధికారులు మొద్దు నిద్ర పోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందించినా పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని దుయ్యబట్టారు. వెంటనే సెల్లార్ తవ్వకం పనులను నిలిపివేయించాలని అధికారులను అపార్ట్‌మెంట్ వాసులు డిమాండ్ చేశారు.



కూలిపోయిన ప్రహరీ

బాలికల సాధికారతే

లక్ష్యం



నెక్లెస్ రోడ్డులో అవగాహన వాక్

ఖైరతాబాద్: బాలికలకు 18 ఏళ్ల వయసు వచ్చేదాకా చదువుకునేలా, కాలేజీల్లో కొనసాగేలా చూడటమే లక్ష్యంగా 'క్రై' సంస్థ ఆధ్వర్యంలో 'పూరీ పఢాయీ.. దేశ్‌కీ భలాయీ' పేరుతో ఆదివారం నెక్లెస్ రోడ్డులో అవగాహన వాక్ నిర్వహించారు. బాలికల సాధికారత పట్ల సామూహిక నిబద్ధతను చాటి చెప్పడం, విద్య విషయంలో బాలికలు ఎదుర్కొంటున్న సవాళ్లపై సమాజంలో అవగాహన పెంపొందించడమే ధ్యేయంగా అవగాహన వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా 'క్రై' సంస్థ సౌత్ రీజినల్ డైరెక్టర్ జాన్ రాబర్ట్స్ మాట్లాడుతూ.. 6– 10 సంవత్సరాల బాలికల్లో 83 శాతం మంది ప్రాథమిక పాఠశాలలకు వెళ్తుండగా, 11– 17 సంవత్సరాల వయసుబాలికల్లో 70 శాతం మాత్రమే మాధ్యమిక పాఠశాలలకు వెళ్తున్నారని పేర్కొన్నారు. బాలికలు పాఠశాలలకు దూరమవుతుండటంతో బాల్య వివాహాలు, చిన్న వయసులోనే తల్లులవడం, బాల కార్మికులుగా మారడం, అక్రమ రవాణాకు గురవడం వంటి ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సవాళ్లను అధిగమించడానికి బహుముఖంగా పని చేయాల్సిన అవసరముందన్నారు. సమస్యల పరిష్కారంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవడమే లక్ష్యంగా 'క్రై' సంస్థ పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎ.నిర్మలా కాంతి, ప్రముఖ నటి, రచయిత విద్యా మహర్షి, ఫెమినా మిస్ ఇండియా– 2020 మానస వారణాసి, నటి దివ్య శ్రీపాద తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు భగవంతుడి స్వరూపాలు

- చిన్నారులకు మెరుగైన వైద్యం భేష్
- 'కిమ్స్' సేవలు అభినందనీయం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



చిన్నారులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

గచ్చిబౌలి: మెరుగైన వైద్యంతో చిన్నారులకు పునర్జన్మ ప్రసాదించిన వైద్యుల సేవలు మరువలేనివని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఆదివారం గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో లిటిల్ వన్స్ ఫౌండేషన్, కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పీడియాట్రిక్ వారియర్స్ డే సందర్భంగా కేటీఆర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. 'పిల్లలు భగవంతుడి స్వరూపాలు. వారి మధ్య గడపటం ఎంతో సంతోషకరం. పిల్లలు బాధపడుతుంటే తల్లిదండ్రులు ఎంత క్షోభ అనుభవిస్తారో ఓ తండ్రిగా నాకు తెలుసు' అని ఒకింత భావోద్వేగంతో పేర్కొన్నారు. ఆపదలో ఉన్న చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కిమ్స్ హాస్పిటల్ చేయూతనందించడం ఎంతో ముదావహమని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో తనకు పోస్ట్ పెట్టిన పేదవాడికి వైద్యం అందించాలని కోరగా కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం స్పందించిందని, మరో ఘటనలో కిడ్నీ మార్పిడికి సైతం సహకరించిందని ఆయన గుర్తు చేశారు. కాగా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన 17 ఏళ్ల లోపు పిల్లలు కిమ్స్ కడల్స్‌లో వెంటిలేటర్, ఎక్మో, డయాలసిస్, గుండె శస్త్ర చికిత్సలు, సూపర్ స్పెషాలిటీ వైద్యం తీసుకొని మంచి జీవితం గడుపుతున్నారు. ఈ పిల్లలంతా తమ ఆటా పాటలతో అలరించారు. వీరి మధ్య కేటీఆర్ ఉత్సాహంగా.. ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు, లిటిల్ వన్స్ ఫౌండేషన్ ట్రస్టీ డాక్టర్ పరాగ్, డాక్టర్ బాబు మదార్కర్, ట్రస్టీ విద్యాభూషణ్, చైర్మన్ రాజేశ్వర్‌రావు, రఘునాథ్ రెడ్డి, మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది లేక.. సర్వే సాగక

- ఇటు రహదారులు.. అటు చెరువులు
- రెండు మండలాలకు ఒక సర్వేయర్
- రంగారెడ్డి జిల్లాలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- 2,500కు పైగా దరఖాస్తుల పెండింగ్
- భూ బాధితులకు తప్పని నిరీక్షణ

సాక్షి, సిటీబ్యూరో: ఇతర జిల్లాలతో పోలిస్తే రంగారెడ్డి జిల్లాలో భూ క్రయ, విక్రయాలే కాదు విస్తీర్ణం, సరిహద్దు వివాదాలు కూడా ఎక్కువే. ప్రభుత్వ, ప్రైవేటు పట్టా భూములతో పాటు రియల్ ఎస్టేట్ వెంచర్లలో వెలసిన ఖాళీ ప్లాట్ల సరిహద్దుల విషయంలో తరచూ వివాదాలు తలెత్తుతుంటాయి. భూ విస్తీర్ణం సహా సరిహద్దుల నిర్ధారణ కోసం ప్రైవేటు సర్వేయర్లను సంప్రదిస్తారు. వారిచ్చే రిపోర్టులపై విశ్వసనీయత లేకపోవడంతో మెజార్టీ భూ బాధితులు ప్రభుత్వ సర్వేయర్లను ఆశ్రయిస్తుంటారు. జిల్లా నిష్పత్తి మేరకు సర్వేయర్లు లేకపోగా, ఉన్నవారు కూడా చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నిర్ధారణ, రీజినల్ రింగ్‌రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు, ఫోర్త్ సిటీ కోసం చేపట్టే భూ సేకరణలో బిజీగా మారారు. ఫలితంగా భూముల సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న 2,500 మందికిపైగా భూ బాధితులకు నెలల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. పక్కనే ఉన్న హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పని చేస్తున్న సర్వేయర్లను డిప్యూటేషన్‌పై తీసుకొచ్చి పని పూర్తి చేయించే అవకాశం ఉన్నా.. జిల్లా అధికారులు ఆ దిశగా ఆలోచించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వారంతా ఆ ప్రాజెక్టుల్లోనే..

- హైదరాబాద్ జిల్లాలో ఖాళీ స్థలాలు పెద్దగా లేవు. 16 మండలాలకు గాను 19 మంది సర్వేయర్లు ఉన్నారు. ఇక్కడ భూ వివాదాలు కూడా చాలా తక్కువ. వీరికి పెద్దగా పని కూడా లేదు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 15 మండలాలు ఉండగా, 18 మంది సర్వేయర్లు ఉన్నారు. ఇక 27 మండలాలు ఉన్న కీలకమైన రంగారెడ్డి జిల్లాలో మాత్రం 14 మందే ఉన్నారు. రెండు, మూడు మండలాలకు ఒక సర్వేయర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు.
- ప్రభుత్వ భూముల సర్వేకు తోడు.. ప్రాజెక్టులు, రోడ్ల కోసం ప్రభుత్వం చేపట్టే భూ సేకరణలో వీరంతా బిజీగా మారుతున్నారు. సాధారణ భూ బాధితులు సర్వే కోసం దరఖాస్తు చేసి నెల రోజులు దాటినా.. అటు వైపు కన్నెత్తి చూడలేని పరిస్థితి. వివాదాలను త్వరగా పరిష్కరించుకోవాలనే భూ బాధితుల్లో ఉన్న బలహీనతను కొంతమంది సర్వేయర్లు క్యాష్ చేసుకుంటున్నారు. ఏరియా, భూమి విలువ, విస్తీర్ణాన్ని బట్టి వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. గతంలో గండిపేట మండల సర్వేయర్ ఒకరు ఇదే అంశంపై పట్టుబడటం విశేషం.



గ్రేటర్ జిల్లాల్లో సర్వేయర్లు ఇలా..

జిల్లా	మండలాలు	సర్వేయర్లు
హైదరాబాద్	16	19
మేడ్చల్	15	18
రంగారెడ్డి	27	14

ఉద్దేశపూర్వకంగానే..

- జిల్లా అవసరాలు, సర్వేయర్ల కొరత, తలెత్తుతున్న సమస్యలను ముందే గుర్తించి ప్రభుత్వానికి తగిన నివేదిక అందజేయాల్సి ఉంది. కానీ ఓ జిల్లా స్థాయి అధికారి ఉద్దేశపూర్వకంగానే కొత్త సర్వేయర్ల కేటాయింపు అభ్యర్థన ఫైలును తొక్కిపెడుతున్నట్లు సమాచారం. అత్యవసర పరిస్థితుల్లో.. సరిహద్దు జిల్లాల్లో పని చేస్తున్న సర్వేయర్ల సేవలను వినియోగించుకునే అవకాశం ఉన్నా.. జిల్లాపై తన కున్న గుత్తాధిపత్యం ఎక్కడ కోల్పోవాల్సి వస్తుందోననే భయంతో పట్టీపట్టనట్టుగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.
- ఉద్దేశపూర్వకంగానే సర్వేయర్ల కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. అంతేకాదు సర్వేయర్ ఏసీబీ కేసులో పట్టుబడి ఖాళీగా ఉన్న మణికొండ సహా, రాజేంద్రనగర్, చేవెళ్ల, శంషాబాద్, మహేశ్వరం, హయత్‌నగర్, బాలాపూర్, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, కొత్తూరు, నందిగామ మండలాల్లో తనకు అనుకూలమైన వారిని నియమించుకుని, వారి ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు సైతం ఉన్నాయి.

సాఫీగా.. సాగిపో!

సైబరాబాద్‌లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళికలు

- కూడళ్లు, రోడ్ల విస్తరణతో పాటు చలాన్ల జారీ
- రద్దీ జోన్లలో ట్రాఫిక్ మార్షల్స్ నియామకం
- డీడీ, రాంగ్ సైడ్ డ్రైవింగ్ వంటి వాటిపై కఠిన చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్‌లో వాహనదారులకు సౌకర్యవంతమైన ప్రయాణం కోసం పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు వాహనాల రద్దీని క్రమబద్ధీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కమిషనరేట్ పరిధిలో కూడళ్లు, రోడ్ల విస్తరణ తదితర చర్యలు చేపడుతున్నామని ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్ తెలిపారు. ట్రాఫిక్ పరిస్థితులను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రతి నెలా రెండు ట్రాఫిక్ డివిజన్లతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ హాట్‌స్పాట్‌లు, అనధికారిక పార్కింగ్ ప్రాంతాలను గుర్తించడంతో పాటు రోజువారీ ట్రాఫిక్ రద్దీని విశ్లేషించి తదనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్లు ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి, ప్రమాదాలు పునరావృతం కాకుండా వివిధ ప్రభుత్వ విభాగాలతో కలిసి నిర్వహణ పనులను చేపడుతున్నామన్నారు. ఔటర్ రింగ్ రోడ్‌పై ప్రమాద పోకడలను విశ్లేషించి, నివారణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

స్పెషల్ డ్రైవ్‌లు..

నంబర్ ప్లేట్ సరిగా లేని వాహనాలను గుర్తించేందుకు ప్రతి రోజు స్పెషల్ డ్రైవ్‌లతో పాటు మెరుగైన ట్రాఫిక్ నిర్వహణ కోసం జంక్షన్లు, కీలకమైన ప్రాంతాలలో డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రహదారులపై ట్రాఫిక్ కదలికలకు అడ్డుగా ఉన్న బారికేడ్లు, విద్యుత్ స్తంభాలు, చెట్లను తొలగించి, వేరే చోట ఏర్పాటు చేస్తున్నామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం అదనపు పోలీసు సిబ్బందిని నియమించడంతో పాటు ప్రత్యేక సిబ్బందితో పెండింగ్‌లో ఉన్న చలాన్లను క్లియర్ చేయిస్తున్నట్లు తెలిపారు. అలాగే వాహనాలు, ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే జోన్లలో ట్రాఫిక్ మార్షల్స్‌ను నియమిస్తున్నామని తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్‌లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు హెల్మెట్ లేకుండా, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసే వాహనదారులపై నిఘా పెంచుతున్నామని ఆయన వివరించారు.

లిఫ్ట్ ఆపరేటర్‌పై రోగి సహాయకుడి దాడి

- నిలోఫర్‌లో ఘటన
- నాంపల్లి పీఎస్‌లో కేసు నమోదు



నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రిలో లిఫ్ట్ ఆపరేటర్‌పై రోగి సహాయకుడు దాడికి పాల్పడిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. నాంపల్లి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అనిత అనే దివ్యాంగురాలు నిలోఫర్ ఆసుపత్రిలో లిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తోంది. శనివారం సాయంత్రం ఓ రోగి సహాకుడిని లిఫ్ట్‌లో రావద్దని వారించినందుకు అతడు ఆమెపై దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషయమై సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్‌ను వివరణ కోరగా దాడి జరిగిన విషయం వాస్తవమేనని, ఇటీవల ఇదే తరహాలో ఆసుపత్రి గేటు వద్ద పని చేస్తున్న సెక్యూరిటీ గార్డ్ ఇమ్రాన్‌పై కూడా పేషంట్ అటెండర్స్ దాడికి పాల్పడ్డారన్నారు. రోగులు, రోగి సహాయకులు సంయమనం పాటించాలని కోరారు. ఆసుపత్రి సిబ్బందిపై దాడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాలేయ వ్యాధులపై అవగాహన



సాక్షి, సిటీబ్యూరో: కాలేయ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు నిమ్స్‌లోని గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్నేషనల్ హెపాటోపాంక్రియాటికోబైలరీ అసోసియేషన్ (ఐహెచ్‌పీబీఏ) ఇండియా చాప్టర్ మద్దతుతో ఈ కార్యక్రమం జరిగింది. ఆర్గనైజింగ్ చైర్మన్‌గా నిమ్స్ డైరెక్టర్ బీరప్ప వ్యవహరించారు. దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 50 మంది డెలిగేట్స్‌కు కాలేయ వ్యాధులపై 65 మంది ప్రొఫెసర్లు అవగాహన కల్పించి, సర్టిఫికెట్లు అందజేశారు.

నిలోఫర్‌లో శిశువు కిడ్నాప్ కథ సుఖాంతం

ముగ్గురి రిమాండ్

- చిన్నారిని అనంతపురం జిల్లాకు తరలించేందుకు యత్నం
- పుల్లూరు టోల్ ప్లాజా వద్ద నిందితుల పట్టివేత
- క్షేమంగా తల్లి చెంతకు చేరిన శిశువు
- కీలకంగా మారిన సీసీ కెమెరా ఫుటేజీ

నాంపల్లి: నిలోఫర్ ఆస్పత్రిలో కిడ్నాప్‌నకు గురైన శిశువు ఆచూకీ లభించింది. శిశువును అపహరించి ఏపీలోని అనంతపురం జిల్లాకు తరలిస్తుండగా జాతీయ రహదారి 44పై గద్వాల జిల్లా పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జహీరాబాద్‌కు చెందిన హసీనా బేగం, గఫార్ బాష దంపతులకు నెల రోజుల క్రితం జహీరాబాదు ఏరియా ఆసుపత్రిలో మగ శిశువు జన్మించాడు. చిన్నారి అనారోగ్యంతో బాధపడుతుండటంతో స్థానిక వైద్యుల సలహా మేరకు తల్లిదండ్రులు గత నెల 20న శిశువును నగరంలోని నిలోఫర్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. నెల రోజుల పాటు నిలోఫర్‌లో చికిత్స పొందిన శిశువును శనివారం సాయంత్రం డిశ్చార్జి చేశారు. డిశ్చార్జి చేసే ముందు శిశువు తల్లి, అమ్మమ్మ ఆరోగ్య శ్రీ వార్డుకు వెళ్లారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన బుర్ఖా ధరించిన గుర్తు తెలియని మహిళ వృద్ధురాలితో మాటలు కలిపి తాను ఇక్కడే పనిచేస్తానంటూ చెప్పింది. చిన్నారి ముద్దుగా ఉన్నాడంటూ చేతిలో తీసుకుని వృద్ధురాలి దృష్టి మరల్చి శిశువును తీసుకుని అక్కడి నుంచి పారిపోయింది. దీంతో శిశువు తల్లి నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఐదు బృందాలుగా రంగంలో దిగారు. సీసీ కెమెరాల ఆధారంగా కిడ్నాపర్ ఆచూకీని గుర్తించి వెంటాడారు.

వారసుడి కోసమే...

అనంతపురం జిల్లా, ముదిగుబ్బ కు చెందిన షాహీన్ బేగం, మేకల చెరువు ప్రాంతానికి చెందిన అబ్దుల్లా అలియాస్ వెంకటేష్, అతడి భార్య రేష్మ అలియాస్ రేణుక ఉపాధి కోసం నగరానికి వలస వచ్చి ఫస్ట్‌లాన్సర్‌లో ఉంటున్నారు. అబ్దుల్లా, రేష్మలకు 2009లో వివాహం అయ్యింది. వీరికి ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం రేష్మ ఎనిమిది నెలల గర్భవతిగా ఉంది. మళ్లీ ఆడపిల్లే పుడుతుందని భావించిన వారు మగశిశువును తెచ్చుకుని పెంచుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు గాను నిలోఫర్ ఆస్పత్రిని ఎంచుకున్నారు. ఈ నేపథ్యంలో తమకు సాయంగా ఉండేందుకు రేష్మ తన సోదరి షాహీన్ బేగంను హైదరాబాదుకు రప్పించింది. పథకం ప్రకారం గర్భంతో ఉన్న రేష్మ చికిత్స కోసం నిలోఫర్‌కు వచ్చినట్లుగా నటించారు. ఆమెకు సహాయకురాలిగా షాహీన్ బేగం ఉంది. అబ్దుల్లా అలియాస్ వెంకటేష్ ఆసుపత్రి వద్ద వేచి ఉంది. షాహీన్ బేగం ఆసుపత్రిలో నుంచి మగ శిశువుతో బయటికి వస్తున్న వృద్ధురాలు(శిశువు అమ్మమ్మ) దగ్గరకు వెళ్లి ఆమె దృష్టి మరల్చి వృద్ధురాలి చేతిలో ఉన్న శిశువును తీసుకుని ఆటోలో అక్కడి నుంచి పారిపోయింది.

సీసీ కెమెరాలే పట్టించాయి...

నిందితులను పట్టుకునేందుకు డీసీపీ నేతృత్వంలో ఐదు బృందాలు రంగంలోకి దిగాయి. నిలోఫర్ నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. సీసీ పుటేజీల్లో లభించిన ఆధారాల ప్రకారం.. ఆటోలో నుంచి నిందితులు బైక్‌పైకి మారారు. మాసాబ్ ట్యాంక్ నుంచి ఎన్‌హెచ్‌-44 హైవేపైకి చేరుకున్న తర్వాత వారు మారుతీ ఓమ్నీ వాహనంలోనికి షిఫ్టు అయ్యారు. మెహిదీపట్నం మీదుగా బైక్ కర్నూల్ హైవే రోడ్డు వైపు వెళ్తుండగా గమనించిన మధ్య మండలం డీసీపీ గద్వాల్ ఎస్పీకి సమాచారం అందించారు. ఆయన మానవపాడు, ఉండవల్లి పీఎస్‌లను అప్రమత్తం చేశారు. పుల్లూరు టోల్ ప్లాజా వద్ద ఎస్సైలు పుట్టా మహేష్ గౌడ్, ఎస్సై చంద్రకాంత్ వాహనాన్ని అడ్డుకున్నారు. కారులో ఉన్న మగ శిశువు, నిలోఫర్‌లో కిడ్నాప్‌నకు గురైన శిశువు ఒక్కటేనని ధృవీకరించుకున్న తర్వాత శిశువును విచారణాధికారిగా ఉన్న నాంపల్లి ఎస్సై సాయి కుమార్‌కు అప్పగించారు. నిందితులను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. కిడ్నాప్ కేసును చేధించిన నాంపల్లి ఇన్‌స్పెక్టర్ అప్పల నాయుడు, డీఐ ఎం.సైదేశ్వర్, సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ పి.రాఘవేందర్, ఎస్సైలు సాయి కుమార్, డి.శాంతికుమార్, పి.ప్రదీప్, కానిస్టేబుల్స్ నాగరాజు, సాగర్, రవి వర్మ, దీపక్‌లను ఉన్నతాధికారులు అభినందించారు.



శిశువును తల్లికి అప్పగిస్తున్న ఏసీపీ సంజయ్‌కుమార్

సం'జాయ్'కుమార్!



2017 అక్టోబర్‌లో..

సాక్షి, సిటీబ్యూరో: ఈ ఫొటోల్లో కనిపిస్తున్న పోలీసు అధికారి పేరు ఆర్.సంజయ్‌కుమార్. మొదటి ఫొటో ఆయన నాంపల్లి ఠాణా ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన 2017 అక్టోబర్ నాటిదైతే.. రెండోది సైఫాబాద్ ఏసీపీగా (నాంపల్లి ఠాణా కూడా ఈ డివిజన్‌లోనిదే) ఉండగా ఆదివారం (24 నవంబర్ 2024) తీసింది. నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్నారుల కిడ్నాప్ ఉదంతాలు ఎక్కువగా నమోదవుతూ ఉంటాయి. నిలోఫర్ ఆస్పత్రి, పబ్లిక్‌గార్డెన్స్, నాంపల్లి రైల్వేస్టేషన్ తదితరాలు దీని పరిధిలో ఉండటమే దీనికి కారణం. అప్పట్లో నాంపల్లి ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న సంజయ్‌కుమార్ ఆ ప్రాంతంలోని ఫుట్‌పాత్‌పై పడుకున్న తల్లి ఒడి నుంచి కిడ్నాపైన ఫయాజ్ ఖాన్‌ను (4 నెలలు) 15 గంటల్లో కాపాడారు. శనివారం నిలోఫర్ ఆస్పత్రి నుంచి అపహరణకు గురైన నెల రోజుల వయసున్న బాబును ఆదివారం తల్లి ఒడికి చేర్చారు. రెండు సందర్భాల్లోనూ తల్లి చేతికి చిన్నారులను అందిస్తుండగా కెమెరా కళ్లకు చిక్కిన అరుదైన దృశ్యాలివీ. 2017 నాటి ఫొటో అప్పట్లో వైరల్‌గా మారి జాతీయ స్థాయిలో మీడియాను ఆకర్షించింది.

సదరన్ ట్రావెల్స్ హంగామా!

దేశీయ, విదేశీ పర్యాటకులకు మెగా ఆఫర్లు



సాక్షి, సిటీబ్యూరో: పర్యాటక రంగంలో ప్రముఖ సంస్థల్లో ఒకటైన సదరన్ ట్రావెల్స్ భారీ ఆఫర్లతో ముందుకొచ్చింది. ట్రావెల్ హంగామా సేల్‌-2024 పేరుతో నవంబర్ 22 నుంచి ఈ ఆఫర్లను ప్రారంభించినట్లు సంస్థ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సేల్ సమయంలో దేశీయ, అంతర్జాతీయ టూర్ ప్యాకేజీలపై డిస్కౌంట్స్ అందజేస్తున్నామన్నారు. అలాగే ఆకర్షణీయమైన బహుమతులు కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్నేషనల్, డొమెస్టిక్ హాలిడే ప్యాకేజీలపై గరిష్ఠంగా రూ.70 వేల క్యాష్ డిస్కౌంట్ ఆఫర్లు ఇస్తున్నామని 2,500కు పైగా ఎక్కువ అంతర్జాతీయ, దేశీయ ప్యాకేజీ టూర్లపై భారీ తగ్గింపు ఉందని సదరన్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ మోహన్ తెలిపారు.

రూ.6.69 లక్షల హవాలా నగదు పట్టివేత

సుల్తాన్‌బజార్: అక్రమంగా హవాలా నగదును తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి రూ.6.69 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ శంకర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాంపల్లి రిసాలాబుల్లాకు చెందిన సంజయ్‌కుమార్ మహాంకారి, సుల్తాన్‌బజార్‌కు చెందిన బీమార్ బాయ్ దేవుజీబాయ్ రాజ్‌పుత్, అర్జున్‌బాయ్ చందాజీ రాజ్‌పుత్ ఆదివారం సుల్తాన్ బజార్ రాయల్ ప్లాజా ఎదురుగా నల్లటి బ్యాగుతో అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో సుల్తాన్‌బజార్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకునేందుకు యత్నించగా తప్పించుకుని పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో ఏసీపీ శంకర్, డీఎస్ఐ నరేష్ వారిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. బ్యాగ్‌ను సోదా చేయగా నుండి రూ.6.69 లక్షల నగదు లభ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నగదును ఐటీశాఖ అధికారులకు అప్పగించారు.

హెరాయిన్ విక్రేతల అరెస్ట్

కీసర: హెరాయిన్ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను కీసర పోలీసుల ప్రత్యేక బృందం ఆదివారం అరెస్ట్ చేసింది. సీఐ వెంకటయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన శతానా రామ్, జగదీష్ కీసర మండల పరిధిలోని బండ్లగూడ, ఠాకూర్‌నగర్‌లో నివసిస్తున్నారు. వీరు ఇరువురు బండ్లగూడలోని ఠాకూర్ పరంధామ్ కాలనీ వద్ద హెరాయిన్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన కమలేష్, రాజస్థాన్‌లోని బార్మేర్ జిల్లాకు చెందిన దినేష్ కళియన్ వీరికి సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. వారి నుంచి 10 గ్రాముల హెరాయిన్, బైక్, 4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రేన్ ఢీకొని సైకిలిస్టు మృతి



భాస్కర్ (ఫైల్)

కుషాయిగూడ: క్రేన్ అదుపుతప్పి ఢీ కొట్టడంతో సైకిలిస్టు మృతిచెందిన సంఘటన ఆదివారం చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.చిన్న చర్లపల్లికి చెందిన డొంతుకుర్తి భాస్కర్ ఆదివారం ఉదయం సైకిల్‌పై కిరాణ దుకాణానికి వెళ్లి తిరిగి వస్తుండగా జడ్‌పీహెచ్‌ఎస్ స్కూల్ సమీపంలో ఎదురుగా వస్తున్న క్రేన్ అదుపు తప్పి అతడిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో భాస్కర్ అక్కడిక్కడే మృతిచెందాడు. డ్రైవర్ అజాగ్రత్త కారణంగానే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి



దేవేందర్ మృతదేహం

మేడ్చల్‌రూరల్: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ చక్రాల కింద పడి డ్రైవర్ మృతిచెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లాకు చెందిన గావులపల్లి దేవేందర్ (50), ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం అతను ట్రాక్టర్‌పై మునీరాబాద్ గ్రామ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు సర్వీసు రోడ్డుకు వచ్చాడు. ఈ క్రమంలో తనకు తెలిసిన వ్యక్తికి చెందిన ట్రాక్టర్ ఆగిపోయి ఉండటంతో అక్కడికి వెళ్లిన దేవేందర్ ట్రాక్టర్‌ను ఆన్ చేసే క్రమంలో ట్రాక్టర్ మధ్యలో నిల్చొని ఆన్ చేయడంతో గేర్‌లో ఉన్న ఇంజిన్ స్టార్ట్ అయ్యి ఒక్కసారిగా ముందుకు కదిలింది. దేవేందర్ కింద పడిపోగా చక్రాలు అతడి మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనలో ట్రాక్టర్ ముందుకు ఉన్న రెండు బైక్‌లు ధ్వంసమయ్యాయి. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త కళ్ల ముందే భార్య దుర్మరణం



సిప్రారాణి త్రిపాఠి (ఫైల్)

జీడిమెట్ల: భార్యాభర్తలు షాపింగ్‌కు వెళ్తుండగా వేగంగా వచ్చిన మినీ లారీ వారు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీ కొట్టడంతో భర్త కళ్లెదుటే భార్య మృతి చెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నాయుడు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజీవ్‌గాంధీ నగర్, మోడీ ఎలిగెన్స్‌లో నివాసంఉంటున్న నాగరాజు, సిప్రారాణి త్రిపాఠి(28) దంపతులు శనివారం రాత్రి షాపింగ్ నిమిత్తం రంగా భుజంగా పైప్‌లైన్ రోడ్డు మీదుగా సుచిత్ర వైపు వెళ్తున్నారు. రంగా భుజంగా సినిమా థియేటర్ సమీపంలో వెనుకనుంచి వచ్చిన మినీ లారీ వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో నాగరాజు ఎడమువైపునకు పడిపోగా అతడి భార్య సిప్రారాణి(28) కుడి వైపు కింద పడింది. సిప్రారాణి తలపై నుంచి లారీ వెనుక టైరు వెళ్లడంతో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఎస్సై నాయుడు ఘటనస్థలికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్ రాజుపై కేసు నమోదు చేశారు.



ఆకట్టుకున్న నేవీ బ్యాండ్

గచ్చిబౌలి: వివిధ భాషల్లో కొనసాగిన నేవీ బ్యాండ్ అందరినీ ఆకట్టుకుంది. ఆదివారం రాత్రి కొత్తగూడ, శరత్ సిటీ క్యాపిటల్ మాల్‌లో ఇంటర్నేషనల్ నేవీ డే ను పురస్కరించుకుని వైజాగ్ ఈస్టర్న్ నావల్ కమాండ్ బృందం నావల్ బ్యాండ్ మ్యూజికల్ నైట్ నిర్వహించారు. లెఫ్టినెంట్ కమాండర్ పద్మనాభం పర్యవేక్షణలో బ్యాండ్ నిర్వహించారు. వివిధ భారతీయ భాషల్లో పలు వాయిద్యాలతో నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. గీత గోవిందం సినిమాలోని ఇంకేం ఇంకేం ఇంకేం కావాలి పాటతో ఆహూతులను ఉర్రూతలూగించారు. నేవీపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఏటా నగరంలో నావల్ బ్యాండ్ నిర్వహిస్తున్నారు. ఈ బృందవంలో మొత్తం 39 మంది సభ్యులు ఉన్నారు. వారాంతం కావడంతో శరత్ సిటీ క్యాపిటల్‌కు వచ్చిన వందలాది మంది ఈ ప్రదర్శనను తిలకించారు.




ఓయూ ప్రవేశ ద్వారాల మూసివేత సమయం పెంపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోకి ప్రవేశానికి రాత్రి సమయాన్ని 9 గంటల వరకు పొడిగించారు. ఎన్‌సీసీ గేటు, ఓయూ పోలీస్ స్టేషన్ ఎదుట గల ప్రవేశ ద్వారాలను రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంచనున్నారు. ఓయూ ప్రవేశ ద్వారాలతో పాటు హబ్సిగూడ వైపు గల గేటును తెరవాలని వీసీ ప్రొ.కుమార్ తీసుకున్న నిర్ణయానికి ఓయూ రిసేర్చ్ స్కాలర్ వలిగొండ నరసింహ కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఈడీ, ఎంపీఈడీ చివరి విడత సీట్ల కేటాయింపు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ వర్సిటీల పరిధిలోని కాలేజీల్లో ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో సీట్లు సాధించిన విద్యార్థుల చివరి విడత జాబితాను విడుదల చేశారు. టీజీపీజీఈటీ-2024 కౌన్సెలింగ్‌లో భాగంగా ఎంఈడీలో 819 అభ్యర్థులకు, ఎంపీఈడీలో 340 మంది అభ్యర్థులకు సీట్లను కేటాయించినట్లు కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులు ఈ నెల 26 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలన్నారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



ఆంజనేయులు మృతదేహం

నాగోలు: బీటెక్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.నాగర్ కర్నూల్ జిల్లా ఎడ్లా తాడూర్‌కు చెందిన ఆంజనేయులు(20) ఇబ్రహీంపట్నం సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ 3 వ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 14న అతడి అన్న రమేష్ పని నిమిత్తం తన స్వగ్రామానికి వెళ్లాడు. ఆదివారం ఉదయం తిరిగి సెంట్రల్ బ్యాంక్ కాలనీలో ఇంటికి వచ్చాడు. ఇంటి తలుపు కొద్దిగా తెరిచి ఉండటాన్ని గుర్తించిన రమేష్ లోపలికి వెళ్లి చూడగా అతని సోదరుడు ఆంజనేయులు చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. రమేష్ ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులకు మహిళ బెదిరింపులు

- భర్త నుంచి కారు, నగదు ఇప్పించాలని డిమాండ్
- అంగీకరించకపోవడంతో పోలీసులపై ఆరోపణలు

లింగోజిగూడ: తన భర్త వద్ద ఉన్న కారు బంగారు, నగదును ఇప్పించాలని పోలీసులను కోరిన మహిళ అందుకు వారు నిరాకరించడంతో పోలీసులపైనే బెదిరింపులకు పాల్పడిన సంఘటన హయత్‌నగర్ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళ్తే హయత్‌నగర్, మునగనూర్‌లో నివాసం ఉంటున్న కాటమోని పావని తన మొదటి భర్త గోపీతో విడాకులు తీసుకుని ఐదేళ్ల క్రితం కర్నూలుకు చెందిన గోరుకంటి శ్రీకాంత్‌ను రెండో వివాహం చేసుకుంది. శ్రీకాంత్ స్థానికంగా పురోహితం చేస్తుండగా, పావని జూనియర్ లాయర్‌గా పని చేసేది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో గత నెలలో శ్రీకాంత్ ఇంటి నుంచి వెళ్లి పోయాడు. దీంతో పావనీ మీర్‌పేట పోలీస్టేషన్‌లో తన భర్త తన నుంచి దూరంగా వెళ్లిపోయాడని అతడి తల్లి పద్మ పేరున ఉన్న కారుతో పాటు బంగారం, నగదు తనకు ఇప్పించాలని ఫిర్యాదు చేసింది. సివిల్ కేసు కావడంతో తమ పరిధిలోకి రాదని పోలీసులు తేల్చి చెప్పారు.దీంతో ఆమె గత నెల 16న తన భర్త కనిపించడం లేదంటూ హయత్‌నగర్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శ్రీకాంత్ కర్నూలులో ఉన్నట్లు గుర్తించి అతడిని పోలీస్టేషన్‌కు తీసుకొచ్చారు. అతను పావనీతో ఉండడం ఇష్టం లేదని చెప్పడంతో వదిలేశారు. దీంతో ఆమె అతడి వద్ద ఉన్న కారు, బంగారం, నగదు ఇప్పించాలని కోరడంతో వారు కారు, కొంత నగదును ఇప్పించారు. అయినా సంతృప్తి చెందని పావని బంగారం మరింత నగదు కోసం డిమాండ్ చేయడంతో అది తమ పని కాదని సివిల్ తగదాలు కోర్టులో తేల్చుకోవాలని చెప్పారు. దీంతో ఆమె ఈ నెల 23న హయత్‌నగర్ పోలీస్టేషన్‌లో తన భర్త శ్రీకాంత్, అతని సోదరుడు దుర్గప్రసాద్‌తో కలిసి వేధింపులకు గురి చేస్తున్నారని, దుర్గప్రసాద్ తనను లైంగికంగా వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది.

ఎస్ఐపై ఆరోపణలు

పావనీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన ఎస్ సైదులు కేసు వివరాలు తెలుసుకునేందుకు తన ఫోన్ నెంబర్ తీసుకుని వేధింపులకు పాల్పడుతున్నాడని, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని ఆమె ఆరోపణలు చేయడంతో పాటు సీపీకి ఫిర్యాదు చేసినట్లు సామాజిక మధ్యమాల్లో వార్త సంచలనమైంది.

మా పరిధి కాదన్నందుకే..

సివిల్ తగదాలు తాము పరిష్కరించమని, కోర్టులో తేల్చుకోవాలని చెప్పడంతోనే పావనీ ఎస్ఐ సైదులుతో పాటు తమపై అసత్య ఆరోపణలు చేస్తుందని హయత్‌నగర్ సీఐ నాగరాజ్‌గౌడ్ అన్నారు.పావని ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు.

రాంగ్ పార్కింగ్ చేస్తే వీల్ క్లాంప్స్

నిర్దేశిత స్థలంలోనే పార్కింగ్ చేసుకోవాలి : ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్



రాంగ్ సైడ్ పార్క్ చేసిన కారుకు వీల్ క్లాంప్స్ వేస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసు

బంజారాహిల్స్: నో పార్కింగ్ జోన్‌లో అక్రమంగా పార్కింగ్ చేస్తూ ట్రాఫిక్ జాంలకు కారణమవ్వడమే కాకుండా నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహన యజమానులకు ట్రాఫిక్ పోలీసులు భారీగా జరిమానాలు విధిస్తున్నారు. కొంతమంది రాంగ్ పార్కింగ్‌లు, ఇంకొందరు వెనుక వచ్చే వాహనాలకు అభ్యంతరాలు కలిగించడం తదితర నిబంధనలు ఉల్లంఘించిన వారిని ట్రాఫిక్ పోలీసులు ఏమాత్రం ఉపేక్షించడం లేదు. దీనిలో భాగంగానే నిబంధనలు ఉల్లంఘించి నో పార్కింగ్ జోన్‌లోనూ, రోడ్ల పక్కన వాహనాలు నిలిపితే వాటికి వీల్ క్లాంప్స్ వేస్తున్నారు. సదరు వాహన డ్రైవర్ ఆ కారుకు వేసిన వీల్ క్లాంప్స్ చూసుకుని సమీపంలోని ట్రాఫిక్ పోలీసులను సంప్రదించాల్సి ఉంటుంది. వీరికి రూ.500ల నుంచి రూ.1000 దాకా జరిమానా విధిస్తున్నట్లు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ప్రతిరోజూ 10 నుంచి 12 వరకు ఇలా అక్రమ పార్కింగ్ చేసిన కార్లకు వీల్ క్లాంప్స్ వేస్తున్నామని ఆయన తెలిపారు. ట్రాఫిక్‌కు అడ్డంకులు సృష్టిస్తూ ఇష్టానుసారంగా కార్లు పార్కింగ్ చేస్తే ట్రాఫిక్ స్తంభించిపోతుందని, నిర్దేశిత ప్రాంతంలోనే కార్లను పార్కింగ్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఎక్కడెక్కడ వాహనాలు పార్కింగ్ చేసుకోవాలో పార్కింగ్ జోన్లు ఏర్పాటు చేసుకోవాలని, నో పార్కింగ్ జోన్ ఉన్నచోట పార్కింగ్ చేస్తే మాత్రం వాహనదారులకు తిప్పలు తప్పవన్నారు. వీల్ క్లాంప్స్ వేస్తే సదరు వాహనదారుడికి చాలా సమయం వృథా అవుతుందన్నారు. ఇలా కాకుండా ఉండాలంటే సక్రమంగా పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. అక్రమ పార్కింగ్‌దారులకు భారీగా జరిమానాలు ఉంటాయని వెల్లడించారు. ప్రతి రోజూ రాంగ్ పార్కింగ్‌లపై తమ పోలీసులు నిఘా పెడుతుంటారని చెప్పారు.

తుది దశకు కుటుంబ సర్వే

- ఖైరతాబాద్‌లో 76 శాతం పూర్తి
- ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు
- మరో మూడు రోజుల్లో పూర్తవుతుందంటున్న అధికారులు



సమగ్ర కుటుంబ సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లు



పత్రాలను కంప్యూటీకరిస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే తుది దశకు చేరింది. ఈ నెల 9వ తేదీన ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వే ఈ నెల 24 నాటికి 76 శాతం పూర్తయ్యింది. మరో మూడు రోజుల్లో పూర్తి కానుంది. నియోజకవర్గంలో మొత్తం 800 బ్లాక్‌లు ఏర్పాటు చేసిన అధికారులు 800 మంది ఎన్యుమరేటర్లను, 70 మంది పర్యవేక్షకులు 800 బ్లాక్‌ల్లో 16 రోజులుగా సర్వే చేస్తున్నారు. ఈ నెలాఖరులోగా సర్వే పూర్తవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. నియోజకవర్గంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో 80 వేలకు పైగా కుటుంబాలు ఉండగా ఇప్పటి వరకు 65 వేల కుటుంబాల సర్వే పూర్తయ్యింది.

ప్రణాళికతో ముందుకు..

ఖైరతాబాద్‌లో సమగ్ర సర్వేను అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ప్రారంభంలో గట్టి సవాళ్లు ఎదురుకాగా వాటిని ఒకట్రెండు రోజుల్లోనే ఎదుర్కొని ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగారు. మొదటి రెండు రోజులు ఎన్యుమరేటర్లు తీవ్ర ఒత్తిడికి గురైనా గత రెండు వారాల నుంచి ముమ్మరంగా సర్వే చేస్తున్నారు. చాలామంది ప్రారంభంలో సహకారం అందించకపోవడంతో ఎన్యుమరేటర్లు కొంత ఇబ్బందికి గురయ్యారు. ప్రముఖులు కూడా తమ వివరాలు అందజేస్తుండడంతో సాధారణ, మధ్య తరగతి ప్రజలకు కూడా సర్వేపై భరోసా ఏర్పడి ఇప్పుడిప్పుడే ఇంటికి వచ్చిన ఎన్యుమరేటర్లకు సమగ్ర కుటుంబ వివరాలు అందజేస్తున్నారు.

కంప్యూటర్‌లో నమోదు...

ఒకవైపు సమగ్ర సర్వే జరుగుతుండగానే మరోవైపు ఇప్పటివరకు సేకరించిన వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు. వివరాల దరఖాస్తులను షేక్‌పేట నారాయణమ్మ కాలేజీలో భద్రపర్చగా కంప్యూటర్‌లో నమోదు ప్రక్రియ ఖైరతాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 కార్యాలయంలో చేపడుతున్నారు. ఈ కార్యాలయ డేటా ఎంట్రీ ఆపరేటర్లు వివరాలను నమోదు చేస్తున్నారు. తాజాగా సర్వే పూర్తి కావస్తుండడంతో ఆపరేటర్లను, సహాయకులను నియమించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సర్వే పత్రాలను పెట్టెల్లో భద్రపరుస్తున్నారు. గత మూడు రోజుల నుంచి పూర్తయిన సర్వే వివరాలను ఆపరేటర్లు కంప్యూటీకరిస్తున్నారు.

తాగటానికి కాదు కదా.. కనీసం వాడుకోలేము..!

ఎన్బీటీనగర్‌లో కలుషిత నీటి సరఫరా



ఎన్బీటీ నగర్‌లో నల్లాలో వచ్చిన రంగుమారిన నీళ్లు

బంజారాహిల్స్: రంగు మారి, దుర్గంధభరితమైన నీళ్లు సరఫరా అవుతున్నాయని నెలల తరబడి మొత్తుకుంటున్నా జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఎన్బీటీ నగర్ బస్తీవాసులు మండిపడుతున్నారు. బంజారాహిల్స్ రోడ్‌నెం.12లోని ఎన్బీటీ నగర్ బస్తీలో ప్రభుత్వ పాఠశాల దాటిన తర్వాత ఉన్న నివాసాలకు గత నాలుగైదు నెలలుగా రంగుమారిన నీళ్లు వస్తున్నాయని, నీళ్ల నుంచి వచ్చే వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ఈ సమస్యను స్థానికంగా ఉన్న సిబ్బందితో పాటు అధికారులకు కూడా తెలియజేశామని అయినా కూడా సమస్య పరిష్కారం కావడం లేదంటూ వారు వాపోతున్నారు. ఈ నీళ్లు కనీసం వాడుకోవడానికి కూడా పనికి రావడం లేదని ఇప్పటికైనా శాఖ ఉన్నతాధికారులు స్పందించి కలుషిత నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల్లో 40 దరఖాస్తులు

ఆన్‌లైన్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చు : ప్రశాంతి



ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల్లో దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

బంజారాహిల్స్: ప్రత్యేక సవరణ కార్యక్రమం కింద ఓటరు జాబితా (స్పెషల్ సమ్మరీ రివిజన్)-2025లో భాగంగా ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని 245 పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక సవరణలో భాగంగా గత నెల 29న ముసాయిదా జాబితా వెలువరించారు. శని, ఆది వారాల్లో అర్హులైన వారు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఈ శిబిరాలు ఏర్పాటు చేశారు. కొత్తగా ఓటరు నమోదు కోసం ఫారం-6, అభ్యంతరాలకు ఫారం-7, మార్పులు, చేర్పుల కోసం ఫారం-8 భర్తీ చేసి బీఎల్‌ఓలకు అందజేశారు. ఈ మూడు కేటగిరిల్లో రెండు రోజుల్లో మొత్తం 40 దరఖాస్తులు అందాయని నియోజకవర్గ ఎన్నికల అధికారిణి ప్రశాంతి తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఓటు నమోదు, పేరు ఉందో లేదో చూసుకునేందుకు ఆన్‌లైన్ విధానంలో సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. నేషనల్ ఓటర్స్ సర్వీస్ పోర్టల్‌ను సందర్శించవచ్చన్నారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదుకు అర్హులని ఆమె వెల్లడించారు. కొత్తగా ఓటరు నమోదు కోసం ఈ నెల 28 వరకు అవకాశం కల్పించారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై చర్చించాలి



అభివాదం చేస్తున్న జేఏసీ నాయకులు

పంజగుట్ట: రాబోయే శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విషయంపై చర్చించి సమాన పనికి సమాన వేతనం కల్పించాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సుమారు 30 ప్రభుత్వ, ప్రభుత్వరంగ శాఖల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘాల యూనియన్ ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు ఒకే వేదికపై వచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు, డిమాండ్లు సాధించుకునేందుకు ఉమ్మడి కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు పులి లక్ష్మయ్య, నరసింహ, ఈశ్వర్‌రావులు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో చైతన్యం కల్పించేందుకు త్వరలోనే జిల్లా, మండల స్థాయి కమిటీలు వేయాలని తెలిపారు. ఏజెన్సీ విధానం రద్దు, గ్రూప్ 4 నియామకాల ద్వారా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులను కలిసి వినతి పత్రాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కృష్ణారెడ్డి, దుర్గం శ్రీనివాస్, యాదగిరి, శంకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులపాటు మెగా వైద్య శిబిరం

600 మందికి పైగా వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బంజారాహిల్స్: టీఎంటీడీఏయూ (తెలంగాణ మూవీ, టీవీ, డిజిటల్ ఆర్టిస్టుల యూనియన్) ఆధ్వర్యంలో చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో యూసుఫ్‌గూడ మాగ్నాడ్ ఆస్పత్రి మద్దతుతో మూడు రోజుల పాటు మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 600 మందికి పైగా పాల్గొని వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మొదటి రోజు ప్రత్యేక అతిథిగా తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, డైరెక్టర్ వీర్ శంకర్ హాజరయ్యారు. రెండో రోజు కార్మిక శాఖ కమిషనర్ గౌతమిదాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రభుత్వం నుంచి వస్తున్న సౌకర్యాలన్నింటినీ కళాకారులకు అందిస్తామని చెప్పారు. అలాగే కళాకారులకు ఈశ్రమ్ కార్డ్స్ విషయంలో కూడా పూర్తిగా సహకరిస్తామని హామీనిచ్చారు. మూడో రోజు 24 క్రాఫ్ట్స్‌లో గల ఇతర యూనియన్ సభ్యులు సుమారు 300 మందికి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి కళాకారులకు ఏ రకమైన సహకారం కావాలన్నా సాంస్కృతిక శాఖ తరుపున అందిస్తామని తెలిపారు. ఇలాంటి వైద్య సదుపాయాలను కల్పిస్తూ కళాకారులకు అండదండగా ఉంటున్న తెలంగాణ మూవీ, టీవీ, డిజిటల్ ఆర్టిస్టుల యూనియన్ గౌరవ అధ్యక్షుడు పృథ్వీరాజ్ మెగా హెల్త్ క్యాంపును నిర్వహించిన యూనియన్ అధ్యక్షుడు రాజశేఖర్‌ను అభినందించారు. ఈ వైద్య శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ మాధవి, స్వామినాయుడు సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రాజశేఖర్, జనరల్ సెక్రటరీ నూకరాజు, ఉపాధ్యక్షులు నందూరి రాము, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆశ, కోశాధికారి ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కేపీరెడ్డి, జాయింట్ సెక్రటరీ రజని, శ్రీకళ, ఈసీ సభ్యులు మాధురి, పద్మ, మోహన్‌రావు, సౌదమిని, సత్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చెలిమెల రాజేశ్వర్

కాచిగూడ: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జీవపరిణామ సిద్ధాంత ప్రచారోద్యమం పోస్టర్‌ను ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు చెలిమెల రాజేశ్వర్, డాక్టర్ దాసరి ప్రసాదరావు, ప్రొఫెసర్ ఎ.రాంచంద్రయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కట్టా సత్య ప్రసాద్ రచనలో జనవిజ్ఞాన వేదిక ప్రచురించిన 'దాచేస్తే దాగని సత్యం జీవ పరిణామం' పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి రాజా, సీసీఎంబీ సైంటిస్ట్ యు.ఆదిత్య, రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

వెంగళరావునగర్: యువతి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... యూసుఫ్‌గూడకు చెందిన ఓ వ్యక్తికి ఇంటర్ చదివే కుమార్తె ఉంది. ఆమె రెండేళ్లుగా ఎస్‌పీఆర్‌హిల్స్‌లోని ఓ బస్తీలో ఉండే ఆమె అత్త వద్ద ఉంటూ విద్యనభ్యసిస్తుంది. ఈనెల 19న యువతి ఫోన్‌లో మాట్లాడుతుండగా తండ్రి ఎవరని ప్రశ్నించాడు. తన స్నేహితుడితో మాట్లాడుతున్నట్లు బదులిచ్చింది. దీంతో యువతి తండ్రి అతనితో మాట్లాడ వద్దని హెచ్చరించాడు. యువతి మాత్రం అతడిని ప్రేమిస్తున్నానని, పెళ్లి కూడా చేసుకుంటానని చెప్పింది. ఈ క్రమంలో ఈనెల 23వ తేదీ ఉదయం యువతి తన అత్తకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం తండ్రి, బంధువులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. తన కుమార్తె కనిపించకుండా పోవడంలో ప్రతాప్‌యాదవ్ ప్రమేయం ఉందని అనుమానం వ్యక్తం చేస్తూ యువతి తండ్రి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యనగర్‌లో మహాపడి పూజ



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: అయ్యప్ప స్వామి కృపతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఆకాంక్షించారు. ఎస్పీఆర్‌హిల్స్‌లోని ఆరోగ్యనగర్‌లో ఆదివారం అయ్యప్ప భక్తులు ఏర్పాటు చేసిన మహాపడిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కఠినతరమైన దీక్షలు బూనిన అయ్యప్ప భక్తులకు మణికంఠుని దివ్యాశీస్సులు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు పాల్గొన్నారు.

ఆయుష్ డైరెక్టర్‌ను కలిసిన టీవైఎస్‌ఏ నేతలు



ఆయుష్ డైరెక్టర్‌తో టీవైఎస్‌ఏ నేతలు

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణా ఆయుష్ డైరెక్టర్ చిట్టెం లక్ష్మిని ఆదివారం పతంజలి యోగా సమితి, తెలంగాణా యోగాసనాల స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో ఇటీవల చేపట్టిన వెల్‌నెస్ సెంటర్లలో యోగా ఇన్‌స్ట్రక్టర్ నియామకాల సమయంలో జరిగిన పొరబాట్లను సవరించాలని ఆమెను కోరారు. దీనికి స్పందించిన ఆయుష్ డైరెక్టర్ రానున్న పది రోజుల్లో మిగిలిపోయిన 241 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలియజేశారు. రాష్ట్రంలోని యోగా టీచర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆయుష్ డైరెక్టర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ కార్యదర్శి నందనం కృపాకర్, యోగా రామిరెడ్డి, తోట సతీష్ తదితరులు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం



నగేష్ (ఫైల్)

బంజారాహిల్స్: కుటుంబ సభ్యులతో గొడవ పడి తన స్నేహితుడి వద్దకు వెళ్లిన ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో అదృశ్యమైన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... కూకట్‌పల్లి ఎల్లమ్మబండ మహాత్మాగాంధీనగర్‌లో నివసించే ఎస్.నగేష్ (38) ప్రైవేటు ఉద్యోగి కాగా, గత ఏడాది మార్చి 22వ తేదీన కుటుంబ సభ్యులతో గొడవ పడి బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని మినిస్టర్స్ క్వార్టర్స్ వద్ద నివసించే తన స్నేహితుడి వద్దకు వెళ్లాడు. అయితే 23వ తేదీన తెల్లవారుజామున స్నేహితుడికి చెప్పకుండానే బయటకు వెళ్లిపోయాడు. రోజులు గడిచినా నగేష్ జాడ లేకపోవడంతో అదే ఏడాది ఆగస్టు 11వ తేదీన నగేష్ సోదరుడు సంతోష్ శంకర్ బంజారా హిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు నగేష్ కోసం గాలింపు చేపట్టారు. నెలలు గడుస్తున్నా ఆచూకీ మాత్రం లభించకపోవడంతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 8712660458 నెంబర్‌లో సంప్రదించాలని బంజారాహిల్స్ ఎస్‌ఐ రవీందర్ తెలిపారు.

మాలల సింహ గర్జనను విజయవంతం చేయాలి

గొనెల రమేశ్ మాల



రహమత్‌నగర్: హైద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో డిసెంబర్ 1న జరిగే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు గ్రేటర్ హైద్రాబాద్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గొనెల రమేశ్ మాల కోరారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మాలల గర్జన సభకు ప్రతి మాల కులస్తుడు పాల్గొనాలని కోరారు. ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన రహమత్‌నగర్ డివిజన్‌లో పర్యటించి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ రాజ్యాధికారం చేజారకుండా ఉండేందుకు కొన్ని పార్టీ దళితులను విభజించి పాలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, వారి ప్రయత్నాలకు ప్రతీ మాల కులస్తుడు తిప్పికొట్టాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చి తీర్పును జాతీయ స్థాయిలోని అన్ని పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని గుర్తుచేశారు. మాలలపై జరుగుతున్న కుట్రకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న జరిగే గర్జన సభకు హైద్రాబాద్ నగరం నుంచి మాల సోదర, సోదరిమణులు, మేధావులు, విద్యార్థులు అత్యధికంగా సంఖ్యలో హాజరై తమ సత్తా చాటాలని కోరారు. ఇందుకు సంబంధించి త్వరలోనే రహమత్‌నగర్‌లో సభను ఏర్పాటు చేయడం జరుగుతుందని రమేశ్ ప్రకటించారు.

ఆక్యుపంక్చర్‌కు కేంద్ర ప్రభుత్వం గుర్తింపు

రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్



వేడుకలను ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్ తదితరులు

ఖైరతాబాద్: ఆక్యుపంక్చర్ విధానానికి కేంద్ర ప్రభుత్వం గుర్తింపు ఇచ్చిందని రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ప్రపంచ ఆక్యుపంక్చర్ డే వేడుకలను ఆదివారం ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో తెలంగాణ ఆక్యుపంక్చర్ ఆక్యుప్రెషర్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా కె.లక్ష్మణ్ హాజరై మాట్లాడుతూ ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా చికిత్సలు అందించే విధానం ఆక్యుపంక్చర్‌కు ఉందన్నారు. ఈ విధానంపై ఉన్న అపోహలు తొలగించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్ తెలిపారు. అల్లోపతి విధానంలో కంటే అద్భుతంగా ఈ విధానంలో చికిత్సలు అందించవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం తమ చికిత్సల విధానాన్ని గుర్తించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేసి దీన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా చొరవ తీసుకొని కౌన్సిల్ ఏర్పాటుతో పాటు ఆక్యుపంక్చర్‌ని వైద్య విధానంగా ప్రవేశ పెట్టాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నూతన ప్రాక్టీషనర్లకు చికిత్స పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.ఎస్.సాగర్, కోశాధికారి జి.సుభాష్‌లతో పాటు ఆక్యుపంక్చర్ పూర్తిచేసుకున్న విద్యార్థులు పాల్గొన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలి

లిబర్టీ: పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టకపోతే బీసీలు తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు. ఆదివారం దళ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ సోమవారం నుంచి పార్లమెంటు ఉభయ సభలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించే బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత ఎన్‌డీఏ ప్రభుత్వంపై ఉందన్నారు. రిజర్వేషన్లు కల్పించే బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని అనేక సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా బీసీలు వివిధ రూపాల్లో పోరాటం చేస్తున్నప్పటికీ అధికారంలో ఉన్న పాలకులు బిల్లుకు ఆమోదముద్ర వేయలేక పోయిందని అన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం చట్టసభల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టకపోతే గల్లీస్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు సమరశంఖం పూరిస్తారని ఆయన హెచ్చరించారు.

విద్యాదానంతో జీవితాంతం సంతృప్తి



కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ రామానుజజీయర్ స్వామి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ వాణీదేవి, వెల్లాల రామ్మోహన్ తదితరులు

సనత్‌నగర్: విద్యా దానం ద్వారా జీవితాంతం సంతృప్తిని అందించవచ్చని శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి అన్నారు. బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (బీఎస్ఎస్ఎస్) తెలంగాణ ఆధ్వర్యంలో 120 మంది పేద బ్రాహ్మణ విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లు, మరో 50 మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందజేశారు. సమాఖ్య అధ్యక్షులు వెల్లాల రామ్మోహన్ అధ్యక్షతన ఆదివారం సనత్‌నగర్‌లోని హనుమాన్ దేవస్థానం కళావేదిక ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్వామిజీ మాట్లాడారు. భగవంతుడు మనకిచ్చిన దానిలో ఎంతోకొంత సమాజహితానికి వినియోగించాలన్నారు. దానం తీసుకునేవారు సద్వినియోగం చేసుకున్నప్పుడే ఆ దానానికి సార్థకత ఉంటుందన్నారు. వెల్లాల రామ్మోహన్ తన సొంత ఖర్చుతో 120 మందికి ల్యాప్‌ట్యాప్‌లతో పాటు 50 మందికి స్కాలర్‌షిప్పులు అందజేయడం అభినందనీయమన్నారు. వెల్లాల రామ్మోహన్ మాట్లాడుతూ సమాఖ్య తరుపున భవిష్యత్తులో విభిన్న కార్యక్రమాలను చేపడుతూ బ్రాహ్మణులకు చేయూతనందిస్తామన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

వెంగళరావునగర్: మున్సిపల్ పార్క్, బీఎస్ మక్తా 11కెవీ ఫీడర్లు, ఈఎస్ఐ, కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉ.10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శ్యామలకుంట పార్క్, బీకెగూడ, మున్సిపల్ పార్క్, ఈఎస్ఐ వెనుక, బీఎస్ మక్తా, హుస్సేన్‌నగర్, నిశాంత్‌బాగ్ కాలనీ, హనుమాన్ టెంపుల్, సుభానీ మసీదు, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఆదివారం తెలియజేశారు. అదేవిధంగా టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, శాంతిశిఖర 11కెవీ ఫీడర్లు ఆల్వీన్, కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల వల్ల జెకెకాలనీ, బీఎస్ఎన్ఎల్, సెయింట్ థెరిస్సా హాస్పిటల్, శాంతి శిఖర అపార్ట్‌మెంట్స్, కుందన్‌బాగ్ ఏరియాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని దీనిని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రేవంత్‌రెడ్డిని విమర్శించే హక్కు కేటీఆర్‌కు లేదు

కాచిగూడ: సీఎం రేవంత్ రెడ్డిని నియంత అంటూ విమర్శించే హక్కు కేటీఆర్‌కు లేదని, వారి హయాంలో జరిగిన నిర్బంధాలను ఒకసారి గుర్తు చేసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి రైతుల కోసం పోరాటాలు చేస్తున్నాడని కేటీఆర్ మాట్లాడుతున్నారని, ఇది హాస్యాస్పదంగా ఉందన్నారు. సీతారామపురం హయతాబాద్ భూముల విషయంలో, అసైన్డ్ భూముల విషయంలో ఎన్నో అవకతవకలు జరిగాయని, ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ప్రభుత్వం ఎకరానికి రూ.21 లక్షలు భూపరిహారం ఇస్తే అందులో సగం డబ్బును 'పట్నం పన్ను' కింద దండుకున్నారని ఆరోపించారు. ఈసమావేశంలో బీసీ పొలిటికల్ జేఏసీ సలహాదారుడు బడేసాబ్, నేతలు గాలిగల్ల సాయిబాబా, జెర్రిపోతుల నగేష్, పూల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఖైరతాబాద్: ఖైరతాబాద్ ఓల్డ్‌సీఐబీ క్వార్టర్స్ బ్రైట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సర్వ సభ్య సమావేశంలో అధ్యక్షుడిగా వెల్లూర్ గోపీనాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా గిల్ల గోపాల్, కోశాధికారిగా వివ రాఘవేంద్ర ప్రసాద్‌లను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ బ్రైట్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని, స్థానికంగా ఎలాంటి సమస్యలున్నా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.


మాలల సత్తా చూపాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పంజగుట్ట: డిసెంబర్ 1వ తేదీన జింఖానా గ్రౌండ్స్‌లో జరగనున్న మాలల సింహగర్జనను విజయవంతం చేసి మాలల సత్తా చూపాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ జి.చెన్నయ్య కోరారు. ఆదివారం బాలాపూర బస్తీలో సింహగర్జన పోస్టర్‌ను రాజు ఉస్తాద్, పత్తి ప్రవీణ్, రావుల విజయ్ కుమార్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు ఐక్యంగా ఉండడం చూసి ఓర్వలేని కొన్ని రాజకీయ పార్టీలు దళితుల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు చూస్తున్నారన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు సుప్రీంకోర్టు ధర్మాసనంలో ఎస్సీ వర్గీకరణకు చేసుకోవచ్చునని తీర్పు ఇచ్చేలా ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. అంబేద్కర్ వారసులుగా రాజ్యాంగాన్ని రక్షించుకోవడం, రిజర్వేషన్లు కాపాడుకోవడం ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. మాలల సింహగర్జనకు లక్షలాదిగా తరలివచ్చి మాలల ఐక్యత చాటి, దళితులు కలిసి ఉంటేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.నర్సింగ్‌రావు, మాణిక్ రావు, బిట్ల శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా





'సాక్షి' ఆధ్వర్యంలో స్పెల్ బీ, మ్యాథ్ బీ పోటీలు

• వేదికైన నల్లగండ్ల వికాస్ ఎపిస్టిమో గ్లోబల్ స్కూల్ • పాల్గొన్న 2,500 మంది పాఠశాలల విద్యార్థులు

SAKSHI SPELL Bee 2024-25

విద్యార్థుల్లో ఉల్లాసం, ఉత్సాహం వెల్లివిరిసింది. స్పెల్ బీ, మ్యాథ్ బీ పోటీలకు విద్యార్థులు భారీగా తరలి వచ్చారు. దీనికి శేరిలింగంపల్లి నియోజకవర్గం నల్లగండ్లలోని వికాస్ ఎపిస్టిమో గ్లోబల్ స్కూల్ వేదికగా మారింది. 'సాక్షి'మీడియా ఆధ్వర్యంలో డ్యూక్స్ వెఫీ, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ రాజమండ్రి సహకారంతో ఆదివారం స్పెల్ బీ క్వార్టర్స్ ఫైనల్స్, మ్యాథ్ బీ సెమీఫైనల్స్ పోటీలు జరిగాయి. పోటీలకు నగరవ్యాప్తంగా ఉన్న వివిధ పాఠశాలలకు చెందిన 2,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు ఈ పోటీలను నిర్వహించారు. పెద్దసంఖ్యలో విద్యార్థులు, వారికి తోడుగా తల్లిదండ్రులు రావడంతో వికాస్ ఎపిస్టిమో గ్లోబల్ స్కూల్ ప్రాంగణం సందడిగా మారింది. రెండు పోటీల్లో రౌండ్లవారీగా ఈ పోటీలను నిర్వహించారు. పోటాపోటీగా, వినూత్నంగా సాగిన ఇలాంటి పోటీలను తరచూ నిర్వహించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. – శేరిలింగంపల్లి

SAKSHI MATH BEE 2024-25



SAKSHI – సాక్షి – సాక్షి SAKSHI TV – SAKSHI DIGITAL – MEDIA GROUP

ఇలాంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలి



స్పెల్ బీ, మ్యాథ్ బీ వంటి పోటీలకు తల్లిదండ్రులు, ప్రతి స్కూల్ విద్యార్థులు ప్రోత్సహించాలి. స్కూల్‌వారీగా వారు కూడా ఇలాంటి పోటీలను నిర్వహిస్తే విద్యార్థులకు చాలా ఉపయోగం. స్పెల్ బీ వల్ల కేవలం స్పెల్లింగ్‌లను నేర్చుకోవడమే కాకుండా వకాబులరీ కూడా అభివృద్ధి అవుతుంది. మ్యాథ్ బీలో పాల్గొనడం ద్వారా విద్యార్థులు మ్యాథ్‌లోని వర్క్‌ను స్మార్ట్‌గా , సులభంగా చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. 'సాక్షి' యాజమాన్యం ఇలాంటి పోటీలను చిన్నతనం నుంచే విద్యార్థులకు నిర్వహించడం అభినందనీయం.
– రజిత గోర, కెరియర్ కౌన్సెలర్, హెడ్ ఆఫ్ అడ్మిషన్స్, వికాస్ ఎపిస్టిమో గ్లోబల్ స్కూల్, నల్లగండ్ల

విద్యార్థుల ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్‌కు దోహదం



స్పెల్ బీ, మ్యాథ్ బీ అనేవి విద్యార్థుల ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్‌కు దోహదం చేస్తాయి. చదువుతోపాటు ఇతర అన్ని రంగాల్లో రాణించేలా వికాస్ ఎపిస్టిమో గ్లోబల్ స్కూల్ ద్వారా కృషి చేస్తున్నాం. 'సాక్షి'ఈ కార్యక్రమాలను చేపట్టి విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం. మేం కూడా ఇలాంటి పోటీలను నిర్వహించేందుకు చర్యలు చేపడతాం. 'సాక్షి'ద్వారా మెటీరియల్ కూడా అందించడం ఎంతో ఉపయుక్తంగా మారింది.
– వాణి మర్రి, వైస్ ప్రిన్సిపాల్,వికాస్ ఎపిస్టిమో గ్లోబల్ స్కూల్, నల్లగండ్ల

పరీక్షల నిర్వహణ అభినందనీయం



స్పెల్ బీ, మ్యాథ్ బీ పోటీలను సాక్షి మీడియా చొరవతో నిర్వహించడం అభినందనీయం. ఈ పోటీలతో విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెరగుతుంది. సాక్షి అందజేసిన మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగం.
– కొల్లిపర అలేఖ్య

ఎగ్జామ్స్‌తో విద్యార్థులకు మేలు



స్పెల్ బీ, మ్యాథ్ బీ వంటి పరీక్షలతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. సాక్షి అందించిన మెటీరియల్‌తో ఓన్‌గా ప్రిపేర్ అయి ఎగ్జామ్ రాశారు.
– ప్రేమ్ కుమార్

టీచర్స్ ప్రోత్సాహంతో...



టీచర్స్ ప్రోత్సాహంతో మ్యాథ్ బీ పోటీల్లో పాల్గొన్నాను. ఈ పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల చాలా విషయాలపై అవగాహన ఉంటుంది.
– వైష్ణవి, అక్షర ఇంటర్నేషనల్ స్కూల్

స్పెల్ బీ ఎగ్జామ్ బాగా రాశా..



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ ఎగ్జామ్ బాగా రాశా. సాక్షి అందజేసిన బుక్‌తోపాటు ఇతర వాటిని బాగా ప్రిపేర్ అయ్యాను. నెక్స్ట్ లెవల్‌కు తప్పకుండా వెళ్తా. – మైరా,4వ తరగతి, చిరెక్ స్కూల్

సాక్షి మెటీరియల్ ఉపయోగపడింది



స్పెల్ బీ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నా. ఈ పోటీల్లో బాగా రాసేందుకు సాక్షి మెటీరియల్ ఎంతో ఉపయోగపడింది. వకాబులరీ కూడా డెవలప్ అవుతుంది.
– అక్షర, రాక్‌వెల్ ఇంటర్నేషనల్ స్కూల్

తప్పకుండా ఫైనల్‌కు వస్తా...



సాక్షి స్పెల్ బీ ఎగ్జామ్ బాగా రాశా. మెటీరియల్ బాగా చదివాను. ఆ విషయాలను ఎగ్జామ్‌లో రాశా. ఫైనల్‌కు తప్పకుండా వస్తా.
– ధార్మిక్ సాయిరెడ్డి, గిగ్గిల్స్ ఎన్ విగ్గిల్స్ స్కూల్

మ్యాథ్ బీతో యాక్టివ్‌గా...



మ్యాథ్ బీ పోటీలు బాగా ఉత్సాహాన్ని నింపాయి. ఈ పోటీలతో యాక్టివ్ అయి మ్యాథ్ ప్రాబ్లమ్స్ ఈజీగా చేసేందుకు అవకాశం ఏర్పడింది.
– శంతను, విద్యాంజలి

నాణ్యమైన సేవలు అందించాలి

ల్యాబ్ టెక్నీషియన్లకు సూచించిన ఎమ్మెల్సీ కోదండరామ్



ల్యాబ్ టెక్నీషియన్ల కృతజ్ఞతసభలో పాల్గొన్న ఎమ్మెల్సీ కోదండరామ్

గాంధీఆస్పత్రి: ప్రభుత్వ ల్యాబ్ టెక్నీషియన్లుగా ఎంపికైన వారంతా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి, ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. తెలంగాణ పబ్లిక్ కమిషన్ ద్వారా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగంలో చేరిన ల్యాబ్ టెక్నీషియన్లు సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ ప్రాంగణంలోని అలుమ్నీ భవనంలో ఆదివారం కృతజ్ఞత సభ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండ రామ్, బల్మూరి వెంకట్ హాజరయ్యారు. ఏడేళ్ల నిరీక్షణకు తెర దించుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగ నియామకాలు చేపట్టిందని, ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వారంతా చిత్తశుద్ధి, సమయపాలనతో విధులు నిర్వహించి నిరుపేదలకు మరింత మెరుగైన సేవలు అందించాలని వారు కోరారు. ప్రభుత్వంలో చర్చించి ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

విజేత పెప్సీకో జట్టు



సాక్షి, హైదరాబాద్: స్టాండర్డ్ చార్టెర్డ్ కప్ ఫైవ్-ఎ-సైడ్ హైదరాబాద్ ఎడిషన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పెప్సీకో జట్టు విజేతగా నిలిచింది. టీసీఎస్ జట్టుతో జరిగిన ఫైనల్లో పెప్సీకో జట్టు 2-0 గోల్స్ తేడాతో గెలిచింది. మొత్తం తొమ్మిది జట్లు ఈ టోర్నీలో పాల్గొన్నాయి. ఈ విజయంతో పెప్సీకో జట్టు ముంబైలో జరిగే జాతీయ ఫైనల్స్ టోర్నీకి అర్హత సాధించింది. జాతీయ టోర్నీలో విజేతగా నిలిచే జట్టు ఇంగ్లిష్ ప్రీమియర్ లీగ్‌లో లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్ మ్యాచ్‌ను తిలకించే అవకాశాన్ని దక్కించుకుంటుంది. దశాబ్దకాలంగా లివర్‌పూల్ జట్టుకు స్టాండర్డ్ చార్టెర్డ్ సంస్థ ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది.

26న బీఆర్‌ఎస్ నేతల సమావేశం

సనత్‌నగర్: ఈ నెల 26వ తేదీన ఉదయం 10 గంటలకు తెలంగాణ భవన్‌లో సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గాల స్థాయి బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహిస్తున్నట్లు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదివారం తెలిపారు. ఈ సమావేశానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఆయా నియోజకవర్గాల పరిధిలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు హాజరుకావాలని కోరారు.

ఉమ్రాకు బయలుదేరిన యాత్రికులు



శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 70 మంది యాత్రికులు ఆదివారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఉమ్రా యాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా యాత్రికులకు వారి కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకోవాలని ఆకాంక్షించారు. యాత్రను అల్‌మిజాన్ సంస్థ నిర్వాహకులు ఫయాజ్ అలీ పర్యవేక్షిస్తున్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ ప్రకాష్‌చంద్ర బారోర్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: ఆన్‌లైన్ మోసాలపై ఎస్‌బీఐ ప్రజలను అప్రమత్తం చేస్తోంది. ఆదివారం సుందరయ్య పార్కులో అవగాహన కార్యక్రమం నిర్వహించింది. హైదరాబాద్ సర్కిల్ ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ ప్రకాష్‌చంద్ర బారోర్ మాట్లాడుతూ కొంతమంది నేరస్తులు పదే పదే ఫోన్ చేస్తూ ఆధార్ నెంబర్, బ్యాంక్ అకౌంట్ నెంబర్ చెప్పాలని, ఏదో లబ్ధి చేకూరుతుందని మభ్యపెడుతూ మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. 'మీ కుటుంబ సభ్యులను అరెస్టు చేశారని, స్టాక్స్ ట్రేడింగ్ చేయడం ద్వారా ధనవంతులు అవ్వండని, కస్టమ్స్ వద్ద పార్సిల్ చిక్కుకుందని, మీ పేరు మీద క్రెడిట్ కార్డు జారీ అయిందని, పొరపాటున డబ్బులు బదిలీ అయ్యాయని, కేవైసీ గడువు ముగిసిందని, సులభమైన పద్ధతుల్లో పెద్దమొత్తంలో సంపాదించండని ఫోన్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు, ఇలాంటి సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి'అని ఆయన సూచించారు. ఈ సందర్భంగా క్రెడిట్, డెబిట్ కార్డుల లావాదేవీలు, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ లావాదేవీలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో డీజీఎం సునీల్ గోయల్, ఆర్‌ఎం సంజయ్ కుమార్, రాజేష్, మురళీకృష్ణ, పార్కు అధ్యక్షుడు ఆర్ వివేక్, డాక్టర్ సునీల్, వి.నాగభూషణం, ఎస్.రమేష్‌రెడ్డి, రాజశేఖర్, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రకాష్‌చంద్ర బారోర్

ఒగ్గు కథకు ప్రతీక చుక్కా సత్తయ్య

సిరికొండ మధుసూదనాచారి

చిక్కడపల్లి: తెలంగాణ గడ్డ కళలకు కాణాచి అని, ఎన్నో కళారూపాలు వైభవంగా వెలుగొందిన నేలపై ఒగ్గు కళారూపం అపురూపమైనదని శాసన మండలిలో బీఆర్‌ఎస్ పక్షనేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఒగ్గుకథకు చుక్కా సత్తయ్య ప్రతీక అని కొనియాడారు. శ్రీ త్యాగరాయ గానసభలో జరుగుతున్న 'ఎందరో మహానుభావులు'కార్యక్రమ పరంపరలో భాగంగా 'చుక్కా సత్తయ్య యాదిలో'సమావేశం ఆదివారం జరిగింది. మధుసూదనాచారి మాట్లాడుతూ చుక్కా సత్తయ్యకు అక్షరం ముక్క రాకున్నా జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ఒగ్గు కథను నిలిపారని అన్నారు. ప్రముఖ నటుడు ఎన్టీఆర్‌ను కూడా ఆయన తన ప్రదర్శనతో మెప్పించారని గుర్తుచేశారు. రచయిత్రి శైలజ మిత్ర మాట్లాడుతూ జనగాం ప్రాంతంలోని కుగ్రామ వీధి ప్రదర్శనల నుంచి రేడియో, టీవీ, బీబీసీ స్థాయికి ఎదిగిన చుక్కా సత్తయ్య ఒగ్గు కథా సామ్రాట్ అని కొనియాడారు. కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు వీఎస్ కళా జనార్దనమూర్తి, పీఎస్‌ఆర్ మూర్తి, సంఘ సేవకుడు పి.వెంకటరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుసూదనాచారి

కేంద్ర బలగాలకు సంక్షేమ బోర్డు అవసరం

శ్యాంసుందర్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞానకేంద్రం: కేంద్ర బలగాలకు సంక్షేమ బోర్డు అవసరమని, కార్యాలయం ఏర్పాటు కోసం ప్రభుత్వం స్థలం కేటాయించాలని తెలంగాణ మాజీ కేంద్ర సాయుధ పోలీసు బలగాల సిబ్బంది సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.శ్యాంసుందర్‌రెడ్డి కోరారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ మాజీ కేంద్ర సాయుధ పోలీసు బలగాల సిబ్బంది సంక్షేమ సంఘం వార్షికోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ సైనిక బలగాల పిల్లలకు ఇస్తున్నట్లుగా క్యాప్ కోటాను వర్తింపచేయాలని ప్రభుత్వ ధరలతో ఇళ్లస్థలాలను కేటాయించాలని, ఇంటిపన్ను రద్దు చేయాలని కోరారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబాలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజు, కోశాధికారి ఎన్.వెంకట్‌రెడ్డి, చీఫ్ అడ్వైజర్స్ ఎస్ఎన్ రెడ్డి, భగవంత్, ఉపాధ్యక్షులు వి.శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అమరవీరులు కుటుంబాలను సత్కరిస్తున్న దృశ్యం

ఆసుపత్రి అంటేనే భరోసా

• కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ • మెడికవర్ ఆసుపత్రిలో మెడికోవర్డ్ ఫ్యామిలీ కార్డు ప్రారంభం

మాదాపూర్: ఆసుపత్రి అంటే భయం కాదు, భరోసా అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. అయితే ఈ రోజుల్లో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారని, బిల్లులు భరించలేనంతగా ఉంటున్నాయని విచారం వ్యక్తం చేశారు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో ఆదివారం మెడికోవర్డ్ ఫ్యామిలీ కార్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ ఆసుపత్రిలో చేరినప్పుడు ట్రీట్‌మెంట్‌కు ఎంత ఖర్చవుతుందో చెబుతారని, డిశ్చార్జ్ అయ్యేనాటికి అంతకు ఐదు రేట్లు ఎక్కువ వసూలు చేస్తున్నారని తెలిపారు. 'నాకు తెలిసిన వ్యక్తి తల్లిని ఆసుపత్రికి తీసుకు వచ్చినప్పుడు తొలుత రూ.3 లక్షల ఖర్చు అవుతుందని చెప్పి, ఇప్పుడు రూ.16 లక్షలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. నెల జీతంపై బతికే అతడు అంత కట్టలేక అమ్మను డిశ్చార్జ్ చేయించండని, చనిపోయినా పర్వాలేదు సార్'అని ఏడుస్తూ చెప్పారని పేర్కొన్నారు. ఆసుపత్రి అంటే భరోసా కల్పించేలా మెడికోవర్డ్ ఫ్యామిలీ కార్డును యాజమాన్యం ప్రవేశపెట్టడం గొప్ప విషయమన్నారు. ఈ కార్డు తీసుకున్న కుటుంబ సభ్యులందరికీ 15 నుంచి 50 శాతం వరకు బిల్లులో డిస్కౌంట్ ఇస్తుండటం శుభపరిణామమని వారిని అభినందించారు. '12 ఏళ్ల క్రితం గుండెపోటు వచ్చి కుప్పకూలితే కరీంనగర్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. డాక్టర్లు కష్టమని చెప్పినప్పటికీ డాక్టర్ శరత్ నాకు ప్రాణం పోశారు'అని ఈ సందర్భంగా సంజయ్ గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీఎండీ డైరెక్టర్ అనిల్‌కృష్ణ, డాక్టర్ శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మెడికోవర్డ్ ఫ్యామిలీ కార్డును ప్రారంభించిన కేంద్రమంత్రి బండి సంజయ్

14, 15 తేదీల్లో అరుణోదయ 50 వసంతాల సభలు

సుందరయ్య విజ్ఞానకేంద్రం: అరుణోదయ 50 వసంతాల సభలను డిసెంబర్ 14, 15 తేదీల్లో నగరంలోని వీఎస్‌టీ హాల్‌లో మొదటిరోజు, సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రెండోరోజు నిర్వహిస్తున్నట్లు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క తెలిపారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, ఉపాధ్యక్షులుగా ప్రొఫెసర్ వినయ్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా విమలక్క, కోశాధికారిగా ఆచార్య కట్టా భగవంత్‌రెడ్డి, మీడియా ఇన్‌చార్జిగా పోతుల రమేష్‌తోపాటు మరో 200 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం అరుణోదయ సమాఖ్య, రాజీలేని పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌ఎఫ్ నాయకులు జీవన్‌కుమార్, ఆచార్య కట్టా భగవంత్‌రెడ్డి, ప్రొఫెసర్ వినయ్‌బాబు, సామాజికవేత్త అంబిక, మన్నారం నాగరాజు, మోత్కూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విమలక్క

సాహిత్య దీపస్తంభం విశ్వనాథ

ఘనంగా విశ్వనాథ సాహిత్య పీఠం ద్విదశాబ్ది ఉత్సవాలు

సనత్‌నగర్: విశ్వనాథ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో బేగంపేటలోని సెస్ ఆడిటోరియంలో నిర్వహించిన ద్విదశాబ్ది ఉత్సవాల్లో సాహిత్య సౌరభాలు వెల్లివిరిశాయి. ఆదివారం జరిగిన ఈ వేడుకల్లో విశ్వనాథుల సాహితీ వైభవాన్ని పలువురు సాహితీవేత్తలు కొనియాడారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆవుల మంజులత మాట్లాడుతూ విశ్వనాథ సత్యనారాయణ తెలుగు సాహిత్యానికి దీపస్తంభం లాంటివారని పేర్కొన్నారు. ఆయన దృక్పథంతో తాము విభేదిస్తున్నప్పటికీ, ఆయన మహాకవి అనడంలో సందేహంలేదని ప్రముఖకవి నిఖిలేశ్వర్ అన్నారు. మధ్యాహ్నం 'విశ్వనాథ రచనల్లో హాస్యం'పై సదస్సు నిర్వహించగా, ఇందులో ఆచార్య మృణాళిని, ఏపీ మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రమణ్యం హాజరై 'విశ్వనాథ వారి ముద్దు వడ్డన్లు'పుస్తకాన్ని ఆవిష్కరించారు. విశ్వనాథ రచనల్లో హాస్యం గురించి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెల్దండ నిత్యానందరావు, దూరదర్శన్ పూర్వ క్రియేటివ్ డైరెక్టర్ ఓలేటి పార్వతీశం, తెలుగు అకాడమీ పూర్వ సంచాలకులు ఆచార్య కె.యాదగిరి కొనియాడారు. కార్యక్రమంలో వెల్చాల కొండల్‌రావు, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'సిరివెన్నెల'అమృతాన్ని కురిపించాడు: ఎన్వీఎస్‌రెడ్డి

సాయంకాలం నిర్వహించిన 'సిరివెన్నెల సీతారామశాస్త్రి పాటలు'సాంస్కృతిక కార్యక్రమంలో సిరివెన్నెల సోదరుడు చేంబోలు శ్రీరామశాస్త్రి రచించిన 'పూర్ణత్వపు పొలిమేరలో..' పుస్తకాన్ని మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ శ్రీరామశాస్త్రి తన పుస్తకం ద్వారా సిరివెన్నెల స్ఫూర్తివంతమైన జీవితాన్ని సమాజానికి మరింత లోతుగా పరిచయం చేయడం గొప్ప విషయమన్నారు. కోవిడ్ కాలంలో తాను హైదరాబాద్ మెట్రో చరిత్రనంతా 58 కవితలుగా మాత్రాచ్ఛందస్సులో 'మేఘపథం'అనే కావ్యంగా రాసినప్పుడు శాస్త్రి దానికి ముందు మాట రాస్తానన్నారని గుర్తు చేసుకున్నారు. ఆయన అమృతాన్ని కురిపించిన అమరుడని అన్నారు. అనంతరం చేపూరి సుబ్బారావు 'సమ్మాన్యుడు (సంక్షిప్తం) పుస్తకాన్ని ఆవిష్కరించారు.



పూర్ణత్వపు పొలిమేరలో.. పుస్తకం ఆవిష్కరించిన మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి

దేశానికి దిక్సూచిగా సమగ్ర సర్వే

మన్సూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వే దేశానికి దిక్సూచిలాగా నిలిచిందని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ పెరిక(పురగిరి క్షత్రియ) కుల కార్తీక మాస వనభోజనాలు, ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఇక్కడి ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వనభోజనాలు, ఆత్మీయ సమ్మేళనాలు కుల ఐక్యతకు దోహదపడతాయని అన్నారు. సమగ్ర సర్వే ఎన్యుమరేటర్లు ఇంటికి రాకపోతే పిలిపించుకుని సర్వే నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే పెరిక కుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.50 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. పెరిక కుల సాధన సమితి కోరిక మేరకు ప్రభుత్వం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నిధులు కేటాయించిందని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. ఆనాటి బీసీ డిక్లరేషన్ కమిటీ చైర్మన్, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో కార్పొరేషన్‌ను సాధించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సుందరీ వీరభాస్కర్, ఆరేపూరి సత్యం, నర్సింగ్‌రావు, జంగయ్య, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



పెరిక కుల కార్తీక వనభోజన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

నెట్టింట్లో పెళ్లి చూపుల వీడియోలు హల్‌చల్ | ప్రతి ఘట్టాన్ని జ్ఞాపకంగా మార్చేందుకు ఆసక్తి | ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేస్తున్న యువత

నూతన వధూవరులకు లైకులు, కామెంట్లు, షేర్లు

చేనేత వారసత్వ వైభవానికి ప్రతీక..

శారీ ఫెస్ట్-2024

సాక్షి, సిటీబ్యూరో: చేనేత వారసత్వ వైభవాన్ని ప్రదర్శించే 'హైదరాబాద్ శారీ ఫెస్టివల్-2024' అమీర్‌పేటలోని కమ్మ సంఘంలో ప్రారంభమైంది. భారత ప్రభుత్వ టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ డెవలప్‌మెంట్ కమిషనర్ సహకారంతో నేషనల్ డిజైన్ సెంటర్ ఏర్పాటు చేసిన ఈ శారీ ఫెస్టివల్‌ను ప్రముఖ చేనేత నిపుణులు, ప్రతిష్టాత్మక సంత్ కబీర్ అవార్డు గ్రహీత పద్మశ్రీ గజం అంజయ్య ప్రారంభించారు. జాతీయ చేనేత బ్రాండ్ అంబాసిడర్ రష్మీ ఠాకూర్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ప్రతి చీర శతాబ్దాల సంప్రదాయం, కళాత్మకత, నైపుణ్యాన్ని సూచిస్తుందని, చేనేత సమాజానికి అవసరమైన గుర్తింపు అందించడంతోపాటు, వారసత్వాన్ని కాపాడుకోవడంలో ఈ తరహా కార్యక్రమాలు కీలకమైనవని గజం అంజయ్య అన్నారు. దేశవ్యాప్తంగా అత్యుత్తమ చేనేత చీరలతో ఈ ప్రదర్శన ఈ నెల 30 వరకూ కొనసాగనుంది. ఈ ఉత్సవంలో నేత కార్మికులు, సహకార సంఘాలతో సహా 75 సంస్థలు పాల్గొన్నాయి. బనారసి, కంజీవరం, పోచంపల్లి, చందేరి వంటి ప్రత్యేక నేతలను ప్రదర్శిస్తారు. ప్రారంభోత్సవంలో హైదరాబాద్‌లోని వీవర్స్ సర్వీస్ సెంటర్ హెడ్ ఆఫ్ ఆఫీస్ డాక్టర్ ఎస్.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.



నట్టింటి నుంచి.. నెట్టింటికి..

సామాజిక మాధ్యమాల్లో పెళ్లిసందడి

హైదరాబాద్ వైబ్స్



పెళ్లంటే పందిళ్లు.. సందళ్లు.. తప్పెట్లు.. తాళాలు.. తలంబ్రాలు.. అని సినీ గేయ రచయిత ఆత్రేయ పాట అందరికీ తెలిసిందే.. అయితే ఆ పాటలో చెప్పిన విధంగా పెళ్లివారి నట్టింట్లో అచ్చం అలాంటి సందడే కొనసాగేది. అయితే ప్రస్తుతం ట్రెండ్ మారింది.. పెళ్లి సందడి నట్టింట్లో నుంచి నెట్టింట్లోకి చేరింది. దీంతో రకరకాల ఆధునిక పోకడలు ఈ తతంగంలో కనిపిస్తున్నాయి. స్వతంత్ర దేశంలో చావు కూడా పెళ్లి లాంటిదేరా బ్రదర్ అని మరో కవి అన్నట్లు సామాజిక మాధ్యమాల వేదికగా ట్రెండ్ అయ్యే విధంగా తతంగం నడుస్తోంది. పెళ్లిచూపులు, ఎంగేజ్‌మెంట్, ప్రీ వెడ్డింగ్ మొదలు, పెళ్లి అనంతరం జరిగే తతంగాల వరకూ అన్నీ సోషల్ వేదికగా షేర్ చేసుకుంటున్నారు. పెళ్లిలో నేటి ఆధునిక పోకడలపైనే ఈ కథనం..

\- సాక్షి, సిటీబ్యూరో



నేటి తరానికి ప్రతిదీ సెలబ్రేషనే.. సామాజిక మాధ్యమాల్లో పెళ్లి సంబరాలు అంబరాన్నంటేలా చేసుకుంటున్నారు. పెళ్లి పనులు ప్రారంభమైనప్పటి నుంచి ప్రీవెడ్డింగ్, పెళ్లి వేడుకలు, పోస్ట్ వెడ్డింగ్, సీమంతం ఇలా ఒక్కటేమిటి ప్రతి సందర్భాన్నీ వీడియోలు, ఫొటోలు తీసుకుని భద్రపరుచుకుంటున్నారు. తరతరాలు గుర్తుండిపోయేలా విభిన్నంగా, వినూత్నంగా తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. వాటికి సంబంధించిన పొట్టి వీడియోలను యూట్యూబ్, ఇన్‌స్టాగామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటున్నారు. అయితే ఇటీవల సరికొత్త ట్రెండ్ వచ్చింది. అదేంటంటే.. పెళ్లి చూపులకు సంబంధించిన వీడియోలను కూడా సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటున్నారు. ఈ వీడియోలు తాజాగా ఫుల్ ట్రెండింగ్‌లో ఉంటున్నాయి.



సంతోషాన్ని పంచుకునేందుకు..

ఇటీవల తమ జీవితంలో జరిగే ముఖ్యమైన అంశాలను ప్రపంచంతో పంచుకోవడం అలవాటైంది. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో వీడియోల రూపంలో పెడుతున్న వారు ఎక్కువ అవుతున్నారు. ఒకప్పుడు పెళ్లి చూపులకు సంబంధించిన అంశాలను చాలా గోప్యంగా ఉంచేవారు. అంతా సెట్ అయిన తర్వాత కానీ బయట ప్రపంచానికి తెలియనిచ్చేవారు కాదు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. జీవితంలో జరిగే ప్రతి ముఖ్యమైన ఘట్టాన్నీ గుర్తుంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పెళ్లి చూపుల కోసం పెళ్లి కొడుకు కారు దిగిన దగ్గరి నుంచి పెళ్లి చూపులు జరుగుతున్న తతంగం మొత్తాన్నీ వీడియోలు తీసుకుంటున్నారు. అటు పెళ్లి కొడుకు, ఇటు పెళ్లి కూతురు నవ్వుతూ సిగ్గు పడుతుంటే అదో మరపురాని అనుభూతిగా మిగిలిపోతుందనడంలో అతిశయోక్తి లేదు. పెళ్లి కూతురు తరపు వాళ్లు, పెళ్లి కొడుకు తరపు బంధువులు ఈ సందర్భంగా సరదాగా జరిపే మాటామంతీ కూడా సోషల్ మీడియాలో పెడుతున్నారు. కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు ఈ సంభాషణలను ఆధారంగా చేసుకుని ఎన్నో ఫన్నీ వీడియోలు తీస్తూ నవ్వులు పూయిస్తున్నారు.

కామెంట్ల వెల్లువ..

పెళ్లి చూపులకు సంబంధించిన వీడియోలను చక్కగా ఎడిటింగ్ చేసి, సూటయ్యే పాటలను బ్యాక్‌గ్రౌండ్‌లో సెట్‌చేసి అప్‌లోడ్ చేస్తున్నారు. పెళ్లి కూతురు, పెళ్లి కొడుకు సరదాగా మాట్లాడుకుంటున్న సందర్భాన్ని కూడా వీడియోలు తీస్తున్నారు. రెండు, మూడేళ్లుగా కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఈ తరహా వీడియోలు తెగ పాపులర్‌గా ఉండేవి. ఇటీవల కాలంలోనే మన దగ్గర కూడా ఇలా పెళ్లి చూపుల వీడియోలు తీసి ఇన్‌స్టాగామ్ వంటి వేదికల్లో పోస్టు చేస్తున్నారు. దీంతో మన దగ్గర కూడా ఈ రీల్స్ వైరల్ అవుతున్నాయి. ఈ రీల్స్ చూసిన వీక్షకులు కూడా నూతన వధూవరులకు కామెంట్ల రూపంలో శుభాకాంక్షలు చెబుతూ పాజిటివ్‌గా స్పందిస్తున్నారు. పెళ్లి కాని యువతీ, యువకులు మాత్రం ఈ వీడియోలను చూస్తుంటే 'పెళ్లి చేసుకుంటే బాగుండూ అనిపిస్తోంది' అంటూ కామెంట్లు పెడుతూ నవ్వులు పూయిస్తున్నారు. మొత్తానికీ ఈ ఏడాది పెళ్లి చూపుల వీడియోలు తెగ వైరల్ అవుతున్నాయనే చెప్పుకోవచ్చు.



జాగ్రత్త అంటున్న నిపుణులు..

ఇటీవల చాలావరకూ ప్రీవెడ్డింగ్, హల్దీ, మెహందీ, పోస్టు వెడ్డింగ్, బేబీ బంప్ వీడియోలు షూట్ చేసుకోవడం కామన్‌గా మారిపోయింది. అయితే ఏదైనా కానీ మితి మీరనంత వరకే మంచిదని నిపుణులు చెబుతున్నారు. సోషల్ మీడియా మోజులో పడి అతిగా ప్రవర్తిస్తే వ్యక్తిగత జీవితంతో పాటు సమాజంలో కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. గతంలో సెన్సేషన్ కోసమో.. వినూత్నంగా, విభిన్నంగా చేయాలనే ఉద్దేశంతోనో వెరైటీగా షూటింగ్స్ చేసి విమర్శలు కొని తెచ్చుకున్న వారూ లేకపోలేదు. దీంతో సామాజిక మాధ్యమాల్లోని ఫొటోలు, వీడియోలు నేటి టెక్నాలజీ కారణంగా మిస్ యూజ్ అయిన సందర్భాలనూ చూస్తూనే ఉన్నాం..



డ్రగ్స్ రహిత తెలంగాణ రన్..

పోస్టర్ ఆవిష్కరణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు

సాక్షి, సిటీబ్యూరో: డ్రగ్స్ రహిత తెలంగాణ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ విద్య సమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 21న నెక్లెస్ రోడ్ వేదికగా 2కే రన్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్ హైకోర్టు వేదికగా తెలంగాణ ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు ఆదివారం ఆవిష్కరించారు. యువత చెడు అలవాట్లకు లోనుకాకుండా భవిష్యత్తు పై దృష్టి పెట్టాలని, సమాజహితం కోసం కృషిచేయాలని సూచించారు. డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం నిర్వహిస్తున్న ఈ రన్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని అన్నారు. యువత భవిష్యత్, ప్రస్తుత సామాజిక పరిస్థితుల నేపథ్యంలో డ్రగ్స్‌పై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ రన్ నిర్వహిస్తున్నామని తెలంగాణ విద్య సమితి అధ్యక్షులు తారక్ గౌడ్ పెండెం పేర్కొన్నారు. గణేష్ నాయక్, సాయినాథ్ రెడ్డి, అశోక్, శ్రీను నాయక్, శ్యామ్, రాజ బాబు పాల్గొన్నారు.

500 కుక్కలు.. 100 పిల్లులు

ఆకట్టుకున్న అతి పెద్ద 'పెడిగ్రీ ప్రో హైకాన్-24' షో

సలుకి, బిచాన్ ఫ్రైజ్, అమెరికన్ బుల్లీ, హెయిరీ డాచ్‌షండ్ వంటి అరుదైన కుక్కలు నగరంలో సందడి చేశాయి. కుక్కలు, పిల్లుల పెట్ లవర్స్ కోసం ఆదివారం నగరంలోని నార్సింగి వేదికగా ఓం కన్వెన్షన్‌లో నిర్వహించిన 'పెడిగ్రీ ప్రో హైకాన్-24' శునకాల ప్రపంచాన్ని నరవాసులకు పరిచయం చేసింది. ఈ ప్రదర్శనలో 500కు పైగా కుక్కలు, 100కు పైగా పిల్లులతో పాటు దాదాపు 5 వేల మంది పెట్ లవర్స్ పాల్గొన్నారు. హైదరాబాద్ కెనైన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన షోలో తెలంగాణ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మహేష్ భగవత్ తన ఉమే గోల్డెన్ రిట్రీవ్‌తో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐఏఎస్ ఆఫీసర్ హరి చందన కూడా తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రదర్శనలో పాల్గొన్నారు. సాక్షి, సిటీబ్యూరో





కెన్నెల్ క్లబ్ ఆఫ్ ఇండియా ఛాంపియన్‌షిప్ డాగ్ షో, ఇండియన్ క్యాట్ క్లబ్ క్యాట్ షోలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందులో టాప్ 10 బ్రీడ్ అవార్డులు అందించారు. ఇందులో మైనే కూన్స్ దేశీయ జాతి పొడవైన పిల్లి ధర రూ. 2.5 లక్షలు పైనే. మరో విదేశి జాతి బ్రిటిష్ షార్ట్‌హైర్స్ ధర రూ.1.2 లక్షల పై మాటే. వీటి ఆహారం, పెంపకం, సంరక్షణ తదితర అంశాకు చెందిన పరిశ్రమల స్టాల్స్ ఇందులో కొలువుదీరాయి.



బ్రీడ్స్ నాణ్యత కాపాడాలి..

కుక్కల పెంపకం, సంరక్షణ పై అవగాహన కల్పించడమే లక్ష్యం. ఇందులో భాగంగా 150కి పైగా విభిన్న జాతుల నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచాలి. కరోనా సమయంలో చాలామంది జంతువులను దత్తత తీసుకున్నారు. కానీ కోవిడ్ ముగిసిన తర్వాత చాలా మంది విడిచిపెట్టడం బాధాకరం. – డాక్టర్ ఎం ప్రవీణ్ రావు, కెనైన్ క్లబ్ ప్రెసిడెంట్



కుక్కలకూ సప్లిమెంట్‌లు..

కుక్కల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన సప్లిమెంట్ 'అబ్సొల్యూట్ పెట్'. భారత్‌లో నూతనంగా ఆవిష్కరించాం. చర్మ సమ్యలు, ఫుడ్‌పాయిజన్ తదితర సమస్యలకు మంచి ఫలితాలను అందిస్తుంది. – జాహ్నవి, అబ్సొల్యూట్ పెట్.

పెద్దలే పిల్లలై..!

'వీ ది వలంటీర్స్' ఆధ్వర్యంలో 'పెద్దల జాతర'

ఆటలు, పాటలు.. అంటే మనకు పిల్లలే గుర్తొస్తారు. కానీ వృద్ధులు కూడా తమ బాల్యం నాటి రోజులు గుర్తు చేసుకుని ఆడిపాడితే ఎలా ఉంటుంది. అచ్చు అదే ఆలోచన చేసింది వీ ది వలంటీర్స్ అనే స్వచ్ఛంద సంస్థ. ఈ సంస్థ ఆధ్వర్యంలో వృద్ధుల కోసం ఆదివారం బౌరంపేటలోని ఓ పాఠశాలలో 'పెద్దల జాతర' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో 30 వృద్ధాశ్రమాల నుంచి దాదాపు 400 మంది వృద్ధులు పాల్గొన్నారు. ఆడుతూ, పాడుతూ, రంగురంగుల బొమ్మలు వేసి రోజంతా సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమాన్ని ఏటా జరుపుతుంటారు. అయితే తొలిసారిగా హైదరాబాద్‌లో నిర్వహించడం విశేషం.

\- సాక్షి, సిటీబ్యూరో





విజయం వాకిట్లో...

కంగారూలకు పెట్టని కోటలాంటి పెర్త్‌లో టీమిండియా అదరగొడుతోంది. బౌలర్ల స్ఫూర్తికి బ్యాటర్ల జోరు తోడవడంతో 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లో భారత్ తొలి విజయానికి చేరువైంది. యశస్వి జైస్వాల్ భారీ సెంచరీకి... కోహ్లి సమయోచిత శతకం తోడవడంతో ఆస్ట్రేలియా ముందు టీమిండియా 534 పరుగుల కొండంత లక్ష్యాన్ని ఉంచింది. మన ఆటగాళ్లు చెడుగుడు ఆడుకున్న పిచ్‌పై ఆసీస్ బ్యాటర్లు తడబడ్డారు. ఫలితంగా 4.2 ఓవర్లలోనే ఆతిథ్య జట్టు 3 వికెట్లు కోల్పోయింది. ఈ మ్యాచ్‌లో గెలుపు ఆశలు వదులుకున్న ఆసీస్ ఆటగాళ్లు నాలుగో రోజు ఎంత సమయం క్రీజులో నిలుస్తారో వేచి చూడాలి!

- పెర్త్ టెస్టులో గెలుపు దిశగా భారత్
- యశస్వి జైస్వాల్ భారీ సెంచరీ
- విరాట్ కోహ్లి అజేయ శతకం
- టీమిండియా రెండో ఇన్నింగ్స్ 487/6 డిక్లేర్డ్
- ఆస్ట్రేలియా లక్ష్యం 534; ప్రస్తుతం 12/3
- బెంబేలెత్తించిన బుమ్రా

పెర్త్: ప్రతిష్టాత్మక 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లో భారత జట్టు తొలి టెస్టులో విజయానికి చేరువైంది. రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా బ్యాటర్లు చెలరేగడంతో ఆస్ట్రేలియా ముందు కొండంత లక్ష్యం నిలిచింది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (297 బంతుల్లో 161; 15 ఫోర్లు, 3 సిక్స్‌లు) భారీ సెంచరీతో కదంతొక్కగా... విరాట్ కోహ్లి (143 బంతుల్లో 100 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్సర్లు) కళాత్మక శతకంతో విజృంభించాడు. ఓవర్‌నైట్ స్కోరు 172/0తో మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 134.3 ఓవర్లలో 487/6 వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. కేఎల్ రాహుల్ (176 బంతుల్లో 77; 5 ఫోర్లు) ఎక్కువసేపు నిలవలేకపోగా... ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి (27 బంతుల్లో 38 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) ధాటిగా ఆడాడు. కోహ్లి సెంచరీ పూర్తి కాగానే భారత కెప్టెన్ బుమ్రా ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు. ఫలితంగా ఆస్ట్రేలియా ముందు 534 పరుగుల లక్ష్యం నిలిచింది. లయన్ 2... స్టార్క్, హాజల్‌వుడ్, కమిన్స్, మార్ష్ తలా ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఆస్ట్రేలియా ఆదివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 4.2 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 12 పరుగులు చేసింది. బుమ్రా (2/1), సిరాజ్ (1/7) ఆసీస్‌ను దెబ్బ కొట్టారు. మెక్‌స్వీనీ (0), కమిన్స్ (2), లబుషేన్ (3) అవుట్ కాగా... ఉస్మాన్ ఖ్వాజా (9 బంతుల్లో 3 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. చేతిలో 7 వికెట్లు ఉన్న ఆసీస్... విజయానికి ఇంకా 522 పరుగులు చేయాల్సి ఉంది. భారత బౌలర్ల జోరు ఇలాగే సాగితే సోమవారం తొలి సెషన్‌లోనే ఆసీస్ ఆట ముగిసే అవకాశాలున్నాయి.

'జై'స్వాల్ గర్జన

సుదీర్ఘ ఫార్మాట్‌లో భారీ సెంచరీలు చేయడాన్ని అలవాటుగా మార్చుకున్న యశస్వి జైస్వాల్... ఆస్ట్రేలియా గడ్డపై ఆడుతున్న తొలి టెస్టులోనే సత్తా చాటాడు. బౌన్సీ పిచ్‌పై రాణించేందుకు ప్రత్యేకంగా సాధన చేసి బరిలోకి దిగిన 22 ఏళ్ల జైస్వాల్... నాణ్యమైన పేసర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ పరుగులు రాబట్టాడు. ఈ క్రమంలో ఆసీస్ గడ్డపై తొలి వికెట్‌కు అత్యధిక భాగస్వామ్యం నమోదు చేసిన జోడీగా రాహుల్‌తో కలిసి రికార్డుల్లోకెక్కిన జైస్వాల్.. 205 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. స్టార్క్ వేసిన బౌన్సర్‌ను అప్పర్ కట్‌తో జైస్వాల్ సిక్సర్‌గా మలిచిన తీరు హైలైట్. తొలి ఇన్నింగ్స్‌లో చెత్త షాట్‌కు పెవిలియన్ చేరిన జైస్వాల్... ఈసారి ఎలాంటి తప్పిదాలు చేయకుండా ముందుకు సాగాడు. క్లిష్టమైన పిచ్‌పై మెరుగైన డిఫెన్స్‌తో ఆకట్టుకున్న రాహుల్‌ను స్టార్క్ అవుట్ చేయగా... దేవదత్ పడిక్కల్ (71 బంతుల్లో 25; 2 ఫోర్లు) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. రెండో కొత్త బంతి తీసుకున్న అనంతరం పడిక్కల్ పెవిలియన్ చేరగా... జైస్వాల్ 275 బంతుల్లో 150 మార్క్ దాటాడు. 23 ఏళ్లలోపు వయసులో నాలుగుసార్లు 150 పైచిలుకు పరుగులు చేసిన తొలి భారత ఆటగాడిగా నిలిచిన జైస్వాల్ చివరకు మార్ష్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు.

'కోహ్లి'నూర్ ఇన్నింగ్స్...

చాన్నాళ్లుగా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్న విరాట్ కోహ్లి... 'క్లాస్ శాశ్వతం, ఫామ్ తాత్కాలికం' అని నిరూపించాడు. పిచ్ బౌన్స్‌కు సహకరిస్తున్న సమయంలో సంయమనం చూపి... కుదురుకున్నాక ట్రేడ్‌మార్క్ కవర్ డ్రైవ్‌లతో కట్టిపడేశాడు. స్వల్ప వ్యవధిలో జైస్వాల్‌తో పాటు పంత్ (1), జురేల్ (1) అవుట్ అయిన దశలో కోహ్లి వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. వాషింగ్టన్ సుందర్ (29; ఒక సిక్స్)తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. అనూహ్య బౌన్స్‌తో కంగారూలు పరీక్షించినా... కోహ్లి ఏమాత్రం తడబడలేదు. పదే పదే వికెట్ పక్క నుంచి షాట్లు ఆడుతూ చకచకా పరుగులు రాబట్టాడు. సుందర్ వెనుదిరిగాక క్రీజులోకి వచ్చిన ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి టి20ల తరహాలో రెచ్చిపోయి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మరో ఎండ్‌లో బౌండరీతో కోహ్లి టెస్టుల్లో 30వ శతకం పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం డాన్ బ్రాడ్‌మన్ (29)ను అధిగమించిన కోహ్లి... ఆసీస్ గడ్డపై ఏడో సెంచరీని తన పేరిట లిఖించుకున్నాడు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 150; **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** 104; **భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) స్మిత్ (బి) మార్ష్ 161; రాహుల్ (సి) కేరీ (బి) స్టార్క్ 77; పడిక్కల్ (సి) స్మిత్ (బి) హాజల్‌వుడ్ 25; కోహ్లి (నాటౌట్) 100; పంత్ (స్టంప్డ్) కేరీ (బి) లయన్ 1; జురేల్ (ఎల్బీ) (బి) కమిన్స్ 1; సుందర్ (బి) లయన్ 29; నితీశ్ కుమార్ రెడ్డి (నాటౌట్) 38; ఎక్స్‌ట్రాలు 55; **మొత్తం (134.3 ఓవర్లలో 6 వికెట్లకు డిక్లేర్డ్) 487. వికెట్ల పతనం:** 1-201, 2-275, 3-313, 4-320, 5-321, 6-410. **బౌలింగ్:** స్టార్క్ 26-2-111-1; హాజల్‌వుడ్ 21-9-28-1; కమిన్స్ 25-5-86-1; మార్ష్ 12-0-65-1; లయన్ 39-5-96-2; లబుషేన్ 6.3-0-38-0; హెడ్ 5-0-26-0. **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** మెక్‌స్వీనీ (ఎల్బీ) (బి) బుమ్రా 0; ఖ్వాజా (బ్యాటింగ్) 3; కమిన్స్ (సి) కోహ్లి (బి) సిరాజ్ 2; లబుషేన్ (ఎల్బీ) (బి) బుమ్రా 3; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (4.2 ఓవర్లలో 3 వికెట్లకు) 12. వికెట్ల పతనం:** 1-0, 2-9, 3-12. **బౌలింగ్:** బుమ్రా 2.2-1-1-2; సిరాజ్ 2-0-7-1.



యశస్వి జైస్వాల్



విరాట్ కోహ్లి

> ఇది నాకు చాలా ప్రత్యేకమైన క్షణం. ఆస్ట్రేలియాలో పర్యటించాలని, బాగా రాణించాలని ఎప్పుడూ కోరుకునేవాడిని. ఈ ఇన్నింగ్స్ ఎంతో ముఖ్యమైంది. ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలింగ్ దళం ముందు నాణ్యమైన ఇన్నింగ్స్‌తో సెంచరీ చేయడం చాలా సంతోషంగా ఉంది. తొలి ఇన్నింగ్స్ సమయంలో బంతి ఎక్కువ సీమ్ అయింది. దీనిపై ఎంతో చర్చించాం. ఏ బంతిని వదిలేయాలి, దేనికి పరుగులు రాబట్టాలి అని ముందు నిర్ణయించుకున్నా. పెర్త్ పిచ్‌పై బౌన్స్ ఉంటుందని తెలుసు. దాని కోసం ప్రత్యేకంగా ప్రాక్టీస్ చేశాం. 2018లో కోహ్లి ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నప్పుడు టీవీల్లో మ్యాచ్‌లు చూశా. ఇప్పుడు కోహ్లి బ్యాటింగ్‌ను నాన్‌స్ట్రయికింగ్ ఎండ్ నుంచి చూడటం వర్ణించలేను.
>
> – యశస్వి జైస్వాల్

> మంచి ప్రదర్శన చేయనప్పుడు మైదానంలో పదే పదే తప్పులు చేస్తుంటాం. జట్టు విజయాలకు సహకరించాలని ఎప్పుడూ అనుకుంటా. అంతే కానీ ఊరికే అలా కొనసాగడం నాకు ఇష్టం ఉండదు. కష్టసుఖాల్లో అనుష్క శర్మ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. నా మదిలో ఏం మెదులుతుందో తను బాగా అర్థం చేసుకుంటుంది. దేశానికి ప్రాతినిధ్యం వహించడం ఎంతో గర్వంగా భావిస్తా. అదీ అనుష్క ఎదురుగా ఉంటే మరింత ప్రత్యేకంగా ఉంటుంది.
>
> – విరాట్ కోహ్లి

201 ఈ మ్యాచ్‌లో భారత ఓపెనర్లు జైస్వాల్, రాహుల్ తొలి వికెట్‌కు జోడించిన పరుగులు. ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియాకు ఇదే అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యం. 1986 సిడ్నీ టెస్టులో గావస్కర్–శ్రీకాంత్ నమోదు చేసిన 191 పరుగుల భాగస్వామ్యం రెండో స్థానానికి చేరింది.

3 ఆస్ట్రేలియా గడ్డపై ఆడిన తొలి టెస్టులోనే సెంచరీ చేసిన మూడో భారత ఆటగాడిగా జైస్వాల్ నిలిచాడు. 1968లో జయసింహ, 1977లో గావస్కర్ ఈ ఘనత సాధించారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

లక్నో 'నవాబ్' రిషభ్ పంత్

రూ. 27 కోట్లకు తీసుకున్న సూపర్ జెయింట్స్



- ఐపీఎల్ లీగ్ చరిత్రలోనే అత్యధిక మొత్తం దక్కించుకున్న ప్లేయర్‌గా పంత్ రికార్డు
- అదరగొట్టిన 'అయ్యర్'లు
- శ్రేయస్‌కు రూ.26 కోట్ల 75 లక్షలు
- వెంకటేశ్‌కు రూ.23 కోట్ల 75 లక్షలు
- ముగిసిన తొలి రోజు వేలం

బ్యాటింగ్‌లో దూకుడుకు మారుపేరు... వికెట్ కీపర్... కెప్టెన్‌గా అనుభవం... ఎలాంటి స్థితిలోనైనా జట్టును గెలిపించగల నైపుణ్యం... అన్నీ కలిసి ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) రిషభ్ పంత్ స్థాయి ఏమిటో చూపించాయి. ఇలాంటి ఆటగాడి కోసమే ఏ జట్టయినా పోటీ పడుతుంది. అందుకే అతని పేరు వచ్చినప్పుడు వేలం వెర్రిగా సాగింది. అతనిపై కోట్లు వెదజల్లేందుకు ఫ్రాంచైజీలు పోటీ పడ్డాయి. అలా అలా పెరుగుతూ పోయిన ఆ విలువ చివరకు రూ.27 కోట్ల వద్ద ఆగింది. లక్నో సూపర్ జెయింట్స్ టీమ్ ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక మొత్తం చెల్లించి భారత ఆటగాడు రిషభ్ పంత్‌ను సొంతం చేసుకుంది. దాంతో అంతకు కొద్ది నిమిషాల క్రితమే పంజాబ్ కింగ్స్ సంచలన రీతిలో రూ.26 కోట్ల 75 లక్షలకు శ్రేయస్ అయ్యర్‌ను సొంతం చేసుకున్న రికార్డు వెనక్కి వెళ్లిపోయింది. వీరిద్దరూ భారత జట్టులో సభ్యులుగా ఇప్పటికే తమకంటూ గుర్తింపు తెచ్చుకోగా... నాలుగు సీజన్లలో అంతంత మాత్రం ఆటనే ప్రదర్శించిన వెంకటేశ్ అయ్యర్ కోసం కోల్‌కతా నైట్‌రైడర్స్ ఏకంగా రూ.23 కోట్ల 75 లక్షలు చెల్లించడం వేలంలో అతి పెద్ద సంచలనం. ఏకంగా 20 మంది ఆటగాళ్లకు రూ.10 కోట్లకంటే ఎక్కువ విలువ దక్కడం విశేషం. అనూహ్యాలకు వేదికగా నిలిచే ఐపీఎల్ వేలం ఎప్పటిలాగే తమ రివాజును కొనసాగించింది. అర్‌్షదీప్ సింగ్, బట్లర్, కేఎల్ రాహుల్, సిరాజ్, స్టార్క్, స్టొయినిస్, షమీవంటి ప్లేయర్లకు ఆశించిన మొత్తాలే దక్కగా... చహల్, జేక్ ఫ్రేజర్, ఆర్చర్, జితేశ్ శర్మ, రబాడ, నూర్, అవేశ్ ఖాన్‌లకు మాత్రం చాలా పెద్ద మొత్తం లభించింది. డికాక్, మ్యాక్స్‌వెల్, హర్షల్ పటేల్, డేవిడ్ మిల్లర్, మార్క్‌రమ్ తక్కువ మొత్తాలకే సరిపెట్టుకోవాల్సి రాగా... ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన విదేశీ ఆటగాడైన డేవిడ్ వార్నర్‌ను తొలిరోజు ఎవరూ తీసుకోకపోవడం అత్యంత ఆశ్చర్యకరం!



శ్రేయస్



వెంకటేశ్

జిద్దా: ఐపీఎల్–2025 వేలం ఊహించిన విధంగానే కోట్లాది రూపాయల రికార్డులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది. తొలి రోజు 72 మంది ఆటగాళ్లను 10 ఫ్రాంచైజీలు ఎంచుకున్నాయి. వీరిలో రిషభ్ పంత్ (రూ.27 కోట్లు) అత్యధిక ధరతో అందరికంటే టాపర్‌గా నిలిచాడు. 2024 వేలంలో మిచెల్ స్టార్క్ (కోల్‌కతా; రూ.24 కోట్ల 75 లక్షలు) నెలకొల్పిన అత్యధిక మొత్తం రికార్డును పంత్ బద్దలు కొట్టాడు. 2024లో కెప్టెన్‌గా కోల్‌కతాను చాంపియన్‌గా నిలిపిన శ్రేయస్ అయ్యర్ (రూ.26 కోట్ల 75 లక్షలు) కాస్త తేడాతో రెండో స్థానంలో నిలవగా... వెంకటేశ్ అయ్యర్ కోసం ఏకంగా రూ.23 కోట్ల 75 లక్షలు చెల్లించి కోల్‌కతా వెనక్కి తీసుకుంది. భారత ఆటగాళ్లలో అర్‌్షదీప్ సింగ్ తన ప్రస్తుతం టీమ్ పంజాబ్ కింగ్స్‌కే వెళ్లగా... చహల్, కేఎల్ రాహుల్, షమీ, ఇషాన్ కిషన్ కొత్త జట్ల తరఫున బరిలోకి దిగనున్నారు. హైదరాబాదీ పేసర్ సిరాజ్‌ను గుజరాత్ టైటాన్స్ ఎంచుకోగా... కెరీర్ చివర్లో సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మరోసారి తన 'హోం' టీమ్ చెన్నై సూపర్ కింగ్స్‌కు వెళ్లడం విశేషం. సోమవారం కూడా వేలం సాగనుంది. మొత్తం 577 మంది నుంచి మిగిలిన ఆటగాళ్లతో పాటు ఆదివారం అమ్ముడుపోని ఆటగాళ్లు కూడా రెండో రోజు మళ్లీ వేలంలోకి వస్తారు.

పంత్ కోసం పోటీపడ్డారిలా...

తొలి రోజు ఆరో ఆటగాడిగా రూ. 2 కోట్ల కనీస విలువతో పంత్ పేరు వేలంలోకి వచ్చింది. లక్నో ముందుగా తమ ఆసక్తిని చూపించింది. వెంటనే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) బరిలోకి దిగింది. ఈ రెండు ఫ్రాంచైజీలు పోటీ పడుతూ మొత్తాన్ని రూ.10 కోట్ల 50 లక్షల వరకు తీసుకెళ్లాయి. ఈ దశలో ఆర్‌సీబీ వెనక్కి తగ్గగా... సన్‌రైజర్స్ పోటీకి సిద్ధమైంది. అలా ఇరు జట్ల మధ్య సాగిన సమరం పంత్ విలువను రూ.20 కోట్ల 75 లక్షల వరకు తీసుకెళ్లింది. ఈ దశలో పంత్ పాత జట్టు ఢిల్లీ అతడిని రైట్ టు మ్యాచ్ ద్వారా మళ్లీ తీసుకునేందుకు ప్రయత్నించింది. అయితే లక్నో ఏకంగా రూ.27 కోట్ల మొత్తానికి ప్యాడిల్ ఎత్తడంతో పంత్ విలువ శిఖరానికి వెళ్లింది.

శ్రేయస్ అయ్యర్ ముందుగా...
పంత్‌కంటే ముందు రికార్డు ధరతో శ్రేయస్ అయ్యర్ అమ్ముడుపోయాడు. 2024 ఐపీఎల్‌లో కోల్‌కతాను చాంపియన్‌గా నిలిపిన కెప్టెన్‌గా అతని పేరు వచ్చింది. గతంలో ఢిల్లీ టీమ్‌లో శ్రేయస్ ఆడినప్పుడు కోచ్‌గా ఉన్న పాంటింగ్ ఈసారి పంజాబ్ తరఫున ముందుగా అతనిపై ఆసక్తిని ప్రదర్శించాడు. ఆపై కోల్‌కతా, ఢిల్లీ మధ్య పోటీ సాగగా... రూ.25 కోట్ల వద్ద ఢిల్లీ సొంతమైనట్లు కనిపించింది. కానీ అనూహ్యంగా మళ్లీ ముందుకొచ్చిన పంజాబ్ కింగ్స్ చివరకు బిడ్‌ను ఖాయం చేసుకుంది.

వెంకటేశ్ అయ్యర్ కోసం హోరాహోరీ...
ఐపీఎల్‌లో 2021–24 మధ్య నాలుగు సీజన్ల పాటు ఆడిన కోల్‌కతా నైట్‌రైడర్స్ తరఫునే ఆడిన వెంకటేశ్ అయ్యర్ 49 ఇన్నింగ్స్‌లలో 137.12 స్ట్రయిక్‌రేట్‌తో 1326 పరుగులు చేశాడు. 9 ఇన్నింగ్స్‌లలో మాత్రమే బౌలింగ్ చేసే అవకాశం దక్కింది. అప్పుడప్పుడు కొన్ని చెప్పుకోదగ్గ ప్రదర్శనలు ఉన్నా... ఒంటి చేత్తో మ్యాచ్‌ను మార్చగల విధ్వంసకర ఆటగాడైతే కాదు. కానీ అతని కోసం వేలం అసాధారణ రీతిలో సాగింది. కోల్‌కతా టీమ్ ముందుగా వేలం మొదలు పెట్టింది. లక్నో ముందు ఆసక్తి చూపించినా...ఆ తర్వాత ప్రధానంగా కోల్‌కతా, ఆర్‌సీబీ మధ్యే పోటీ సాగింది. ఇరు జట్లు కలిసి రూ. 20 కోట్లు దాటించాయి. కోల్‌కతా రూ. 23 కోట్ల 75 లక్షలకు చేర్చిన తర్వాత బెంగళూరు స్పందించలేదు.

డేవిడ్ వార్నర్‌కు నిరాశ! పట్టించుకోని ఫ్రాంచైజీలు



ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన బ్యాటర్లలో ఒకడు. 184 మ్యాచ్‌లలో 6565 పరుగులతో అత్యధిక స్కోరర్ల జాబితాలో నాలుగో స్థానం. ఒంటి చేత్తో మ్యాచ్‌లను గెలిపించిన రికార్డుతో పాటు కెప్టెన్‌గా సన్‌రైజర్స్‌కు టైటిల్ అందించిన ఘనత! ఇలాంటి ఘనాపాటి ఆసీస్ స్టార్ డేవిడ్ వార్నర్‌ను ఎవరూ తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగించింది. అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకున్నా... అతనేమీ ఆటకు దూరమై చాలా కాలం కాలేదు. ఇటీవల టి20 వరల్డ్‌కప్ ఆడి చురుగ్గా ఉన్న వార్నర్‌లో ఇప్పటికీ ఈ ఫార్మాట్‌లో చెలరేగిపోగల సత్తా ఉంది. వేలంలో కొందరు అనామక ఆటగాళ్ల కోసం సాగిన పోటీ చూస్తే వార్నర్ కనీస విలువ రూ.2 కోట్లకు కూడా తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడం అనూహ్యం. గత సీజన్‌లో పూర్తిగా విఫలం కావడం వేలంపై ప్రభావం చూపించి ఉండవచ్చు. తొలి రోజు 12 మందిని మాత్రమే ఫ్రాంచైజీలు తిరస్కరించగా అందులో వార్నర్, బెయిర్‌స్టో ఎక్కువగా గుర్తింపు పొందిన ఆటగాళ్లు కాగా... ప్రస్తుతం భారత టెస్టు టీమ్‌లో ఉన్న దేవదత్ పడిక్కల్‌పై పెద్దగా అంచనాలు లేవు. మిగిలిన 9 మందిలో పీయూష్ చావ్లా తప్ప ఇతర ఆటగాళ్లు అనామకులే.

అమ్ముడుపోయిన ఆటగాళ్ల జాబితా

చెన్నై సూపర్ కింగ్స్
నూర్ అహ్మద్ (రూ.10 కోట్లు)
ఆర్. అశ్విన్ (రూ. 9.75 కోట్లు)
కాన్వే (రూ. 6.25 కోట్లు)
ఖలీల్ అహ్మద్ (రూ. 4.80 కోట్లు)
రచిన్ రవీంద్ర (రూ. 4 కోట్లు)
రాహుల్ త్రిపాఠి (రూ. 3.40 కోట్లు)
విజయ్ శంకర్ (రూ. 1.20 కోట్లు)

ఢిల్లీ క్యాపిటల్స్
కేఎల్ రాహుల్ (రూ. 14 కోట్లు)
స్టార్క్ (రూ. 11.75 కోట్లు)
నటరాజన్ (రూ. 10.75 కోట్లు)
జేక్ ఫ్రేజర్ (రూ 9 కోట్లు)
హ్యారీ బ్రూక్ (రూ. 6.25 కోట్లు)
అశుతోష్ శర్మ (రూ. 3.80 కోట్లు)
మోహిత్ శర్మ (రూ.2.20 కోట్లు)
సమీర్ రిజ్వీ (రూ. 95 లక్షలు)
కరుణ్ నాయర్ (రూ. 50 లక్షలు)

గుజరాత్ టైటాన్స్
బట్లర్ (రూ.15.75 కోట్లు)
సిరాజ్ (రూ.12.25 కోట్లు)
రబాడ (రూ.10.75 కోట్లు)
ప్రసిధ్ కృష్ణ (రూ.9.50 కోట్లు)
లోమ్రోర్ (రూ.1.70 కోట్లు)
కుమార్ కుశాగ్ర (రూ.65 లక్షలు)
మానవ్ సుతార్ (రూ. 30 లక్షలు)
అనూజ్ రావత్ (రూ.30 లక్షలు)
నిశాంత్ సింధు (రూ. 30 లక్షలు)

కోల్‌కతా నైట్‌రైడర్స్
వెంకటేశ్ (రూ.23.75 కోట్లు)
అన్రిచ్ నోర్జే (రూ.6.50 కోట్లు)
డికాక్ (రూ.3.60 కోట్లు)
అంగ్‌క్రిష్ (రూ.3 కోట్లు)
గుర్బాజ్ (రూ.2 కోట్లు)
వైభవ్ అరోరా (రూ.1.80 కోట్లు)
మర్కండే (రూ. 30 లక్షలు)

లక్నో సూపర్ జెయింట్స్
రిషభ్ పంత్ (రూ.27 కోట్లు)
అవేశ్ ఖాన్ (రూ.9.75 కోట్లు)
మిల్లర్ (రూ.7.50 కోట్లు)
అబ్దుల్ సమద్ (రూ.4.20 కోట్లు)
మిచెల్ మార్ష్ (రూ.3.40 కోట్లు)
మార్క్‌రమ్ (రూ.2 కోట్లు)
ఆర్యన్ జుయాల్ (రూ.30 లక్షలు)

ముంబై ఇండియన్స్
ట్రెంట్ బౌల్ట్ (రూ.12.50 కోట్లు)
నమన్ ధీర్ (రూ.5.25 కోట్లు)
రాబిన్ మింజ్ (రూ.65 లక్షలు)
కరణ్ శర్మ (రూ.50 లక్షలు)

పంజాబ్ కింగ్స్
శ్రేయస్ అయ్యర్ (రూ.26.75 కోట్లు)
అర్‌్షదీప్ సింగ్ (రూ.18 కోట్లు)
చహల్ (రూ.18 కోట్లు)
స్టొయినిస్ (రూ.11 కోట్లు)
నేహల్ వధేరా (రూ.4.20 కోట్లు)
మ్యాక్స్‌వెల్ (రూ.4.20 కోట్లు)
వైశాక్ విజయ్ (రూ.1.80 కోట్లు)
యశ్ ఠాకూర్ (రూ.1.60 కోట్లు)
హర్‌ప్రీత్ బ్రార్ (రూ.1.50 కోట్లు)
విష్ణు వినోద్ (రూ.95 లక్షలు)

రాజస్తాన్ రాయల్స్
జోఫ్రా ఆర్చర్ (రూ.12.50 కోట్లు)
హసరంగ (రూ.5.25 కోట్లు)
మహీశ్ తీక్షణ (రూ.4.40 కోట్లు)
ఆకాశ్ మధ్వాల్ (రూ.1.20 కోట్లు)
కార్తికేయ (రూ.30 లక్షలు)

బెంగళూరు
హాజల్‌వుడ్ (రూ.12.50 కోట్లు)
ఫిల్ సాల్ట్ (రూ.11.50 కోట్లు)
జితేశ్ శర్మ (రూ.11 కోట్లు)
లివింగ్‌స్టోన్ (రూ.8.75 కోట్లు)
రసిక్ ధార్ (రూ.6 కోట్లు)
సుయాశ్ శర్మ (రూ.2.60 కోట్లు)

సన్‌రైజర్స్ హైదరాబాద్
ఇషాన్ కిషన్ (రూ.11.25 కోట్లు)
మొహమ్మద్ షమీ (రూ.10 కోట్లు)
హర్షల్ పటేల్ (రూ.8 కోట్లు)
రాహుల్ చహర్ (రూ.3.20 కోట్లు)
మనోహర్ (రూ.3.20 కోట్లు)
ఆడమ్ జంపా (రూ.2.40 కోట్లు)
సిమర్జిత్ సింగ్ (రూ.1.50 కోట్లు)
అథర్వ తైడే (రూ.30 లక్షలు)

టాప్-20
(రూ.10 కోట్లు, అంతకుమించి)
రిషభ్ పంత్ (రూ.27 కోట్లు)
శ్రేయస్ (రూ.26.75 కోట్లు)
వెంకటేశ్ (రూ.23.75 కోట్లు)
అర్‌్షదీప్ సింగ్ (రూ.18 కోట్లు)
చహల్ (రూ.18 కోట్లు)
బట్లర్ (రూ.15.75 కోట్లు)
కేఎల్ రాహుల్ (రూ. 14 కోట్లు)
ట్రెంట్ బౌల్ట్ (రూ.12.50 కోట్లు)
హాజల్‌వుడ్ (రూ.12.50 కోట్లు)
జోఫ్రా ఆర్చర్ (రూ.12.50 కోట్లు)
సిరాజ్ (రూ.12.25 కోట్లు)
స్టార్క్ (రూ. 11.75 కోట్లు)
ఫిల్ సాల్ట్ (రూ.11.50 కోట్లు)
ఇషాన్ కిషన్ (రూ.11.25 కోట్లు)
జితేశ్ శర్మ (రూ.11 కోట్లు)
స్టొయినిస్ (రూ.11 కోట్లు)
నటరాజన్ (రూ. 10.75 కోట్లు)
రబాడ (రూ.10.75 కోట్లు)
మొహమ్మద్ షమీ (రూ.10 కోట్లు)
నూర్ అహ్మద్ (రూ.10 కోట్లు)

తొలి రోజు మొత్తం 72 మంది ఆటగాళ్లను ఫ్రాంచైజీలు వేలంలో దక్కించుకోగా... ఇందులో 24 మంది విదేశీయులు ఉన్నారు. వేలం కోసం మొత్తం రూ.467.95 కోట్లను జట్లు వెచ్చించాయి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,961	557
79,117	23,907

విదేశీ సూచీలు

నాస్‌డాక్	19,004	▲	31
డోజోన్స్	44,297	▲	426
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,262	▲	113
డాక్స్	19,323	▲	176
షాంఘై	3,267	▼	103
నికాయ్	38,284	▲	258

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	84.09	85.11
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	105.81	108.63
€	యూరో	ఒకటి	87.89	90.49
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	53.86	55.23
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.01	56.20
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.41	65.89
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.58	23.12
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	22.10	23.88
¥	చైనా యువాన్	ఒకటి	10.76	12.59

విదేశీ 'స్టాక్స్' షాపింగ్ చేద్దామా!

అమెరికా స్టాక్స్‌లోనూ పెట్టుబడులకు అవకాశం • పోర్ట్‌ఫోలియోకి మరింత స్థిరత్వం • రూపాయి విలువ క్షీణతకు చెక్

పెట్టుబడులకు వైవిధ్యం ప్రాణం. 'పెట్టుబడుల్లో ఉచితంగా వచ్చేది ఏదైనా ఉందంటే అది వైవిధ్యమే' అన్నది ఆధునిక ఫైనాన్స్‌కు పితామహుడిగా చెప్పుకునే, నోబెల్ పురస్కార గ్రహీత హ్యారీ మర్కోవిజ్ అభిప్రాయం. వైవిధ్యం అంటే పెట్టుబడులన్నింటినీ తీసుకెళ్లి ఏదో ఒక సాధనంలో ఉంచకపోవడం. మార్కెట్ అస్థిరతలు, ఊహించని నష్టాల నుంచి పెట్టుబడులకు ఈ వైవిధ్యమే రక్షణ కవచంలా పనిచేస్తుంది. ఈక్విటీలు, ఎఫ్‌డీలు, బాండ్లు, బంగారం, రియల్ ఎస్టేట్ ఇలా భిన్న సాధనాల మధ్య పెట్టుబడులను వర్గీకరించుకోవాలి. ఇక ఈక్విటీ పెట్టుబడుల్లోనూ కొంత మేర అమెరికా స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఈ వైవిధ్యాన్ని మరింత విస్తృతం చేసుకున్నట్టు అవుతుంది.

భారత్ శరవేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాంటప్పుడు ఈక్విటీ పెట్టుబడుల్లో కొంత భాగాన్ని వేరే దేశానికి ఎందుకు కేటాయించుకోవడం అన్న సందేహం రావచ్చు. కానీ, ఒక మార్కెట్‌కే పరిమితం కావడం వల్ల ఆ దేశానికి సంబంధించి ఆర్థికపరమైన రిస్క్‌ల ప్రభావం పెట్టుబడులపై అధికంగా ఉంటుంది. ఇది రాబడులపైనా ప్రభావం చూపిస్తుంది. గడిచిన నాలుగైదేళ్ల కాలాన్ని పరిశీలిస్తే.. నిఫ్టీ 50 సూచీ కంటే అమెరికా ఎస్అండ్‌పీ 500 (ప్రధాన సూచీ) అధిక రాబడులు అందించింది. ఇదే కాలంలో అమెరికా వృద్ధి రేటు కంటే భారత్ వృద్ధి రేటు మూడు రెట్లు అధికం. అయినా కానీ, రాబడుల్లో ఎస్అండ్‌పీ సూచీయే ముందుంది. దిగ్గజ టెక్నాలజీ కంపెనీలకు చిరునామా అమెరికా స్టాక్ మార్కెట్. అలాంటి గొప్ప కంపెనీల్లో పెట్టుబడులతో వైవిధ్యం మరింత బలపడుతుందన్నది నిపుణుల సూచన. ఈక్విటీ పెట్టుబడుల వైవిధ్యంతో వచ్చే ప్రయోజనాలపై అవగాహన కల్పించే కథనమే ఇది.

– సాక్షి, బిజినెస్ డెస్క్



వైవిధ్యం ఎందుకు..?

భారత్‌కు వెలుపల ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలన్నది ఇన్వెస్టర్ రిస్క్ సామర్థ్యం ఆధారంగానే ఉంటుంది. గడిచిన రెండు మూడు దశాబ్దాల కాలంలో అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లను పరిశీలిస్తే.. గొప్ప పనితీరు చూపించిన రెండు మార్కెట్లు భారత్, అమెరికా. అందుకే ఈ రెండు ఈక్విటీ మార్కెట్ల మధ్య పెట్టుబడులను వైవిధ్యం చేసుకోవడం మెరుగైన నిర్ణయం అవుతుంది. రిస్క్ సమతుల్యత తోపాటు గొప్ప రాబడుల అవకాశాలను సొంతం చేసుకోవచ్చు. అమెరికా, భారత్ ఈక్విటీలు గత 20 ఏళ్ల కాలంలో గొప్ప రాబడులు ఇచ్చినప్పటికీ వీటి మధ్య సహ సంబంధం తక్కువ. అభివృద్ధి చెందిన ఈక్విటీ మార్కెట్లకు, భారత్‌కు మధ్య పనితీరు విషయంలో 60–80 శాతం వరకు పరస్పర సంబంధం ఉంటోంది. అదే అమెరికాకు వచ్చేటప్పటికి (2008 ఆర్థిక మాంద్యం, కరోనా మినహా) ఇది 50 శాతమే. కనుక రిస్క్, రాబడులను బ్యాలన్స్ చేసుకోవడమే కాదు.. రెండు ఆర్థిక వ్యవస్థల్లోని అనుకూలతల నుంచి ప్రయోజనాలు పొందొచ్చు.



రూపాయి క్షీణతకు హెడ్జింగ్



ప్రతి కొన్నేళ్లకోసారి యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు బాటలో నడుస్తుంటుంది. ఆ సమయంలో భారత్ సహా వర్ధమాన దేశాల కరెన్సీలతో పోల్చితే యూఎస్ డాలర్ బలోపేతం కావడం గమనించొచ్చు. 2011లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 45 డాలర్ల వద్ద ఉంది. ఇప్పుడు 84 డాలర్లను దాటేసింది. ట్రంప్ 2.0 నాలుగేళ్ల పాలనలో రూపాయి మరో 6–8 శాతం క్షీణిస్తుందన్న అంచనాలున్నాయి. అమెరికా ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసిన వారికి రూపాయి విలువ క్షీణతతో రెండు రకాల ప్రయోజనాలు లభిస్తాయి. అమెరికా ఈక్విటీల్లో పెట్టుబడుల వృద్ధికితోడు.. పెట్టుబడుల ఉపసంహరణతో మరిన్ని రూపాయిలు (విలువ క్షీణత వల్ల) చేతికి వస్తాయి. రూపాయి విలువ క్షీణత అన్నది యూఎస్ ఈక్విటీ రాబడులను ఇతోధికం చేస్తుంది. సాధారణంగా యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు క్రమంలో విదేశీ ఇన్వెస్టర్లు వర్ధమాన మార్కెట్ల నుంచి పెట్టుబడులు వెనక్కి తీసుకుంటుంటారు. ఆ సమయంలో మన ఈక్విటీలు ప్రతికూలతలను చూస్తుంటాయి.

భవిష్యత్ అవసరాల కోసం..



మన దేశం నుంచి ఏటా వేల సంఖ్యలో విద్యార్థులు అమెరికాకు వెళుతున్నారు. అంతేకాదు విద్య అనంతరం ఉపాధి కోసం వెళుతున్న వారి సంఖ్య కూడా అధికంగానే ఉంటోంది. ఇలాంటి వారికి యూఎస్ పెట్టుబడులు అనుకూలం. అధిక ఆదాయ వర్గాలు విదేశీ పర్యటనలకు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నాయి. ఇందుకోసం డాలర్ల రూపంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. పిల్లలను విదేశాల్లో చదివించుకోవాలంటే యూఎస్ డాలర్ మారకంలోనే చెల్లింపులు చేయాల్సి వస్తుంది. విదేశీ కోర్సుల వ్యయం ఏటా నిర్ణీత శాతం మేర పెరుగుతుంది. అదే సమయంలో ఏటా రూపాయి విలువ క్షీణతతో ఆ విద్యా వ్యయం ఇంకాస్త అధికమవుతోంది. అందుకే డాలర్ మారకంలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా రూపాయి విలువ క్షీణతతో ఏర్పడే భారాన్ని తొలగించుకోవచ్చు. రూపాయి అస్థిరతలను తగ్గించుకోవచ్చు.

రెట్టింపు కాంపౌండింగ్



వాటాదారులకు సంపదను సమకూర్చడంలో యూఎస్, భారత ఈక్విటీ మార్కెట్లు గత కొన్ని దశాబ్దాలుగా ఎంతో మెరుగైన పనితీరు చూపిస్తున్నాయి. ఈ రెండు మార్కెట్లను భిన్నమైన వృద్ధి చోదకాలు నడిపిస్తుంటాయి. అయినా కొన్ని ఏకరూప అంశాలు కూడా ఉన్నాయి. రెండు దేశాల్లోనూ గణనీయ సంఖ్యలో వినియోగదారులున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు. మార్కెట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థలు. అందుకే మిగిలిన మార్కెట్లకు భిన్నంగా అమెరికా, భారత్ దీర్ఘకాలంగా ఇన్వెస్టర్లకు మెరుగైన రాబడులు అందిస్తున్నాయి. ఈ రెండు దేశాల స్టాక్స్‌లోనూ పెట్టుబడులు సంపద సృష్టికి రెండు ఇంజన్ల మాదిరిగా పనిచేస్తాయి. వర్ధమాన మార్కెట్లలో అత్యధిక వృద్ధి అవకాశాలు భారత ఈక్విటీల ద్వారా.. టెక్నాలజీ, హెల్త్‌కేర్, కన్జ్యూమర్ గూడ్స్ పరంగా దిగ్గజ కంపెనీల్లో ఎక్స్‌పోజర్ అమెరికన్ ఈక్విటీల ద్వారా సొంతం చేసుకోవచ్చు.

స్థిరత్వం.. రాబడులు

ఆర్థిక మందగమన సమయాల్లో అమెరికా, భారత మార్కెట్లు ఒకే మాదిరి పనితీరు చూపించాలని లేదు. గడిచిన 20 ఏళ్లలో యూఎస్, భారత ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టినట్టయితే భారీ మార్కెట్ పతనాల్లో నష్టాలు తగ్గినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. చాలా అరుదుగానే ఈ రెండు ఒకే మాదిరి ప్రవర్తిస్తాయి. అంతర్జాతీయ సంక్షోభాల్లో రూపాయితో డాలర్ బలపడుతుంటుంది. దీంతో ఆ సమయంలో యూఎస్ పెట్టుబడులు అదనపు విలువను సమకూరుస్తాయి. ఇదే నష్టాలను తగ్గించి, పెట్టుబడులకు స్థిరత్వాన్ని ఇస్తుంది. అమెరికా స్టాక్స్, భారత స్టాక్స్‌కు 50:50 రేషియోలో పెట్టుబడులు కేటాయించుకోవడం వల్ల రిస్క్ ఆధారిత మెరుగైన రాబడులకు అవకాశం ఉంటుందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రిస్క్‌ను పరిమితం చేసుకుని, వీలైనంత అధిక రాబడులు సమకూర్చుకోవడమే విజయవంతమైన పెట్టుబడి విధానం రహస్యం. భారత ఇన్వెస్టర్లకు విదేశీ స్టాక్స్ అన్నవి సమతూకాన్నిస్తాయి. ఒకటి అభివృద్ధి చెందిన దేశం అయితే, రెండేది 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించే లక్ష్యంతో పనిచేస్తున్న దేశం. రెండింటిలోనూ వృద్ధి అవకాశాలను సొంతం చేసుకోవడం ఇన్వెస్టర్ల ముందున్న మెరుగైన మార్గాల్లో ఒకటి.

ఎలా ఇన్వెస్ట్ చేయాలి..?

భారత స్టాక్స్ మాదిరే నేరుగా అమెరికా స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. లేదా మ్యూచువల్ ఫండ్స్/ఈటీఎఫ్‌ల ద్వారా ఎక్స్‌పోజర్ తీసుకోవచ్చు. యూఎస్ స్టాక్ బ్రోకర్లతో మన దేశ స్టాక్ బ్రోకర్లు కొందరికి ఒప్పందాలు ఉన్నాయి. అలాంటి దేశీ బ్రోకర్ ద్వారా అకౌంట్ ప్రారంభించి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. మోతీలాల్ ఓస్వాల్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ తదితర సంస్థలు ఈ సేవలు అందిస్తున్నాయి.

మ్యూచువల్ ఫండ్స్

- యాక్సిస్ నాస్‌డాక్ 100 ఎఫ్‌వోఎఫ్
- ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ నాస్‌డాక్ 100 ఎఫ్‌వోఎఫ్
- బంధన్ యూఎస్ ఈక్విటీ ఎఫ్‌వోఎఫ్
- ఎడెల్‌వీజ్ యూఎస్ టెక్నాలజీ ఈక్విటీ ఎఫ్‌వోఎఫ్
- కోటక్ నాస్‌డాక్ 100 ఎఫ్‌వోఎఫ్,
- ఫ్రాంక్లిన్ ఇండియా ఫీడర్ ఫ్రాంక్లిన్ యూఎస్ అపార్చునిటీస్ ఫండ్
- మోతీలాల్ ఓస్వాల్ నాస్‌డాక్ 100 ఎఫ్‌వోఎఫ్
- ఇన్వెస్కో ఇండియా నాస్‌డాక్ 100 ఈటీఎఫ్ ఎఫ్‌వోఎఫ్ ద్వారా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.



ఎన్ఎస్ఈ ఐఎఫ్ఎస్‌సీ

ఎన్ఎస్ఈ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ (ఐఎఫ్ఎస్‌సీ)ని ప్రారంభించింది. ఇక్కడ ట్రేడింగ్, డీమ్యాట్ ఖాతా ప్రారంభించడం ద్వారా యూఎస్‌కు చెందిన 50 స్టాక్స్‌లో నేరుగా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఎన్ఎస్ఈ ఐఎఫ్ఎస్‌సీ రిజిస్టర్డ్ స్టాక్ బ్రోకర్ ద్వారా ఖాతా తెరిచి, బ్యాంక్ ఖాతా నుంచి ఫండ్స్ బదిలీ చేసుకుని షేర్లు కొనుగోలు చేసుకోవచ్చు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఒక ఆర్థిక సంవత్సరంలో ఒకరు గరిష్టంగా 2,50,000 డాలర్లను విదేశాల్లో ఇన్వెస్ట్ చేసుకునేందుకు అనుమతి ఉంది



వివిధ లక్ష్యాలకు కేటాయింపులు ఎలా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నెలవారీ సంపాదనలో పొదుపు చేసిన మొత్తాన్ని.. రిటైర్మెంట్, పిల్లల విద్య, ఇల్లు కొనుగోలు తదితర లక్ష్యాలకు ఎలా కేటాయించుకోవాలి? ఇందుకు ఏదైనా ఆర్థిక సూత్రం ఉందా?

– వికాస్ సింగ్

మీ ఆదాయం, ప్రాధాన్యతలు, కాలవ్యవధికి అనుగుణంగా వివిధ లక్ష్యాల కోసం పొదుపు, పెట్టుబడులు నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. ఒకరు తమ ఆదాయంలో కనీసం 20 శాతాన్ని పొదుపు చేసి, ఇన్వెస్ట్ చేయాలన్నది సాధారణ సూత్రం. ఈ పొదుపు మొత్తాన్ని వివిధ లక్ష్యాలకు ఎలా విభజించాలనే దానికి సార్వత్రిక సూత్రం అంటూ లేదు. వ్యక్తుల ఆదాయ పరిస్థితులు, రాబడుల ఆకాంక్షలు, లక్ష్యాలకు అనుగుణంగానే నిర్ణయించుకోవాలి. మీ ప్రాధాన్యతలు, కాలవ్యవధికి అనుగుణంగా లక్ష్యాలను స్వల్పకాలం, మధ్యకాలం, దీర్ఘకాలం అంటూ వేరు చేయండి. దీర్ఘకాలం అంటే కనీసం ఏడేళ్ల అంతకుమించిన లక్ష్యాల కోసం ఈక్విటీ సాధనాలపై దృష్టి సారించాలి. ఎందుకంటే ఇవి అద్భుతమైన రాబడులతోపాటు, కాంపౌండింగ్ ప్రయోజనాన్నిస్తాయి. 5–7 ఏళ్ల మధ్యకాల లక్ష్యాల కోసం ఈక్విటీ, డెట్ ఫండ్స్‌లో లేదా బ్యాలన్స్‌డ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. వీటిల్లో వృద్ధి, స్థిరత్వం ఉంటుంది. 3–5 ఏళ్ల స్వల్ప కాలానికి సంబంధించిన లక్ష్యాల కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు, లిక్విడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. ఇక క్రమం తప్పకుండా అంటే ఆరు నెలలు లేదా ఏడాదికోసారి అయినా మీ పెట్టుబడులు మీ లక్ష్యాలకు అనుగుణంగానే ఉన్నాయా? అన్నది సమీక్షించుకోవాలి. లక్ష్యాలకు చేరువ అవుతున్న క్రమంలో ఈక్విటీ పెట్టుబడులను డెట్ సాధనాల వైపు మళ్లించుకోవాలి. క్రమం తప్పకుండా పొదుపు, వ్యూహాత్మక పెట్టుబడుల ద్వారా మీ ఆర్థిక లక్ష్యాలను చేరుకునే చురుకైన ప్రణాళికను ఆచరణలో పెట్టండి.

నా వద్ద 2020లో కొనుగోలు చేసిన డెట్ ఫండ్స్ ఉన్నాయి. ఇప్పుడు వాటిని విక్రయిస్తే పన్ను భారం ఎలా పడుతుంది?

– పి.కె గుప్తా

స్థిరమైన రాబడులకు డెట్ ఫండ్స్ మంచి ఎంపిక. మీరు 2020లో డెట్ మ్యూచువల్ ఫండ్స్ కొనుగోలు చేసి, ఇప్పుడు విక్రయిస్తే వచ్చిన లాభంపై 12.5 శాతం పన్ను చెల్లించాలి. పైగా లాభంలో ద్రవ్యోల్బణం ప్రభావం తీసివేసేందుకు (ఇండెక్సేషన్) అవకాశం లేదు. డెట్ ఫండ్స్ కొనుగోలు చేసిన తేదీ, ఎంత కాలం పాటు కొనసాగించారు, ఎప్పుడు విక్రయించారనే ఆధారంగా పన్ను భారం మారిపోతుంది. 2023 ఏప్రిల్ 1కి ముందు డెట్ ఫండ్స్ కొనుగోలు చేసిన వారికి ఇండెక్సేషన్ ప్రయోజనం లభిస్తుంది. కాకపోతే 36 నెలల పాటు వాటిని కొనసాగించి, 2024 జూలై 23లోపు విక్రయించిన వారికే ఈ ప్రయోజనం పరిమితం. మీ కొనుగోలు ధరలో ఇండెక్సేషన్ సర్దుబాటు జరుగుతుంది. దీంతో లాభంపై చెల్లించాల్సిన పన్ను కూడా తగ్గిపోతుంది. కాకపోతే 2023 ఏప్రిల్ 1కి ముందు కొనుగోలు చేసినప్పటికీ, 2024 జూలై 23లోపు విక్రయించని వారికి ఇండెక్సేషన్ ప్రయోజనం కోల్పోయినట్టే. దీంతో గతంతో పోల్చితే డెట్ ఫండ్స్ లాభాలపై ప్రస్తుత పన్ను ఆకర్షణీయంగా లేదు. కాకపోతే మరింత కాలం పాటు డెట్ ఫండ్స్‌లో పెట్టుబడులు కొనసాగించడం ద్వారా సంప్రదాయ ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే అధిక రాబడులు పొందేందుకు అవకాశం ఉంటుంది. ఎఫ్‌డీలపై వడ్డీ ఏటా పన్ను పరిధిలోకి వస్తుంది. డెట్ ఫండ్స్‌లో విక్రయించినప్పుడే లాభంపై పన్ను అమల్లోకి వస్తుంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-11-2024

విశాఖ	585-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	595-00
విజయవాడ	595-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	580-00
వరంగల్	582-00
రిటైల్ ధర	6.40

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ నుంచి

గ్యారంటీడ్ పెన్షన్ ప్లాన్ ఫ్లెక్సీ



పెరిగే వ్యయాలను ఎదుర్కొనడంలో పదవీ విరమణ చేసిన వారికి కొంత తోడ్పాటు అందించేలా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ కొత్త పాలసీని ఆవిష్కరించింది. ఏటా అయిదు శాతం అధికంగా యాన్యుటీ చెల్లింపు ప్రయోజనాలను అందించే ఫీచరుతో గ్యారంటీడ్ పెన్షన్ ప్లాన్ ఫ్లెక్సీని ప్రవేశపెట్టింది. ఈ తరహా పాలసీల్లో ఇదే మొట్టమొదటిదని సంస్థ తెలిపింది. ద్రవ్యోల్బణం వల్ల కాలక్రమేణా కొనుగోలు శక్తి తగ్గినా, జీవన ప్రమాణాలను స్థిరంగా కొనసాగించుకోవడంలో కస్టమర్లకు ఈ పాలసీ ఉపయోగకరంగా ఉంటుందని సంస్థ చీఫ్ ప్రోడక్ట్, డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమిత్ పల్టా తెలిపారు. ప్రస్తుతం అధిక వడ్డీ రేట్లు ఉన్న నేపథ్యంలో జీవితకాలం పాటు అధిక రాబడులను అందుకునేలా యాన్యుటీ పథకాన్ని కొనుగోలు చేసేందుకు ఇది సరైన తరుణమని ఆయన పేర్కొన్నారు.

ఫండ్ స్ట్రీట్

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్ ఈక్విటీ మినిమం వేరియన్స్ ఫండ్

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఈక్విటీ మినిమం వేరియన్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. దీర్ఘకాలంలో పెట్టుబడి వృద్ధికి తోడ్పడేలా, నిఫ్టీ 50 టీఆర్ఐతో పోలిస్తే పోర్ట్‌ఫోలియోలో ఒడిదుడుకులు తక్కువ స్థాయికి పరిమితమయ్యేలా చూసే పెట్టుబడి ధోరణిని ఇది అమలు చేస్తుంది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ డిసెంబర్ 2 వరకు అందుబాటులో ఉంటుంది. ఈక్విటీలు, ఈక్విటీ సంబంధ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసే ఈ ఫండ్.. ప్రధానంగా తక్కువ ఒడిదుడుకులు ఉండే లార్జ్ క్యాప్ స్టాక్స్‌కి ఎక్కువ వెయిటేజీనిస్తూ నిధులను కేటాయిస్తుంది. ఇది రిస్కులను తగ్గించేందుకు, పోర్ట్‌ఫోలియోను పటిష్టంగా తీర్చిదిద్దేందుకు కనిష్ట వేరియన్స్ విధానాన్ని అమలు చేస్తుంది.

యాక్సిస్ ఎంఎఫ్ నుంచి ముమెంటమ్ ఫండ్

ఇటీవల ప్రాచుర్యంలోకి వస్తున్న ముమెంటమ్ ఇన్వెస్టింగ్ విధానానికి సంబంధించి యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా ముమెంటమ్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఇది పెరిగే ధోరణిలో ఉన్న సెక్యూరిటీలను 'అధిక ధరలో కొని, మరింత ఎక్కువ రేటుకు విక్రయించడం' అనే సూత్రాన్ని పాటిస్తుంది. వివిధ రంగాల్లో అత్యధికంగా ముమెంటమ్ కనపరుస్తున్న స్టాక్స్‌ను ఎంపిక చేసి, వాటిలో ఇన్వెస్ట్ చేస్తుంది. ఇందుకోసం కఠినతరమైన క్వాంటిటేటివ్ విశ్లేషణను ఉపయోగిస్తుంది. లిక్విడిటీ, ధర కదలికల మదింపు, కాంపోజిట్ ర్యాంక్, స్టాక్‌పరంగా ఉండే రిస్కులు, పోర్ట్‌ఫోలియోకి ఉండే పరిమితులు మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకుంటుంది. ఈ ఫండ్ డిసెంబర్ 6 వరకు అందుబాటులో ఉంటుంది. కనీసం రూ. 100 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. దీనికి నిఫ్టీ 500 టీఆర్ఐ ప్రామాణికంగా ఉంటుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

మార్కెట్లు పుంజుకునే చాన్స్	పెట్టుబడులకు మెరుగైన వైవిధ్యం

సారేగామా ఇండియా | బ్రోకరేజ్: ఎమ్‌కే గ్లోబల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 458 టార్గెట్: రూ. 580

ఎందుకంటే: మ్యూజిక్ లేబుల్ కంపెనీ సారేగామా ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) జులై–సెప్టెంబర్(క్యూ2)లో వార్షిక ప్రాతిపదికన పటిష్ఠ ఫలితాలు వెలువరించింది. దీంతో మ్యూజిక్ లైసెన్సింగ్ ఆదాయం మందగించిన అంశం మరుగున పడింది. వీడియో విభాగం ప్రధానంగా జోరు చూపడంతో కన్సాలిడేటెడ్ టర్నోవర్ 40 శాతంపైగా జంప్‌చేసింది. ఎంపిక చేసిన పలు ప్లాట్‌ఫామ్స్ పెయిడ్ విధానంలోకి మారినప్పటికీ మ్యూజిక్ లైసెన్సింగ్ ఆదాయం 8 శాతమే వృద్ధి చూపింది. ఈ కాలంలో 25.2 శాతం నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు అందుకుంది. ఇవి అంచనాలకంటే తక్కువే. ఇందుకు తక్కువ మార్జిన్ల వీడియో విభాగం అమ్మకాలు పుంజుకోవడం, కంటెంట్ పెట్టుబడులు పెరిగిపోవడం ప్రభావం చూపాయి. అయినప్పటికీ కంపెనీ యాజమాన్యం మధ్యకాలానికి ఆదాయం, మార్జిన్ల వృద్ధిపై గతకాలపు అంచనాలను కొనసాగిస్తోంది. కాగా.. మ్యూజిక్ లైసెన్స్ విభాగం ఆదాయం పుంజుకోవడం భవిష్యత్‌లో ప్రధానంగా కంపెనీకి లబ్ధిని చేకూర్చగలదని భావిస్తున్నాం. సీజనాలిటీని అధిగమించడంతో ఈ ఏడాది ద్వితీయార్థం(అక్టోబర్–మార్చి)లో మెరుగైన పనితీరు చూపడం ద్వారా తొలి అర్ధభాగ(ఏప్రిల్–సెప్టెంబర్) బలహీనతలను అధిగమించగలదని అంచనా. ప్రధాన రిస్కులను పరిశీలిస్తే డిమాండ్ అనిశ్చితుల నేపథ్యంలో ఫలితాలు అంచనాలను అందుకోలేకపోవచ్చు. మ్యూజిక్ లైసెన్సింగ్ ఆదాయం నీరసించడం, మార్జిన్ల మందగమనం షేరు పెరుగుదలపై ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశముంది.

స్టాక్స్ వ్యూ

అమరరాజా ఈ & ఎం | బ్రోకరేజ్: షేర్‌ఖాన్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,232 టార్గెట్: రూ. 1,638



ఎందుకంటే: ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం(జులై–సెప్టెంబర్)లో అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ అమ్మకాల పరిమాణం టెలికం, 4వీలర్ ఓఈఎం విభాగాలలో నీరసించింది. దీంతో ఆదాయ వృద్ధికి విఘాతం ఏర్పడింది. అయితే ఇతర పలు విభాగాలలో పటిష్ఠ అమ్మకాలు సాధించింది. ఇక మరోవైపు అధిక ట్రేడింగ్ మిక్స్‌కుతోడు.. ఇంధనాలపై(గత కాలపు) లెవీకిగాను రూ. 15 కోట్ల ప్రొవిజన్లు చేపట్టడం నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లను దెబ్బతీసింది. కాగా.. క్యూ2 ప్రారంభానికిముందు సెకండరీ(ఆఫ్టర్) మార్కెట్లో ప్రొడక్టులపై సగటున 1.5 శాతం ధరలు పెంచింది. దీంతో నికర లాభం అంచనాలను అందుకోలేకపోయింది. అయినప్పటికీ అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో లెడ్ రీసైక్లింగ్ ప్లాంట్ అందుబాటులోకి రానున్నట్లు కంపెనీ యాజమాన్యం ప్రకటించింది. దీంతోపాటు.. జనవరి–మార్చి(క్యూ4)లో ట్యూబులర్ బ్యాటరీ ప్లాంటు ఉత్పత్తి ప్రారంభంకానున్నట్లు తెలియజేసింది. వెరసి భవిష్యత్‌లో మార్జిన్లు బలపడేందుకు వీలున్నట్లు భావిస్తున్నాం. క్యూ2 పనితీరు విశ్లేషణ తదుపరి రీప్లేస్‌మెంట్ మార్కెట్లో జోరందుకోనున్న అంచనాలు, లిథియాన్ సెల్ బిజినెస్‌లో లభించనున్న అవకాశాలు కంపెనీకి ఆకర్షణను తీసుకువచ్చే అవకాశముంది. ముడివ్యయాలలో ఆటుపోట్ల పరిస్థితులు, రీప్లేస్‌మెంట్ డిమాండ్‌లో దిద్దుబాటు, పెరుగుతున్న పోటీ కంపెనీకి ప్రతికూల అంశాలుగా పేర్కొనవచ్చు. లిథియాన్ ప్రాజెక్టుపై భారీగా ఇన్వెస్ట్ చేస్తుండటాన్ని రిస్కులలో ఒకటిగా పరిగణించాలి. డిమాండ్ అనిశ్చితుల నేపథ్యంలో ప్రాజెక్ట్ ఎగ్జిక్యూషన్ రిస్కులకు ఇది దారితీసే వీలుంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

న్యాయవ్యవస్థకు ఏఐ ఊతం

3 ఏఐ టూల్స్, 31 ఈ-సేవా కేంద్రాల ప్రారంభోత్సవంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ

సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న కృత్రిమ మేథ (ఏఐ) న్యాయవ్యవస్థకు ఊతంగా నిలుస్తోందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ అభిప్రాయపడ్డారు. సికింద్రాబాద్‌లోని రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధేతో కలసి జస్టిస్ నరసింహ 31 తాలూకా కోర్టుల్లో ఈ-సేవా కేంద్రాలను ప్రారంభించారు. అలాగే 3 ఏఐ టూల్స్ శ్రుతి, సారాంశ్, పాణినిలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐ టూల్స్ శ్రుతి, సారాంశ్, పాణినిలను న్యాయవ్యవస్థ కుటుంబ సభ్యులుగా ఆయన అభివర్ణించారు. వాటిని శ్రీమతి శ్రుతి, శ్రీమతి సారాంశ్, శ్రీ పాణినిగా సంబోధించారు. ఇకపై 'వారు'న్యాయ వ్యవస్థతో కలసి పనిచేస్తారంటూ చమత్కరించారు.

తెలుగు భాషను మరవద్దు..

'ఎందరో మహానుభావులు.. అందరికీ వందనాలు. 31 జిల్లాలు, 31 తాలూకా కోర్టుల్లో ఈ-కేంద్రాలను నెలకొల్పడం అభినందనీయం. వేములవాడ, ఇల్లందు కోర్టులతో న్యాయవాదిగా నాకు అనుబంధం ఉంది. సామాన్యులకు న్యాయ సేవలను సులభతరం చేయాలి. శ్రుతి, సారాంశ్, పాణి.. మన కుటుంబంలోకి వచ్చిన కొత్త సభ్యులు. 'శ్రుతి'తో లీగల్ డాక్యుమెంట్లు తెలుగులోకి అనువాదం ఎంతో సంతోషాన్నిచ్చింది. పేజీలకు పేజీలు ఉండే తీర్పు ప్రతులను సారాంశ్‌తో తగ్గించుకోవచ్చు. భాషాప్రయుక్త రాష్ట్రాలుగా దేశం విడిపోయింది. స్థానిక భాషకు విలువ ఇచ్చి గౌరవించాలి. పాణినితో తీర్పు, ఇతర వివరాలు తెలుగులో పొందవచ్చు. కన్నతల్లి కన్నుమూస్తేగానీ ఆమె విలువ ఏమిటో తెలియదు. అలాగే తెలుగు భాష కూడా. మనీ భాషలు ఎన్ని వచ్చినా మన భాషను మరవద్దు. తాలూకా, జిల్లా కోర్టుల్లో తెలుగులో వాదనలు జరిగే రోజు రావాలి. ఈ-సేవా కేంద్రాలతో ప్రజల చెంతకు న్యాయవ్యవస్థ చేరనుంది. సాంకేతికతను అనుసంధానం చేసుకొని పల్లెకు దరిచేరాలి. సత్యమే భూషణం అనే విషయాన్ని సిబ్బంది గుర్తుంచుకోవాలి'అని సూచించారు. సాంకేతిక నిరక్షరాస్యులకు ఈ-సేవా కేంద్రాలు తోడ్పాటు అందిస్తాయన్నారు. అలాగే తీర్పులు, ఉత్తర్వులు, లీగల్ డాక్యుమెంట్లు కోర్టు సిబ్బందికి తెలుగులో అందుబాటులోకి తేవడం ఉపయుక్తకరమన్నారు.



ఏఐ టూల్స్‌ను ఆవిష్కరిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ, హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే

ఏఐతో పని భారం తగ్గుతుంది: జస్టిస్ అరాధే

కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ 'తాలూకా కోర్టుల్లో ఈ సేవా కేంద్రాలు ప్రారంభించడం ఆనందదాయకం. ఈ కేంద్రాలు గ్రామీణులకు ఉపయుక్తకరం. కేసు వివరాలు, కోర్టు ఫీజుల చెల్లింపు.. ఇలా పలు సేవలు అందుబాటులో ఉంటాయి. కృత్రిమ మేథతో న్యాయవ్యవస్థలోనూ పని భారం తగ్గనుంది. శ్రుతి, సారాంశ్, పాణిని కీలక పాత్ర పోషించనున్నాయి'అని పేర్కొన్నారు. జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ.. 'సమన్లు, వారెంట్లు ఎలక్ట్రానిక్ రూపంలో పంపడం కోసం ఇప్పటికే ఎన్-స్టెప్ ప్రారంభమైంది. ఈ- సేవా కేంద్రాలతో గ్రామీణులకు న్యా యవ్యవస్థ మరింత చేరవకానుంది. ఉచిత న్యాయ సాయం, ఈ-చలాన్ల చెల్లింపు, ఈ-ఫైలింగ్, ఈ-సంతకం, ఈ-ములాఖత్, ఆర్‌టీఐ.. ఇలా పలు సేవలు 31 కోర్టుల్లో అందుబాటులోకి రానున్నాయి'అని చెప్పా రు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, జిల్లా జడ్జీలు, రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

ఏఐ టూల్స్ ఉపయోగం ఇలా..
సాక్షి ప్లస్ (ఈపేపర్)లో

రాజ్యాంగ పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలి: ప్రొ.నాగేశ్వర్



ఖమ్మం మయూరిసెంటర్: గాంధీజీ చెప్పినట్లు రాజ్యం.. మతం ఒకటి కాదని, రాజ్యాంగాన్ని పరిరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థి, ప్రముఖ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్నారు. భారత రాజ్యాంగం మతానికి వ్యతిరేకం కాదని, మతోన్మాదానికి మాత్రమే వ్యతిరేకమని చెప్పారు. ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజం పట్ల స్పందించే గుణాన్ని ఎస్ఎఫ్ఐ నేర్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ పాల్గొన్నారు.

భక్త'కోటి దీపోత్సవం'

ఒకే వేదికపై పంచభూతలింగ సహిత ద్వాదశ జ్యోతిర్లింగారాధన



కవాడిగూడ (హైదరాబాద్): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నగరంలోని ఎన్టీఆర్ స్టే డియంలో భక్తి టీవీ, రచన టెలివిజన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవాలు ఆదివారానికి 16వ రోజుకు చేరుకున్నాయి. వేడుకల్లో ఒకే వేదికపై పంచభూత లింగ సహిత, ద్వాదశ జ్యోతిర్లింగారాధన నిర్వహించారు. కోటి దీపోత్సవ వేదికపై తొలి సారిగా ఆకాశలింగ క్షేత్రం, చిదంబరం నటరాజ స్వామి, శివకామసుందరీ అమ్మవార్ల కల్యాణం అత్యంత వైభవంగా కన్నుల పండువగా జరిగింది. భక్తుల మధ్య పల్లకీలో ఆదిదంపతుల ఊరేగింపును కోటి దీపోత్సవ ప్రాంగణంలో నిర్వహించారు. తిరుపతి రామకృష్ణమఠం శ్రీ సుకృతానందస్వామి, విశాఖపట్నం రామకృష్ణమఠం శ్రీ స్వసంవేద్యానంద స్వామి, రామకృష్ణమఠం స్వామీజీలు భక్త జనానికి ఆశీ ర్వచనం అందించగా.. డాక్టర్ ధూళిపాళ మహాదేవమణి ప్రవచనామృతాలు వినిపించారు.


నేటి భవితలో..

- ఎంబీఏ స్పెషల్:
ఐఐఎంల్లో సమ్మర్ ప్లేస్‌మెంట్స్ జోష్!
రెండు నెలల ఇంటర్న్‌షిప్ చేస్తే రూ.2 లక్షల స్టయిఫండ్! ఆ తర్వాత అదే కంపెనీల్లో శాశ్వత కొలువులు సైతం సొంతం చేసుకునే అవకాశం! ఫైనల్ ప్లేస్‌మెంట్స్‌లో ఎలాంటి టెన్షన్ లేకుండా ఎస్‌పీఓ ద్వారా ముందుగానే ఫైనల్ ఆఫర్‌కు మార్గం సుగమం చేసుకోవచ్చు!! దేశంలో ప్రతిష్ఠాత్మక మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్.. .ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) క్యాంపస్‌ల్లో సమ్మర్ ప్లేస్‌మెంట్స్ ఆఫర్లు వెల్లువెత్తుతున్నాయి. 2024-26 బ్యాచ్ పీజీపీ విద్యార్థులకు సగటున రూ.2 లక్షల స్టయిఫండ్‌తో సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ లభించాయి! ఈ నేపథ్యంలో.. ఐఐఎంల్లో ఎస్‌పీఓ తాజా ట్రెండ్స్, భవిష్యత్ అవకాశాలపై ప్రత్యేక కథనం.
- విద్య, ఉద్యోగ సమాచారం.

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


కరెంట్ కోసం ఖాళీ చేసేస్తున్నారు!



'శ్రీశైలం'లో పడిపోతున్న నిల్వలు!

- కృష్ణా బోర్డు సూచనలను బేఖాతరు చేస్తూ ఇరు రాష్ట్రాల విద్యుదుత్పత్తి
- రోజూ సగటున 40 వేల క్యూసెక్కుల వినియోగం
- వేసవిలో తాగు, సాగునీటికి పొంచి ఉన్న ముప్పు
- గతేడాది తరహా పరిస్థితులు ఉత్పన్నమయ్యే ప్రమాదం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఏపీ పోటీపడి జలవిద్యుదుత్పత్తి చేయడంతోపాటు సాగు, తాగునీటి అవసరాలకు రోజూ సగటున 40 వేల క్యూసెక్కుల నీటిని వాడుకుంటుండటంతో శ్రీశైలం జలాశయంలో నిల్వలు వేగంగా పడిపోతున్నాయి. శనివారం ఉదయం 6 గంటలకు సేకరించిన నీటి వినియోగ లెక్కల ప్రకారం విద్యుదుత్పత్తి ద్వారా తెలంగాణ 35,315 క్యూసెక్కులను దిగువన సాగర్‌కు విడుదల చేస్తుండగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 8 వేల క్యూసెక్కులు, మల్యాల నుంచి హంద్రీ–నీవా సుజల స్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్) కాల్వకు 1,688 క్యూసెక్కులను ఏపీ తరలిస్తోంది. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా తెలంగాణ 1,600 క్యూసెక్కులను తోడుకుంటోంది. ప్రస్తుత నీటి సంవత్సరంలో శ్రీశైలం జలాశయానికి ఏకంగా 1,532.67 టీఎంసీల వరద వచ్చింది. జలాశయ గరిష్ట నీటినిల్వ సామర్థ్యం 215 టీఎంసీలకుగాను ప్రస్తుతం 149.42 టీఎంసీల నిల్వలు మాత్రమే మిగిలి ఉండటం గమనార్హం.



కృష్ణా బోర్డు సూచనలు బేఖాతరు!

మళ్లీ వర్షాకాలం వచ్చే వరకు శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లోని నిల్వలను సాగు, తాగునీటి అవసరాల కోసం సంరక్షించాలని కృష్ణా బోర్డు ఇరు రాష్ట్రాలకు ఇటీవల పలుమార్లు లేఖలు రాసింది. రెండు జలాశయాల్లో విద్యుదుత్పత్తిని తక్షణమే ఆపాలని కోరింది. దిగువ ప్రాంతాల్లో తాగు, సాగునీటి అవసరాలను తీర్చడానికే నీటిని తీసుకోవా లని సూచించింది. ఏపీ పునర్విభజన చట్టంలోని షెడ్యూల్–11లో జలవిద్యుత్‌కు అత్యల్ప ప్రాధా న్యత కల్పించిన విషయాన్ని గుర్తు చేసింది. అయితే బోర్డు సూచనలను ఇరు రాష్ట్రాలు బేఖాతరు చేస్తుండటంతో వేసవి ప్రారంభానికి ముందే శ్రీశైలం జలాశయంలో నిల్వలు అడుగంటిపోయే ప్రమాదముంది. అదే జరిగితే వేసవిలో సాగు, తాగు నీటి అవసరాలకు ఇబ్బందులు తప్పవు.

గతేడాది తాగు, సాగునీటికి కటకట

గతేడాది తీవ్ర వర్షాభావం నెలకొనడంతో శ్రీశైలం జలాశయం నిండలేదు. ఈ నేపథ్యంలో ఉన్న నిల్వలను తాగు, సాగునీటి అవసరాలకు పొదుపుగా వాడుకోవాలని.. జలవిద్యుదుత్పత్తి చేయొద్దని కృష్ణా బోర్డు కోరినా ఇరు రాష్ట్రాలు పోటాపోటీగా విద్యుదుత్పత్తి చేపట్టాయి. దీంతో గతేడాది సరిగ్గా ఇదే సమయానికి జలాశయంలో నిల్వలు 61.55 టీఎంసీలకు పడిపోయాయి. దీంతో గతే డాది వేసవిలో తాగు, సాగునీటికి రెండు రాష్ట్రాల్లోతీవ్ర ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి.

నేడు కృష్ణా బోర్డు భేటీ..

హైదరాబాద్‌లోని జలసౌధలో సోమవారం కృష్ణా బోర్డు సమావేశం జరగనుంది. ఈ భేటీలో శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో విద్యుదుత్పత్తి అంశంపై ఇరు రాష్ట్రాల మధ్య వాడీవేడి చర్చ జరిగే అవకాశం ఉంది. రెండు జలాశయాలను జలవిద్యుదుత్పత్తి అవసరాల కోసమే నిర్మించారని చాలా కాలంగా తెలంగాణ వాదిస్తోంది. రెండు జలాశయా ల్లోని తమ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో పూర్తి స్థాపిత సామర్థ్యం మేరకు విద్యుదుత్పత్తి నిర్వహించాలని తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో)ను ఆదేశిస్తూ గత బీఆర్ఎస్ ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన కేసుపై విచారణ జరుగుతోంది. కృష్ణా బోర్డు భేటీలో ఇరు రాష్ట్రాలకు బోర్డు మళ్లీ కొత్త సూచనలు చేసే అవకాశం ఉంది.

రాజ్‌భవన్‌లో మెగా వైద్య శిబిరం



సాక్షి, హైదరాబాద్: కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయం సహకారంతో రాజ్‌భవన్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదివారం ప్రారంభించారు. అల్లోపతి, ఆయుర్వేద, డెంటల్, పారా మెడికల్ బృందాలు రాజ్ భవన్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించాయి. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఈ సందర్భంగా గవర్నర్ సూచించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి. వెంకటేశం, గవర్నర్ జాయింట్ సెక్రటరీ జె.భవానీ శంకర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వే వివరాల నమోదు చకచకా..



ఆదివారం యాదాద్రి జిల్లా భువనగిరి మున్సిపాలిటీ కార్యాలయ సమావేశం మందిరంలో సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

ఆలయానికి వ్రత శోభ



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 1,648 వ్రతాలు జరిగాయి. సత్యనారాయణస్వామి వ్రతాలతో పాటు వివిధ విభాగాల ద్వారా నిత్యాదాయం రూ.79,70,843 వచ్చినట్లు దేవస్థానం ఈవో భాస్కర్‌రావు వెల్లడించారు. ఇందులో కేవలం సత్యనారాయణస్వామి వ్రతాల ద్వారానే రూ.13,18,400 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. - యాదగిరిగుట్ట


నిరుపేద చిన్నారికి ప్రజాభవన్‌లో బర్త్‌డే వేడుక



ప్రజాభవన్‌లో పుట్టిన రోజు వేడుక జరుపుకుంటున్న నిరుపేద చిన్నారి

కొత్తగూడ: నిరుపేద చిన్నారి షైనీ పుట్టిన రోజు వేడుకలు మంత్రి సీతక్క ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రి కుమారుడు సూర్య ఆదివారం ఘనంగా జరిపించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రానికి చెందిన స్వప్న–శ్రీకాంత్ దంపతుల కుమార్తె షైనీ గుండెకు రంధ్రాలతో జన్మించింది. తప్పనిసరి ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలపడంతో మాజీ సర్పంచ్ రణధీర్ చొరవ తీసుకుని దాతల సహకారంతో పాటు ప్రభుత్వం నుంచి ఎల్‌ఓసీ ఇప్పించి ఆపరేషన్ చేయించాడు. ఆపరేషన్ విజయవంతం అయి డిశ్చార్జ్ చేసిన రోజే చిన్నారి పుట్టిన రోజు కావడంతో సీతక్క ప్రజాభవన్‌లోని తన నివాసంలో వేడుకలు నిర్వహించాలని సూచించారు. పాప చదువు బాధ్యత తామే చూసుకుంటామని సూర్య, వైద్య ఖర్చులు భరిస్తానని మాజీ సర్పంచ్ హామీ ఇచ్చి ఇంటికి పంపించారు. ఈ సందర్భంగా పాప తల్లిదండ్రులు మంత్రి సీతక్క, సూర్య, రణధీర్, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏఐ టూల్స్ ఉపయోగం ఇలా..



సాక్షి, హైదరాబాద్: న్యాయవ్యవస్థ కార్యకలాపాల్లో దోహదపడేందుకు వీలుగా తాజాగా అందుబాటులోకి వచ్చిన మూడు కృత్రిమ మేథ (ఏఐ) టూల్స్ శ్రుతి, సారాంశ్, పాణిని ఎలా పనిచేస్తాయి.. కోర్టు సిబ్బందికి అవి ఎలా సహాయపడతాయి? వాటి వివరాలు ఇలా..

ఏఐ శ్రుతి...

ఆటోమేటిక్ స్పీచ్ రికగ్నిషన్ (ఏఎస్ఆర్) అంటే.. మనం మాట్లాడే పదాలను రాతపూర్వకంగా మార్చే టూల్. స్టెనోగ్రాఫర్ల లోటును ఇది భర్తీ చేస్తుంది. దీని సాయంతో న్యాయమూర్తులు చెప్పే మధ్యంతర ఉత్తర్వులు, తీర్పులను నేరుగా రాతపూర్వక రూపంలోకి మార్చుకోవచ్చు. పదాలు సరిగా వచ్చాయా లేదా.. అని సరి చూసుకొనే అవకాశం కూడా ఇందులో ఉంది. కోర్టు సిబ్బందికి ఇది శ్రమను తగ్గిస్తుంది. దీన్ని స్పీచ్ టు టెక్స్ట్ అని కూడా అంటారు. ఆంగ్లంలోనే కాదు.. తెలుగు, హిందీ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, తమిళం, కన్నడ భాషల్లోనూ దీన్ని వినియోగించుకోవచ్చు. ఈ టెక్స్ట్‌ను పీడీఎఫ్ ఫార్మాట్‌లో కాపీని పొందవచ్చు.

సారాంశ్...

ఇది పూర్తి సుదీర్ఘ కంటెంట్‌లోని ప్రధాన అంశాలను అందిస్తుంది. పేజీలకు పేజీల తీర్పుల్లోని సారాంశం కావాలనుకున్నప్పుడు ఈ టూల్ ఉపయోగపడుతుంది. కచ్చితమైన సారాంశాన్ని రూపొందించమే ఈ సారాంశ్ పని.

పాణిని...

ఇది ఒక ట్రాన్స్‌లేటర్‌లా పనిచేస్తుంది. కోర్టుకు సంబంధించిన వివిధ డాక్యుమెంట్లను ఆంగ్లం నుంచి తెలుగులోకి మార్చుకోవచ్చు. ఆంగ్లం నుంచి దేశంలోని పలు భాషల్లోకి.. ఇటు నుంచి అటు మార్చుకోవచ్చు. 11 భాషల్లోకి అనువాదం చేయగల టూల్ ఈ పాణిని. తెలుగుతోపాటు అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, హిందీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒరియా, పంజాబీ, తమిళంలోకి అనువదించగలదు.

ఈ-సేవలో కక్షిదారులకు అందే సేవలు..

- కేసు స్థితి, తదుపరి విచారణ తేదీ, ఇతర విచారణ వివరాలు
- కావాల్సిన డాక్యుమెంట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు
- హార్డ్ కాపీ పిటిషన్లను స్కానింగ్ మొదలు ఈ–సంతకం చేర్చడం, సీఐఎస్ వరకు అప్‌లోడ్ చేసి ఎస్ఆర్ నంబర్ సృష్టించడం
- ఈ–స్టాంప్ పేపర్ల కొనుగోలు/ఈ–చెల్లింపులు ఆన్‌లైన్‌లో చేయడానికి సాయం
- జైలులోని బంధువులను కలుసుకోవడానికి ఈ–ములాఖత్ కోసం బుకింగ్ సదుపాయం
- న్యాయమూర్తులు సెలవులో ఉంటే వివరాలు తెలుసుకోవచ్చు
- సుప్రీంకోర్టు నుంచి స్థానిక కోర్టుల వరకు న్యాయ సహాయ కమిటీల నుంచి ఉచిత న్యాయసేవను ఎలా పొందవచ్చో తెలుసుకోవచ్చు
- తీర్పులు, మధ్యంతర ఉత్తర్వుల కాపీలను ఈ–మెయిల్, వాట్సాప్ ద్వారా పొందవచ్చు


రేపు అన్ని గ్రామాల్లో 'ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు'

ఉత్తర్వులు జారీ చేసిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈనెల 26న రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 'ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాలు'నిర్వహించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులను కూడా ప్రారంభించాలని నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా రాజ్యాంగ దినోత్సవాన్ని కూడా నిర్వహించనుంది. ప్రజాపాలన – ప్రజా విజయోత్సవాల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ డాక్టర్ జి.సృజన ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం కింద కనీసం ఒక పనినైనా స్థానిక మంత్రి, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్లమెంటు సభ్యులు లేదా ఇతర ప్రజాప్రతినిధులతో ప్రారంభించాలని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. రాజ్యాంగ దినోత్సవానికి సంబంధించిన వివరాలు అమృత్ సరోవర్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ ఉత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.



ప్రజాపాలన విజయోత్సవాల నేపథ్యంలో త్రివర్ణ కాంతుల్లో మెరిసిపోతున్న అసెంబ్లీ, సచివాలయం



వల వేస్తే.. కొండచిలువ



చేపల కోసం వల వేస్తే.. కొండ చిలువ చిక్కింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన ఈ సంఘటన వివరాలివి. స్థానిక ఎల్లమ్మ చెరువులో శనివారం సాయంత్రం చేపల కాంట్రాక్టర్‌కు సంబంధించిన సిబ్బంది బోట్‌లో తిరుగుతుండగా, దొంగచాటున వల వేసి చేపలు పడుతున్న ఓ వ్యక్తిని గమనించారు. సిబ్బందిని చూసిన ఆ వ్యక్తి వలను వదిలేసి పారిపోయాడు. అప్పటికే చీకటి పడటంతో.. సిబ్బంది ఆ వలను బోట్‌లో వేసుకొని ఆదివారం ఉదయం చెరువు కట్ట పైకి తెచ్చారు. వలను చూసేసరికి ముడుచుకొని ఉన్న కొండ చిలువ కనపడటంతో బెంబేలెత్తారు. వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మహమ్మద్ ఫరాద్ రెస్క్యూ టీమ్‌తో చెరువు కట్టకు చేరుకుని కొండ చిలువను తీసుకెళ్లారు. కొండచిలువను అటవీ ప్రాంతంలో వదిలిపెడతామని ఆయన తెలిపారు.

– హుస్నాబాద్



'ద్వీపం'లో కార్తీక సందడి



కార్తీకమాసం సందర్భంగా పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడుతున్నాయి. విజయవాడ భవానిపురంలోని భవానీ ద్వీపంలో ఆదివారం పిల్లలు పెద్దలు కుటుంబ సమేతంగా ద్వీపానికి వచ్చి వనభోజనాలు చేస్తూ ఉల్లాసంగా గడిపారు . - విజయవాడ

స్పెల్ బీకి విశేష స్పందన



'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన స్పెల్ బీ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పాఠశాల విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా నెల్లూరులో జరిగిన పోటీలకు హాజరైన విద్యార్థుల చిత్రమిది. - సాక్షి, ఫొటోగ్రాఫర్, నెల్లూరు

ఉల్లాసంగా..ఉత్సాహంగా



వారాంతం కావడంతో విశాఖపట్నంలోని ఆర్‌కే బీచ్‌కు పర్యాటకులు పోటెత్తారు. అన్ని వయసుల వారు తీరం వద్ద ఉత్సాహంగా గడిపారు. దీంతో బీచ్ పరిసర ప్రాంతాలన్నీ జనసందోహంగా మారిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. - సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

డిజిటల్ అరెస్ట్..బీ అలెర్ట్!

కర్ణాటకలో పెరిగిన ఘటనలు / లక్షలాది రూపాయలు పోగొట్టుకుంటున్న వైనం / అప్రమత్తంగా ఉండటమే పరిష్కారమంటున్న పోలీసులు

''చట్టంలో డిజిటల్ అరెస్టు అనే వ్యవస్థే లేదు.. డిజిటల్ అరెస్టు చేయడమనేది పూర్తిగా అబద్ధం. క్రిమినల్ గ్యాంగులు, మోసగాళ్లు, ఆన్‌లైన్ దొంగలు చేసే పనే ఈ డిజిటల్ అరెస్టు''
– 115వ మన్‌కీబాత్ రేడియో కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.

కేస్-1

ఆయన పేరు ఎల్ఎస్ ఆనంద్..వయసు 72 ఏళ్లు..కర్ణాటకలోని శివమొగ్గ నగరం గోపాళ లేఅవుట్‌లో నివాసం.. ఒకరోజు హఠాత్తుగా ఆయనకు సీబీఐ అధికారినంటూ ఒక వీడియో కాల్ వచ్చింది. మీ ఆధార్ కార్డు నంబర్‌లో పెద్ద మొత్తంలో డబ్బులు అక్రమ బదిలీ జరిగింది. దీంతో మీపై ఫిర్యాదు అందింది.. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నామంటూ ఆనంద్‌ను భయపెట్టారు. ఆ తర్వాత ఆనంద్‌ను భయపెట్టి రూ.41 లక్షలను దోచుకున్నారు. డబ్బులు కోల్పోయిన తర్వాత శివమొగ్గ సైబర్ పోలీస్‌స్టేషన్‌ను ఆనంద్ ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహమ్మద్ అహ్మద్ (45), అభిషేక్ షేఖ్ (27) అనే ఇద్దరిని అరెస్ట్ చేశారు.

కేస్-2

తుమకూరు నగరం విద్యానగరకు చెందిన జి.విజయాదిత్య పాటిల్ ఇంజినీర్. నవంబర్ 13న ఆయనకు ముంబై ఫెడెక్స్ కొరియర్ సర్వీస్ నుంచి కాల్ చేస్తున్నట్లు కాల్ వచ్చింది. అదే రోజు సాయంత్రం ముంబై సైబర్ సెల్ నుంచి మాట్లాడుతున్నట్లు నమ్మించారు. మీరు ముంబై నుంచి ఇరాన్‌కు పంపిస్తున్న పార్సిల్‌లో 5 పాస్‌పోర్టులు, ఎండీఎంఏ అనే డ్రగ్స్ ఉన్నట్లు విజయాదిత్యను భయపెట్టారు. విచారణ నిమిత్తం స్కైప్‌లోకి రావాలని పిలిచారు. ఆ మరుసటి రోజు డిజిటల్ అరెస్ట్ నుంచి తప్పించుకోవాలంటే డబ్బులు ఇవ్వాలని బెదిరించి రూ.33.99 లక్షలను బాధితుడి నుంచి బదిలీ చేయించుకున్నారు. ఆ తర్వాత గూగుల్‌లో ముంబై సైబర్ సెల్ సమాచారాన్ని సేకరించి కాల్ చేయగా, తాను మోసపోయానని విజయాదిత్య గ్రహించాడు.

కేస్-3

సీబీఐ అధికారి అంటూ ఫోన్ కాల్‌లో బెదిరించడమే కాకుండా డిజిటల్ అరెస్టు ద్వారా లక్షలాది రూపాయలను మోసం చేసిన నిందితుడిని కావూరు పోలీసులు అరెస్టు చేశారు. కేరళ ఎర్నాకులం జిల్లా అలువా తాలూకాకు చెందిన నిసార్ అనే నిందితుడు డిజిటల్ అరెస్టు ద్వారా రూ. 68 లక్షలను దోచుకున్నట్లు మంగళూరు నగర పోలీసు కమిషనర్ అనుపమ్ అగర్వాల్ తెలిపారు.

సాక్షి, బెంగళూరు: డిజిటల్ సాంకేతికతలు పెరుగుతున్నట్లే అదే స్థాయిలో మోసాలు కూడా పెరుగుతున్నాయి. దైనందిన జీవితంలో సమాచార సాంకేతికతను ఎంతగా వినియోగిస్తున్నామో అంతే స్థాయిలో వాటి వల్ల ప్రతికూలతలు కూడా ఉన్నాయి. ఇటీవల కాలంలో సామాన్య ప్రజలను చాలా సులభంగా డిజిటల్ అరెస్టు ద్వారా సైబర్ నేరస్తులు మోసం చేస్తున్నారు. ఇలాంటి తరహా కేసులు ప్రభుత్వాలకు సవాలుగా మారాయి. ఎలాంటి శ్రమ లేకుండా ఆదాయం ఆర్జించే మార్గాల్లో డిజిటల్ అరెస్టు ఒకటిగా సైబర్ మోసగాళ్లు మార్చుకున్నారు. సైబర్ మోసగాళ్లు అత్యాధునికతను ఉపయోగించుకుని తమ వర్చ్యువల్ మార్కెట్‌ను విస్తరించుకుంటున్నారు. ప్రారంభంలో క్రెడిట్, డెబిట్ కార్డుల సమాచారం , ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు తదితర వాటి ద్వారా ప్రజలు మోసం చేసేవారు. తాజాగా డిజిటల్ అరెస్ట్ ద్వారా కొత్తగా దోపిడీ మార్గాన్ని ఎన్నుకున్నారు.

కర్ణాటకలో ప్రస్తుతం డిజిటల్ అరెస్టు మోసాలు పెరిగిపోతున్నాయి. ఆన్‌లైన్ సైబర్ మోసాలు రోజురోజుకి కొత్త పుంతలు తొక్కుతున్నాయి. తాజాగా సంతరించుకున్న రూపమే డిజిటల్ అరెస్ట్. ఈ తరహా సైబర్ మోసానికి గురై చాలా మంది లక్షలాది రూపాయలను కోల్పోతున్నారు. ఈ పద్ధతిపై ఇటీవల జరిగిన మన్‌కీ బాత్‌లో కూడా ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలను అప్రమత్తం చేశారు. కర్ణాటకలో జరిగిన ఒక కేసును ఉటంకిస్తూ ప్రజలను హెచ్చరించారు. ముంబై పోలీసుల పేరిట కర్ణాటక విజయపుర సంతోష్ చౌధురి అనే వ్యక్తిని బ్లాక్‌మెయిల్ చేసేందుకు యత్నించిన ఘటనను ప్రధాని ప్రస్తావించి డిజిటల్ అరెస్ట్‌పై హెచ్చరించారు. ఈ సైబర్ మోసాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండి, తమ ఆధార్, ఓటీపీ, బ్యాంక్ అకౌంట్ నంబర్ తదితర వివరాలను గోప్యంగా ఉంచాలని పోలీసులు సూచిస్తున్నారు.



ఏంటీ డిజిటల్ అరెస్ట్..??

సామాన్య అర్థంలో డిజిటల్ అరెస్టు అంటే సైబర్ మోసగాళ్లు.. అమాయకులను లక్ష్యంగా చేసుకుని తాము పోలీసులు, ఈడీ, సీబీఐ, ఐటీ, ఆర్‌బీఐ, నార్కోటిక్స్, కస్టమ్స్ అధికారులమంటూ చెప్పుకుని మోసం చేయడమే. ప్రజలకు అధికారులమంటూ కాల్ చేసి, వారిని నకిలీ గుర్తింపు కార్డుల ద్వారా నమ్మించి, నకిలీ అరెస్టు వారెంట్లు చూపించి, కూర్చొన్న చోట నుంచే వీడియో, ఆడియో కాల్స్ చేసి డబ్బును దోచుకుంటున్నారు. 'మీరు సీరియస్ నేరానికి పాల్పడ్డారు. కొన్నేళ్ల పాటు శిక్ష పడుతుంది. న్యాయ ప్రక్రియ ఎదుర్కోవాల్సి ఉంటుంది' అంటూ ప్రజలను బెదిరించి, భయపెట్టి డబ్బులను దోచుకుంటున్నారు.

ఎలా జరుగుతుంది??

డిజిటల్ అరెస్ట్ కేసుల్లో నిందితులు అధికారుల రూపంలో ఆడియో, వీడియో కాల్స్ చేస్తారు. వాట్సాప్, స్కైప్ వంటి ప్లాట్‌ఫామ్‌ల ద్వారా వీడియో కాల్స్ చేస్తున్నారు. బాధితులకు డిజిటల్ అరెస్ట్ వారంట్లను జారీ చేస్తారు. నిధుల దుర్వినియోగం, పన్నుల మోసాలు, ఇతరత్రా చట్ట ఉల్లంఘనలను వివిధ కారణాల చూపిస్తూ బాధితులను భయపెడతారు. కొన్ని సందర్భాల్లో ఈ మోసగాళ్లు ఈ ఫోన్ కాల్స్ నిజమేనని నమ్మించడానికి పోలీసు స్టేషన్ల తరహాలో సెట్లను కూడా తయారు చేసుకుంటారు. విచారణలో సహకరిస్తామని, కేసులో పేరు లేకుండా చేస్తామని, రిఫండబుల్ డబ్బులు చెల్లించాలని నమ్మబలికి తమ బ్యాంకు ఖాతాలకు లేదా యూపీఐ ఐడీలకు అమౌంట్ బదిలీ చేయించుకుంటారు. ఒక్కసారి వారి మాటలను నమ్మి డబ్బులు చెల్లించిన తర్వాత మళ్లీ స్కామర్లు కనిపించరు.

ఈ మోసాన్ని ఎలా తప్పించుకోవాలంటే?

- నిజమైన అధికారులు ఎప్పటికీ డబ్బులు చెల్లించాలని, బ్యాంకింగ్ వివరాలు ఇవ్వాలని అడగరనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.
- సైబర్ మోసగాళ్లు డబ్బుల కోసం త్వరపెడుతుంటారు. వారి చర్యలను వేగంగా నిర్వహిస్తారు. కాల్స్ చేస్తూ డబ్బుల కోసం డిమాండ్ చేస్తుంటారు.
- స్కామర్లపై అనుమానం కలిగిన వెంటనే సంబంధిత ఏజెన్సీకి నేరుగా సంప్రదించి వారి గుర్తింపును నిర్ధారించుకోవాలి.
- వ్యక్తిగత సమాచారాన్ని, ఆర్థిక అంశాలు, వివరాలను ఎప్పటికీ ఎవ్వరికీ బహిర్గతం చేయకూడదు.
- ప్రభుత్వ ఏజెన్సీలు అధికారిక సంప్రదింపుల కోసం వాట్సాప్, స్కైప్ వంటి సామాజిక మాధ్యమాలను వినియోగించరు.
- మీరు మోసానికి గురవుతున్నారని అనుమానం వచ్చిన వెంటనే పోలీస్‌స్టేషన్ లేదా సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

మోసపోయిన తర్వాత ఇలా చేయాలి..

- ఆన్‌లైన్ మోసానికి గురై డబ్బులు కోల్పోతే వెంటనే బ్యాంక్ అధికారులను సంప్రదించి ఖాతాను ఫ్రీజ్ చేయాలి.
- జాతీయ సైబర్ నేరాల పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి.
- మోసపోయిన తర్వాత నిందితుల వివరాలను మీ వద్దే ఉంచుకోండి. అంటే ఫోన్ కాల్స్ వివరాలు, లావాదేవీలు, సందేశాలు తదితర వాటిని సేవ్ చేసుకుని ఉంచుకోవాలి.
- అవసరమైతే న్యాయవాదుల సహాయం పొందాలి.

క్లుప్తంగా...

ప్రధాని విశాఖ షెడ్యూల్ ఖరారు

సాక్షి, విశాఖపట్నం: ఈ నెల 29న ప్రధాని మోదీ విశాఖపట్నం పర్యటన ఖరారైంది. ప్రాథమిక షెడ్యూల్ ప్రకారం విశాఖ ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించే బహిరంగ సభ, రోడ్ షోలో ప్రధాని పాల్గొననున్నారు. 29న సాయంత్రం 3.40 గంటలకు ప్రత్యేక విమానంలో తూర్పు నౌకాదళానికి చెందిన ఎయిర్‌బేస్ ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో కాన్వెంట్ జంక్షన్, రైల్వే స్టేషన్, సంపత్ వినాయక్ టెంపుల్, ట్రైకూన్, సిరిపురం జంక్షన్ మీదుగా ఎస్పీ బంగ్లా రోడ్డు నుంచి ప్రధాన వేదిక వద్దకు 4.40 గంటలకు వస్తారు. ట్రైకూన్ జంక్షన్ నుంచి ఎస్పీ బంగ్లా వరకు 500 మీటర్ల మేర నిర్వహించే రోడ్‌షోలో ప్రధాని పాల్గొని బహిరంగ సభకు చేరుకుంటారు. అక్కడ నిర్దేశించిన బహిరంగ సభ కార్యక్రమంలో 4.45 నుంచి 5.00 గంటల వరకు గవర్నర్, సీఎం, ఉప ముఖ్యమంత్రితో కలిసి పాల్గొని ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్‌తో పాటు, రైల్వే లైన్లు, పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్ని ప్రధాని చేయనున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం ప్రసంగాల అనంతరం సాయంత్రం 5.25 నుంచి 5.43 గంటల వరూ ప్రజలనుద్దేశించి ప్రధాని ప్రసంగించనున్నారు. అనంతరం.. సాయంత్రం 5.45 గంటలకు సభా వేదిక నుంచి ఎయిర్ పోర్టుకు తిరుగుపయనమవుతారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి చేరుకుంటారు.

చిన్న వెంకన్న సేవలో డీజీపీ



ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చిన్న వెంకన్న ఆలయాన్ని డీజీపీ ద్వారకాతిరుమలరావు ఆదివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు తూర్పు రాజగోపురం వద్ద పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు.

చిన్నారిపై వీధి కుక్కల దాడి
తీవ్ర గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స



అగనంపూడి: గ్రామ సింహాలు చిన్నారిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన విశాఖలో జరిగింది. జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీ పానకాలయ్యపేట బోనంగికి చెందిన సిద్ధనాతి నూక అప్పారావు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం రాత్రి అప్పారావు భార్య లక్ష్మి ఇంట్లో పనులు చేసుకుంటుండగా, అప్పారావు పనిమీద బయటకు వెళ్లాడు. రోడ్డు మీద ఆడుకుంటున్న వీరి కుమార్తె యక్షిత (3)పై రెండు వీధి కుక్కలు దాడి చేయగా శరీరం వెనుక భాగం, మెడ, తలపై కూడా తీవ్రంగా గాట్లు పడ్డాయి. స్థానికులు కుక్కలను తరిమికొట్టి పాపను రక్షించి కేజీహెచ్‌కు తరలించారు. ప్రాణాపాయ స్థితి తప్పినట్లు వైద్యులు చెప్పారు.

ఆ హైస్కూల్‌లో ఒంటిగంటకే ఫైనల్ బెల్

- రాష్ట్రంలో ఏకైక ఒంటిపూట బడి
- విద్యార్థులకు శాపంగా మారిన ఇంటర్ బోర్డు నిర్వాకం

రాజంపేట: మధ్యాహ్నం ఒంటి గంట అయితే చాలు.. ఆ హైస్కూల్‌లో ఫైనల్ బెల్ కొట్టేస్తారు. వేసవి సహా కాలం ఏదైనా.. సోమ, మంగళ, బుధ ఏ రోజైనా ఆ స్కూల్‌కు రోజూ ఒంటిపూట బడే. అన్నమయ్య జిల్లా నందలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ఒంటిపూటే నడిచే ఏకైక హైస్కూల్‌గా రికార్డులకెక్కింది. 1908లో నందలూరులో బోర్డు హైస్కూల్ ఏర్పాటైంది. 1954లో జిల్లా పరిషత్ హైస్కూల్.. ఆ తర్వాత 1962లో జిల్లా హయ్యర్ సెకండరీ హైస్కూల్‌గా ఆవిర్భవించింది. ఒకప్పుడు విశాలమైన గదులు, లైబ్రరీ, ల్యాబ్, క్రీడా పరికరాలతో పాటు నాణ్యమైన బోధన, ఉత్తమ ఉపాధ్యాయులతో క్రమశిక్షణకు మారుపేరుగా హైస్కూల్ ఖ్యాతిగాంచింది. ఎందరో ఐఏఎస్‌లను అందించి చరిత్రలో నిలిచింది. ఇక్కడి హైస్కూల్‌లో తరగతులు ఉదయం 7.45కు ప్రారంభిస్తారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తారు.



జూనియర్ కళాశాల రాకతో హైస్కూల్ విద్యకు గ్రహణం

నందలూరు బస్టాండు నుంచి సౌమ్యనాథ ఆలయానికి వెళ్లే మార్గంలో విశాలమైన స్థలంలో ఈ హైస్కూల్ ఉంది. భవనాల కొరతతో 1982లో నందలూరులోని జూనియర్ కళాశాలను ఇక్కడికి మార్చారు. సొంతభవనాల నిర్మాణం వరకు అని చెప్పిన ఇంటర్ బోర్డు నేటి వరకు ఇక్కడే కళాశాలను కొనసాగిస్తోంది. ఇక్కడి నుంచి కళాశాలను తరలించాలని జెడ్పీ హైస్కూల్ యాజమాన్యం మొత్తుకున్నా.. కలెక్టర్లు జోక్యం చేసుకున్నా ఫలితం లేదు. 274 మంది విద్యార్థులున్న ఈ హైస్కూల్‌లో మధ్యాహ్నం వరకు తరగతులు సాగుతున్నాయి. మధ్యాహ్నం నుంచి ఇంటర్ విద్యను కొనసాగిస్తున్నారు.

వ్యతిరేకిస్తున్న అధ్యాపకులు

ఏదో ఒక పూట వస్తున్నాం..పాఠాలు చెప్పి పోతున్నాం.. అక్కడికి తరలిస్తే రెండు పూటలా కాలేజీకి రావాల్సి వస్తుంది అనుకున్నారో ఏమో. ఇంటర్ కళాశాలను తరలింపును కొందరు అధ్యాపకులు వ్యతిరేకిస్తున్నారు. మండల కాంప్లెక్స్ సమీపంలోని ఎస్సీ హాస్టల్ భవనాలు దూరమని.. అక్కడికి వెళితే ఇంటర్ బాలికలకు రక్షణ ఉండదని ప్రచారం చేశారు. నిజానికి మండల కాంప్లెక్స్ ఆవరణ ప్రశాంతంగా ఉంటుంది. దశాబ్దాలుగా అక్కడే వందలాదిమంది బాలికలతో బీసీ గురుకుల పాఠశాల కూడా ఉంది. కేవలం తమ స్వార్థం కోసం అధ్యాపకులు చేసిన వ్యవహారం వల్ల తరలింపు ఆగిపోయిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా కలెక్టర్, డీఈవో, ఇంటర్ ఆర్‌జేడీ ఒకతాటిపైకి వచ్చి హైస్కూల్‌కు ఒంటిపూట బడి నుంచి విముక్తి కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా...ఐఏఎస్‌లను.. గొప్ప రాజకీయ నాయకులను దేశానికి అందించిన స్కూల్‌గా ఈ ఇది ఖ్యాతి గడించింది.

జింక చర్మాల అక్రమ రవాణా

ఐదుగురి అరెస్ట్

వజ్రకరూరు: అనంతపురం, కర్నూలు జిల్లాల్లో జింకలను వేటాడి చంపి..వాటి మాంసాన్ని విక్రయించడంతో పాటు చర్మాలను అక్రమ రవాణా చేస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను అనంతపురం జిల్లా వజ్రకరూరు పోలీసులు అరెస్టు చేసి 24 జింక చర్మాలు, రెండు కొమ్ములు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం వజ్రకరూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ నాగస్వామి..ఫారెస్ట్ సెక్షన్ అధికారి కరీముల్లా, బీట్ ఆఫీసర్ సతీష్‌తో కలసి కేసు వివరాలను వెల్లడించారు. గుంతకల్లుకి చెందిన షికారి దేవరాజు, షికారి గోవిందు, అనంతపురం నగరానికి చెందిన షికారి బాబు, షికారి బాలరాజు, గుంతకల్లు మండలం ఆచారమ్మ కొట్టాలకు చెందిన వడ్డే పెద్దఅంజి గుంతకల్లు, వజ్రకరూరు, ఆలూరు, చిప్పగిరి తదితర ప్రాంతాల్లో వ్యవసాయ పొలాల్లో కత్తెరలు ఏర్పాటు చేసి జింకలను వేటాడేవారు. వాటి మాంసాన్ని విక్రయించి చర్మాలను కర్ణాటకలోని బళ్లారి, కంప్లి, హొస్పేట్ తదితర ప్రాంతాలకు అక్రమ రవాణా చేసేవారు. శనివారం సాయంత్రం 24 జింక చర్మాలు, రెండు కొమ్ములను సంచుల్లో వేసుకుని కర్ణాటక వైపు వెళుతున్నట్లు పోలీసులకు సమాచారం రాగా.. అటవీ శాఖ అధికారులతో కలసి వజ్రకరూరు మండలం కొనకొండ్ల సమీపంలోని బళ్లారి జాతీయ రహదారిలో వీరిని పట్టుకున్నారు. నిందితులను ఆదివారం అనంతపురంలోని మొబైల్‌కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించారు.



ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 10 గంటలు


తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 75,147 మంది స్వామివారిని దర్శించుకోగా 28,096 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.3.16 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 10 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

2 నుంచి మార్గశిర మాసోత్సవాలు



డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో డిసెంబర్ 2 నుంచి 30వ తేదీ వరకు మార్గశిర మాసోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు తెలిపారు. ప్రత్యేక పూజల వివరాలను తెలియజేశారు. మార్గశిరమాసంలో ప్రతీ గురువారం పంచామృతాభిషేకాలు నిర్వహిస్తామని, ఇందులో పాల్గొనాలనుకునే భక్తులు రూ.7,500 చెల్లించాలని తెలిపారు. గురువారం మినహా మిగిలిన రోజుల్లో పంచామృతాభిషేకంలో పాల్గొనదలిచే భక్తులు రూ.2,500 పూజా రుసుం చెల్లించాలన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే క్షీరాభిషేకానికి రూ.1,116 చెల్లించాలని, ఆయా పూజల్లో పాల్గొనదలచే భక్తులు పూజా రుసుమును ముందుగా చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఆన్‌లైన్ ద్వారా www. aptemples. ap. gov. in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. లేదా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, విశాఖపట్నం అకౌంట్ నెంబరు 0608 1001 1006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్080608లో పూజా రుసుం చెల్లించాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన వారు ఆ లావాదేవీ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్ర నామాలు, పూర్తి చిరునామాను endow& eokanaka@gov. in ద్వారా పంపవచ్చని వివరించారు. నేరుగా టికెట్లు తీసుకునేవారి కోసం దేవాలయ కౌంటర్లలోనూ టికెట్లు అందుబాటులో ఉంచామన్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు టికెట్లు పొందవచ్చని తెలియజేశారు.

మొదలైన క్రిస్మస్ సందడి



రాజంపేట టౌన్ : క్రైస్తవులు, విశ్వాసులకు అతి ముఖ్యమైన పండుగ క్రిస్మస్. క్రీస్తు జననానికి చిహ్నంగా క్రైస్తవులు క్రిస్మస్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. క్రిస్మస్ డిసెంబర్ 25న అయినప్పటికి వివిధ పేర్లతో నెల రోజుల ముందు నుంచి క్రిస్మస్ ప్రార్థనలు ప్రారంభమవుతాయి. అందులో భాగంగా మండలంలో పలు చర్చిల్లో ఆదివారం క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. ఆయా చర్చిల పాస్టర్లు క్రైస్తవులకు, విశ్వాసులకు వాక్యోపదేశం చేశారు. క్రీస్తు జననం మానవాళికి పర్వదినమని, మరో నెల రోజుల్లో ఆ పర్వదినం రాబోతుందన్నారు. ఆ ఆనందభరితమైన ఘడియకు సమయం ఆసన్నమైనందున ఏసు నామముతో నెల రోజులపాటు జరుపుకునే ప్రత్యేక ప్రార్థనల్లో విశ్వాసులంతా తప్పక పాల్గొనాలని సూచించారు. క్రీస్తు మార్గాన్ని అనుసరించినప్పుడే సన్మార్గం వైపు పయనించగలమన్నారు. ఈ లోకానికి వెలుగునిచ్చేందుకు వచ్చాడని, ఆయన వెంట నడిచిన వారంతా జీవపు వెలుగులు కలిగివుంటారని తెలిపారు. ప్రభువు పట్ల విశ్వాసం ఉంచిన వారు శాంతి, సమాధాన సంతోషాలతో జీవించగలరని పాస్టర్లు విశ్వాసులకు తెలిపారు. వచ్చే నెల నుంచి జరుపుకునే ప్రీ, సెమీ, సపోజ్ క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవులు, విశ్వాసులు పాల్గొని క్రీస్తు జనన చిహ్న ఘడియకు ప్రార్థనలకు స్వాగతం పలకాలని తెలిపారు. కాగా నవంబర్ 25న సపోజ్ క్రిస్మస్‌ను పురస్కరించుకుని మందిరంల వద్ద ప్రత్యేక ప్రార్థనలు, స్కిట్‌లు జరుపనున్నారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వారాంతపు సెలవులు కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారిని సుమారు 30వేలమంది దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 స్పెషల్ ఎంట్రన్స్ ద్వారా 3,216మంది, రూ.50 ప్రత్యేక దర్శనం ద్వారా 3,340మంది భక్తులు దర్శించుకున్నట్లు వెల్లడించారు. అదే విధంగా రూ.500 రాహుకేతు సర్పదోష పూజలు 2,723, రూ.750 పూజలు 1,115, రూ.1,500 పూజలు 339, రూ.2,500 పూజలు 279, రూ.5వేల పూజలు 55 జరిగినట్లు వివరించారు.

శాస్త్రోక్తంగా ఆకాశదీపం



శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం శాస్త్రోక్తంగా ఆకాశదీపం వెలిగించారు. కార్తీక మాసం సందర్భంగా నిత్యం ఆకాశదీపం వెలిగించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆలయంలో ఊంజల్ సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చనని ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. సింహగిరీశునికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వారసత్వ కళ



నేటి ఆధునిక గృహాలలో నాటి ప్యాలెస్ కళ

మహారాజా ప్యాలెస్‌ల నుండి ఇకత్ డిజైన్ల వరకు ఆధునిక ఇళ్లలో భారతీయ కళల ప్రభావం అంతర్లీనంగా ఉంటోంది. క్లిష్టమైన ఎంబ్రాయిడరీ నమూనాల నుండి గ్రాండ్ ఆర్కిటెక్చరల్ మోటిఫ్‌ల వరకు, మనదైన వారసత్వం ఇంటీరియర్ డిజైన్‌లో కొంగొత్త నిర్వచనాన్ని చూపుతుంది.

భారతీయ కళలు మ్యూజియంలు, గ్యాలరీలకు మించి విస్తరిస్తున్నాయి. ఇవి మనం నివాసం ఉండే ప్రాంతాలనూ ప్రభావితం చేస్తున్నాయి. క్లిష్టమైన ఎంబ్రాయిడరీ నమూనాల నుండి గ్రాండ్ ఆర్కిటెక్చరల్ మోటిఫ్‌ల వరకు, భారతీయ వారసత్వంలోని ఈ అంశాలు ఆధునిక ఇంటీరియర్ డిజైన్‌ను సరికొత్తగా చూపుతున్నాయి. భారతీయ కళ, సంప్రదాయాన్ని గౌరవించే సేకరణలు సమకాలీన గృహాలలోకి ప్రవేశించి, కలకాలం నిలిచేలా రిఫ్రెష్‌గా భావించే ఇంటీరియర్‌లను సృష్టిస్తున్నాయి. వారసత్వ ప్రేరేపిత డిజైన్లు సంప్రదాయంతో ఎంతో గొప్పగా ఉంటాయని రుజువు చేస్తున్నాయి.

మహారాజా ప్యాలెస్-ప్రేరేపిత ఇంటీరియర్స్

భారతీయ చరిత్ర మొత్తం వైభవంతో కూడిన కథలతో నిండి ఉంటుంది. హస్తకళతో పాటు ఎన్నో అంశాలకు ఉదాహరణలుగా నిలిచే రాజభవనాలు ఉన్నాయి. ఈ రీగల్-ప్రేరేపిత డిజైన్‌లు గ్రాండ్ మహారాజా ప్యాలెస్‌ల ఆర్చ్‌లు, మోటిఫ్‌లు, విలాసవంతమైన అలంకారాన్ని ప్రతిబింబిస్తాయి. అయితే ఇవి నేటి కాలపు అందానికి ప్రతీకగానూ ఉంటాయి.

చికన్‌కరి సొగసు


ఇంటీరియర్ నిపుణుడు, మెరినో ఇండస్ట్రీస్ లిమిటెడ్ డైరెక్టర్ మనోజ్ లోహియా మరింత వివరిస్తూ, 'రీగల్ శ్రేణిలో గజముద్ర, వసంత, సంస్కృతి వంటి డిజైన్‌లు ఉన్నాయి. ప్రతి ఒక్క అంశమూ రాజ వైభవంతో అలరారుతుంటుంది. ఆ తర్వాత భారతదేశ విభిన్న కళారూపాలలో చికన్‌కరీ ఎంబ్రాయిడరీ ఓ ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. ఈ డిజైన్లు అల్లికలతో ఉంటాయి. చేతితో తయారైన ఈ అల్లికలు సొగసుగానూ, అందుబాటులో ఉంటాయి. అలంకృత్ ఒక అలంకారమైన ఆభరణాన్ని పోలి ఉంటుంది. కర్ణిక భారతీయ చెవిపోగుల నుండి స్ఫూర్తిని పొందింది. సాంప్రదాయ హవేలీలలో కనిపించే ఈ తోరణాల కళ నేటి ఆధునిక ఇళ్లలోనూ కనిపిస్తుంది. వాస్తుశిల్పం కూడా ఆధునిక అమరికలో చక్కగా ఇమిడిపోయి గొప్ప వారసత్వ కళతో ఆకట్టుకుంటున్నాయి' అని ఆయన వివరించారు.

ఇకత్ వీవింగ్ డిజైన్స్


ఇకత్ అనేది దాని అద్భుతమైన నమూనాలు, సజీవ రంగులకు ప్రసిద్ధి చెందిన ఒక శక్తివంతమైన కళారూపం. కొత్త మెటీరియల్‌లలో ఈ నమూనాలను పునఃరూపకల్పన చేయడం ద్వారా, ఆధునిక డిజైన్ సేకరణలు అదే శక్తి, చైతన్యంతో నింపుతున్నాయి. ఇంటీరియర్ డిజైనర్ శ్రీ మనోజ్ మాట్లాడుతూ– 'ఇకత్ హస్తకళకు కేంద్రంగా ఉండే ఒక థ్రెడ్‌వర్క్. సముద్రపు అలల నమూనాలను తలపిస్తోంది. ప్రశాంతతను కలిగిస్తుంది. తరంగ్ పుష్పం సున్నితమైన అందాన్ని మిళితం చేస్తుంది. ఈ డిజైన్‌లు ఒక గదికి శిల్పకళాపరమైన అందాన్ని తీసుకువస్తాయి. సాంస్కృతిక వారసత్వం, ఆధునిక సౌందర్యాల మధ్య అంతరాన్ని తగ్గిస్తాయి' అని తెలిపారు.



నలంద దేశానికి గౌరవం



నలంద... ఆర్యభట్ట పుట్టిన నేల ఇది. సూర్యసిద్ధాంతం నేలకు దిగి వచ్చిన ప్రదేశం. అంతేకాదు... 'సున్న' పుట్టిన ప్రదేశం కూడా. నేటి కంప్యూటర్‌కు బీజం పడిన ప్రదేశమూ ఇదే. 23 హెక్టార్ల విస్తీర్ణం. యునెస్కో హెరిటేజ్ సైట్. ఈ గొప్ప బౌద్ధ క్షేత్రంలో పర్యటించడానికి వచ్చిన బౌద్ధ సన్యాసులు దీక్షగా ధ్యానంలో నడుస్తున్నట్లు వెళ్తుంటారు. పాట్నాకు వందకిలోమీటర్ల దూరాన ఉంది



నలంద మహావిహార... ప్రపంచంలో తొలి రెసిడెన్షియల్ యూనివర్సిటీ. కామన్ ఎరా 427లో గుప్తులు స్థాపించిన విశ్వవిద్యాలయం ఇది. మొత్తం పుస్తకాల సంఖ్య 90 లక్షలు, విద్యార్థుల సంఖ్య పదివేలు. ఆసియా దేశాలన్నింటి నుంచి విద్యార్థులు వచ్చేవాళ్లు. వైద్యం, తర్కం, గణితం, బౌద్ధ సూత్రాల అధ్యయనం కోసం వచ్చేవారు. బౌద్ధధర్మ, ధర్మసూత్రాలలో అత్యున్నత జ్ఞానాన్ని సముపార్జించిన వారిని దలైలామా అనే బిరుదుతో గౌరవించడం కూడా ఇక్కడే మొదలైంది. ఏడువందల ఏళ్లకు పైగా ప్రకాశవంతంగా విరాజిల్లిన ఈ విద్యాలయం విదేశీ దాడులలో ధ్వంసమైంది. పన్నెండవ శతాబ్దంలో భక్తియార్ ఖిల్జీ దాడి చేసి ధ్వంసం చేశాడు. ఇప్పుడు మిగిలినది నాటి విశ్వవిద్యాలయానికి చెందిన ఆనవాళ్లు మాత్రమే.

పర్యటన ఒక ఎడ్యుకేషన్

ఈ యూనివర్సిటీ నిర్మాణమే ఒక ఎడ్యుకేషన్ అని చెప్పాలి. కాల్చిన ఇటుకల నిర్మాణాలు, నీటి పారుదల కోసం ఏర్పాట్లు, విద్యార్థులు నివసించడానికి గదులు, ఆ గదుల్లో పుస్తకాలు భద్రపరుచుకోవడానికి ఒక షెల్ఫ్, దుస్తుల కోసం ఒక షెల్ఫ్ ఉంటాయి. స్టడీ అవర్‌లో విద్యార్థులు చదువుకోవడానికి కూర్చునే వలయాకారపు ఏర్పాటు కూడా కచ్చితంగా ఉంటుంది. ఒకరికొకరు ఆరడుగుల దూరంలో కూర్చోవాలి. అలాగే ఇక్కడ పాఠ్యాంశాలను బోధించే విశాలమైన లెక్చర్ హాల్‌తోపాటు ప్రార్థన స్థలాలు కూడా ఉన్నాయి. లెక్చర్ హాల్‌లో గురువు కోసం ఉద్దేశించిన స్థానం ప్రత్యేకంగా ఉంటుంది. ఇంకో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ ప్రాంగణానికి పై కప్పు ఉండదు. సూర్యుడి కిరణాల ఆధారంగా సమయాన్ని తెలుసుకోవడానికి స్కేల్ వంటి కొలమానం ఈ గోడల మీద ఉంది. పౌర్ణమికి చంద్రుని కాంతికి కాంతులీనే తెల్లని రాయిని చూడడం మర్చిపోకూడదు. నలంద విశ్వవిద్యాలయం మాత్రమే కాదు, నలంద టూర్ కూడా ఒక కోర్సు చేసినంత జ్ఞానాన్ని మన బుర్రలో నింపుతుంది.

మనోనేత్రం చూస్తుంది!

గణితంలో 'సున్న' తెలియనంత కాలం లెక్కల లెక్క సులువుగా తలకెక్కేది కాదు. ఆర్యభట్ట సున్న ను కనుక్కోవడంతో గణిత శాస్త్రానికి కొత్త లెక్క దొరికింది. ప్రపంచం అంతా సున్నాని అందిపుచ్చుకున్నాయి. అలాగే సూర్యసిద్ధాంతం కూడా ఇక్కడే ఖగోళ కిరణాలను ప్రకాశింప చేసింది. ఇన్ని ఘనతలను సాధించిన విశ్వవిద్యాలయాన్ని నేడు శిథిలాలలో వెతుక్కోవడమే మనకు మిగిలింది. నలందలో మన కళ్లలకు కనిపించేది శిథిలాలే. మనోనేత్రానికి అర్థమయ్యేది మాత్రం అపరిమితమైన జ్ఞానం. జామెట్రికల్ థియరీతో నిర్మించిన విధానం అద్భుతం. శత్రువుల దాడులను ఎదుర్కొని కూడా వేల ఏళ్ల నాటి నిర్మాణంలో భాగమైన ఇటుకలు నేటికీ మనదేశ వాస్తుశైలి, నిర్మాణకౌశలానికి ప్రతీకలుగా నిలిచి ఉన్నాయి. భక్తియార్ ఖిల్జీ ఈ విశ్వవిద్యాలయ నిర్మాణాల విధ్వంసంతోపాటు పుస్తకాలన్నింటినీ రాసిపోసి తగులబెట్టాడని ఆ మంటలకు నలుపెక్కిన గోడలను, ఇటుకలను చూపిస్తారు.

గడచిన వంద ఏళ్లుగా మన విద్యార్థులు ఉన్నత విద్య కోసం పశ్చిమదేశాల బాట పడుతున్నారు. వేల ఏళ్ల కిందట పశ్చిమదేశాలు చదువు కోసం ఇక్కడికి వచ్చాయి. ఆ ఘనత మనకు చరిత్రగా మాత్రమే మిగిలిందనే ఆవేదనతో గుండె బరువెక్కుతుంది. ఈ ప్రదేశానికి సుమారు 12 కిలోమీటర్ల దూరాన బీహార్‌లోని రాజ్‌గిర్‌లో నలంద విశ్వవిద్యాలయాన్ని, 2014లో పునః స్థాపించారు.

వాతావరణం ఆహ్లాదకరం

పాట్నా నగరానికి 90 కిలోమీటర్ల దూరాన ఉంది నలంద మహావిహారాయ. ఇక్కడ పర్యటించడానికి శీతాకాలమే సౌకర్యం. ఉదయం తొమ్మిదింటికి ఈ ప్రదేశానికి చేరుకుంటే మబ్బులు మెల్లగా కదులుతూ అప్పుడప్పుడే తెలవారుతున్నట్లు సూర్యుడి కిరణాలు ఏ మాత్రం వెచ్చదనం లేకుండా చల్లగా ఉంటాయి. ఈ ప్రదేశమంతటా తిరిగి చూడడానికి మూడు గంటలు పడుతుంది. సర్టిఫైడ్ గైడ్ సహాయం తీసుకోవాలి. వాహనం కనిపించగానే ఏదో ఒక ఐడీ కార్డు మెడలో వేసుకుని ఆ కార్డు చూపిస్తూ మనల్ని చుట్టేస్తారు. చక్కగా వివరించగలిగిన గైడ్‌లను, ప్రభుత్వ టూరిజమ్ లేదా ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ ఐడీ కార్డు ఉన్న గైడ్ సహాయం తీసుకోవాలి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ట్రావెల్ టిప్స్

- నలందలో డిసెంబర్ ఉష్ణోగ్రతలు 10 – 24 మధ్య ఉంటాయి. పగలు చల్లగా ఉంటుంది. రాత్రి బాగా చలిగా ఉంటుంది. థర్మల్స్ తప్పనిసరి. సాక్స్, తలకు స్కార్ఫ్ కూడా ఉండాలి.
- ఇక్కడ ఆహారంలో రోటీ, బంగాళదుంప ప్రధానంగా ఉంటుంది. కూరగాయలు కావాలంటే బంగాళదుంప కూరలో టొమాటో, క్యాలీఫ్లవర్ కలుపుతారంతే. ఉదయాన్నే జిలేబీ తిని వెచ్చటి టీ తాగడం మర్చిపోవద్దు.
- రెస్టారెంట్‌లలో రోటీతోపాటు రైస్ ఆర్డర్ చేస్తే ఒక గరిటె అన్నం వడ్డించి బిల్లు భారీగా వడ్డిస్తారు. రోటీ ఆర్డర్ చేసేటప్పుడు కూడా ఎన్ని రొట్టెలు ఇస్తారనే వివరాలు అడిగి తెలుసుకోవాలి. వాళ్లు ఇచ్చిన రొట్టెలన్నింటినీ తినడం దక్షిణాది వారికి కష్టమే.

ఆర్ట్

ప్రపంచస్థాయి సాంస్కృతిక వేడుక



బెంగళూరు సాంస్కృతిక హాట్ స్పాట్‌కి ముస్తాబు అయ్యింది. అన్‌బాక్సింగ్ బిఎల్‌ఆర్ హబ్బా పేరుతో నగరం అంతటా సందడి చేయబోతున్నారు. ప్రపంచస్థాయి సాంస్కృతిక వేడుకల నిర్వహణతో నగరం సామర్థ్యాన్ని మరింతగా పెంచింది. ఫెస్టివల్ ఛీఫ్ వి.రవిచందర్ మాట్లాడుతూ – 'మేం శిఖరాగ్రానికి చేరుకోవడానికి దశాబ్దాలుగా కృషి చేస్తున్నాం. నగరంలోని దారుల్లో గుంతలు, మురికినీరు, చెత్తతో ఉండే సవాళ్లు ఎలాగూ తప్పవు. కానీ మా లక్ష్యంఒకటే. బెంగళూరును ప్రపంచ పటంలో సాంస్కృతిక వేడుకలు జరుపుకోదగిన నగరంగా నిలబెట్టడం. 600 వేదికల్లో దాదాపు రెండు వేల ఈవెంట్స్ జరుగుతున్నాయి. బిఎల్‌ఆర్ హబ్బా ఫెస్టివల్ వల్ల ఈ ఏడాది నవంబర్ 30 నుండి డిసెంబర్ 15 వరకు సందడిగా మారుతోంది. వేడుకల హైలైట్‌లలో హబ్బా కచేరీలు ప్రధానంగా ఉంటాయి. ముందుగా పదిమంది ప్రతిభావంతులైన కళాకారులు, కళాకారుల సమూహాలతో బెంగళూరు మెట్రోరైల్ స్టేషన్‌లలోని ఎనిమిది గోడలను, రెండు ప్రముఖ ప్రైవేట్ గోడలను కుడ్యచిత్రాలతో అందంగా మార్చాం. సాంకేతికత, డిజైన్, సాహిత్యం, సంగీతం, నృత్యం, వారసత్వ కళలతో నగరం పదహారు రోజుల పాటు విరాజిల్లుతుంది. 'సాధారణంగా సంవత్సరానికి 500 సాంస్కృతిక ఈవెంట్లు ఉంటాయి. ఇప్పుడు హబ్బాకోసం 16 రోజుల్లో 500 ఈవెంట్స్‌ను నిర్వహించబోతున్నాం. ఇలాంటి సవాళ్లంటే చాలా ఇష్టం' అని తెలిపారు.



(ఫైల్ ఫొటో)

డ్యాన్స్ : యశోదా ఠాకోర్

నృత్యం హృదయంలోని బాధ నుంచి పుడుతుంది

'నృత్యశాస్త్రం నుంచి నృత్యం పుట్టదు. హృదయంలో కలిగే బాధ నుండి ఉద్భవిస్తుంది' అంటారు కూచిపూడి నృత్యకారిణి, దేవదాసి నృత్యంలో ప్రావీణ్యత గల యశోదా ఠాకోర్. ఇటీవల ఆమె విదేశాల్లో దేవదాసీ నృత్యాన్ని ప్రదర్శించారు.

ఆంధ్రప్రదేశ్‌లోని కళావంతుల సంఘంచే స్వరపరిచి రూపొందించిన దానిని యశోద మరింత అందంగా ఆవిష్కరిస్తారు. ఒక ప్రేమికురాలు కృష్ణుడిని కోల్పోవడంపై కలిగిన ఆందోళనను అద్భుతంగా వర్ణిస్తుంది.





కథానాయిక తనవాడైన వ్యక్తిని పొడవాటి వస్త్రాలతో కట్టివేయాలనే కోరికను అణుచుకుంటూ ఎటూ వెళ్లవద్దని వేడుకోవడాన్ని కళ్లకు కడుతుంది. యు.కెలోని గ్లెన్‌బర్గ్‌లో జరిగిన వేడుకలో ప్రదర్శన అనంతరం ....

ఈ నృత్యం వేరొకరి జీవితంపై రూపొందించింది

దేవదాసీ నృత్యం భారతదేశ చరిత్ర, రాజకీయాలలో ఎలా ప్రధానంగా ఉంటూ వచ్చిందో ఠాకోర్ వివరించారు. 'భారత శాస్త్రీయ కళలు క్లిష్టమైన పరిస్థితులలో కొన్నిసార్లు అట్టడుగుకు చేరుకున్నాయి. కొన్ని హింసాత్మక చరిత్రలనూ పరిచయం చేశాయి. దక్షిణాదిన వ్యాపించి ఉన్న దేవదాసి సంఘాలు తమ కళతో తరతరాలుగా దేవాలయాలు, జమీందార్లను ఆశ్రయించాయి. దేవదాసీ కళాకారులు తమ కుటుంబ సభ్యులతో వాయిద్యాలతో ప్రదర్శనలను నిర్వహించారు. వారు భూమి, ఆస్తి, ఆభరణాలకు యజమానులు కాకపోయినా సంరక్షకులుగా ఉండేవారు. ఒక కళారూపానికి బాధ్యత వహించే శక్తిమంతమైన ప్రదర్శనకారులు ఇప్పటికీ ఉన్నారు. కానీ సామ్రాజ్య పాలన, కొత్త జాతీయవాద ఎజెండా ఈ ప్రదర్శనకారులకు కఠినమైన రోజులను తెచ్చిపెట్టింది.

జాతీయవాద – వలసవాద పితృస్వామ్యాల మధ్య ప్రదర్శన కళలు సంప్రదాయాలలోని లైంగికశక్తితో అణగదొక్కడానికి వ్యవస్థ మొగ్గు చూపింది. మధ్యతరగతి డ్రాయింగ్ రూమ్‌లలో 'సంస్కృతి'ని కొత్తగా చూపడానికి దేశీయ రూపాలను ప్రభావవంతంగా శుద్ధి చేసింది. కోల్‌కతాలోని ఝుమూర్ నృత్య కథలో, కథక్ వంటి నృత్య రూపాల ప్రసిద్ధ చరిత్రలలో కూడా ఇది గమనించవచ్చు. దీంతో దేవదాసీ అవమానకరమైన, బలహీనమైన వ్యక్తిగా ఎదిగింది.

హృదయాన్ని కదిలించేలా!

లోతుగా చీలిపోయిన కుల సమాజంలో బ్రిటీషర్ల కాలంలో ఈ కళలు అక్షర రూపంలోకి వచ్చాయి. 1947లో దేవదాసీ నిర్మూలన చట్టం రావడంతో ఈ కళాకారులు ప్రదర్శన చేసే హక్కును కోల్పోయారు. ప్రదర్శకులుగా వారి శ్రమ, నైపుణ్యం పూర్తిగా కనిపించకుండా పోవడంతో దేవదాసీలు వ్యభిచారంలోకి నెట్టబడ్డారు. పెత్తందార్లు, పోలీసుల నుండి వేధింపులకు గురయ్యే పరిస్థితి ఏర్పడింది. ఒంటరి మహిళలు కావడంతో వారి కుటుంబాలు అనిశ్చిత పరిస్థితుల్లోకి నెట్టబడ్డాయి. ఒకప్పుడు గౌరవనీయమైన మాతృకగా, అన్నదాతగా ఉన్న దేవదాసీలు ఇప్పుడు లేమితో జీవన పోరాటం చేస్తున్నారు. కడుపులోని కేన్సర్ మెలిపెడుతుంటే ఆకలిని చంపుకోవడానికి బీడీలు కాల్చే మహిళలు నాకు తెలుసు.

డబ్బు కోసం కాదు, మోక్షం కోసం నృత్యం చేయాలి...

దేవదాసీ నిర్మూలన చట్టం వల్ల కొంతమంది మహిళలు తమ కళను కోల్పోతే, మరికొందరు సిగ్గుతో కుటుంబాలను, సంబంధాలను విచ్ఛిన్నం చేసే మార్గాల్లో తమను తాము దూరం చేసుకోవడానికి ప్రయత్నించారు. ఒక చట్టాన్ని ఆమోదించినప్పుడు ఆ కళ పై ఆధారపడి జీవించే వారికి ఏం జరుగుతుందో ఎవరికీ పట్టదు. దేవదాసీలు ప్రజా జీవితం నుండి తొలగించిన తర్వాత వారి కళ మాత్రం 'గౌరవనీయమైన' శరీరాలపై నాటబడింది. మీరు వెళ్లిపోండి, మీ కళను మాత్రం తీసుకుంటాము అన్నట్టుగా చేశారు. ఉన్నత-కులాల పురుషులు ఈ నృత్య రూపాలను స్వీకరించి, ఆధిపత్యం చెలాయించారు. వాటి మూలాలను మాత్రం చెరిపివేశారు. దేవదాసీల ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టి, నృత్యాన్ని మాత్రం 'క్లాసికల్' నిబంధనలలో ఉంచారు. కళ డబ్బు కోసం కాదు, మోక్షం కోసం జీవిస్తుంది. నాట్యం నాట్యశాస్త్రం నుండి రాదు, హృదయం లోని బాధ నుండి ఉత్పన్నం అవుతుంది' అంటారు యశోదా ఠాకూర్.

రంభా ప్యాలెస్

పర్యాటకుల కోసం సిద్ధం



ఒడిశాలో చిల్కా సరస్సు. ఆసియా ఖండంలో అతి పెద్ద ఉప్పునీటి సరస్సు. ఆ సరస్సు తీరాన ఉంది రంభా ప్యాలెస్. ఆ ప్యాలెస్ గురించి చెప్పాలంటే రెండు వందల ఏళ్ల వెనక్కి వెళ్లాలి.

అది 1791. మనదేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ హవా నడుస్తున్న రోజులవి. ఇంగ్లిష్ ఇంజనీర్ థామస్ స్నోద్‌గ్రాస్, మన స్థానిక సహాయకులతో కలిసి నిర్మించిన ప్యాలెస్ అది. ఈ ప్యాలెస్ చక్కటి వెకేషన్ ప్లేస్. కోణార్క్ సూర్యదేవాలయానికి పూరీలోని జగన్నాథ ఆలయానికి కూడా 150 కిలోమీటర్ల దూరాన ఉంది. ఈ ప్యాలెస్‌ను పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దే ప్రయత్నంలో భాగంగా 2018లో న్యూఢిల్లీకి చెందిన హాచ్ వెంచర్ కొన్నది.



నిర్మాణాన్ని పునరుద్ధరించే బాధ్యతను శ్రీలంకకు చెందిన ఆర్కిటెక్ట్ చన్నా దాసవాతేకి అప్పగించింది. ఈ ఆర్కిటెక్ట్ ఆరేళ్ల పాటు శ్రమించి ప్యాలెస్ చారిత్రక వైభవానికి విఘాతం కలగకుండా పునరుద్ధరించాడు.



జాతీయోద్యమంలో భాగంగా సాగిన ఉత్కళ్ మూవ్‌మెంట్ జ్ఞాపకాలను పదిలపరుచుకుని ఉందీ ప్యాలెస్. మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, బ్రిటిష్ ఉన్నతాధికారులతో సమావేశమైన గుర్తులున్నాయందులో. 'ప్యాలెస్‌లో నివసించిన అనుభూతి కోసం పర్యాటకులు రాజస్థాన్ వెళ్తుంటారు. ఒకసారి ఒడిశా సంస్కృతి సంప్రదాయాలను కూడా ఆస్వాదించండి' అంటూ ఈ ప్యాలెస్ సహ యజమాని ఒడిశా రాజవంశానికి చెందిన వారసుడు హిమాన్‌గిని సింగ్ పర్యాటకులకు ఆహ్వానం పలుకుతున్నారు. క్రిస్మస్ వెకేషన్‌కి లేదా సంక్రాంతి వెకేషన్‌కి ప్లాన్ చేసుకోండి.





> గెలుపొందాలంటే కొన్ని కీలకంగా ఉంటాయి. మొదటిది ఆలోచన. రెండోది నమ్మకం. మూడోది కలగనడం. చివరిగా సాహసించడం.
> - వాల్ట్ డిస్నీ, యానిమేటర్, ప్రొడ్యూసర్

సాక్షి ప్లస్
సోమవారం । 25-11-2024

బిజినెస్ రీల్

హ్యుందాయ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్లాంట్స్



న్యూఢిల్లీ: వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా (హెచ్‌ఎంఐఎల్) రెండు పునరుత్పాదక విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. వాహనాల తయారీకై 2025 నాటికి పూర్తిగా పునరుత్పాదక విద్యుత్‌ను వినియోగించాలన్న లక్ష్యంలో భాగంగా తమిళనాడులోని ప్లాంటులో వీటిని నెలకొల్పనుంది. ఇందుకోసం ఫోర్త్ పార్ట్‌నర్ ఎనర్జీతో పవర్ పర్చేజ్ ఒప్పందం చేసుకున్నట్టు హ్యుండై గురువారం తెలిపింది. 75 మెగావాట్ల సౌర, 43 మెగావాట్ల పవన విద్యుత్ ప్లాంట్‌ను స్థాపిస్తారు. ఈ రెండు కేంద్రాలకు హెచ్‌ఎంఐఎల్ రూ.38 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్, ఆపరేషన్స్, మెయింటెనెన్స్ కోసం ఫోర్త్ పార్ట్‌నర్ ఎనర్జీతో కలిసి స్పెషల్ పర్పస్ వెహికిల్ ఏర్పాటు చేశారు. హ్యుండై మోటార్ ఇండియాకు ఈ ఎస్‌పీవీలో 26 శాతం వాటా ఉంటుంది. ప్రస్తుత విద్యుత్ అవసరాల్లో 63 శాతం పునరుత్పాదక వనరుల నుంచి సమకూరుతోందని కంపెనీ తెలిపింది. హెచ్‌ఎంఐఎల్ ప్లాంటుకు 25 ఏళ్లపాటు ఏటా 25 కోట్ల యూనిట్ల విద్యుత్ సరఫరా చేస్తామని ఫోర్త్ పార్ట్‌నర్ ఎనర్జీ తెలిపింది.

చిన్న పారిశ్రామిక టౌన్‌షిప్‌లు

- ఎఫ్‌డీఐ నిబంధనల సరళీకరణ
- డీపీఐఐటీ కార్యదర్శి భాటియా



న్యూఢిల్లీ: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనలను సరళీకరించడం, స్మార్ట్ పారిశ్రామిక టౌన్‌షిప్‌లు, టైర్–2, 3 పట్టణాల్లో రంగాల వారీ ప్రత్యేకమైన పారిశ్రామిక పార్క్‌ల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించిందని పరిశ్రమల ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) కార్యదర్శి అమర్‌దీప్ సింగ్ భాటియా తెలిపారు. దేశ పారిశ్రామికీకరణకు ఈ చర్యలు ఊతమిస్తాయన్నారు. ఫిక్కీ వార్షిక సమావేశంలో భాగంగా మాట్లాడారు. పలు శాఖల మద్దతుతో పారిశ్రామికాభివృద్ధికి అనుకూల ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. జాతీయ పారిశ్రామిక నవడా కార్యక్రమం, ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ), వ్యాపార సులభతర నిర్వహణ సంస్కరణలు పారిశ్రామికాభివృద్ధికి వీలు కల్పించినట్టు భాటియా తెలిపారు. విద్యుదీకరణ పారిశ్రామికీకరణను వేగవంతం చేసిందని భారీ పరిశ్రమల శాఖ కార్యదర్శి కరమ్ రిజ్వీ ఇదే కార్యక్రమంలో భాగంగా అన్నారు. తయారీలో పోటీతత్వం, దేశీయ వాటాను పెంచేందుకు తీసుకుంటున్న చర్యలను ప్రస్తావించారు. ప్రైవేటు పెట్టుబడులు అన్నవి దేశీయ డిమాండ్‌కు అనుగుణంగా ఉండాలని ఫిక్కీ వైస్ ప్రెసిడెంట్, ఆర్‌పీజీ గ్రూప్ చైర్మన్ అనంత్ గోయెంకా అన్నారు. రంగాల వారీ పారిశ్రామిక పార్క్‌లు ఎంతో మార్పును తీసుకురాగలవన్నారు. కాకపోతే స్థానికంగా, విదేశాల్లోని ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్‌లు) నుంచి పాఠాలను పరిగణనలోకి తీసుకోవాలని, తయారీ రంగంలో పోటీతత్వాన్ని పెంచాలని సూచించారు.

మహారాష్ట్ర ఫలితాల ఎఫెక్ట్

మార్కెట్లు పుంజుకునే చాన్స్

- ద్వితీయార్థంలో అమ్మకాలు
- ప్రపంచ అనిశ్చితుల ప్రభావం
- గణాంకాలకూ ప్రాధాన్యం
- ఈ వారం ట్రెండ్‌పై నిపుణులు



ముంబై: ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లపై మహారాష్ట్ర అసెంబ్లీ ఫలితాలు, ప్రపంచ రాజకీయ, భౌగోళిక పరిస్థితులు, ఆర్థిక గణాంకాలు ప్రభావం చూపనున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఫలితాలను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూటమి శాసించడంతో ఇన్వెస్టర్లకు ప్రోత్సాహం లభించినట్లు తెలియజేశారు. దీంతో తొలి రోజు మార్కెట్లు సానుకూలంగా ప్రారంభంకావచ్చని స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా అంచనా వేశారు. దీనికితోడు గత వారం చివర్లో మార్కెట్లు హైజంప్ చేయడంతో సెంటిమెంటు బలపడినట్లు విశ్లేషించారు. కొద్ది వారాలుగా కరెక్షన్ బాటలో సాగుతున్న మార్కెట్లలో శుక్రవారం రిలీఫ్ ర్యాలీకి తెరలేచింది. గత ఐదు నెలల్లోలేని విధంగా సెన్సెక్స్ 1,961 పాయింట్లు దూసుకెళ్లగా.. నిఫ్టీ 557 పాయింట్లు ఎగసిన సంగతి తెలిసిందే. అయితే తదుపరి దశలో పలు దేశ, విదేశీ అంశాలు ప్రతికూల ప్రభావాన్ని చూపవచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా భావిస్తున్నారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలలో ఇండియా కూటమి విజయం సాధించడం, రష్యా- ఉక్రెయిన్ మధ్య యుద్ధ భయాలు పెరగడం వంటి అంశాలను ఈ సందర్భంగా ఖేమ్కా, మీనా ప్రస్తావించారు.

జీడీపీ.. కీలకం

బుధవారం(27న) త్రైమాసిక ప్రాతిపదికన జులై–సెప్టెంబర్(క్యూ3)కు యూఎస్ జీడీపీ గణాంకాల రెండో అంచనా వెలువడనుంది. ముందస్తు అంచనాలో వార్షికంగా క్యూ3లో 2.8 శాతం వృద్ధిని సాధించింది. ఈ బాటలో ఫెడరల్ రిజర్వ్ మినిట్స్ విడుదల కానున్నాయి. ఎఫ్‌ఓఎంసీ గత పాలసీ సమావేశంలో వడ్డీ రేట్లను 0.25 శాతం తగ్గించింది. దీంతో ప్రస్తుతం ఫెడ్ ఫండ్స్ రేట్లు 4.5–4.75 శాతంగా అమలవుతున్నాయి. ఈ నిర్ణయాల వెనుక అంశాలను మినిట్స్ వెల్లడించనున్నాయి. అక్టోబర్ నెలకు కీలక పీసీఈ ధరల గణాంకాలు విడుదలకానుండగా.. 29న నవంబర్ నెలకు యూరో ప్రాంత ద్రవ్యోల్బణ అంచనాలు తెలియనున్నాయి. ఇక దేశీయంగా జులై–సెప్టెంబర్(క్యూ2)లో ఆర్థిక వ్యవస్థ పనితీరు గణాంకాలు వెలువడనున్నాయి. ఏప్రిల్–జూన్(క్యూ1)లో జీడీపీ 6.7 శాతం పుంజుకుంది. ఇదేవిధంగా ప్రభుత్వం అక్టోబర్ నెలకు మౌలిక రంగ పురోగతి గణాంకాలు ప్రకటించనుంది. సెప్టెంబర్‌లో మౌలిక రంగం 2 శాతం బలపడింది.

ఇతర ప్రభావిత అంశాలు

ప్రపంచస్థాయిలో రాజకీయ, భౌగోళిక ఆందోళనలు, దీంతో పెరుగుతున్న ముడిచమురు ధరలు, ద్రవ్యోల్బణ పరిస్థితులకు దారితీస్తున్నట్లు మార్కెట్ విశ్లేషకులు వివరించారు. మరోవైపు ప్రపంచ ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు ఇండెక్స్ బలపడుతుండటంతో రూపాయి నీరసిస్తున్న విషయం విదితమే. వీటికితోడు యూఎస్ ట్రెజరీ బాండ్ల ఈల్డ్స్ మెరుగుపడుతుండటంతో కొద్ది రోజులుగా విదేశీ పెట్టుబడులు వెనక్కి మళ్లుతున్నాయి. ఈ అంశాలు దేశీయంగా మార్కెట్ల ట్రెండ్‌ను నిర్దేశించే వీలున్నట్లు మీనా, ఖేమ్కా తెలియజేశారు. కాగా.. దేశీయంగా మౌలిక రంగ అభివృద్ధి, రాజకీయ సుస్థిరతకు మహారాష్ట్ర అసెంబ్లీ ఫలితాలు దోహదపడగలవని మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ డైరెక్టర్ పల్క అరోరా చోప్రా పేర్కొన్నారు. ఇది స్టాక్ మార్కెట్లకు బలిమిని ఇవ్వగలదని అభిప్రాయపడ్డారు. అయితే వారాంతాన వెలువడనున్న జీడీపీ, 'మౌలిక' గణాంకాలపై ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా పేర్కొన్నారు.

గత వారమిలా

దేశీ స్టాక్ మార్కెట్లు భారీ అమ్మకాల నుంచి గత వారం చివర్లో యూటర్న్ తీసుకున్నాయి. దీంతో గత వారం మార్కెట్లు నికరంగా లాభాలతో ముగిశాయి. ఆటుపోట్ల మధ్య సెన్సెక్స్ 1,537 పాయింట్లు(2 శాతం) జమ చేసుకుని 79,117 వద్ద నిలిచింది. నిఫ్టీ సైతం 375 పాయింట్లు(1.6 శాతం) బలపడి 23,907 వద్ద స్థిరపడింది. వెరసి సెన్సెక్స్ 79,000ను అధిగమించగా.. నిఫ్టీ 24,000 పాయింట్లకు చేరువైంది. అయితే బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1.7% లాభపడగా.. స్మాల్ క్యాప్ 0.5 శాతమే పుంజుకుంది.

అమ్మకాలకే ఎఫ్‌పీఐల మొగ్గు

నవంబర్‌లో రూ. 26,533 కోట్లు

ఇటీవల కొద్ది రోజులుగా దేశీ స్టాక్ మార్కెట్లలో అమ్మకాలకే ప్రాధాన్యత ఇస్తున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) ఈ నెలలోనూ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. వెరసి నవంబర్‌లో ఇప్పటి(22)వరకూ నికరంగా రూ. 26,533 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. ఇందుకు ప్రధానంగా చైనా సహాయక ప్యాకేజీలకు తెరతీయడం, దేశీ కార్పొరేట్ క్యూ2 ఫలితాలు నిరాశపరచడం, ప్రపంచ అనిశ్చితులు, డాలరు బలపడటం వంటి అంశాలు కారణమవుతున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. అయితే అక్టోబర్‌లో నమోదైన విక్రయాలతో పోలిస్తే అమ్మకాల తీవ్రత తగ్గినట్లు తెలియజేశారు. అక్టోబర్‌లో ఎఫ్‌పీఐలు నికరంగా 11.2 బిలియన్ డాలర్ల(రూ. 94,107 కోట్లు) పెట్టుబడులను వెనక్కి తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే అంతకుముందు సెప్టెంబర్‌లో అంతక్రితం 9 నెలల్లోనే అత్యధికంగా రూ. 57,724 కోట్లు ఇన్వెస్ట్ చేయడం గమనార్హం!




పతంజలి ఆయుర్వేద్ ఆదాయం రూ.9,335 కోట్లు

- 2023–24లో 23 శాతం అధికం
- పతంజలి ఫుడ్స్‌లో వాటాల విక్రయం

న్యూఢిల్లీ: బాబా రామ్‌దేవ్ ఆధ్వర్యంలోని పతంజలి ఆయుర్వేద్ గడిచిన ఆర్థిక సంవత్సరానికి (2023–24) రూ.9,335 కోట్ల ఆదాయాన్ని సాధించింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూస్తే 23 శాతం పెరిగింది. లిస్టెడ్ కంపెనీ పతంజలి ఫుడ్స్‌లో కొంత వాటాలు విక్రయించడం ఆదాయం పెరిగేందుకు సాయపడింది. అలాగే, గ్రూప్‌లోని ఇతర కంపెనీల రూపంలో మెరుగైన ఆదాయం సమకూరినట్టు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌కు కంపెనీ సమర్పించిన వివరాల ఆధారంగా తెలుస్తోంది. ముఖ్యంగా ఇతర ఆదాయం రూ.2,875 కోట్లు 2023–24లో వచ్చినట్టు వెల్లడించింది. నికర ఆదాయాన్ని గమనిస్తే.. (కేవలం అమ్మకాల ద్వారా వచ్చిన) అంతక్రితం ఆర్థిక సంవత్సరం కంటే 14 శాతం తక్కువగా రూ.6,460 కోట్లకు పరిమితమైంది. నికర లాభం రూ.2,901 కోట్లుగా నమోదైంది. 2022–23 సంవత్సరంలో పతంజలి ఆయుర్వేద్ రూ.7,534 కోట్ల ఆదాయంపై రూ.578 కోట్ల లాభాన్ని ప్రకటించడం గమనార్హం. ఆదాయం తగ్గినప్పటికీ, నికర లాభం ఐదు రెట్లు పెరిగినట్టు తెలుస్తోంది. ప్రధానంగా పతంజలి ఫుడ్స్‌లో వాటాల విక్రయం, ఇతర ఆదాయం ఇందుకు దోహదపడింది. ప్రకటనలు, ప్రచారం కోసం 9 శాతం అధికంగా రూ.422 కోట్లు వ్యయం చేసింది. పతంజలి ఆయుర్వేద్ తన నిర్వహణలోని హోమ్, పర్సనల్ కేర్ వ్యాపారాన్ని రూ.1,100 కోట్లకు పతంజలి ఫుడ్స్‌కు విక్రయించేందుకు ఈ ఏడాది జూలైలో నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పతంజలి ఆయుర్వేద్ ఫలితాల్లో కనిపించనుంది. దివాలా పరిష్కార చట్టం కింద రుచి సోయా సంస్థను పతంజలి గ్రూప్ కొనుగోలు చేయడం, ఆ తర్వాత పేరును పతంజలి ఫుడ్స్‌గా మార్చడం గమనార్హం.

క్యూ2లో లిస్టెడ్ రియల్టీ సంస్థల జోరు

రూ. 35,000 కోట్ల విలువ చేసే ప్రాపర్టీల విక్రయం



న్యూఢిల్లీ: వర్షాలు, నియంత్రణ సంస్థల నుంచి పూర్తిగా అనుమతులు రాకపోవడం తదితర అంశాల కారణంగా 2024–25 రెండో త్రైమాసికంలో కాస్త ప్రతికూల ప్రభావం పడినా లిస్టెడ్ రియల్టీ దిగ్గజాల విక్రయాలు గణనీయంగా నమోదయ్యాయి. 26 సంస్థలు ఏకంగా రూ. 35,000 కోట్ల విలువ చేసే ప్రాపర్టీలను విక్రయించాయి. గోద్రెజ్ ప్రాపర్టీస్ అత్యధికంగా రూ. 5,198 కోట్ల బుకింగ్స్ నమోదు చేసింది. నియంత్రణ సంస్థలకు సమర్పించిన వివరాల ప్రకారం 26 దిగ్గజ సంస్థలు రూ. 34,985 కోట్ల ప్రాపర్టీలు విక్రయించాయి. అత్యధికంగా రెసిడెన్షియల్ సెగ్మెంట్‌లో ప్రీ–సేల్స్ నమోదయ్యాయి. లోధా బ్రాండ్‌పై కార్యకలాపాలు సాగించే ముంబైకి చెందిన మ్యాక్రోటెక్ డెవలపర్స్ రూ. 4,290 కోట్ల బుకింగ్స్ సాధించింది. ఢిల్లీ–ఎన్‌సీఆర్ (నేషనల్ క్యాపిటల్ రీజియన్) సంస్థ మ్యాక్స్ ఎస్టేట్స్ రూ. 4,100 కోట్లు, బెంగళూరు కంపెనీలు ప్రెస్టేజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ రూ. 4,023 కోట్లు, సిగ్నేచర్ గ్లోబల్ రూ. 2,780 కోట్ల ప్రాజెక్టులు విక్రయించాయి. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో చాలా మటుకు రియల్టీ కంపెనీలు రూ. 500 – రూ. 1,000 కోట్ల అమ్మకాలు నమోదు చేశాయి. అయితే, తొలి త్రైమాసికంతో పోలిస్తే రెండో త్రైమాసికంలో కొన్ని సంస్థల విక్రయాలు నెమ్మదించాయి. మార్కెట్ క్యాపిటలైజేషన్‌పరంగా అగ్రస్థానంలో ఉన్న డీఎల్ఎఫ్ తొలి త్రైమాసికంలో రూ. 6,404 కోట్ల ప్రీ–సేల్స్ సాధించగా కొత్త ప్రాజెక్టులేమీ ప్రకటించకపోవడంతో రెండో త్రైమాసికంలో రూ. 692 కోట్లు మాత్రమే నమోదు చేసింది.

కొత్త ఈవీపై హీరో కసరత్తు

తుది దశలో మిడ్ సెగ్మెంట్ మోటర్‌సైకిల్

న్యూఢిల్లీ: మధ్య స్థాయి పర్ఫార్మెన్స్ సెగ్మెంట్ ఎలక్ట్రిక్ మోటర్‌సైకిల్ తయారీపై కసరత్తు చేస్తున్నట్లు హీరో మోటోకార్ప్ సీఈవో నిరంజన్ గుప్తా తెలిపారు. అమెరికాకు చెందిన జీరో మోటర్‌సైకిల్స్ భాగస్వామ్యంలో ఈ వాహనం అభివృద్ధి చేసే ప్రక్రియ తుది దశలో ఉందని పేర్కొన్నారు. జీరో మోటర్‌సైకిల్స్ ప్రధానంగా ఎలక్ట్రిక్ మోటర్‌సైకిల్స్, పవర్‌ట్రెయిన్స్ తయారు చేస్తుంది. 2022 సెప్టెంబర్‌లో జీరోలో 60 మిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టే ప్రతిపాదనకు హీరో బోర్డు ఆమోదముద్ర వేసింది. మరోవైపు, తమ ఎలక్ట్రిక్ స్కూటర్ల శ్రేణిని మరింతగా విస్తరిస్తున్నట్లు గుప్తా చెప్పారు. వచ్చే ఆరు నెలల్లో వివిధ ధర శ్రేణుల్లో, కస్టమర్ సెగ్మెంట్లలో తమ ఎలక్ట్రిక్ వాహనాలు ఉంటాయని వివరించింది. ప్రస్తుతం హీరో మోటోకార్ప్‌కి చెందిన విడా ఎలక్ట్రిక్ స్కూటర్లు రూ. 1–1.5 లక్షల శ్రేణిలో అందుబాటులో ఉన్నాయి. 230 నగరాలు, పట్టణాల్లో అమ్ముడవుతున్నాయి.



ట్యాక్స్ ప్లానింగ్ సూచనలు



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి, కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

ట్యాక్స్ ప్లానింగ్ ప్రాముఖ్యత గురించి తెలుసుకున్నాం. ఈ వారం ట్యాక్స్ ప్లానింగ్ చేయడానికి సూచనలను తెలుసుకుందాం.

చట్టాన్ని తెలుసుకోండి. చట్టాన్ని గౌరవించండి.


చాలా పెద్ద పుస్తకం. ఎన్నో సెక్షన్లు, సబ్ సెక్షన్లు, వివరణల ఫారంలు, ఎనెక్జర్లు, మార్పులు, చేర్పులు, టెక్నికల్ భాష అని భయపడకండి. నిజానికి ఇది గ్రీక్ అండ్ లాటిన్ కాదు. సులువుగా తెలుసుకోవచ్చు. కొంచెం శ్రద్ధ, ఇష్టం ఉండాలి. మీ ఇల్లు కట్టిన మేస్త్రీ వంద ఇంగ్లీషు పదాలు పలుకుతాడు. ఇంగ్లీషు రాదు. అలాగే మీ కార్పెంటర్.. రోడ్డు మీదే కాపురం చేసే పంక్చర్లు వేసే వ్యక్తి ఎన్నో ఇంగ్లీషు పదాలు వాడతారు. ప్రస్తుతం సెల్‌ఫోన్లు వాడే కోట్లాది మందికి ఇంగ్లీషు రాదు. కానీ మన ఇష్టం, కోరిక, అభిలాష, బాధ్యత, చట్టాన్ని గౌరవించే సంప్రదాయం.. ఇవి చాలు. దీనికి తోడుగా ఉందిగా 'గూగుల్ తల్లి'.. సమాచారాన్ని వెదజల్లి మిమ్మల్ని సన్నద్ధం చేసే కల్పవల్లి. అన్ని భాషల్లోని యూట్యూబ్‌లు, ఎన్నెన్నో లింకులు, వెబ్‌సైట్లు, సోషల్ మీడియా వేదికల్లో పుస్తకాలు, ప్రచురణలు, డెమో సెషన్లు, సభలు, సమావేశాలు, చర్చావేదికలు, వర్క్‌షాప్‌లు, ట్యాక్స్ కాలమ్‌లు, వ్యాసాలు, అవగాహన సదస్సులు ఉంటున్నాయి. ఇంకేం కావాలి. డిపార్టుమెంట్ వారు సర్క్యులర్స్ ఇస్తున్నారు. అధికారులు ఫ్రెండ్లీగా ఉంటారు. ఎన్నో యాప్‌లు, రెడీ రెకనర్లు, ప్రశ్నలకు జవాబులు. వీటిని అందిపుచ్చుకుంటే మీరు పండితులైనట్లే లెక్క.

మీ హక్కులు, బాధ్యతలు తెలుసుకోండి.. మసలుకోండి..

ఆత్మబంధువు రూపంలో సి.నా.రె. గారి సూటి ప్రశ్నించారు 'ఏమి చదివి పక్షులు పైకెగరగలిగేను' అని .. అలాగే 'ఎవరు నేర్పారమ్మ ఈ కొమ్మకు పూలిమ్మని' అని కృష్ణశాస్త్రిగారు ప్రశ్నించారు. కాబట్టి తెలుసుకుంటే రానిదంటూ ఉండదు.. ఈనాటి ఈ చట్టం ఏనాటిదో అని భయపడకండి. మీరేమీ తక్కువ కాదు.. ఎవరికీ తీసిపోరు. మీ ఫోన్ స్మార్ట్. మీరు స్మార్ట్. మీ ఫోన్ ఏ ప్లాన్‌లో ఉందో తెలుసు. టారిఫ్ ప్లాన్ తెలుసు, వైఫై వివరాలు తెలుసు, బ్యాంకు అకౌంట్ పాస్‌వర్డ్‌లు తెలుసు. బంగారం ధర తెలుసు. షేర్లు ఎంతకు కోట్ అవుతున్నాయో తెలుసు. ఇలా ఎన్నో తెలుసు. అలాంటిది ఇన్‌కం ట్యాక్స్ రూల్స్ అనేవి బ్రహ్మపదార్థాలు కావు కదా తెలియకుండా ఉండటానికి. మీరు పట్టించుకోలేదు అంతే. ఇక నుంచి అవి తెలుసుకోండి. వివిధ రకాలైన గడువు తేదీలను తెలుసుకోండి. గుర్తుంచుకోండి. రూల్స్ తెలుసుకోండి. మినహాయింపులు, తగ్గింపులు తెలుసుకోండి. మీ సహోద్యోగులను సంప్రదించండి. మార్నింగ్ వాక్‌లో మీ పక్కింటాయనతో మాట్లాడండి.

ఇప్పుడు ప్లాన్ చేయండి..

ముచ్చటగా మూడోది.. ప్లాన్ చేసుకోండి. మొదటి పాయింటు ప్రకారం సమగ్ర సమాచారం ఉంది. రెండో పాయింటు ప్రకారం సమాచారాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నారు. తెలుసుకున్నారు. ఇక ప్లానింగ్. ఈ సంవత్సరం అనుకోకుండా ఆదాయం వచ్చింది. ఆ మేరకు ఆదాయం తగ్గించుకోవాలనుకుంటే దాన్ని సేవింగ్స్ చేయండి. ఉదాహరణకు రూ. 40,000 బోనస్ వచ్చింది. పరిమితులు దాటకుండా ఉంటే 80సి ప్రకారం ఇన్వెస్ట్ చేయండి. స్థిరాస్తి క్యాపిటల్ గెయిన్స్ వచ్చింది. మరో ఇల్లు కొనండి. లేదా బాండ్లు కొనండి. ఇంటద్దె అలవెన్స్ పూర్తిగా మినహాయింపు రావాలంటే.. ఇంటి అద్దె ఎక్కువ ఇచ్చి పెద్ద ఇంట్లో ఉండండి. అయితే, ఆఫీసుకు దూరంగా ఉండి రవాణా ఖర్చు రానుపోను చాలా ఎక్కువయితే మరోలా ప్లాన్ చేయండి. చివరిగా ట్యాక్స్‌ప్లానింగ్ అంటే కేవలం పన్నుభారం తగ్గించుకోవడానికే ప్రాధాన్యం ఇవ్వడం కాదు. ఇతరత్ర కుటుంబ ప్రాధాన్యతలు, ఆరోగ్య సమస్యలు, నైతిక విలువలు, చట్టాన్ని గౌరవించటం, కుటుంబ సభ్యులతో సత్సంబంధాలు, వృత్తి మీద ప్రేమ, సొంతూరిమీద ప్రేమ మొదలైనవి పరిగణనలోకి తీసుకుంటేనే ప్రయోజనకరంగా ఉంటుంది.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

పెట్టుబడులకు మెరుగైన వైవిధ్యం

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మల్టీ అస్సెట్ ఫండ్

పెట్టుబడులకు వైవిధ్యం ఎంతో కీలకం. అస్థిరతల నుంచి ఇదే రక్షణనిస్తుంది. పోర్ట్‌ఫోలియోకు రిస్క్ తగ్గిస్తుంది. వివిధ సాధనాల మధ్య పెట్టుబడులతో కూడిన వైవిధ్యాన్ని అందించే వాటిల్లో మల్టీ అస్సెట్ ఫండ్స్ మంచి ఎంపిక అవుతుంది. ఈ విభాగంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మల్టీ అస్సెట్ ఫండ్‌కు చక్కని రాబడుల చరిత్ర ఉంది. అంతేకాదు మల్టీ అస్సెట్ ఫండ్స్ విభాగంలో 48 శాతం మేర పెట్టుబడులు ఈ పథకం నిర్వహణలోనే ఉండడాన్ని గమనించొచ్చు. తమ పెట్టుబడులకు చక్కని వైవిధ్యంతోపాటు, రిస్క్‌ను తగ్గించుకోవాలని భావించే వారు ఈ పథకాన్ని దీర్ఘకాలం కోసం ఎంపిక చేసుకోవచ్చు. అది కూడా సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా రిస్క్‌ను తగ్గించుకుని మరింత అధిక రాబడులు సొంతం చేసుకోవచ్చు.

పనితీరు

ఈ పథకానికి 22 ఏళ్ల ట్రాక్ రికార్డు ఉంది. ఆరంభంలో రూ.10 లక్షల ఇన్వెస్ట్ చేసి ఉంటే, ఇన్నేళ్లలో రూ.7.26 కోట్లుగా మారేది. అంటే ఏటా 21.58 శాతం కాంపౌండెడ్ రాబడి లభించింది. ఈ పథకం పనితీరుకు ఇది నిదర్శనం. ఇదే విభాగంలో మరో పథకంలో ఇన్వెస్ట్ చేసినట్టయితే 22 ఏళ్లలో రూ.10 లక్షల పెట్టుబడి రూ.3.36 కోట్లుగా మారేది. పోటీ పథకాలతో పోల్చి చూస్తే ఈ విభాగంలో పటిష్టమైన పనితీరు ఈ పథకం సొంతం. ఏడాది కాలంలో ఈ పథకం 24 శాతం రాబడులు అందించింది.



కానీ ఇదే కాలంలో మల్టీ అస్సెట్ ఫండ్స్ సగటు రాబడి 21 శాతంగానే ఉంది. మూడేళ్లలో ఏటా 17 శాతం రాబడి తెచ్చి పెట్టింది. ఇదే కాలంలో మల్టీ అస్సెట్ ఫండ్స్ విభాగం సగటు రాబడి 12 శాతంగానే ఉంది. ఐదేళ్లలోనూ ఈ పథకం ఏటా 21 శాతం, ఏడేళ్లలో 15.30 శాతం, పదేళ్లలో 14 శాతం చొప్పున వార్షిక ప్రతిఫలాన్ని పెట్టుబడులపై అందించింది. అంతేకాదు ఆరంభం నుంచి ఈ పథకంలో ప్రతి నెలా రూ.10వేల చొప్పున సిప్ చేస్తూ వస్తే మొత్తం రూ.26.4 లక్షల పెట్టుబడి, రాబడులతో కలిపి రూ.2.9 కోట్లుగా మారి ఉండేది. అంటే ఏటా 18.37 శాతం కాంపౌండెడ్ రాబడికి సమానం.



పెట్టుబడుల విధానం

ఈక్విటీ, డెట్, కమోడిటీలు, రియల్ ఎస్టేట్ సాధనాల మధ్య పెట్టుబడులను వైవిధ్యం చేస్తుంది. స్టాక్స్‌తోపాటు, డెట్ సెక్యూరిటీలు, గోల్డ్ ఈటీఎఫ్‌లు, సిల్వర్ ఈటీఎఫ్‌లు, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్)లోనూ ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ పథకం పనితీరును మల్టీ అస్సెట్ విభాగంలోని ఇతర పథకాలతోనే పోల్చి చూడగలం. అంతేకానీ ఇతర విభాగాల్లోని పథకాలతో పోల్చి చూడరాదు.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
ఐసీఐసీఐ బ్యాంక్	4.76
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	4.45
మారుతి సుజుకీ	3.78
ఎన్‌టీపీసీ	3.11
రిలయన్స్ ఇండస్ట్రీస్	2.94
బజాజ్ ఫిన్‌సర్వ్	2.40
ఎస్‌బీఐ కార్డ్స్	2.15
ఇన్ఫోసిస్	1.98
ఎల్‌అండ్‌టీ	1.89
సన్‌ఫార్మా	1.72

ఈక్విటీలు, కమోడిటీలు, బంగారం, డెట్ అన్నీ ఒకే కాల వ్యవధిలో ఒకే విధమైన పనితీరును అన్ని సందర్భాల్లో చూపించవు. ఒక్కో కాలంలో ఒక్కో విభాగంలో ప్రతికూలతలు నెలకొనొచ్చు. ఆ సమయంలో మిగిలిన విభాగంలోని పెట్టుబడులు రాబడులతో ఇన్వెస్టర్ ప్రయోజనం పొందొచ్చు. ఆ విధమైన వైవిధ్యం ఈ పథకంతో లభిస్తుంది. ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.50,648 కోట్లు ఉన్నాయి. ఇందులో 48.82 శాతం మేర ఈక్విటీలకు కేటాయించింది. డెట్‌లో 14.83 శాతం, కమోడిటీల్లో 12 శాతం, రియల్ ఎస్టేట్ సాధనాల్లో ఒక శాతం చొప్పున పెట్టుబడులు పెట్టింది. 23.32 శాతం మేర నగదును కలిగి ఉంది. ఈక్విటీల్లో 18 శాతం మేర బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లో, 7 శాతం మేర ఇంధన, యుటిలిటీ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది.

ఎత్తుకు పైఎత్తు...

నేటి నుంచి విశ్వ చదరంగ సమరం



క్లాసికల్ చెస్ ఫార్మాట్‌లో భారత్ నుంచి ఇప్పటి వరకు ఒక్కరే విశ్వవిజేతగా నిలిచారు. ఐదుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ చివరిసారి 2013లో విశ్వకిరీటాన్ని అధిరోహించాడు. ఆ తర్వాత నార్వే సూపర్‌స్టార్ మాగ్నస్ కార్ల్‌సన్ దశాబ్దంపాటు చదరంగ విశ్వాన్ని ఏలాడు. అదే సమయంలో భారత్ నుంచి మరో ప్లేయర్ ఆనంద్ ఘనతలకు చేరువగా రాలేకపోయారు. కానీ గత కొన్నాళ్లుగా భారత చెస్ ముఖచిత్రం మారిపోయింది. ఒక్కసారిగా నలుగురైదుగురు తెరపైకి వచ్చి సంచలన విజయాలు సాధిస్తున్నారు. దొమ్మరాజు గుకేశ్ అందరి అంచనాలను తారుమారు చేసి ఏకంగా ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించాడు. సరైన పోటీ లేకపోవడంతో కార్ల్‌సన్ స్వచ్ఛందంగా ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకు దూరమవ్వడంతో ... గత ఏడాది చైనా ప్లేయర్ డింగ్ లిరెన్ కొత్త ప్రపంచ చాంపియన్‌గా అవతరించాడు. అంతా అనుకున్నట్లు జరిగితే 11 ఏళ్ల తర్వాత భారత్ నుంచి గుకేశ్ రూపంలో మరో విశ్వవిజేత కనిపిస్తాడు.

- ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం డింగ్ లిరెన్‌తో గుకేశ్ పోరు
- ఫామ్‌లో ఉన్న భారత్ గ్రాండ్‌మాస్టర్
- టైటిల్ కాపాడుకునేందుకు చైనా గ్రాండ్‌మాస్టర్ రె‘ఢీ’

సింగపూర్ సిటీ: చదరంగ చరిత్రలోనే ఇద్దరు ఆసియా గ్రాండ్‌మాస్టర్ల మధ్య మరో ఆసియా వేదికపై ప్రపంచ చెస్ చాంపియన్ టైటిల్ వేటకు నేడు జేగంట మోగనుంది. దాదాపు 45 ఏళ్ల తర్వాత ఆగ్నేయాసియా దేశంలో ప్రపంచ చదరంగ విజేత పోటీలు జరుగుతున్నాయి. 1979లో ఫిలిప్పీన్స్‌లోని బగూవోలో జరిగితే ఇప్పుడు సింగపూర్ కొత్త చాంపియన్‌కు తివాచీ పరిచే అవకాశముంది. చైనాకు చెందిన డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌తో భారత గ్రాండ్‌మాస్టర్, 18 ఏళ్ల దొమ్మరాజు గుకేశ్ అమీతుమీకి సిద్ధమయ్యాడు. సూపర్ గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ తర్వాత మళ్లీ భారత్‌కు ప్రపంచ చెస్ కిరీటాన్ని తెచ్చేందుకు చైనీస్ గ్రాండ్‌మాస్టర్‌పై ఎత్తుకు పైఎత్తులు వేసేందుకు ఈ తమిళనాడు టీనేజర్ ‘సై’ అంటున్నాడు.

గుకేశ్ అవుతాడా మరో ఆనంద్?

భారత స్టార్ గుకేశ్ ర్యాంక్ 5. గతేడాది నుంచి నిలకడైన విజయాలు సాధిస్తున్నాడు. తన ఎత్తులతో ప్రత్యర్థుల్ని చిత్తు చేస్తున్న అతను గతేడాది ఆగస్టులో విశ్వనాథన్ ఆనంద్ లైవ్ రేటింగ్స్‌ను అధిగమించాడు. 1986, జూలైలో ప్రవీణ్ థిప్సే తర్వాత ఆనంద్‌ను దాటిన తొలి భారత ప్లేయర్‌గా ఘనత వహించి ప్రపంచ టాప్–10 ర్యాంకింగ్స్‌లోకి దూసుకొచ్చాడు. ‘ఫిడే’ సర్క్యూట్‌లో క్యాండిడేట్స్ టోర్నీ సహా చెస్ ఒలింపియాడ్ తదితర ఈవెంట్లలో ఘన విజయాలు సాధించడంతో రెండేళ్ల క్రితం 2600 ఎలో రేటింగ్‌లో ఉన్న తను ఇప్పుడు 2783 రేటింగ్‌కు ఎగబాకాడు. చెస్ ఒలింపియాడ్‌లో భారత్ చారిత్రక విజయంలో గుకేశ్‌ది కీలకపాత్ర! మొదటి బోర్డులో గరిష్ట పది పాయింట్లకుగాను 9 పాయింట్లు సాధించడంతో అప్పటి లైవ్ రేటింగ్‌లో ఏకంగా 3056 రేటింగ్స్‌కు చేరుకున్నాడు.

మరోవైపు ప్రపంచ చాంపియన్ 32 ఏళ్ల డింగ్ ఇటీవల తడబడుతున్నాడు. మానసిక అనారోగ్యం చాంపియన్ ఆటతీరుపై పెను ప్రభావమే చూపింది. కొన్ని నెలలపాటు అసలు ఏ స్థాయి టోర్నీలోనూ బరిలోకే దిగలేని పరిస్థితి వచ్చింది. తర్వాత చెస్ సర్క్యూట్‌లో ఆడినా... అంతంత మాత్రం ఫలితాలతో 2788 ఎలో రేటింగ్ నుంచి 2728కు పడిపోయాడు. దీంతో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 23వ స్థానానికి దిగజారాడు. అయితే రేటింగ్స్‌ను, ముందరి ఫామ్‌ను పరిగణించి తక్కువ అంచనా వేస్తే తప్పులో కాలేసినట్లే! టైబ్రేక్స్‌లో, కీలకమైన ఎత్తుల పుడు పైఎత్తులు వేయడంలో డింగ్ దిట్ట.

ముఖాముఖి పోరులో

ఇప్పుడు ప్రపంచ కిరీటం కోసం పోటీపడుతున్న వీరిద్దరు గతంలో మూడుసార్లు ముఖాముఖిగా తలపడ్డారు. అయితే ఇందులో ప్రపంచ చాంపియన్‌దే పైచేయి. క్లాసికల్ ఈవెంట్‌లో నల్లపావులతో రెండు సార్లు డింగ్ గెలుపొందగా... చివరగా సింక్వీఫీల్డ్ కప్‌లో ఇద్దరి మధ్య జరిగిన పోటీ ‘డ్రా’గా ముగిసింది. అంటే మూడింట ఒక్కసారి కూడా డింగ్ ఓడిపోలేదు. గుకేశ్ 0–2తో వెనుకబడి ఉన్నాడు.

అర్హత సాధించారిలా...

గతేడాది జరిగిన ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో రష్యా గ్రాండ్‌మాస్టర్ ఇయాన్ నిపోమ్‌నిషిని ఓడించి డింగ్ తొలిసారి చాంపియన్‌గా ఆవిర్భవించాడు. ప్రస్తుతం ప్రపంచ చాంపియన్ హోదాతో చైనా గ్రాండ్‌మాస్టర్‌కు నేరుగా టైటిల్ నిలబెట్టుకునే అవకాశముంటుంది. భారత గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ ఈ మెగా టోర్నీలో ఆడేందుకు పెద్ద పోరాటమే చేశాడు. ఈ ఏడాది టోరంటోలో జరిగిన క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో విజేతగా నిలువడం ద్వారా తాజా చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించాడు. క్యాండిడేట్స్ టోర్నీ ఆడి, గెలిచిన పిన్న వయస్కుడిగా గుకేశ్ గుర్తింపు పొందాడు.

షెడ్యూల్... ఫార్మాట్

అధికారికంగా టోర్నీ ప్రారంభోత్సవం 23నే జరిగింది. అయితే తొలి రౌండ్ నేడు మొదలవుతుంది. వచ్చే నెల 15 వరకు మొత్తం 14 రౌండ్ల పాటు గేమ్‌లు జరుగుతాయి. గెలిస్తే ఒక పాయింట్... ‘డ్రా’ చేసుకుంటే అర పాయింట్ లభిస్తాయి. ఎవరైతే ముందుగా 7.5 పాయింట్లు సాధిస్తారో వారే ప్రపంచ చాంపియన్. క్లాసికల్ గేమ్‌లో తొలి 40 ఎత్తుల వరకు ఒక్కో ఆటగాడికి 120 నిమిషాలు సమయం ఉంటుంది. 41వ ఎత్తు నుంచి మిగతా గేమ్ మొత్తానికి 30 నిమిషాల సమయమిస్తారు. 14 గేమ్‌ల తర్వాత స్కోరు సమమైతే... ర్యాపిడ్, బ్లిట్జ్ ఫార్మాట్లలో టైబ్రేక్ పోటీలు నిర్వహించి విజేతను తేల్చుతారు.

ప్రైజ్‌మనీ రూ. 21.10 కోట్లు

టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ 2.5 మిలియన్ డాలర్లు (రూ. 21.10 కోట్లు). ఒక్కో గేమ్ విజేతకు 2 లక్షల డాలర్లు (రూ. కోటి 68 లక్షలు) లభిస్తాయి. ఇలా 14 రౌండ్ల తర్వాత మిగిలిన మొత్తాన్ని ఇద్దరు ప్లేయర్లకు సమానంగా అందజేస్తారు. టైబ్రేకర్‌లో విజేతగా నిలిచిన ప్రపంచ చాంపియన్‌కు 13 లక్షల డాలర్లు (రూ.10.97 కోట్లు), రన్నరప్‌నకు 12 లక్షల డాలర్లు (రూ.10.13 కోట్లు) ప్రదానం చేస్తారు.

లైవ్‌గా చూడొచ్చా?

ఎంచక్కా చూడొచ్చు. టీవీ చానెల్స్‌లో అందుబాటులో లేకపోయినా... మన భారత గ్రాండ్‌మాస్టర్ తలపడుతున్న ఈ ప్రపంచ చాంపియన్‌షిప్ గేమ్‌లపై మనం ఓ కన్నేయొచ్చు. ‘ఫిడే’కు చెందిన యూట్యూబ్, ట్విట్చ్ చానెల్స్‌లో అలాగే... ఈఎస్‌పీఎన్ ఇండియా లైవ్ బ్లాగ్‌లోనూ పోటీలను వీక్షించవచ్చు.

సాకేత్ ఖాతాలో 20వ డబుల్స్ టైటిల్



సాక్షి, హైదరాబాద్: యోకోహామ ఓపెన్ ఏటీపీ చాలెంజర్–75 టెన్నిస్ టోర్నీలో భారత డేవిస్ కప్ జట్టు సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఆదివారం జపాన్‌లో జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో సాకేత్ మైనేని (భారత్)–బెంజమిన్ హసన్ (లెబనాన్) ద్వయం 6–2, 6–4తో బ్లేక్ బేల్డన్– పుటర్‌గిల్ (ఆస్ట్రేలియా) జోడీపై విజయం సాధించింది. 63 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్–హసన్ రెండు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశారు. ఈ ఏడాది సాకేత్ సాధించిన నాలుగో ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్‌కాగా... ఓవరాల్‌గా 20వ ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్. ఈ ఏడాది భారత్‌కే చెందిన రామ్‌కుమార్‌తో కలిసి సాకేత్ చెన్నై ఓపెన్, బెంగళూరు ఓపెన్, సియోల్ ఓపెన్ టోర్నీలలో విజేతగా నిలిచాడు.

కేరళ బ్లాస్టర్స్ గెలుపు



కొచ్చి: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫుట్‌బాల్ టోర్నీలో కేరళ బ్లాస్టర్స్ ఎఫ్‌సీ 3–0తో చెన్నైయిన్ ఎఫ్‌సీపై ఘనవిజయం సాధించింది. చప్పగా సాగిన తొలి అర్ధభాగానికి కేరళ స్ట్రయికర్లు ద్వితీయార్ధంలో చెలరేగి తిరుగులేని విజయాన్ని కట్టబెట్టారు. జీసస్ జిమెనెజ్ (56వ నిమిషంలో) తొలి గోల్ అందించగా, కాసేపటికి నోవా సదౌయి (70వ నిమిషంలో) గోల్ సాధించి పెట్టాడు. దీంతో 2–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లిన కేరళకు ఆఖరి నిమిషాల్లో కేపీ రాహుల్ మరో గోల్ చేశాడు. ఇంజ్యూరి టైమ్ (90+2వ నిమిషంలో)లో అతను చేసిన గోల్‌తో బ్లాస్టర్స్ 3–0తో విజయాన్ని ఖాయం చేసుకుంది. నేడు గచ్చిబౌలి స్టేడియంలో జరిగే పోరులో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్‌తో ఒడిశా ఎఫ్‌సీ తలపడుతుంది.

కోట్లు కొల్లగొట్టారు...

- అర్ష్‌దీప్ సింగ్, చహల్, కేఎల్ రాహుల్‌లకు భారీ మొత్తం
- భారత ఆటగాళ్లకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చిన ఫ్రాంచైజీలు





జిద్దా (సౌదీ అరేబియా): భారత టి20 వరల్డ్ కప్ విజయంలో కీలక పాత్ర పోషించిన అర్ష్‌దీప్ సింగ్‌కు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వేలంలో సరైన విలువ, తగిన జట్టు లభించాయి. వరుసగా ఆరు సీజన్ల పాటు పంజాబ్ కింగ్స్‌కే ఆడిన అతడిని అదే జట్టు మళ్లీ సొంతం చేసుకుంది. చెన్నై, ఢిల్లీ, గుజరాత్, బెంగళూరు, రాజస్తాన్, సన్‌రైజర్స్ కూడా అతని కోసం పోటీ పడటం విశేషం. చివరకు సన్‌రైజర్స్ రూ.15 కోట్ల 75 లక్షలకు ఖాయం చేసుకోగా... పంజాబ్ వెంటనే ఆర్‌టీఎంను ఉపయోగించుకుంది. యుజువేంద్ర చహల్ కోసం గుజరాత్, చెన్నై, లక్నో, పంజాబ్ పోటీ పడ్డాయి. చివర్లో హైదరాబాద్, పంజాబ్ మధ్య హోరాహోరీ సాగగా... ఆఖరికి అతను పంజాబ్ సొంతమయ్యాడు. బట్లర్ కోసం టైటాన్స్, ప్రస్తుత జట్టు రాజస్తాన్ ఆసక్తి చూపించాయి. గుజరాత్‌కు వికెట్ కీపర్ బ్యాటర్ అవసరం ఉండటంతో ఆ జట్టు బట్లర్ విలువ పెంచుతూ పోయింది. చివరకు భారీ మొత్తానికి తమతో తీసుకుంది. గత సీజన్‌లో లక్నో యాజమాన్యంతో విభేదాల కారణంగా జట్టుకు దూరమైన కేఎల్ రాహుల్ కోసం కూడా అందరిలో ఆసక్తి కనిపించింది. తమ బెంగళూరు ప్లేయర్ కోసం ఆర్‌సీబీ ముందుకు వచ్చినా... కెప్టెన్ అవసరం ఉన్న ఢిల్లీనే దూకుడుగా వ్యవహరించింది. అనూహ్యంగా చెన్నై రూ.12 కోట్ల 25 లక్షలతో ముందుకు వచ్చినా చివరకు ఢిల్లీనే ఎంచుకుంది. ఆసీస్ పేసర్ హాజల్‌వుడ్ కోసం నాలుగు టీమ్‌లు పోటీ పడినా ఆర్‌సీబీ దక్కించుకుంది. ఆర్‌సీబీ తరఫునే హాజల్‌వుడ్ 2022–23 సీజన్లు అతను ఆడాడు. సిరాజ్ కోసం మొదటి నుంచి గుజరాత్ టైటాన్సే ఎక్కువ ఆసక్తి చూపించింది. చెన్నై, రాజస్తాన్ కూడా పోటీ పడినా... గుజరాత్ రూ.12 కోట్ల 25 లక్షల వద్ద ముగించింది. ఈ దశలో ఆర్‌టీఎం వాడుకునే అవకాశం ఉన్నా... ఆర్‌సీబీ పట్టించుకోలేదు. స్టార్క్ కోసం కోల్‌కతా, బెంగళూరు ముందుకు వచ్చినా, ఢిల్లీ దక్కించుకుంది. ఫిల్ సాల్ట్ అందరికంటే ముందుగా బిడ్డింగ్ మొదలు పెట్టిన ఆర్‌సీబీ అతడిని సొంతం చేసుకునే వరకు వదల్లేదు. ఇషాన్ కిషన్ కోసం ప్రస్తుతం జట్టు ముంబై ఇండియన్స్ ముందుగా రంగంలోకి దిగినా... ఢిల్లీ, పంజాబ్‌లను దాటి హైదరాబాద్ గెలుచుకుంది. మూడు సీజన్ల పాటు పంజాబ్‌కే ఆడిన దూకుడైన వికెట్ కీపర్ జితేశ్ శర్మ కోసం ఆర్‌సీబీ భారీ మొత్తం చెల్లించింది. ఒకదశలో పంజాబ్ ఆర్‌టీఎం వాడాలని చూసినా... విలువను బెంగళూరు మరింత పెంచడంతో పంజాబ్ తప్పుకుంది. ధాటిగా ఆడే స్టొయినిస్‌కు ఊహించిన విధంగానే పెద్ద మొత్తం దక్కింది. లక్నోకు ఆర్‌టీఎం అవకాశం వచ్చినా వాడుకోకపోవడంతో అతను పంజాబ్ సొంతమయ్యాడు. తాజా ఫామ్, గత కొన్ని సీజన్లలో పేలవ ప్రదర్శనను బట్టి చూస్తే రబాడకు చాలా పెద్ద మొత్తం దక్కినట్లే. గాయంతో ఏడాది కాలంగా ఆటకు దూరంగా ఉన్న భారత టాప్ పేసర్ మొహమ్మద్ షమీ కోసం కోల్‌కతా, చెన్నై, లక్నో పోటీ పడ్డాయి.



వేలం నిర్వహిస్తున్న మల్లికా సాగర్. చిత్రంలో ఐపీఎల్ బోర్డు కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వరనాథ్

సన్‌రైజర్స్ రూ.10 కోట్లకు తీసుకెళ్లిన తర్వాత ఆర్‌టీఎం వాడుకునేందుకు గుజరాత్ ఆసక్తి చూపించలేదు. ఐపీఎల్‌లో నాలుగు జట్ల తరఫున ఆడిన షమీ 2022, 2023లలో గుజరాత్ విజేతగా, రన్నరప్‌గా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. నటరాజన్ కోసం కూడా మంచి పోటీ సాగింది. రూ.10 కోట్ల 25 లక్షల వరకు ఢిల్లీ తీసుకెళ్లిన తర్వాత ఆర్‌సీబీ ముందుకు వచ్చినా ఆఖరిని ఢిల్లీనే దక్కించుకుంది. గతంలో తమ కోసం ఆడిన జోఫ్రా ఆర్చర్ కోసం రాజస్తాన్ రాయల్స్ భారీ మొత్తం చెల్లించగా... గతంలో రెండు సీజన్లు తమ తరఫునే బరిలోకి దిగిన ట్రెంట్ బౌల్ట్‌ను ముంబై మళ్లీ తీసుకుంది. అయితే అందరికంటే పెద్ద ప్రమోషన్ అఫ్గానిస్తాన్ స్పిన్నర్, 19 ఏళ్ల నూర్ అహ్మద్‌కు లభించింది. గత సీజన్‌లో రూ.30 లక్షలకే గుజరాత్‌కు ఆడిన అతనికి ఈసారి చెన్నై ఏకంగా రూ.10 కోట్లు చెల్లించింది. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మల్లికా సాగర్ ఆధ్వర్యంలో వేలం కార్యక్రమం జరిగింది.



పల్టన్ ఫటాఫట్

బెంగాల్ వారియర్స్‌పై 17 పాయింట్లతో పుణేరి ఘనవిజయం

నోయిడా: డిఫెండింగ్ చాంపియన్ పుణేరి పల్టన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనకు బెంగాల్ వారియర్స్ చేతులెత్తేసింది. ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో పుణేరి పల్టన్ అర్ధసెంచరీని మించిన పాయింట్లను అవలీలగా చేసింది. కూతకెళ్లిన రెయిడర్లు, డిఫెండర్లు క్రమం తప్పకుండా పాయింట్లను సాధించారు. దీంతో పల్టన్ 51–34 స్కోరుతో 17 పాయింట్ల తేడాతో వారియర్స్‌పై జయభేరి మోగించింది. ఆట మొదలైన 7 నిమిషాలకే బెంగాల్ ఆలౌటైంది. మళ్లీ తొలి అర్ధభాగం ముగిసే దశలో ఆలౌట్ కావడంతో 24–11తో పుణేరి పూర్తి ఆధిపత్యంతో బ్రేక్‌కు వెళ్లింది. అనంతరం రెండో అర్ధభాగంలోనూ వారియర్స్ ఆటతీరు ఏమాత్రం మారలేదు. ఐదు నిమిషాలకే మ్యాచ్‌లో మూడోసారి ఆలౌటైంది. 11 నిమిషాల వ్యవధిలో నాలుగోసారి ఆలౌటైంది. పుణేరి జట్టు మ్యాచ్‌లో ఒకే ఒక్కసారి అది కూడా మ్యాచ్ ముగిసే ఆఖరి నిమిషంలో ఆలౌట్ కాగా... అప్పటికే పాయింట్ల ఫిఫ్టీ కొట్టింది. పల్టన్ రెయిడర్లు ఆకాశ్ షిండే (9 పాయింట్లు), మోహిత్ గోయత్ (9), పంకజ్ మోహితె (6), డిఫెండర్లు మోహిత్ (5), గౌరవ్ ఖత్రి (3) రాణించారు. బెంగాల్ తరఫున రెయిడర్ నితిన్ కుమార్ (13) అదరగొట్టాడు. మిగతా వారిలో కెప్టెన్, డిఫెండర్ ఫజల్ అత్రాచలి (3), ప్రణయ్ రాణే (5) మెరుగ్గా ఆడారు. తర్వాత జరిగిన రెండో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 44–42తో పట్నా పైరేట్స్‌పై గెలిచింది. యూపీ ఆటగాళ్లలో గగన్ గౌడ (11), భవాని రాజ్‌పుత్ (10), హితేశ్ (8)లు రాణించారు. పట్నా జట్టులో రెయిడర్ దేవాంక్ (18) ఆకట్టుకున్నాడు. అయాన్ (10) రాణించాడు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో పుణేరి పల్టన్‌తో జైపూర్ పింక్‌పాంథర్స్ తలపడనుండగా, యు ముంబాతో బెంగళూరు బుల్స్ పోటీపడుతుంది.

9 ఏళ్ల తర్వాత...

పాకిస్తాన్‌పై జింబాబ్వే విజయం ● సికందర్ రజా ఆల్‌రౌండ్ ప్రదర్శన



బులవాయో: పాకిస్తాన్‌తో ఆదివారం జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో జింబాబ్వే జట్టు ‘డక్‌వర్త్ లూయిస్’ పద్ధతిలో 80 పరుగుల తేడాతో విజయం సాధించింది. తద్వారా పాకిస్తాన్‌పై తొమ్మిదేళ్ల తర్వాత వన్డే మ్యచ్‌లో జింబాబ్వే విజయాన్ని అందుకుంది. చివరిసారి జింబాబ్వే 2015లో పాక్‌ను ఓడించింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ సికందర్ రజా (39 పరుగులు; 7 పరుగులకు 2 వికెట్లు) ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచి జింబాబ్వే గెలుపులో కీలక పాత్ర పోషించాడు. మొదట బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే 40.2 ఓవర్లలో 205 పరుగులకు ఆలౌటైంది. ఎన్‌గరావా ((52 బంతుల్లో 48; 5 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. సికందర్ రజా (56 బంతుల్లో 39; 6 ఫోర్లు), మరుమని (29; 2 ఫోర్లు, 1 సిక్స్), సీన్ విలియమ్స్ (23; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. పాక్ బౌలర్లలో సల్మాన్ ఆఘా (3/42), ఫైజల్ అక్రమ్ (3/24) ఆకట్టుకున్నారు. 206 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ 21 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 60 పరుగులు చేసింది. ఈ దశలో వర్షం రావడంతో ఆట సాధ్యపడలేదు. అప్పటికి ‘డక్‌వర్త్ లూయిస్’ పద్ధతి ప్రకారం విజయసమీకరణానికి పాక్ 80 పరుగులు వెనుకబడి ఉంది. జింబాబ్వే బౌలర్లలో ముజరబాని, సీన్ విలియమ్స్, సికందర్ రజా 2 వికెట్ల చొప్పున పడగొట్టారు.

జైలర్ కన్నా ఖైదీల ఆదాయమే ఎక్కువ!



బ్రిటన్ జైళ్లలో అధికారుల కంటే ఖైదీలే ఎక్కువ సంపాదిస్తున్నారు. రక్షణ కల్పించే అధికారులు, సెకండరీ టీచర్లు, బయో కెమిస్టులు, సైకోథెరపిస్టులు తదితరుల కంటే కూడా వారి ఆదాయం చాలా ఎక్కువట! అక్కడి కొన్ని బహిరంగ జైళ్లలో ఖైదీలను బయటికి వెళ్లి పని చేయడానికి కూడా అనుమతిస్తారు. అలా పనికి వెళ్లిన ఓ ఖైదీ గతేడాది ఏకంగా 46 వేల డాలర్ల (రూ.39 లక్షల) వార్షిక ఆదాయం ఆర్జించి రికార్డు సృష్టించాడు. మరో 9 మంది ఖైదీలు కూడా ఏటా 28,694 డాలర్ల (రూ.24 లక్షల) కంటే ఎక్కువ సంపాదిస్తున్నారని హోం శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఖైదీలకు పునరావాసంతో పాటు విడుదలయ్యాక సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు వీలు కల్పించడంలో భాగంగా ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటోంది. అక్కడి జైళ్లలో ఖైదీలు పలు ఉద్యోగాలు చేస్తారు. లారీ డ్రైవర్లుగా చేసేవారి సంపాదన ఎక్కువ. కొందరు శిక్షాకాలం ముగియకముందే తాత్కాలిక లైసెన్సు సంపాదించేస్తారు. ఈ ఖైదీల్లో పలువురు ఆదాయపన్ను కూడా చెల్లిస్తుండటం విశేషం. కొందరు సేవా కార్యక్రమాలకు విరాళాలూ ఇస్తారు! బ్రిటన్లో జైలు గార్డుల సగటు వేతనం 35,000 డాలర్లు. – సాక్షి, నేషనల్ డెస్క్

మా ఇంటలిజెన్స్ అధికారులు క్రిమినల్స్

నిజ్జర్ హత్య కేసులో తప్పుగా నివేదించారన్న కెనడా ప్రధాని



ఒట్టావా: భారత్‌తో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కీలక వ్యాఖ్యలు చేశారు. ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య కేసుతో ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తదితరులకు సంబంధమున్నట్టు తమ ఇంటెలిజెన్స్ అధికారులే తప్పుగా నివేదించారన్నారు. అవి తప్పుడు కథనాలని స్పష్టం చేశారు. ''అత్యంత రహస్య సమాచారాన్ని దురదృష్టవశాత్తు కొందరు క్రిమినల్స్ మీడియాకు లీక్ చేశారు. వాటి ఆధారంగా తప్పుడు కథనాలు ప్రచురితమయ్యాయి'' అని ట్రూడో చెప్పుకొచ్చారు. నిజ్జర్ హత్యతో పాటు కెనడాలో జరుగుతున్న పలు హింసాత్మక కుట్రలతో మోదీ, ఎస్.జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తదితరులకు సంబంధముందని కెనడా భద్రతా సంస్థలు భావిస్తున్నట్టు అక్కడి వార్తా సంస్థల్లో కొద్ది రోజులుగా పలు కథనాలు వెలువడ్డాయి. భారత్ తీవ్ర అభ్యంతరాల నేపథ్యంలో వాటిని కెనడా ప్రభుత్వం ఖండించింది. వాటికి తమవద్ద ఎలాంటి ఆధారాలూ లేవని చెప్పుకొచ్చింది.


ఒకప్పుడు విదేశాల్లో టెకీ.. ఇప్పుడు బిచ్చగాడు

వైరలవుతున్న బెంగళూరు వ్యక్తి వీడియోలు



అతను ఒకప్పుడు జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో, ఆ తరువాత బెంగళూరులో ఓ ప్రముఖ టెక్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేశాడు. ఇప్పుడదే బెంగళూరులోని జయనగర్ వీధుల్లో బిచ్చమెత్తుకుంటున్నాడు. మద్యానికి బానిసవడమే తన దుస్థితికి కారణమని చెబుతున్నాడు. అతను తనతో పంచుకున్న కథను శరత్ యువరాజా అనే యువకుడు ఇన్‌స్టాలో షేర్ చేశాడు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఐన్‌స్టీన్ మొదలుకుని పలువురు తత్వవేత్తల దాకా అందరి గురించీ అతను అనర్గళంగా మాట్లాడుతున్నాడు. ధ్యానం, తత్వశాస్త్రం, సైన్స్ వంటి అంశాలపై లోతైన వ్యాఖ్యలు చేస్తున్నాడు. అయితే నేం, 'తల్లిదండ్రులను కోల్పోవడం నన్ను మద్యం మత్తులోకి నెట్టింది. అది అదుపు తప్పి ఈ గతి పట్టింది. నిరాశ్రయుడిగా మారి బతకడం కోసం భిక్షాటన చేస్తున్నా'' అని చెప్పుకొచ్చాడు. ''మతం కులం, ఇవన్నీ కలగలసి చివరకు నేనేమయ్యానో చూడండి. నేనింకా చదవాలి'' అని మరో వీడియోలో చెప్పాడు. సాయం చేయడానికి ప్రయత్నిస్తే నిరాకరించాడని శరత్ పేర్కొన్నారు. ''దాంతో ఎన్జీవోలను సంప్రదించా. కానీ పోలీసుల ప్రమేయంతోనే అతన్ని మార్చడం సాధ్యమని డాక్టర్లు అంటున్నారు'' అని చెప్పారు. వ్యసనాలకు దూరంగా ఉండటం, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, వృత్తిలో విజయాలు తదితరాలపై ఈ వీడియోలు ఆన్‌లైన్‌లో గట్టి చర్చకు దారి తీశాయి. – సాక్షి, నేషనల్ డెస్క్

జపాన్‌లో లవ్ హోటళ్లు


తిమింగళం ఆకారంలో ఆకట్టుకుంటున్న ఓ లవ్ హోటల్

వింత ఆకృతుల్లో కనువిందు ● పోటెత్తుతున్న ప్రేమ పక్షులు

అణుబాంబుల వినాశనం నుంచి తేరుకుని జపాన్ సాధించిన ప్రగతి అన్ని దేశాలకూ స్ఫూర్తిదాయకమే. అక్కడి గమ్మత్తైన సంగతులను కెమెరాలో బంధించేందుకు బయల్దేరిన ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ ఫ్రాంకోయిస్ ప్రోస్ట్‌ను లవ్ హోటళ్ల సంస్కృతి బాగా ఆకర్షించింది. ప్రైవసీ కోసం ప్రేమ పక్షులు కాస్త 'ఏకాంతంగా' సమయం గడిపే ఈ హోటళ్లు జపాన్‌లో సూపర్‌హిట్‌గా మారాయి. వింత ఆకృతుల్లో అలరించే వీటి విశేషాలను రకరకాల యాంగిళ్లలో కెమెరాలో బంధించాడు.

పడవలు, కోటలు, అంతరిక్ష వస్తువులు

హోటల్ జాయ్, హోటల్ ప్యాషన్, హోటల్ బేబీ కిస్... ఇలా ఆకర్షణీయ పేర్లతో లవ్, కిస్ సింబళ్లతో ఈ హోటళ్లు ఆకట్టుకునేలా ఉంటాయి. విభిన్న ఆకృతుల్లో ఉండటం వీటిలోని మరో విశేషం. ఒక హోటల్ భారీ పడవలా, మరోటి పేద్ద కోటలాగా దర్శనమిస్తాయి. ఇంకోటి తిమింగలంలా, మరోటి గ్రహాంతరవాసుల ఎగిరే పళ్లెం (యూఎఫ్‌ఓ)లా నిర్మించారు. సాధారణ భవంతుల మధ్య చూడగానే కనిపెట్టేలా వీటిని కట్టారు. ఇలాంటి 200కు పైగా లవ్ హోటళ్లను ప్రోస్ట్ ఫొటోలు తీశారు. వ్యభిచారాన్ని నిషేధిస్తూ జపాన్‌లో 1958లో చట్టం తెచ్చాక ఈ లవ్ హోటళ్ల సంస్కృతి పెరగడం విశేషం. వీటిల్లో వ్యభిచారం జరుగుతోందని కొందరు విమర్శిస్తుండగా మరికొందరు దాన్ని గట్టిగా ఖండిస్తుండటం విశేషం.

ఇరుకు ఇళ్లు, ఉమ్మడి కుటుంబాలు

ఉమ్మడి కుటుంబాల్లో కొత్త జంటలకు ఊపిరాడదు. చిలిపి చేష్టలు తదితరాలు కష్టం. పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలు నివసించే ఇళ్లు, గదులు మరీ ఇరుకు. ఇలాంటి కొత్త, పేద జంటల 'అవసరాలు' తీర్చే ప్రత్యామ్నాయ వేదికలుగా లవ్ హోటళ్లు బాగా ఉపయోగపడుతున్నాయని జపాన్‌లో చాలామంది భావిస్తున్నారు. కొత్త జంటలు, ప్రేమ పక్షుల ప్రైవసీకే గాక నైట్‌క్లబ్ వంటి పలు వసతులకు ఇవి నెలవులు. జలాంతర్గామిలా, పెద్ద నౌకలా చూపు తిప్పుకోలేనంతటి ముదురు రంగు పెయింటింగుల్లో, రాత్రిళ్లు ధగధగల విద్యుత్ వెలుగుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

ఫుల్ ప్రైవసీ

ఈ లవ్ హోటళ్లలో సిబ్బంది చాలా తక్కువగా ఉంటారు. ఉన్నా సరిగా కనపడరు. తెరలు, మసకమసక గాజు తలుపుల వెనక నుంచే సేవలందిస్తారు. చార్జీలను ఆన్‌లైన్‌లోనే చెల్లించవచ్చు. కారు పార్కింగ్ ప్రాంతం కూడా కాస్త చీకటిగానే ఉంటుంది గనుక ప్రైవసీకి లోటే ఉండదు. 1970ల నుంచీ బాగా పాపులరైన మెగురో ఎంపరర్ లవ్ హోటల్‌ను యూరప్ కోట ఆకృతిలో నిర్మించారు. దాని బాటలో జపాన్ అంతటా చాలా నగరాల్లో లవ్ హోటళ్లు కోట డిజైన్లలో పుట్టుకొచ్చాయి. హోన్షు, షికోకు దీవులు మొదలుకుని టోక్యో దాకా అంతటా అలరిస్తూ వచ్చాయి. ఒకయామాలోని హోటల్ అలాదిన్‌ను గ్రాండ్ అరేబియన్ ప్యాలెస్‌లా భారీ గుమ్మటాలతో కట్టారు.

ఏటా 50 కోట్ల మంది

జపాన్‌వ్యాప్తంగా 20,000 లవ్ హోటళ్లుంటాయని అంచనా. 1980ల్లో వచ్చిన కఠిన చట్టాల తర్వాత వీటి సంఖ్య తగ్గింది. అయినా ఇప్పటికీ వీటికి విపరీతమైన జనాదరణ ఉంది. 1990ల నుంచి అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం ఈ హోటళ్లను ప్రేమ జంటలు ఏటా 50 కోట్లసార్లు సందర్శిస్తున్నారు! ఆ లెక్కన జపాన్‌లో సగం శృంగారం ఈ హోటళ్లలోనే జరుగుతోందని ప్రముఖ న్యాయ శాస్త్రవేత్త మార్క్ డి.వెస్ట్ విశ్లేషించారు. 2005లో రాసిన 'లా ఇన్ ఎవ్రీడే జపాన్' పుస్తకంలో ఇలాంటి బోలెడు విషయాలను వెల్లడించారాయన.

– సాక్షి, నేషనల్ డెస్క్

తూర్పు రాష్ట్రాలు గ్రోత్ ఇంజన్లు: మోదీ

న్యూఢిల్లీ: తూర్పు రాష్ట్రాలను ఒకప్పుడు అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతాలుగా పరిగణించేవారని, తాము మాత్రం ఇప్పుడు దేశానికి గ్రోత్ ఇంజన్లుగా భావిస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. దేశంలో తూర్పు ప్రాంతాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ఒడిశాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని సంకల్పించామని తెలిపారు. ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన 'ఒడిశా పర్బా'వేడుకలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒడిశాలో బీజేపీ అధికారంలోకి వచ్చాక 100 రోజుల్లోనే రూ.45 వేల కోట్ల పెట్టుబడులకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఒడిశా గడ్డ మహా పండితులకు, యోగులకు నిలయమని చెప్పారు. పండితులు మన ప్రాచీన పవిత్ర గ్రంథాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లారని, ప్రజలు వాటిలో అనుసంధానమయ్యారని తెలిపారు. దేశ సాంస్కృతి వైభవం మరింత వెలుగులీనడానికి యోగులు, పండితులు తోడ్పడ్డారని ప్రధానమంత్రి కొనియాడారు.

ముగ్గురి ప్రాణాలు తీసిన జీపీఎస్

బరేలీ: తెలియని ప్రాంతం ఎక్కడకు వెళ్లినా... జీపీఎస్‌ను ఫాలో అవ్వడం సాధారణం అయిపోయింది. అలా జీపీఎస్ నావిగేషన్‌ను నమ్ముకుని వెళ్లిన వారి కారు నదిలోకి దూసుకెళ్లడంతో ఉత్తరప్రదేశ్‌లో ముగ్గురు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. రాష్ట్రంలోని బరేలీ నుంచి బదౌన్ జిల్లాలోని డాటాగంజ్‌కు కారులో బయల్దేరారు. దారి తెలియకపోవడంతో జీపీఎస్‌ను ఆశ్రయించారు. ఖల్పూర్–దాతాగంజ్ రహదారిపై వెళ్తుండగా.. జీపీఎస్ నావిగేషన్ వారిని రాంగంగ నది వంతెనపైకి తీసుకెళ్లింది. ఈ ఏడాది ప్రారంభంలో వచ్చిన వరదల కారణంగా వంతెనలో కొంత భాగం కూలిపోయింది. ఇది జీపీఎస్ వ్యవస్థలో అప్‌డేట్ కాలేదు. కారు నేరుగా వంతెనపై దూసుకెళ్లడంతో నదిలో పడిపోయింది. కారులో ఉన్న ముగ్గురు మృతిచెందారు. దెబ్బతిన్న వంతెన వెళ్లే మార్గంలో ఎలాంటి భద్రతా హెచ్చరికలు, సంకేతాలు లేకపోవడంవల్లే ప్రమాదం జరిగిందని పోలీసు అధికారి శివం తెలిపారు.

యూఏఈలో రబ్బీ మృతదేహం లభ్యం

టెల్ అవీవ్: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో కనిపించకుండా పోయిన ఇజ్రాయెల్ –మోల్డోవా రబ్బీ (యూదు మత ప్రబోధకుడు) మృతదేహం లభ్యమైనట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఆయన మరణానికి కారణమైనవారిపై చర్యలు తీసుకుంటామని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. యూఏఈ దీనిపై స్పందించలేదు. దుబాయ్‌లో కోషర్ కిరాణా దుకాణాన్ని నడుపుతున్న అల్ట్రా–ఆర్థడాక్స్ రబ్బీ 28 ఏళ్ల జ్వీ కోగన్ గురువారం నుంచి కనిపించకుండా పోయారు. ఆదివారం ఆయన మృతదేహం లభించింది. ఈ పరిణామం తనను తీవ్రంగా కలచివేసిందని ప్రధాని నెతన్యాహు అన్నారు. ఈ ఘటనపై దర్యాప్తుకు పూర్తిగా సహకరించినందుకు యూఏఈ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సోషల్ మీడియా దన్నుతో...

తీర్పులను ప్రభావితం చేసే యత్నాలు

- న్యాయమూర్తులు అప్రమత్తంగా ఉండాలి
- మాజీ సీజేఐ చంద్రచూడ్ హితవు



న్యూఢిల్లీ: కోర్టుల తీర్పులను ప్రభావితం చేయడానికి కొన్ని ఒత్తిడి గ్రూప్‌లు ప్రయత్నిస్తున్నాయని, అందుకు సోషల్ మీడియాను ఉపయోగించుకుంటున్నాయని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ చెప్పారు. తీర్పులను ప్రభావితం చేయడం ద్వారా సొంత ప్రయోజనాలు సాధించుకోవాలని ఆశిస్తున్న ఇలాంటి శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని న్యాయమూర్తులకు సూచించారు. ''యూట్యూబ్‌లో 20 సెకండ్ల వీడియో చూసి ప్రజలు అభిప్రాయం ఏర్పరుచుకుంటున్న పరిస్థితి! వారిపై సోషల్ మీడియా విపరీతమైన ప్రభావం చూపుతోంది. అభిప్రాయాలను నిర్దేశిస్తోంది. ఇది ప్రమాదకర పరిణామం'' అన్నారు. న్యాయస్థానాలు ఇచ్చే తీర్పులు, తీసుకున్న నిర్ణయాలకు ఆధారం ఏమిటన్నది తెలుసుకొనే అవకాశం, దానిపై అభిప్రాయం వ్యక్తం చేసే హక్కు ప్రజలకు ఉన్నప్పటికీ అది జడ్జిలను టార్గెట్ చేసేలా ఉండకూడదని అభిప్రాయపడ్డారు. ప్రత్యేకంగా కొందరు జడ్జిలను లక్ష్యంగా చేసుకొని ఆరోపణలు చేస్తున్న పరిస్థితులు ఉత్పన్నమైనప్పుడు నిజంగా భావవ్యక్తీకరణ స్వేచ్ఛ అంటే ఇదేనా? అనే ప్రశ్న తలెత్తుతుందని పేర్కొన్నారు. ఆదివారం ఎన్డీటీవీ ఆధ్వర్యంలో జరిగిన సంవిధాన్–75 సదస్సులో జస్టిస్ చంద్రచూడ్ ప్రసంగించారు. ఎలాంటి ఆంక్షలు, నిరోధకాలు, బాధ్యతలు లేకుండా ఇలా ప్రైవేట్ పౌరుడిగా ఉండడం చాలా అద్భుతంగా ఉందని వ్యాఖ్యానించారు.

ఆయన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఈ నెల 10న పదవీ విరమణ చేసిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకం కోసం అమల్లో ఉన్న కొలీజియం వ్యవస్థను జస్టిస్ చంద్రచూడ్ సమర్థించారు. న్యాయమూర్తులు సైతం నిరభ్యంతరంగా రాజకీయాల్లో చేరవచ్చని, రాజ్యాంగం అందుకు ఎలాంటి అడ్డుకట్టలు వేయడం లేదని పేర్కొన్నారు. క్రికెట్ తనకు చాలా ఇష్టమైన క్రీడ అని చెప్పారు. జస్‌ప్రీత్ బుమ్రా, విరాట్ కోహ్లి తన అభిమాన క్రికెటర్లు అని వ్యాఖ్యానించారు. ఒకప్పటి క్రికెటర్లలో రాహుల్ ద్రవిడ్‌ను అభిమానిస్తానని తెలిపారు.

పర్యావరణ ప్యాకేజీ... 300 బిలియన్ డాలర్లు


బకూ (అజర్‌బైజాన్): వాతావరణ మార్పుల తాలూకు దుష్ప్రభావాలను ఎదుర్కొనేందుకు వీలుగా వర్ధమాన దేశాలకు 300 బిలియన్ డాలర్లు అందించేందుకు ధనిక దేశాలు అంగీకరించాయి. అజర్‌బైజాన్‌లోని బకూ వేదికగా జరుగుతున్న కాప్–29 సదస్సులో ఆదివారం ఈ మేరకు పర్యావరణ ప్యాకేజీపై ఒప్పందం కుదిరింది. వర్ధమాన దేశాలకు 100 బిలియన్ డాలర్లు ఇచ్చేలా 2009లో కాప్ సదస్సులో అంగీకారం కుదరడం తెలిసిందే. దాని స్థానంలో 2035 నాటికి ఆ దేశాలకు 300 బిలియన్ డాలర్లు అందించేలా ప్యాకేజీని సవరించారు. కానీ పర్యావరణ లక్ష్యాల సాధనకు ఈ మొత్తం ఏ మూలకూ చాలదని భారత్ మండిపడింది. పలు వర్ధమాన దేశాలు కూడా అందుకు గొంతు కలిపాయి. పర్యావరణ పరిరక్షణ చర్చల విషయంలో కాప్–29 ప్రెసిడెన్సీ వ్యవహార శైలి సరిగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశాయి. పారిస్ ఒప్పంద లక్ష్యాలకు విఘాతం కలిగిస్తూ ధనిక దేశాలు తమ బలాన్ని ఉపయోగించి తమపై బలవంతంగా ఈ ఒప్పందాన్ని రుద్దుతున్నాయమని మండిపడ్డాయి. ఈ ప్యాకేజీని 'చాలా తక్కువ, చాలా ఆలస్యం'గా ఆఫ్రికన్ గ్రూప్ ప్రతినిధులు అభివర్ణించారు. గత శుక్రవారం దాకా జరగాల్సిన 12 రోజుల కాప్ సదస్సు రెండో రోజులు అదనంగా కొనసాగి దేశాల అభ్యంతరాలు, వాకౌట్ల నడుమ ఆదివారం ముగిసింది.

అగ్ర రాజ్యాల అంగీకారం

- ▶ కాప్–29 సదస్సులో ఒప్పందం
- ▶ ఏ మూలకూ చాలదన్న భారత్
- ▶ గొంతు కలిపిన పలు వర్ధమాన దేశాలు

అంగీకరించబోం: భారత్

వాతావరణ మార్పుల వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాలే బాగా ప్రభావితమవుతున్నాయని భారత్ గుర్తు చేసింది. ''వాటికి కేవలం 300 బిలియన్ డాలర్ల ప్యాకేజీ చాలా తక్కువ. ఇందుకు అంగీకరించబోం'' అని స్పష్టం చేసింది. తమ అభ్యంతరాలను తీసుకోకుండా కాప్–29 అధ్యక్షునితో పాటు ఐరాస ఈ ఒప్పందాన్ని దేశాలపై రుద్దాయని ఆరోపించింది. దీన్ని తీవ్ర అన్యాయంగా సదస్సులో పాల్గొన్న భారత్ ఆర్థిక వ్యవహారాల శాఖ సలహాదారు చాందినీ రైనా అభివర్ణించారు. ప్యాకేజీని ఆమోదించే ముందు కనీసం తమతో మాట్లాడాలని సూచించినా పట్టించుకోలేదన్నారు. ''అన్నిదేశాల అభ్యంతరాలనూ వినాలి. ఇలా దేశాలను మాట్లాడనీయకుండా చేయడం ఐరాస వాతావరణ మార్పుల ఒప్పందానికి విరుద్ధం. దీన్ని భారత్ పూర్తిగా వ్యతిరేకిస్తోంది'' అని తెలిపారు.



పెద్ద జోక్: నైజీరియా

భారత్‌కు నైజీరియా మద్దతు తెలిపింది. 300 బిలియన్ డాలర్లు ప్యాకేజీ పెద్ద జోక్ అని వ్యాఖ్యానించింది. మలావీ, బొలీవియా సైతం భారత్‌తో గొంతు కలిపాయి. ఇది నిరాశాజనక పరిణామమని 'తక్కువ అభివృద్ధి చెందిన దేశాల' (ఎల్డీసీ) గ్రూప్ చైర్మన్ ఎవాన్స్ ఎన్జేవా అన్నారు. ఒప్పందం ఏకపక్షంగా జరిగిందని ఆఫ్రికన్ గ్రూప్ ఆఫ్ నెగోషియేటర్స్ (ఏజీఎన్) చైర్మన్ విమర్శించారు. ఇది హాస్యాస్పదమని నైజీరియాకు చెందిన సంధానకర్త ఎన్కిరుకా మదుక్వే అన్నారు. దీనిపై పునరాలోచించుకోవాలి తీసుకోవాలా వద్దా అని నిర్ణయించుకునే హక్కు వర్ధమాన దేశాలకు ఉందని ఆమె అన్నారు. ఎల్డీసీ గ్రూప్, అలయన్స్ ఆఫ్ స్మాల్ ఐలాండ్ స్టేట్స్ (ఏఓఎస్ఐఎస్) ప్రతినిధులు వాకౌట్ చేయడంతో గందరగోళం నెలకొంది. ఐరాస వాతావరణ చర్చలు దాదాపు విఫలమయ్యాయని ఐరాస మానవ హక్కుల మాజీ హైకమిషనర్ మేరీ రాబిన్సన్ అన్నారు.

1.3 లక్షల కోట్ల డాలర్లు కావాలి

గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన కారణమైన గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాల కట్టడికి సాయపడేందుకు అల్పాదాయ ఆర్థిక వ్యవస్థలకు సంపన్న దేశాలు ఆర్థిక, సాంకేతిక పరిజ్ఞానం, మద్దతు అందిస్తున్నాయి. ఇందుకోసం 2020 నాటికి 100 బిలియన్ డాలర్లు అందిస్తామని 2009లో హామీ ఇచ్చినా దాన్ని నెరవేర్చిన దాఖలాలు లేవు. ఇప్పుడు ప్రకటించిన 300 బిలియన్ డాలర్లు ఏ మూలకూ చాలవని, కనీసం 1.3 లక్షల కోట్ల డాలర్లు కావాలని వర్ధమాన దేశాలు కోరుతున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

ప్రపంచంలో తొలి వర్ణమాల ఇదే!

సిరియాలో కనుగొన్న శాస్త్రవేత్తలు



సిరియాలో పురాతత్వ శాస్త్రవేత్తల తవ్వకాల్లో కొత్త వర్ణమాల వెలుగులోకి వచ్చింది. దాదాపు 4,400 సంవత్సరాల క్రితం ఈ లిపిని వినియోగించి ఉంటారని జాన్ హాప్కిన్స్ విశ్వవిద్యాల పరిశోధకుల బృందం ప్రకటించింది. క్రీస్తుపూర్వం 2,400 సంవత్సరంలో పశ్చిమ సిరియాలోని ప్రాచీన పట్టణ ప్రాంతం టెల్ ఉమ్–ఎల్ మర్రా వద్ద జరిపిన తవ్వకాల్లో చేతి వేళ్ల ఆకృతిలో ఉన్న చిన్న మట్టి వస్తువులపై ఈ వర్ణమాలను గుర్తించారు. ఒక సమాధిని తవ్వితీయగా ఇవి లభించాయని చెబుతున్నారు. ఇన్నాళ్లూ నిర్ధారించిన దాని కంటే ఈ లిపి మరో 500 ఏళ్ల క్రితంనాటిదని అంచనావేస్తున్నారు. ఆమ్‌స్టర్‌డ్యామ్ విశ్వవిద్యాలయంతో కలిసి సంయుక్తంగా జాన్ హాప్కిన్స్ వర్సిటీలో పురాతత్వవేత్త, ప్రొఫెసర్ గ్లెన్ స్వార్జ్ నేతృత్వంలో ఈ తవ్వకాలు జరిగాయి. ఈ ప్రాంతంలో 16 ఏళ్ల క్రితమే తొలిసారిగా తవ్వకాలు జరిగాయి. తొలి కంచు యుగంనాటి ఈ సమాధిలో ఆరు అస్థిపంజరాలు, బంగారు, వెండి ఆభరణాలు, వంట పాత్రలు, ఒక బాణం, మృణ్మయ పాత్రలను కనుగొన్నారు. తొలి తరం నాగరికతలు తమలో తాము సమాచారం ఇచ్చిపుచ్చుకునేందుకు కొత్త తరహాలో అనుసంధాన విధానాలను అనుసరించేవని ఈ మట్టి వస్తువులపై ఉన్న రాతలను బట్టి అర్థమవుతోందని పరిశోధకులు చెప్పారు. ''నాటి సమాజాల్లో రాజరికం, అత్యున్నత స్థాయి వర్గాలే కాదు సామాన్యులూ వర్ణమాల ద్వారా రాయగలిగే సామర్థ్యాలను సంతరించుకునే ప్రయత్నాలు చేశారనడానికి ఇవి ప్రబల నిదర్శనాలు'' అని స్వార్జ్ అన్నారు. ''వీటిపై ఉన్న లిపి లాంటి అక్షరాలను చూస్తుంటే వేర్వేరు పాత్రల్లో ఏమేం నిల్వచేశారో తెలిసేందుకు ఒక్కో పాత్రపై 'లేబుల్'లాగా ఈ లిపిని వాడి ఉంటారని అర్థమవుతోంది. ఈ అక్షరాలను మనం తర్జుమా చేయకుండా అసలు ఇవేంటో ఒక నిర్ధారణకు రావడం చాలా కష్టం. కార్బన్–14 డేటింగ్ ద్వారా తెలిసిందేమంటే ఈ రాతలు చరిత్రలో ఇప్పటిదాకా కనుగొన్న వర్ణమాల కంటే పురాతనమైనవని తేలింది. క్రీస్తుపూర్వం 1900 సమీప కాలంలో ఈజిప్ట్, పరిసర ప్రాంతాల్లో తొలిసారిగా వర్ణమాల రూపొందినట్టు ఇన్నాళ్లూ భావించాం. కానీ సిరియాలో వెలుగు చూసిన అక్షరాలను చూస్తుంటే ఎన్నడూ ఊహించని ప్రదేశాల్లోనూ వర్ణమాలకు మూలాలున్నాయని అర్థమవుతోంది'' అని స్వార్జ్ వ్యాఖ్యానించారు. నవంబర్ 21న జరిగిన అమెరికన్ సొసైటీ ఆఫ్ ఓవర్‌సీస్ రీసెర్చ్ వార్షిక సమావేశంలో స్వార్జ్ తన పరిశోధన వివరాలను బహిర్గతంచేశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

సమ్మర్ ప్లేస్‌మెంట్స్ జోష్!

రెండు నెలల ఇంటర్న్‌షిప్ చేస్తే రూ.2 లక్షల స్టయిఫండ్! ఆ తర్వాత అదే కంపెనీల్లో శాశ్వత కొలువులు సైతం సొంతం చేసుకునే అవకాశం! ఫైనల్ ప్లేస్‌మెంట్స్‌లో ఎలాంటి టెన్షన్ లేకుండా ఎస్‌పీఓ ద్వారా ముందుగానే ఫైనల్ ఆఫర్‌కు మార్గం సుగమం చేసుకోవచ్చు!! దేశంలో ప్రతిష్టాత్మక మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్.. .ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) క్యాంపస్‌ల్లో సమ్మర్ ప్లేస్‌మెంట్స్ ఆఫర్లు వెల్లువెత్తుతున్నాయి. 2024-26 బ్యాచ్ పీజీపీ విద్యార్థులకు సగటున రూ.2 లక్షల స్టయిఫండ్‌తో సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ లభించాయి! ఈ నేపథ్యంలో.. ఐఐఎంల్లో ఎస్‌పీఓ తాజా ట్రెండ్స్, భవిష్యత్ అవకాశాలపై ప్రత్యేక కథనం..



- » రెండు నెలల ఇంటర్న్‌షిప్‌కు రెండు లక్షల స్టయిఫండ్!
- » ఐఐఎంల విద్యార్థులకు ఎస్‌పీఓ వెల్లువ
- » ఫైనల్ ప్లేస్‌మెట్స్‌కు మార్గంగా సమ్మర్ ప్లేస్‌మెంట్స్
- » ముందంజలో బ్యాంకింగ్, ఫైనాన్స్, కన్సల్టింగ్ రంగాలు

సమ్మర్ ప్లేస్‌మెంట్ అంటే

సమ్మర్ ప్లేస్‌మెంట్ అంటే.. ఇంటర్న్‌షిప్ అనే చెప్పాలి. విద్యార్థులు క్షేత్ర స్థాయి నైపుణ్యాలు పొందడానికి ఏదైనా సంస్థలో ఇంటర్న్‌షిప్ చేయడం తెలిసిందే. ఐఐఎంలు, ఇతర బి-స్కూల్స్‌లో ఈ ఇంటర్న్‌షిప్‌నకు విద్యార్థులను ఎంపిక చేసేందుకు చేపట్టే ప్రక్రియనే సమ్మర్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ అంటారు. అందులో ఎంపికైన వారికి ఇచ్చే ఆఫర్స్‌నే సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్(ఎస్‌పీఓ)గా పిలుస్తారు. ఎంబీఏలో చేరిన విద్యార్థులకు మొదటి సంవత్సరం పూర్తయ్యాక సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫ ర్స్ ఇచ్చి..ఇంటర్న్ ట్రైనీగా అవకాశం కల్పిస్తున్నా యి. ఇలా ఇంటర్న్ ట్రైనీగా ఎంపికైన వారికి స్టయిపండ్ పేరుతో ఆర్థిక ప్రోత్సాహకాలు కూడా అందిస్తారు.

ఎస్‌పీఓల హవా

తొలి తరం ఐఐఎంలు లక్నో, అహ్మదాబాద్, బెంగళూరుల్లో 2024-26 బ్యాచ్ విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ వెల్లువెత్తాయి. ఐఐఎం-లక్నోలో మొత్తం 576 మంది విద్యార్థులకు ఎస్‌పీఓలు లభించాయి. వీరికి సగటు స్టయిఫండ్ నెలకు రూ.1.43 లక్షలుగా, గరిష్ట స్టయిఫండ్ రూ.3.95 లక్షలుగా నిలవడం విశేషం. ఐఐఎం -కోల్‌కతలో 564 మంది విద్యార్థులకు గాను అందరికీ సమ్మర్ ప్లేస్‌మెంట్స్ లభించాయి. ఇక్కడ సగటు స్టయిఫండ్ రూ.1.89 లక్షలుగా, గరిష్ట స్టయిఫండ్ రూ.3.67 లక్షలుగా నిలిచింది. ఐఐఎం-బెంగళూరు క్యాంపస్‌లో 601 మంది విద్యార్థులకుగాను అందరికీ ఎస్‌పీఓలు లభించాయి. ఈ క్యాంపస్‌లోనూ సగటు స్టయిఫండ్ రూ.2 లక్షలుగా, గరిష్ట స్టయిఫండ్ రూ.3.5 లక్షలుగా నమోదైంది.

నవతరం ఐఐఎంల్లోనూ

నవతరం ఐఐఎంల్లో ఒకటైన ఐఐఎం-ఇండోర్‌లో నూటికి నూరు శాతం విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్స్ లభించాయి. ఇక్కడ సగటు స్టయిఫండ్ రూ.1.25 లక్షలుగా ఉంది. మిగిలిన క్యాంపస్‌లలో డిసెంబర్ మొదటి వారంలో సమ్మర్ ప్లేస్‌మెంట్ ప్రక్రియ మొదలయ్యే అవకాశం ఉందని.. రెండు లేదా మూడు దశల్లో డిసెంబర్ 15వ తేదీలోపు ఈ ప్రక్రియ ముగుస్తుందని ఆయా క్యాంపస్ ప్లేస్‌మెంట్ సెల్ వర్గాలు పేర్కొంటున్నాయి.

జోరు పెరిగిన తీరు

ఐఐఎం క్యాంపస్‌ల్లో గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ జోరు పెరిగిందని చెప్పొచ్చు. వాస్తవానికి కోవిడ్ తర్వాత రెండేళ్ల స్తబ్దుగా ఉన్న ఎస్‌పీఓలు.. గత ఏడాది గాడిలో పడ్డాయి. ఈ ఏడాది అవి మరింత పుంజుకున్నాయి. మార్కెట్‌లో ఆయా సంస్థల కార్యకలాపాలు, వ్యాపారాలు తిరిగి పుంజుకోవడంతో.. దానికి అనుగుణంగా నియామకాల కోసం ఐఐఎంలకు వస్తున్నట్లు చెబుతున్నారు.

ఇతర బి-స్కూల్స్‌లోనూ

మేనేజ్‌మెంట్ విద్యలో పేరున్న ఢిల్లీ యూనివర్సిటీలోకి ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(ఎఫ్ఎంఎస్) విభాగంలోనూ ఎంబీఏలో ఈ సారి ఆఫర్లు మెరుగ్గా ఉంటాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దేశంలోని మరో ప్రముఖ బి-స్కూల్ ఎక్స్‌ఎల్ఆర్ఐ-జంషెడ్‌పూర్‌లో తాజాగా వంద శాతం ఇంటర్న్‌షిప్ ఆఫర్లు లభించాయి. ఇక్కడ రెండు నెలల వ్యవధికి ఇచ్చే స్టయిపండ్ కూడా గరిష్టంగా రూ.3.5 లక్షలుగా నమోదైంది.

ఈ రంగాలదే హవా

ఈ ఏడాది సమ్మర్ ప్లేస్‌మెంట్స్‌లో కన్సల్టింగ్, ఫైనాన్స్, బ్యాంకింగ్ రంగాల హవానే కనిపించింది. ఇప్పటివరకూ లభించిన ఆఫర్లల్లో దాదాపు 40 శాతం మేరకు కన్సల్టింగ్, ఫైనాన్స్ రంగాలకు చెందిన సంస్థల నుంచే ఉన్నాయి. బీసీజీ, బెయిన్ అండ్ కో, యాక్సెంచర్ స్ట్రాటజీ, పీడబ్ల్యూసీ, డెలాయిట్, కేపీఎంజీ, సినర్జీ కన్సల్టింగ్ సంస్థలు టాప్ రిక్రూటర్స్‌గా నిలిచాయి. కన్సల్టింగ్, ఫైనాన్స్ రంగాల తర్వాత ఐటీ, ఈ-కామర్స్ సంస్థలు టాప్ రిక్రూటర్స్‌గా నిలిచాయి. ఈ రంగాల్లో డేటా మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, మార్కెటింగ్ విభాగాల్లో ఆఫర్లు లభించాయి. అదే విధంగా గూగుల్, ఫేస్‌బుక్ సంస్థలు కూడా ఎస్‌పీఓ ఆఫర్లు కల్పించాయి.

సేల్స్, మార్కెటింగ్

సేల్స్ అండ్ మార్కెటింగ్ ప్రొఫైల్స్‌లోనూ గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా జోరు కొనసాగింది. ముఖ్యంగా ప్రొడక్ట్ రీసెర్చ్, మార్కెట్ అనాలిసిస్ విభాగాల్లో విధులు నిర్వర్తించే విధంగా ఈ ఆఫర్స్ లభించాయి. అదే సమయంలో జనరల్ మేనేజ్‌మెంట్ విభాగంలోనూ సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ పంథా కొనసాగింది. సంస్థలు ఈ విభాగాల్లో విద్యార్థులను నియమించుకునే క్రమంలో వారిలోని విశ్లేషణాత్మక దృక్పథం, మార్కెట్ పరిస్థితులపై వారికున్న అవగాహనను క్షుణ్నంగా పరిశీలించి ఆఫర్స్ ఇచ్చినట్లు ఐఐఎంల వర్గాలు పేర్కొన్నాయి.

ఈ ప్రొఫైల్స్‌లో అధికంగా

ఐఐఎంల విద్యార్థులకు లభించిన జాబ్ ప్రొఫైల్స్‌ను గమనిస్తే ఎక్కువగా.. డేటా మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్, జనరల్ అడ్మినిస్ట్రేషన్, సేల్స్ అండ్ మార్కెటింగ్, డేటా అనలిటిక్స్, బిజినెస్ స్ట్రాటజీస్ ప్రొఫైల్స్ ముందంజలో ఉన్నాయి.

ఆఫర్స్ కారణాలు ఇవే

ఐఐఎంల్లో ఎస్‌పీఓ ఆఫర్లతోపాటు రెండు నెలల స్వల్ప వ్యవధికి రూ.లక్షల్లో స్టయిపండ్ ఇవ్వడానికి ఈ క్యాంపస్‌ల విద్యార్థులకు రియల్ టైమ్ నైపుణ్యాలు, అప్‌డేటెడ్ నాలెడ్జ్ ఉంటుందని సంస్థలు భావించడమే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక్కడ బోధన విధానాలు అత్యున్నత స్థాయిలో ఉంటాయి. కార్పొరేట్ లీడర్లను తీర్చిదిద్దే విధంగా రియల్ టైమ్ కేస్ స్టడీస్ విధానంలో ప్రాక్టికల్ బోధన లభిస్తుంది. అందుకే ఐఐఎంల విద్యార్థులకు ఎస్‌పీఓలు ఇచ్చేందుకు కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి.

కార్పొరేట్ కెరీర్‌కు మార్గం

ఎస్‌పీఓ అవకాశం అందుకున్న విద్యార్థులు శిక్షణ సమయంలో చూపే పనితీరు ఆధారంగా ఆయా సంస్థల్లో శాశ్వత కొలువులు అందుకునే అవకాశం ఉంది. ఇంటర్న్‌షిప్ చేసిన సమయంలో తమకు కేటాయించిన విధులు, విభాగాల్లో సామర్థ్యాలను, నైపుణ్యాలను ప్రదర్శించి మెరుగ్గా రాణిస్తే.. ఫైనల్ ప్లేస్‌మెంట్ ఆఫర్ దాదాపు ఖరారైనట్లేననే చెబుతున్నారు. ఇలాంటి అభ్యర్థులు ద్వితీయ సంవత్సరం చివర్లో నిర్వహించే ఫైనల్ ప్లేస్‌మెంట్ ప్రక్రియలో పాల్గొనకుండానే కొలువు సొంతం చేసుకోవచ్చు.

ఫైనల్ ప్లేస్‌మెంట్స్

2024-26 బ్యాచ్ విద్యార్థులకు ఫైనల్ ప్లేస్‌మెంట్ ప్రక్రియ గతంతో పోలిస్తే మెరుగ్గా ఉంటుందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. పలు సంస్థలు అంతర్జాతీయ స్థాయిలో కార్యకలాపాలను విస్తరిస్తున్నాయని, వాటికి మేనేజ్‌మెంట్ నిపుణుల అవసరం ఏర్పడుతోందని చెబుతున్నారు. అందుకే రియల్ టైమ్ నైపుణ్యాలున్న యువతను ముందుగానే గుర్తించేందుకు ఎస్‌పీఓ ఆఫర్లు ఇస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఇంటర్న్‌షిప్ సమయంలో చూపిన ప్రతిభ ఆధారంగా.. మంచి వేతనాలతో ఫైనల్ ప్లేస్‌మెంట్స్ ఆఫర్స్ ఇచ్చే అవకాశాలున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విద్య, ఉద్యోగ సమాచారం

యూజీసీ-నెట్ డిసెంబర్-2024

యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ).. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ డిసెంబర్ -2024 పరీక్ష నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. ఏటా రెండు సార్లు జూన్, డిసెంబర్ నెలల్లో నిర్వహిస్తుంది.

నెట్ అర్హత సాధిస్తే యూనివర్శిటీలు, కళాశాల స్థాయిల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేయవచ్చు. జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే ఫెలోషిప్ లభిస్తుంది.

- » **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. ఓబీసీ-ఎన్‌సీఎల్/ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/థర్డ్ జెండర్ కేటగిరీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు అవసరం.
- » **వయసు:** జేఆర్ఎఫ్‌కు 01.01.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు గరిష్ట వయో పరిమితి లేదు.
- » **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష. రెండు పేపర్లు పేపర్-1, పేపర్-2 ఉంటాయి. పేపర్-1లో 50 ప్రశ్నలు 100 మార్కులు, పేపర్-2లో 100 ప్రశ్నలు 200 మార్కులు. పరీక్ష సమయం 3 గంటలు. పరీక్ష మాధ్యమం ఇంగ్లిష్, హిందీలో ఉంటుంది.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**10.12.2024
- » **పరీక్ష ఫీజు చెల్లించడానికి చివరితేది:** 11.12.2024.
- » **దరఖాస్తు సవరణ తేదీలు:** 12.12.2024, 13.12.2024.
- » **పరీక్ష తేదీలు:** 01.01.2025 నుంచి 19.01.2025 వరకు
- » **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ugcnet.nta.ac.in

న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్, హైదరాబాద్‌లో 300 అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని అణుశక్తి విభాగం న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్‌లో వివిధ విభాగాలు/ట్రేడుల్లో అప్రెంటిస్‌షిప్ శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 300.
- » **ట్రేడులు:** ఫిట్టర్, టర్నర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, అటెండెంట్ ఆపరేటర్/కెమికల్ ప్లాంట్ ఆపరేటర్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్స్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్స్, ల్యాబొరేటరీ అసిస్టెంట్ (కెమికల్ ప్లాంట్), మోటార్ మెకానిక్స్ (వెహికల్), డ్రాఫ్ట్స్‌మ్యాన్ (మెకానికల్), సీఓపీఏ, డీజిల్ మెకానిక్, కార్పెంటర్, ప్లంబర్, వెల్డర్, స్టెనోగ్రాఫర్(ఇంగ్లిష్).
- » **అర్హత:** పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 25.11.2024 నాటికి 18 ఏళ్ల కంటే తక్కువ ఉండకూడదు. జనరల్ అభ్యర్థులకు 25 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు 28 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 30 ఏళ్లు మించకూడదు.
- » **స్టైపెండ్:** నెలకు రూ.7,700 నుంచి రూ.8,050.
- » **ఎంపిక విధానం:** పదో తరగతి/ఐటీఐలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు. ఎలక్ట్రీషియన్, వెల్డర్ ట్రేడులకు ఇంటర్వ్యూ మాత్రమే నిర్వహించి ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఎన్ఏపీఎస్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**25.11.2024
- » **వెబ్‌సైట్:** https://nfc.gov.in

నిట్ ఆంధ్రప్రదేశ్‌లో పీహెచ్‌డీ ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తాడేపల్లిగూడెంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్).. డిసెంబర్ 2024 సెషన్ పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » **కోర్సులు:** పీహెచ్‌డీ(ఫుల్ టైమ్/పార్ట్ టైమ్/అండర్ ప్రాజెక్ట్), ఇంటర్ డిసిప్లినరీ పీహెచ్‌డీ (ఫుల్ టైమ్) ప్రోగ్రామ్.
- » **విభాగాలు:** బయో టెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, స్కూల్ ఆఫ్ సైన్సెస్(మ్యాథ్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ), స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ మేనేజ్‌మెంట్(ఇంగ్లిష్).
- » **అర్హత:** సంబంధిత విభాగంలో 60 శాతం మార్కులతో ఎంఈ/ఎంటెక్, ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతో పాటు వ్యాలిడ్ గేట్/నెట్ స్కోర్ సాధించి ఉండాలి.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 27.11.2024.
- » **వెబ్‌సైట్:** https://www.nitap.ac.in

విద్య, ఉద్యోగ సమాచారం

ఈడీసీఐఎల్, న్యూఢిల్లీలో 257 పోస్టులు

న్యూఢిల్లీలోని ఈడీసీఐఎల్(ఇండియా) లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 257.
- » **పోస్టుల వివరాలు:** కెరీర్-మెంటల్ హెల్త్ కౌన్సిలర్స్-255, పీఎంయూ మెంబర్స్/కోఆర్డినేటర్-02.
- » **అర్హత:** కెరియర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ పోస్టులకు ఎమ్మెస్సీ/ఎంఏ (సైకాలజీ) ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. పీఎంయూ మెంబర్స్/కోఆర్డినేటర్ పోస్టులకు ఎమ్మెస్సీ/ఎంఫిల్(సైకియాట్రిక్ సోషల్ వర్క్/మాస్టర్స్ ఇన్ గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్) ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. తెలుగు భాషా ప్రావీణ్యం తప్పనిసరిగా ఉండాలి.
- » **వేతనం:** నెలకు కెరియర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్లకు రూ.30,000. పీఎంయూ మెంబర్స్/కోఆర్డినేటర్ పోస్టులకు రూ.50,000.
- » **గరిష్ఠ వయో పరిమితి:** కెరియర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్లకు 35 ఏళ్లు, పీఎంయూ మెంబర్స్/కోఆర్డినేటర్లకు 45 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** అకడమిక్/ప్రొఫెషనల్ విద్యార్హతలు, ఉద్యోగానుభవం, రాత నైపుణ్య పరీక్ష, పీపీటీ, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **పనిచేయాల్సిన ప్రదేశాలు:** కెరియర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ పోస్టులు ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాల్లో, పీఎంయూ మెంబర్స్/కోఆర్డినేటర్ పోస్టులు విజయవాడలో భర్తీ కానున్నాయి.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.12.2024
- » **వెబ్‌సైట్:** https://edcilindia.co.in

సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో నాన్ టీచింగ్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురంలోని సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
- » **పోస్టుల వివరాలు:** జూనియర్ ఇంజనీర్ (సివిల్)-01, సెక్యూరిటీ అసిస్టెంట్-02.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి.
- » **వయసు:** జూనియర్ ఇంజనీర్ పోస్టుకు 35 ఏళ్లు, సెక్యూరిటీ అసిస్టెంట్‌కు 32 ఏళ్లు మించకూడదు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 08.12.2024.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.12.2024.
- » **వెబ్‌సైట్:** https://cuap.ac.in

Pay special attention to structure words

Be sure your choice is both logical and grammatically correct. If you don't know some words, use elimination and educated guessing, which means you are able to eliminate one or more of the choices as definitely wrong. Don't eliminate a choice unless you are dictionary-sure of its definition. Two-blank sentence completions are harder than one-blank sentence completions only if you insist on trying to fill both blanks at the same time. Instead, tackle one blank at a time, beginning with the easier one.



Sentence Completion

Sentence completion is one of the most important tests designed to assess the vocabulary skills of candidates. In a sentence, one or two blanks are left out to be filled with one of the alternatives given below it. Read the entire sentence saying "blank" for the blank(s). This gives you an overall sense of the meaning of the sentence and helps you figure out how the parts of the sentence relate to each other. As you read each sentence, look for the word or phrase that captures the essence of the meaning of the sentence and thus holds the key to its solution. This is important. If an answer occurs to you before you even look at the choices, you may have a synonym for the answer or the answer itself. Pay special attention to structure words-but, although, however, yet, even though, therefore, while, etc., because they are key to forming the logical structure of the sentence.

There are several types of sentence completions:

- Restatement
- Comparison
- Contrast
- Cause and effect

Let us learn each of these types with an example to understand it further.

Restatement: Here is an example of a restatement question:

Example: The city council formed a committee to simplify several dozen ____ city ordinances that were unnecessarily complicated and out-of-date.

1) feckless 2) empirical
3) byzantine 4) pedantic

The answer is choice (3), byzantine, an adjective that means "highly complicated and intricate." Here, you are looking for a restatement of the clue words complicated and out-of-date, and for something that needs simplifying.

Comparison: likewise, similarly, and, just as, for example, as shown, as illustrated by

Example: Sheela was cleared of all charges; similarly, Sam was ____.

1) blamed 2) liable
3) prone 4) vindicated

The answer is (4) 'vindicated', as it compares to being "cleared of all charges," so perhaps Sam was vindicated.

Contrast: though, although, however, despite, but, yet; on the other hand, but, however, despite, or on the contrary.

Example: Although the tiger is a solitary beast, the king of the forest, the lion is a ____ animal.

1) lonely 2) retiring
3) gregarious 4) private

The answer is something that contrasts with 'solitary,' such as gregarious.

Cause and effect: These words indicate that one thing causes another to occur.

Some of the most common cause and effect indicators are:

Because, For, Thus, Hence, Therefore, If, Then.

Here is an example of a cause-and -effect sentence completion question:

Example: Because the House has the votes to override a presidential veto, the President has no choice but to ____.

1) object 2) abdicate
3) abstain 4) compromise

Since the House has the votes to pass the bill or motion, the President would be wise to compromise and make the best of the situation. The answer is (4) compromise.

PRACTICE TEST

Directions: Choose the correct answer choice from the four options given below each sentence to complete the meaning of the sentence.

1. Alexander Graham Bell ____ the telephone.
   1) found 2) explored
   3) invented 4) discovered
2. The mayor was miser but his son was a ____.
   1) wreak 2) generous man
   3) spend thrift 4) liberal man
3. While sending a telegram the words used should be ____.
   1) lengthy 2) formal
   3) ornamental 4) brief
4. The hard outer part of a loaf of bread is called ____.
   1) salad 2) dessert
   3) cuisine 4) crust
5. The cyclone did great ____ to the crops.
   1) miracle 2) violence
   3) destroy 4) damage
6. The television was ____ by John Baird.
   1) discovered 2) invented
   3) found 4) explored
7. The old woman lost her memory in an accident. She is ____.
   1) blind 2) cripple
   3) amnesiac 4) spastic
8. After a brief and violent ____ that ousted the president, General Monsanto declared himself the dictator of the country.
   1) nuance 2) coup
   3) solicitation 4) lament
9. Although the warring parties had settled a number of disputes, past experience made them ____ to express optimism that the talks would be a success.
   1) rash 2) reticent
   3) scornful 4) overjoyed
10. Crestfallen by having done poorly in the final exam, Sheetal began to question her abilities. Her self-confidence was ____.
    1) destroyed 2) placated
    3) elevated 4) sustained
11. She made an even ____ attempt to apologise.
    1) clumsier 2) wide
    3) cleaning 4) broader
12. Could you be more ____ about what you need?
    1) accommodate 2) accurate
    3) adapt 4) adoptable
13. The task ____ the students occupied for hours.
    1) held 2) kept
    3) stayed 4) aside
14. Are you lost? Would you like me to ____ you the way?
    1) make 2) offer
    3) do 4) show
15. People tell so many different stories, It's hard to get a true ____.
    1) description 2) view
    3) picture 4) imagination
16. The boss was very dismissive and treated his suggestion ____ contempt.
    1) for 2) with 3) as 4) to
17. He has made a ____deal of money.
    1) very 2) huge
    3) large 4) great
18. She's made herself ill with anxiety ____ her exams.
    1) to 2) for 3) about 4) with
19. Do you mind if I ____ a question at this stage?
    1) made 2) put 3) raise 4) set
20. Can you explain ____ you got there?
    1) that 2) why 3) how 4) did
21. I think it shows ____ judgment to invest in training.
    1) secure 2) right
    3) sound 4) write
22. If I give you the camera, make sure you ____ it to good use.
    1) put 2) do 3) get 4) enter
23. Their business plan makes sense - I think they're a ____ risk.
    1) good 2) safe
    3) well 4) better
24. The war had a damaging ____ on the economy.
    1) effect 2) result
    3) outcome 4) output
25. The Canary Islands get sunshine all year ____.
    1) through 2) round
    3) along 4) threw
26. You must do your best to ____ out of trouble.
    1) keep 2) go 3) run 4) bring
27. My response varies ____ on the situation.
    1) depending 2) relying
    3) resting 4) taking
28. I was ____ amazed when he got the job!
    1) deeply 2) absolutely
    3) very 4) strength
29. We're trying to ____ money for the local hospital.
    1) support 2) increase
    3) raise 4) put
30. We all wish you ____ in your new career.
    1) well 2) good 3) fine 4) very

Answers:

1) 3	2) 3	3) 4	4) 4
5) 4	6) 2	7) 3	8) 2
9) 2	10) 1	11) 1	12) 2
13) 2	14) 1	15) 3	16) 2
17) 4	18) 3	19) 3	20) 3
21) 3	22) 1	23) 1	24) 1
25) 2	26) 1	27) 1	28) 2
29) 3	30) 2		

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

పర్యావరణ పరిరక్షణ చట్టాలు
ఉద్యమాలు-సదస్సులు

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పర్యావరణం

- **వన్యప్రాణి సంరక్షణ చట్టం (1972):** ఈ చట్టం ప్రకారం ఏ రాష్ట్రమైనా వన్యప్రాణి సంస్థ అనుమతి లేకుండా పార్కులు, వన్యప్రాణి కేంద్రాలకు సంబంధించి హద్దులను మార్చకూడదు. దీనికి 2022లో సవరణలు చేశారు.
- **భూమి, సహజ వనరుల హక్కు సంరక్షణ చట్టం (1972):** స్వీడన్ రాజధాని స్టాక్‌హోమ్‌లో పర్యావరణంపై జరిగిన యూఎన్ఓ సదస్సులో భూమి, సహజ వనరులను రక్షించేందుకు ప్రతి దేశం చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.
- **కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (1974):** నీటి కాలుష్య నివారణ చట్టం ప్రకారం 1974లో కాలుష్య నియంత్రణ మండలిని ఏర్పాటు చేశారు. 1981లో చేసిన వాయు కాలుష్య నివారణ చట్టంలోని అధికారాలను కూడా ఈ సంస్థకే అప్పగించారు.
- **అడవుల సంరక్షణ చట్టం (1980):** ఈ చట్టం ప్రకారం ఏ రాష్ట్రమైనా కేంద్రం అనుమతి లేకుండా అటవీ భూములను ఇతర ప్రయోజనాలకు ఉపయోగించరాదు. అటవీ భూముల్లో ఏదైనా ప్రాజెక్ట్ నిర్మాణాన్ని చేపడితే ముందుగా సంబంధిత శాఖల నుంచి అనుమతి పొందాలి.
- **అటవీ, పర్యావరణ శాఖ (1985):** కేంద్ర ప్రభుత్వం 1985లో పర్యావరణం, అటవీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది. పర్యావరణం, అడవులకు సంబంధించి కార్యక్రమాల అమలుకు అటవీ శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది.
- **ఎకోమార్క్ (1991):** దీన్ని భారత ప్రమాణాల



సంస్థ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) జారీ చేస్తుంది. 1991లో దీన్ని ఏర్పాటు చేశారు. పర్యావరణానికి హాని కలిగించని ఉత్పత్తులకు ఎకోమార్క్ సర్టిఫికెట్ జారీ చేస్తుంది. పర్యావరణంపై ప్రభావం చూపే ఉత్పత్తులను అంగీకరించదు.
- **పర్యావరణ ట్రిబ్యునల్ చట్టం (1995):** పర్యావరణానికి నష్టం కలిగించే అంశాలపై, ప్రమాదకర పదార్థాల తయారీపై, వ్యక్తులు, ఆస్తులకు సంబంధించి సమస్యల పరిష్కారానికి ఈ చట్టం చేశారు.
- **జీవ వైవిధ్య చట్టం (2002):** 1992 జూన్ 5న యూఎన్ఓ ఆధ్వర్యంలో బ్రెజిల్‌లోని రియోడిజెనీరోలో జీవ వైవిధ్య సదస్సు జరిగింది. ఈ సదస్సులో 172 సభ్య దేశాలు పాల్గొన్నాయి. జీవ వైవిధ్య సంరక్షణకు అంతర్జాతీయ స్థాయిలో సంతకాలు జరిగాయి. ఇక్కడ జరిగిన ఒప్పందం ప్రకారం 2002లో కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ ఈ చట్టాన్ని తెచ్చింది.

పర్యావరణ ఉద్యమాలు

- **బిష్ణోయి ఉద్యమం:** ఇది దేశంలో తొలి పర్యావరణ ఉద్యమంగా పేరుగాంచింది. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జిల్లా ఖేజర్లీ గ్రామానికి చెందిన అమృతాదేవి నాయకత్వంలో ఈ ఉద్యమం జరిగింది. 1730లో ఖేజ్రి వృక్షాలను రక్షించేందుకు 363 మంది ఉద్యమం చేసి ప్రాణాలు కోల్పోయారు.
- **సైలెంట్ వ్యాలీ ఉద్యమం:** కేరళలోని పాలక్కడ్ జిల్లాలోని ఉష్ణమండల అటవీ ప్రాంతాన్ని సైలెంట్ వ్యాలీ అంటారు. పెరియార్ నదికి ఉప నది అయిన కుధిపుజ నదిపై జలవిద్యుత్ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల అడవులు, జంతువులు, జీవరాసులు అంతరించిపోతున్నాయని ఆందోళన చేస్తూ 1973లో ఉద్యమం ప్రారంభమైంది. తర్వాత 1985లో ఈ ప్రాంతాన్ని సైలెంట్ వ్యాలీ నేషనల్ పార్క్‌గా మార్చారు.
- **జంగిల్ బచావో ఆందోళన్:** బిహార్ ప్రభుత్వం అటవీ ప్రాంతంలో ఉన్న సాల్ చెట్లను నరికి, వాటి స్థానంలో టేకు వృక్షాలు పెంచాలని ప్రయత్నించడంతో 1980లో ఈ ఉద్యమం ప్రారంభమైంది. సింగ్‌భం జిల్లా గిరిజన వాసులు సాల్ వృక్షాలను హత్తుకొని నిరసన వ్యక్తం చేశారు.
- **చిప్కో ఉద్యమం:** ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లాలో అడవుల నరికివేతకు వ్యతిరేకంగా 1973లో ఈ ఉద్యమం ప్రారంభమైంది. చిప్కో అంటే 'హత్తుకొను' అని అర్థం. చిప్కో ఉద్యమకారులు చెట్ల నరికివేతను వ్యతిరేకిస్తూ వాటిని హత్తుకొని ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు. సుందర్‌లాల్ బహుగుణ, గౌరీ దేవి, చండీప్రసాద్ భట్ మొదలైనవారు ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు.
- **నవధాన్య ఉద్యమం:** జీవ రాశులు అంతరిస్తున్నాయనే ఉద్దేశంతో జీవవైవిధ్య సంరక్షణకు, సేంద్రీయ వ్యవసాయానికి రక్షణ కల్పించేందుకు 1984లో వందనా శివ ఆధ్వర్యంలో ఈ ఉద్యమం జరిగింది.
- **అప్పికో ఉద్యమం:** చిప్కో ఉద్యమం తరహాలోనే అడవుల సంరక్షణ కోసం 1983 సెప్టెంబర్‌లో కర్ణాటకలో ఉత్తర కన్నడ జిల్లాలోని సల్కాని ప్రాంతంలో ఉద్యమం ప్రారంభమైంది. పాండురంగ హెగ్డే నాయకత్వంలో ఉద్యమం జరిగింది. కన్నడంలో అప్పికో అంటే 'కౌగిలించుకొను' అని అర్థం.
- **నర్మదా బచావో ఆందోళన్:** మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో నర్మదా నది ప్రవహిస్తోంది. పర్యావరణానికి హాని కలిగిస్తూ ఈ నదిపై చేపట్టే ప్రాజెక్ట్‌లకు వ్యతిరేకంగా ఆయా రాష్ట్రాల్లో ఈ ఉద్యమం ప్రారంభమైంది. ముఖ్యంగా గుజరాత్‌లోని సర్దార్ సరోవర్ డ్యాంకు వ్యతిరేకంగా ఉద్యమం కొనసాగింది. ఈ ఉద్యమాన్ని 1989లో మేధా పాట్కర్ ప్రారంభించారు. బాబా ఆమ్టే, అరుంధతి రాయ్‌లాంటి వారు కూడా ఈ ఉద్యమాన్ని కొనసాగించారు.
- **గంగా పరిరక్షణ ఉద్యమం**
గంగా నది దేశంలో అతిపెద్దది. స్వచ్ఛమైన గంగా నది కోసం, కాలుష్య నివారణ కోసం శ్రీమతి రమారౌట ఆధ్వర్యంలో 1988న కాన్పూర్‌లో ఒక సెమినార్ జరిగింది. అదే ఉద్యమంగా మొదలైంది. అనేక స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ నాయకులు, వైజ్ఞానిక సంస్థలు ఈ ఉద్యమానికి ప్రోత్సాహాన్ని అందించాయి.

అంతర్జాతీయ సదస్సులు

- **క్యోటో ప్రోటోకాల్:** వివిధ కారణాల వల్ల భూగోళం వేడెక్కుతోంది. ముఖ్యంగా కార్బన్‌డై యాక్సైడ్ కారణంగా గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ జరిగి భూగోళం వేడెక్కుతోందనే ఉద్దేశంతో 1997, డిసెంబర్ 11న జపాన్‌లోని క్యోటో నగరంలో ప్రపంచ దేశాల మధ్య ఒప్పందం జరిగింది. ఇందుకు 192 దేశాలు అంగీకరించాయి. 2005, ఫిబ్రవరి 16 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం గ్రీన్‌హౌస్ వాయువుల ప్రభావాన్ని 5 శాతానికి తగ్గించాలి. 2012లో కెనడా ఈ ఒప్పందం నుంచి తప్పుకుంది.
- **కార్టెజినా ప్రోటోకాల్:** జీవరాశుల భద్రత కోసం 1999లో కొలంబియాలోని కార్టెజినాలో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్‌లో చర్చ జరిగింది. 2003 సెప్టెంబర్ నుంచి ఇది అమల్లోకి వచ్చింది. 2015 నాటికి 170 దేశాలు ఇందుకు అంగీకరించాయి. ఈ ఒప్పందాన్ని 'బయోసేఫ్టీ ప్రోటోకాల్' అంటారు
- **మొక్కల సంరక్షణ సదస్సు:** ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో 1999లో అమెరికాలో మిస్సోరిలోని సెయింట్ లూయిస్ నగరంలో జీవ వైవిధ్య సదస్సు జరిగింది. ఈ సదస్సులో అంతరించి పోతున్న మొక్కలను కాపాడాలని నిర్ణయించారు. 2020 నాటికి లక్ష్యాన్ని పూర్తిచేయాలని ప్రతినబూనారు.
- **రియోడిజెనీరో - ధరిత్రీ సదస్సు:** 1992, జూన్ 5న బ్రెజిల్‌లోని రియోడిజెనీరోలో జీవ వైవిధ్య సదస్సు జరిగింది. ఇందులో అంతర్జాతీయ స్థాయిలో సంతకాలు జరిగాయి. 1993, డిసెంబర్ 29న అమల్లోకి వచ్చింది. ఈ సదస్సులో జీవ వైవిధ్య సంరక్షణను మానవజాతి సమస్యగా గుర్తించారు.
- **నగోయా ప్రోటోకాల్:** జపాన్‌లోని నగోయాలో 2010 అక్టోబర్‌లో జీవ వైవిధ్య సదస్సు జరిగింది. ఇది 1992లో రియోడిజెనీరోలో జరిగిన సదస్సుకు అనుబంధంగా జరిగిన రెండో ఒప్పందం. 2014, అక్టోబర్ 12 నుంచి ఈ ఒప్పందం అమల్లోకి వచ్చింది.
- **మాంట్రియల్ ఒప్పందం:** సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల బారిన పడకుండా రక్షించే ఓజోన్ పొరకు జరుగుతున్న హానిని అరికట్టేందుకు 1987, సెప్టెంబర్ 16న కెనడాలోని మాంట్రియల్‌లో ప్రపంచ దేశాలు ఒప్పందం చేసుకున్నాయి. ఓజోన్ పొరకు నష్టాన్ని కల్గించే పదార్థాల ఉత్పత్తిని నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నాయి. ఇది 1989 జనవరిలో అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం అమలు ద్వారా అంటార్కిటికా ఖండం వద్ద ఓజోన్ పొరకు కలిగిన విఘాతాన్ని తగ్గిస్తున్నారు. 2050 నాటికి ఓజోన్ పొర యథాస్థితికి వస్తుందని భావిస్తున్నారు.
- **హైదరాబాద్ జీవవైవిధ్య సదస్సు:** ఐక్యరాజ్య సమితి జీవవైవిధ్య సదస్సు హైదరాబాద్‌లో 2012, అక్టోబర్ 1 నుంచి 9 వరకు జరిగింది. 194 సభ్యదేశాలకు చెందిన పర్యావరణ, అటవీశాఖ మంత్రులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటి సంస్థలు కూడా పాల్గొన్నాయి. ఈ సదస్సులో జీవవైవిధ్యం, జీవరాసుల సంరక్షణపై చర్చ జరిగింది.
- **పారిస్ ఒప్పందం:** వాతావరణ మార్పులపై పారిస్‌లో 2015, నవంబర్ 30 నుంచి డిసెంబర్ 12 వరకు పర్యావరణ సదస్సు జరిగింది. 196 సభ్య దేశాలు హాజరయ్యాయి.
- **ఎకో సిటీ/ జీరో కార్బన్ సిటీ:** ఎకో సిటీ అనే



భావనను 1975లో కాలిఫోర్నియాలో బెర్‌కలీ రిచర్డ్ ప్రతిపాదించారు. కాలుష్యం లేకుండా ఉండేందుకు ప్రతి నగరంలో వివిధ చర్యలు చేపట్టాలి. పునరుత్పాదక శక్తివనరుల వాడకం పెంచాలి. పేదరికం తగ్గి, ఆర్థిక వృద్ధి పెరిగితే కాలుష్య నివారణ జరుగుతుంది. భారతదేశంలో ఎకోసిటీ కాన్ఫరెన్స్ బెంగళూరులో జరిగింది. ప్రపంచంలో జీరో కార్బన్ పట్టణం – మస్దర్(అబుదాబి).

మాదిరి ప్రశ్నలు

1. 2012లో జీవవైవిధ్య సదస్సు ఏ నగరంలో జరిగింది?
   1) వాషింగ్టన్ 2) హైదరాబాద్
   3) పారిస్ 4) న్యూయార్క్
2. క్యోటో ప్రోటోకాల్ జరిగిన సంవత్సరం?
   1) 2016 2) 2014
   3) 1988 4) 1997
3. దేశంలో తొలి పర్యావరణ ఉద్యమం?
   1) సైలెంట్ వ్యాలీ 2) చిప్కో ఉద్యమం
   3) నర్మదా బచావో 4) బిష్ణోయి ఉద్యమం
4. నర్మదా బచావో ఉద్యమాన్ని ఎవరు నిర్వహించారు?
   1) మేధా పాట్కర్ 2) బహుగుణ
   3) రామకృష్ణ హెగ్డే 4) అన్నా హజారే
5. నీటి కాలుష్య నివారణ చట్టాన్ని ఏ సంవత్సరంలో చేశారు?
   1) 1981 2) 1986
   3) 1974 4) 1999
6. చిప్కో ఉద్యమం ఏ రాష్ట్రంలో జరిగింది?
   1) గుజరాత్ 2) బిహార్
   3) ఉత్తరాఖండ్ 4) రాజస్థాన్
7. ప్రపంచ మొదటి జీరో కార్బన్ పట్టణం?
   1) బీజింగ్ 2) మస్దర్
   3) ఢిల్లీ 4) దోహా
8. సైలెంట్ వ్యాలీ రక్షణ ఉద్యమం ఏ సంవత్సరంలో మొదలైంది?
   1) 1973 2) 1986
   3) 1989 4) 1983

సమాధానాలు

1) 2	2) 4	3) 4	4) 1
5) 3	6) 3	7) 2	8) 1

Spiral Model was developed by?

BANK EXAMS

COMPUTER AWARENESS

SDLC
(Software Development Life Cycle)

SDLC, Software Development Life Cycle is a process used by software industry to design, develop and test high quality softwares. It is also called as Software development process.

- ISO/IEC 12207 is an international standard for software life-cycle processes. It aims to be the standard that defines all the tasks required for developing and maintaining software.

A typical Software Development life cycle consists of the following stages:


Stage1: Planning and Requirement Analysis
Stage 2: Defining Requirements
Stage 3: Designing the product architecture
Stage 4: Building or Developing the Product
Stage 5: Testing the Product
Stage 6: Deployment in the Market and Maintenance

SDLC Models

- Waterfall Model
- Iterative Model
- Spiral Model
- V-Model
- Big Bang Model

The other related methodologies are Agile Model, RAD Model, Rapid Application Development and Prototyping Models.

SDLC Waterfall Model




The sequential phases in Waterfall model are:

- **Requirement Gathering and analysis:** All possible requirements of the system to be developed are captured in this phase and documented in a requirement specification doc.
- **System Design:** The requirement specifications from first phase are studied in this phase and system design is prepared. System Design helps in specifying hardware and system requirements and also helps in defining overall system architecture.
- **Implementation:** With inputs from system design, the system is first developed in small programs called units, which are integrated in the next phase. Each unit is developed and tested for its functionality which is referred to as Unit Testing.
- **Integration and Testing:** All the units developed in the implementation phase are integrated into a system after testing of each unit. Post integration the entire system is tested for any faults and failures.
- **Deployment of system:** Once the functional and non functional testing is done, the product is deployed in the customer environment or released into the market.
- **Maintenance:** There are some issues which come up in the client environment. To fix those issues patches are released. Also to enhance the product some better versions are released. Maintenance is done to deliver these changes in the customer environment.

All these phases are cascaded to each other in which progress is seen as flowing steadily downwards (like a waterfall) through the phases. The next phase is started only after the defined set of goals are achieved for previous phase and it is signed off, so the name "Waterfall Model". In this model phases do not overlap.


SDLC Iterative Model



This model is most often used in the following scenarios:

- Requirements of the complete system are clearly defined and understood.
- Major requirements must be defined; however, some functionalities or requested enhancements may evolve with time.
- A new technology is being used and is being learnt by the development team while working on the project.
- Resources with needed skill set are not available and are planned to be used on contract basis for specific iterations.
- There are some high risk features and goals which may change in the future.

SDLC Spiral Model



- **Identification:** This phase starts with gathering the business requirements in the baseline spiral. In the subsequent spirals as the product matures, identification of system requirements, subsystem requirements and unit requirements are all done in this phase.

At the end of the spiral the product is deployed in the identified market.

- **Design:** Design phase starts with the conceptual design in the baseline spiral and involves architectural design, logical design of modules, physical product design and final design in the subsequent spirals.
- **Construct or Build:** Construct phase refers to production of the actual software product at every spiral. In the baseline spiral when the product is just thought of and the design is being developed a POC (Proof of Concept) is developed in this phase to get customer feedback.
- **Evaluation and Risk Analysis:** Risk Analysis includes identifying, estimating, and monitoring technical feasibility and management risks, such as schedule slippage and cost overrun.

Summary

- Waterfall and V model are traditional SDLC models and are of sequential type. Sequential means that the next phase can start only after the completion of first phase. Such models are suitable for projects with very clear product requirements and where the requirements will not change dynamically during the course of project completion.
- Iterative and Spiral models are more accommodative in terms of change and are suitable for projects where the requirements are not so well defined, or the market requirements change quite frequently.
- Big Bang model is a random approach to Software development and is suitable for small or academic projects.
- Agile is the most popular model used in the industry. Agile introduces the concept of fast delivery to customers using prototype approach.

MODEL QUESTIONS

1. Spiral Model was developed by?
   1) Bev Littlewood
   2) Berry Bohem
   3) Roger Pressman
   4) Victor Bisili
   5) None of Above
2. Which model is popular for students small projects ?
   1) Waterfall Model
   2) Spiral Model
   3) Quick and Fix model
   4) Prototyping Model
   5) None of Above
3. Which is not a software life cycle model?
   1) Spiral Model
   2) Waterfall Model
   3) Iterative Model
   4) Capability maturity Model
   5) V-Shape Model
4. Project risk factor is considered in ?
   1) Spiral Model
   2) Waterfall Model
   3) Prototyping Model
   4) Iterative enhancement Model
   5) None of Above
5. SDLC stands for?
   1) Software design life cycle
   2) Software development life cycle
   3) System design life cycle
   4) System development life cycle
   5) None of Above
6. SPIRAL model has?
   1) 3 Phases 2) 1 Phase
   3) 2 Phases 4) 4 Phases
   5) None of Above
7. SRS stands for?
   1) Software requirement specification
   2) Software requirement solution
   3) System requirement specification
   4) System requirement ossification
   5) None of Above
8. Waterfall model is not suitable for?
   1) Small Projects
   2) Complex Projects
   3) Accommodating change
   4) Diminutive Projects
   5) None of Above
9. RAD stands for?
   1) Rapid Application Development
   2) Relative Application Development
   3) Ready Application Development
   4) Repeated Application Development
   5) None of Above
10. RAD Model was purposed by?
    1) IBM 2) Motorola
    3) Microsoft
    4) Lucent Technologies
    5) None of Above
11. Software engineering aims at developing?
    1) Reliable Software
    2) Cost Effective Software
    3) Reliable and cost effective Software
    4) All of above
    5) None of Above
12. A good specification should be?
    1) Unambiguous
    2) Distinctly Specific
    3) Functional 4) All of Above
    5) None of Above
13. Which of the following is a tool in design phase?
    1) Abstraction
    2) Refinement
    3) Information Hiding
    4) All of Above
    5) None of Above
14. Information hiding is to hide from user, details ?
    1) That are relevant to him
    2) That are not relevant to him
    3) That may be maliciously handled by him
    4) That are confidential
    5) None of Above
15. Which of the following is required to communicate between two computers?
    1) Communications software
    2) Protocol
    3) Communications hardware
    4) Access to transmission medium
    5) All of the above
16. Devices is used to connect two similar LAN with same protocols
    1) Bridges 2) Router
    3) Gateway 4) Switch
    5) None of these
17. DSL is an example of a (n) ______ connection.
    1) Network 2) Wireless
    3) Slow 4) Broadband
    5) None of these
18. FTP is______
    1) used to send email
    2) used to browse the Web
    3) is part of Netscape
    4) Is a protocol for the transfer of files between computers
    5) None of these
19. Telnet is-
    1) Used to send email
    2) Uses telephone lines
    3) Is part of Netscape
    4) Is a protocol that allows for remote login
    5) None of these
20. = sum(Bl:B8) is an example of a-
    1) Function 2) formula
    3) Cell address 4) value
    5) None of these

KEY

1) 2	2) 1	3) 4	4) 1	5) 2
6) 4	7) 1	8) 3	9) 1	10) 1
11) 3	12) 4	13) 4	14) 3	15) 5
16) 1	17) 4	18) 4	19) 4	20) 2